భారతి

సాహిత్య మాసపత్రిక
జూలై 1980

జడప్రశ్న
నాయని కృష్ణకుమారి

రూసో
కృష్ణారావు

నలుగుడు జాతి వీరసుడు
రంధి సోమరాజు

పర్సీ బ్రాంట్ నివేదిక
వెంకటేశ్వర్లు
వెంకట నారాయణ

వసంతం కోసం
తిరునగరి

నెత్తుటి రెండు రంగులు
మనోహర్ రెడ్డి

ఇంకా కేవస్వీ, సూర్యనారాయణ, చిదంబరరెడ్డి, రమణ, శ్రీనివాసరావు, చైతన్య, సుబ్బరామశాస్త్రి, పార్వతీశ్వర్, రఘునాథం, అబ్దుల్ ఖాదర్, రామచంద్రయ్య, సత్యవతి, తిరుమలరావు ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

★

జూలై 1980

సంపుటము : 57 సంచిక : 7

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

జూలై 1980

నలుగుడు జాతి వోరసుడు!

శ్రీ రంధి సోమరాజు

టీపిసీ బర్ని సేత్తో వొట్టుకోని
బస్సెక్కినాది బుల్లెమ్మ
య్యెనకాత లరడజనుమంది బుల్లోళ్ళు
దూడల్లా జయ్యి నెక్కినారు
యిసకేత్తే యిసకరాల్డంనేదు
మడ్సిమీద మడ్సెక్కినట్టేవుంది
మడ్సినీ మడ్సినీ తాపడంసేసీసినట్టుంది.
బుల్లికి ముందలంతా ఆడకూతుళ్ళే
సిమిడిపోయిన వొన్నంలా కలేసుకపోనారు
ముళ్ళ కంచెల్లా ఎనకాతల మగోల్లు
యీా పక్క ఆపక్క సూదుల్లా
గుచ్చుక పోతున్నారు
య్యెనక్కెల్లు అన్లేదు
య్యేటి మీదడిపోతారేటి అన్లేదు
అస్సలు వూపిరే ఆడ్డంనేదు
సెనం యెల్లాగా కల్లుమూసీసుకోవాల!
ఏటి సేత్తాది?
మరి బతుకు!
మద్దెన ఆసులో కండెనా
కండక్టరు గోడాకదు
సాపకింద నీరునా
మద్సులమద్దె జారిపోతన్నాడు
డబ్బులుచ్చుకోడం
టిక్కెట్లియ్యిడం
సాము గరిడీలనుకో ...
మన సేతు లేదున్నయ్యో
శెనం ఎదుక్కోవాల
అందరి మద్దెనా గాలిపటం తోకనా ఏలాడి
వుచ్చుకోవాల టిక్కెట్టు
పేనాలు కడట్టుక పోతాయి
య్యింతలో డ్రైవోరేసే
సడన్ బేకు లొకటి
పేట్రీలో పిట్టను గుద్దులాటనుకో
బెమ్మసిముదు డొంకల్లో కిసిరేత్తాయి
సీ ఎదవజెల్మ!
సుట్టూ సీడపురుగు నవ్వులు
కిస్‌మంటూా సోడాబుడ్డుల్లా
వొళ్ళునలిగి మనసిరిగి పేనాలు మిగిలి
కుల్లు కాలవలోంచి బాతునా బయిటడి
రెక్కలు దులిపీసుకోవాల
బాడిదలో గచ్చకాయనా
బాదేవత మీ దడుగెట్టి
బస్సు దేవుడి కెట్టాల
సెయ్యేత్తు సెమట దండాలు
మునుపు మగోలేపు ఆడకూతుర్ని
కన్నెత్తి సూడనిచ్చివోలుకారు
ఇయ్యాల ఆలు మగోలమద్దె తిరుగాడుతుంటె
సూాత్తున్నారు
నలుగుతుంటె సూత్తున్నారు
యిదేన్రొరే మనజాతి –
నువ్వు మా గొప్ప నలుగుడు జాతికి
వోరసు డ్రవొరే ... ... !

గాండీవం

శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి

గాండీవం, అర్జునుడిది;
అది దేవదత్తమైన ధనుస్సు;
ఒక ప్రయోజనం కోసం ఇవ్వబడ్డది!
అది చేతిలో ఉన్నప్పుడు
ఎదిరి జనం అదరిపోయేవారు!

*　　　*　　　*

అయితే, ఆ ప్రయోజనం అయిపోయింది,
కృష్ణ నిర్యాణంకూడా జరిగిపోయింది,
శౌరి భార్యలను
కిరాతులు చుట్టుముట్టారు
గాండీవి సమక్షంలోనే!

*　　　*　　　*

గాండీవి హుంకరించాడు,
గాండీవం ఎక్కుపెట్టాలని ప్రయత్నించాడు,
కాని, దానిని లేపడమే కష్టమయింది!
ఎల్లాగో దానితోనే వాళ్లను పొడిచాడు
అల్లా అల్లా తఱుమగలిగాడు!

*　　　*　　　*

అంత అర్జునుడే అల్లా అయితే —
సామాన్యుల సంగతి చెప్పాలా వేరే?
కాలం కలిసివచ్చినప్పుడు
అందఱూ మొనగాళ్లే!
కలిసి రాకపోతే
మలప సన్న్యాసులు!

కాలమహిమవల్ల,
అంటే, అతని పూర్వపుణ్యంవల్ల
అయిన గ్రహ గమనంవల్ల —
ఒకానొకడికి అధికారం వస్తుంది.
అధికారంలో ఉన్నవాడికి
మంది, మార్బలం సమృద్ధిగా ఉంటుంది!
దానినే విష్ణ్వంశ అన్నా నష్టంలేదు!

*　　　*　　　*

అయితే, ఆ కాస్త పుణ్యమూ, అయిపోతే,
'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' — అని
దేవలోకంలో వాళ్లనుగూర్చి చెప్పినట్లుగా,
అతడు కూడా,
వట్టి సాదామనిషి, అయిపోతాడు!

*　　　*　　　*

అతగాణ్ణి, పలుకరించే దిక్కు ఉండదు!
చూస్తూకూడా చూడనట్లే సాగిపోతారు, జనం!
తాను పలుకరించినా జనం పలుకరు,
అల్లాంటి వాడివల్ల ప్రయోజనం ఏముంటుంది
కనుక!

*　　　*　　　*

రైలు దగ్గఱకు దండలతో జనంరారు,
పత్రికలలో వార్త పడడంకూడా అనుమానమే?
గాండీవం పసపోయిన
గాండీవి కంటె,
అతడెక్కువ వాడా?

రాజకీయంలో రైతు

శ్రీ సడ్లపల్లి చిదంబరరెడ్డి

"రైతు సోదరయ్య రాయిటు కూర్చొమ్మ"

"వద్దుబాబు వద్దు వదలునన్ను
ఉన్న గిన్నె కాస్త ఉండనీ భిక్షకు
దిక్కులేనివాణ్ణి దిక్కులుండి"

"అన్నదాత నీవు వెన్నెముకు ధరణికి,
దేశ ప్రగతి కెంతొ ధీరుడంచు,
ముప్పదేండ్లనుండి గొప్పదేరితివంచు
చదివినాను పెద్ద చదువులందు"

అన్న నాదు మాట విన్నంత రైతన్న
ఏడ్పులాంటి నవ్వు ఎరుకపరచి
ఎముకగూటిపైన ఎగబీకి దుప్పటి
చెప్పదొడగె అతని గొప్ప చరిత.

"మండు ఎండలందు కండలు కరిగించి
చేసి సేద్యమెంతొ చెమటకార్చి
కడుపునిండ ఇంత గంజిని త్రాగుచు
గడపుచుండ బీదకాపురమ్ము
గొప్ప నాయకు లొక కుప్పగా గుమిగూడి
ఎద్దుల జొతమాకు ఇమ్ముసుమ్మి
నిన్ను ఉద్ధరించి మిన్నగా చేతుము
అనుచు తోలుకొనుచు అరగినారు.
అవనిగెల్చి ఏవిరా ఎడ్లగురుతుచే
ఎవరి కెరుకలేక ఎడ్లుపోయె
అంతలోన బయటి అరపులు వినలేక
"ఏమిటయ్య గోల ఎవరుమీరు ?"
అన్న నన్నుచేరి అందరు వినయులై
"నీదు కొడవవిమ్మ లేదు అనకు
నీకు సేవజేయ నేలపై పుట్టాము
ఇమ్మ ఇమ్మ"ని [illegible] ఏగినారు.

కొడవలి గతియే[illegible] గుర్తుకులేదాయె
పస్తులుండినా[illegible] పాలులేక
పశువుమేత లేక పాలుపితుకదాయె;
అట్టివేళ కొందరరుగుదెంచి
"ఆవుదూడ నిమ్మ అన్ని విధముల నీకు
సేవచేయగలము గోవుసాక్షి"

అనుచు త్రాళ్ళ విప్పి అటురాక వెళ్ళిరి
నాటినుండి పాలమాట పోని
నీరుకూడ లేక ఇడుమల మడుగులో
చిక్కుకున్న నన్ను చూడరయిరి
అప్పుడేను కొంద రాత్రముగారాగ
"నన్ను చేరదిండు అన్నలార"
అన్న నన్ను చూచి అందరొక్కటిగాను
"నిన్ను చేరదీయ నిజముగాను
వచ్చినాము సుమ్మి భగవాను సాక్షిగా
వేగతెమ్మ నీదు నాగలికాని;"—

తీపిమాటలాడి తీసుకుపోయారు
పగలు రాత్రియనక పొగడి పొగడి
'రైతుసేవ'యనుచు రాజ్యమ్ముచేబూని
పొట్ట పెంచుటందు దిట్టలయిరి.

బ్రతుకుచావుమధ్య చితికిపోయినవేళ
ఉన్నవన్నిపోయిఉన్నవేళ
"మొదటినుండి మోసపోయిన రైతన్న
అభయహస్తమిదియె అండనీకు
మమ్మునమ్మమన్న మాతోనరావన్న"
అనుచు మోసగించి అదనుచూచి
కత్తిరించి చేయి ఎత్తుకుపోయారు
చేయిలేనివాణ్ణి చేసినారు.

కళ్ళనుండి నీరు జలజలకారగ
కఠిన హృదయమైన కరగిపోగ
అతనియొక్క దీనస్థితిగూర్చి ఎరుగగ
నోటమాటరాక నుండిపోగ

''ఇంతవేళనుండి అంతగ అడిగావు
కళ్ళనుండి నీరు కార్చినావు
ఎవరివాడవీవు ఏమిటి నీపని''
అనుచు రైతునన్ను అడగినాడు.

''పుట్టినది మొదలు చదువగ
'పట్టము' ఇది అంచు నొక్క 'పట్టము' నివ్వన్.
పట్టదు అది ఏ పనినీ
వట్టిగ తిరుగాడుచుందు వ్యర్థపుజీవై.

నీవు చెప్పినట్టి నిజమైన గాథలు
కలచివేసె మనసు కవితవ్రాయ
పత్రికలది ఏమొ ప్రచురించి చూపవు
వ్యర్థమయిన భావవాక్యలనుచు.
ఏమి చేయలేక ఏమి చేయాలంచు
దేశస్థితిని చూస్తు తిరుగుచుంటి
నీదు కథను వినగ నిజముగా మతిపోయె
మరలివచ్చె'' దనుచు తరలిపోతి.

జ్ఞానదా!

శ్రీమతి సి హెచ్. సత్యవతి

ప్పటిలా మౌనంగా దూరంగా
ఆస్వామి ఉండగా
చిరునవ్వుల చిలకరింపుతో
నిలువెల్లా తళ తళలాడిపోతూ
నాలో ఎనలేని ఉత్సాహాన్ని నింపావు.
తల్లివై నన్ను ఓదార్చావు.
ఎవరున్నారు ఎవరున్నారు నాకొరకు ?
నీ కన్నుల మౌన భాషణలు
ఆచిన్ని కోపపు రేఖలు
ఆపై అలవోకగా తొణికిపోయేనవ్వులు
ఇవీ, నా ప్రతి నిత్యపు ఆరాటంలో
నీలో నేను చూచుకొనేవి.
నిన్ను మించిన తోడు ఆ మహాదేవునికే లేదే
అలాంటి నీ ఒడిలో నీ మాతృత్వపు లాలనలో
నా సమస్త చరిత్రనూ ఎరిగిన నీలో
నన్ను నేనే తిలకించుతూ
సాగిపోనీ ఈ జీవితం.
ప్రతిరోజూ నీ ఆలయానికి వస్తాను.
కుతూహలంతో నిన్ను కనులప్పగించి చూస్తాను
ఆ క్షణంలో సంపూర్ణంగా చూసినట్లే 'అనుకుంటూ
మళ్ళీ మళ్ళీ రెప్పవేయక చూస్తాను.
నిను వీడి వెనుతిరిగి వచ్చే నాలో
నీ రూపాన్ని చూడడంలో ఏదో మరచాననిపిస్తుంది
నిన్న సంపూర్ణంగానే చూశానేమోనని
మరునాడు మరింత శ్రద్ధగా వస్తాను.
కాని నీ సన్నిధిలో నా ప్రవర్తన మామూలే
ఇన్ని రోజుల నా యాత్రలో
ఏరోజూ నీ సంపూర్ణ స్వరూప దర్శనం కాలేదు
ఆ చిన్ని గుహలో ఇమిడిపోయిన
నీ చిన్ని రూపమే చూడలేని నేను
నీ విశాల సృష్టిలో
అంతటా నిండిఉన్న నిన్నెలా తెలుసుకోగలను ?
మోహమున్నంత వరకు కోరిక తీర్చవు
ఊహించని తరుణంలో
అడగకుండానే అవసరమైనవి ఇస్తావు
నీ దైవత్వంముందు
మా మానవత్వం ఓడిపోయినా
దానికే గర్వపడే అహంకారిని నేను.

శ్రీ మెతుకు మనోహర్ రెడ్డి

నెత్తుటి రెండు రంగులు

అది ప్రాతఃకాలం. ఇంకా సూర్యుడుదయించలేదు. చార్మినార్ క్రాసురోడ్డులో ఒక స్త్రీ దీనావస్థలో జిడ్డుముఖంతో తారట్లాడుతున్నది. పేళ్లుపడ్డ నెత్తి, ముద్దలుగా అతుక్కుపోయిన వెంట్రుకలు, ఆమె దారిద్ర్యాన్ని చెప్పక చెప్పుతున్నాయి. మైలబట్టి పేలికలయిన గుడ్డలు, ఏ రంగువో గుర్తించ వీలులేకున్నవి. అవి అర్ధ శరీరాన్నయినా దాచలేకున్నవి. ఆమె ఒక ఎముకలగూడ. ప్రాణమున్నది కావున ఆశవున్నది. ఆశ వున్నది కావున బ్రతుకుతున్నది. ఆ బ్రతుక్కు ఒక్క పైస విలువ కూడ లేదు. అసిటిక్ ఆసిడ్ ప్లాంట్, చార్మినార్ సిగరెట్టు ఫ్యాక్టరీ పోటీగా ముక్కు పుటాలను పగులగొట్టేస్తున్నవి. ఆమె ఒక నల్లటి కుక్క, కూనలా ఉన్న మాంసపు ముద్దను మోస్తున్నది. ఆ స్త్రీ ఎంకి, ఆ మాంసపు ముద్ద ఎంకి మూడేళ్ళ కొడుకు నర్సిములు. వానికి తలమీద వెంట్రుకలు లేవు. ఎంకి ఎండిన రొమ్ములనే పాలకోసం చీకుతాడు. వానికి ఆకలి తీరుతుందో లేదో కాని వాడుమాత్రం అలాచేస్తూనే, ఏడుస్తుంటాడు.

సంగం టాకీసు మూలమీద చెప్పులు కుట్టే రాజయ్య పక్కన రోజూ ఉదయమే ఇదేవేళన కూర్చుంటుంది. అఫ్జల్గంజ్ నుండి సికింద్రాబాద్వైపు పోయే బస్స్టాప్లో, సిండికేట్ బ్యాంకు ముందు ఆఫీసుకు పనులకు పోయేవాళ్ళను చెయ్యెత్తి భిక్షమెత్తడంతో ప్రారంభమవుతుంది ఎంకి దినచర్య. జనిగలా ఎంకి రొమ్ములను దినమంతా దాని చంకలో కూర్చొని పీలుస్తూనే ఉంటాడు. వాని నెత్తిమీద కోపం వచ్చినప్పుడల్లా ఎంకి వేస్తూనే ఉంటుంది. "అయ్యా దానం చేయండి. బాబులూ దానం చేయండి. మీకు దేవుడు పదింతల సుఖమిస్తాడు" అని ప్రాధేయపూర్వకంగా పాట పాడినట్లు లయబద్ధంగా గొంతెత్తి అరుస్తుంది. రోజూ మ్యునిసిపల్ స్వీపర్ రామయ్య విసుక్కుంటూ ఎంకిని దీవిస్తూంటాడు. "ముండా! ఇప్పుడే తెల్లారిందా! ఏం మొఖమే పక్కకు జరుగు, నేనూడ్చుకోవాల" అంటాడు. ఎంకి భయపడక అంతకన్నా ఘాటుగా తిడ్తుంది. రామయ్య "కదుల్తావా? లేక చీపురుదెబ్బలు కావాల్నా" అని అరుస్తాడు. తిట్టుకుంటూ పక్కకు జరుగుతుంది ఎంకి. రామయ్య ఊడ్చుకుంటూ వెళ్ళిపోతాడు.

అదే సమయంలో E. C. I. L., I. D. P. L. మరియు H. A. L. ఫ్యాక్టరీలకు పోయే బస్సులు వచ్చి ఇక్కడ ఆగుతవి. ఆ సాబులు, దొరసానుల దగ్గిఱ ఎంకికి ఉదయాన్నే 50 పైసల్దాకా దొరుకుతవి. ఇందిరాపార్క్ ప్రక్కనుండి వచ్చే రోడ్డునుండి ఆకుకూరలు అమ్మే ముసలమ్మలు నెత్తిన గంపలు పెట్టుకొని చిక్కడపల్లికిపోతారు. 8 గంటలకు చార్మినార్ సిగరెట్టు ఫ్యాక్టరీ విడుస్తారు. ఆర్టీసి వర్క్షాప్కు వాళ్ళ బస్సులు నిండు చూలాల్లా మనుషుల్ని మోసుకొస్తయి అదేటయిమ్లో. రోడ్డంతా గందరగోళంగా ఉంటుంది. వాహనాల రుసరుసలు, సైకిళ్ల, రిక్షాల కదలికలతో రోడ్డంతా గజిబిజిగా ఉంటుంది.

ఆ రోజు సోమవారం. ముషీరాబాద్ టెలిఫోన్ ఎక్చేంజ్లో లేడీ ఆపరేటర్ రేమండ్ సూటింగ్ అబ్బాయితో బాతాఖాని వేస్తున్నది. సమయం ఉదయం 9 గంటలు సికింద్రాబాద్ స్టేషన్కుపోయే 2 నం. బస్ ఆగింది. ఫ్లడ్గేట్లు తెరిస్తే నీరు ఎలా వస్తుందో అలానే మనుషులు బయటకు వస్తున్నారు బస్సునుండి. మాంసపు ముక్కకోసం కాట్లాడే కుక్కల్లా బస్సులోకి చొరబడుతున్నారు. పాను షాప్నుండి రేడియోపాట అప్పుడే విడుదలయిన సినిమాలోనిది వినపడుతున్నది. కార్నర్లోనున్న ప్రెసిడెంట్ హోటల్లో తందూరి చికెన్, పులావ్లో ఘుమఘుమలు నోరూరిస్తున్నవి. ఆవల క్రిస్టల్ బార్ దీనికి పోటీ పడుతున్నది. ఎంకి వీటన్నిటిలో తనను తాను మరిచింది. ఒకేసారి పరలోకంనుండి ఊడిపడ్డదానిలా "దానం చేయండి అమ్మల్లారా! తిండిలేక రెండు రోజులయింది" అంటూ లయబద్ధంగా అరవసాగింది. ఇంతలో 50 పైసల నాణెం ఆమె గిన్నెలో పడింది. దాత సుదర్శన్ థియేటర్ ఓనర్ బిడ్డ. రోజూ ఇదే త్రోవన సెంట్ఫ్రాన్సిసు కాలేజ్కు పోతుంది. కారు ఆపి ఇష్టమొచ్చినప్పుడల్లా ఎంకికి దానం చేస్తుంది. ఎంకి మనసారా ఆ అమ్మాయిని దీవిస్తుంది, మంచి మొగుడు దొరకాలని, ముద్దొచ్చే బిడ్డలనివ్వాలని, రెండు చేతులెత్తి ఆకాశంవంక చూచి దేవుడ్ని ప్రార్థిస్తుంది ఎంకి. ఆ వూబోణికి ఇది సంతోషంగా ఉంటుంది. ఇంతలోనే చాలామంది బిచ్చగాళ్ళు వచ్చి ప్రక్కన చేరారు ఎంకి వేరే దగ్గిఱ అదృష్టం చూసుకోవాలని ఆలోచించింది. అడిక్మేట్నుండి ఇక్కడకు వచ్చి అడుక్కొనే పోచమ్మ అంటే ఎంకికి మంట. పోచమ్మకు ఎంకికి ఎప్పటికి పోట్లాటనే. తాబేలులా నడిచే పోచమ్మ ముసలిది. చార్మినార్ క్రాస్రోడ్ పోచమ్మ మొగుడుదయినట్లు ఇతర బిచ్చగాళ్ళమీద కేకలేస్తుంది. ఎంకి రోడ్డుదాటి సంధ్య థియేటర్ వైపు పోవాలనుకున్నది. 91 నంబర్ బస్సు వచ్చి ఆగింది. కండక్టర్ "కవాడిగూడ, బోట్స్ క్లబ్, ఆర్. పి. రోడ్, మారేడ్పల్లి" అని అరుస్తున్నాడు రోడ్డు దాటి వేడి వేడి జిలేబీలుచేసే బండిదగ్గిఱ చేయిచాపింది. అంతకుముందే ఇంకా బోణీయయినా కాక వాడు గజ్జికుక్కను తరిమాడు. కోపంతోవాడు రెండు జిలేబీలు ఎంకిమీద విసిరాడు. ఒకటినర్సిములుకు ఇచ్చింది ఎంకి. వాడు దాన్ని ఒకేసారి

మ్రింగి మళ్ళీ చేయి చాపాడు. ఎంకి ఇవ్వలేదు. నర్సిగాడు ''లంజా! అన్నీ నువ్వే తింటావే!'' అంటూ చంకలోనుండే అరచాడు. లాభం లేదనుకొని ఎంకి గబుక్కున జిలేబిని మింగేసింది, మళ్ళీ తనకు దొరుకుతుందో లేదోనని. కనుగ్రుడ్లు ఎంకివి బయటకు పొడుచుకొచ్చినవి. ''లంజాకొడుకా! నేను తినద్దారా!'' అని వాని వీపుమీద చరిచింది. ఎంకిమెల్లగా దాని కుంటిమొగుడు రంగని దగ్గరకు పోయింది. వాడు సుదర్శన్ థియేటర్ ముందు బిచ్చమెత్తుకుంటాడు.

రంగనికి దయనీయమైన గత చరిత్ర ఉన్నది. వాడు పూర్వం రాజేంద్ర ఆయిల్ మిల్‌లో నౌకర్. ఉన్నంతలో వాడు బాగానే బ్రతికేవాడు. వాళ్ళు రోజుకు రెండుసార్లు వంట చేసికొనేవాళ్ళు. పాత దుస్తులు కొనుక్కొని కాలం గడిపేవాళ్ళు. ఒక గుడిసె ఉండేది అడిక్‌మెట్‌లో. వానికి వారానికి 36 రూపాయల జీతం. ఏడేళ్ళ కొడుకు ఉండేవాడు. ఒకరోజు ఫ్యాక్టరీ ప్రమాదంలో చిక్కుకుని కాలు విరిగింది. రక్తం మడుగులోనుండి వాడ్ని తీసికొని తోటి వాళ్ళు ఉస్మానియా ఆస్పత్రిలో చేర్చారు. జీవన్మరణ సంధిలో మూడు నెలలు గడిపినాక ఒక కాలుని తీసివేసి ఇంటికి పంపారు. ఇంకో మూడు నెలలు రాజేంద్ర ఆయిల్ మిల్లుచుట్టూ తిరుగుతే 500 రూ.లు ఇచ్చారు. అప్పటినుండే వాళ్ళ జీవిత నాటక రంగంలో శోకపు అంకం మొదలయింది. వాళ్ళ గుడిసెలో దొంగతనం జరిగింది. ఆ దొంగలు ఇంకా బీదవాళ్ళు. లేకుంటే ఈ దేశపు బీదరికానికి అట్టడుగు చరిత్రకు వాళ్ళు తార్కాణాన్ని ఈ విధంగా ఎందుకు చూపెడుతారు? ఏడేళ్ళ కొడుకు టి బి.తో చనిపోయాడు. కొన్ని నెలల్దాక వాళ్ళను వాళ్ళు భిక్షమెత్తుకొని పోషించుకొనేవాళ్ళు. కాని విధి ఓ విపరీతం చేసింది. నర్సిగాని రూపంలో వాళ్ళు ఓ జనిగను కన్నారు. ఎంకి రక్తాన్ని వాడు పీలుస్తుంటే దాని ప్రాణం పైపైనే పోయేది. గుడిసెను అమ్ముకొని వీధుల పాలయ్యారు వాళ్ళు.

రంగడు వాని స్థానంలో వాడు కూర్చున్నాడు. వాని ప్రక్కన మంగలివాళ్ళు, చెప్పులుకుట్టేవాళ్ళు కూర్చుంటారు. మంగలి దానయ్య అంటాడు ''ఈ రంగడు బస్సు క్రిందపడి ఎప్పుడో చస్తాడు'' అని. ఎంకి వచ్చే సరికి రంగడు ఒక కాగితంలో పెట్టుకొని ఏదో తింటున్నాడు. ఎంకి ఇది చూచి ''కుంటిముండాకొడుకా! నిన్నటినుండి నర్సిగానికి నాల్గు మెతుకులన్నా లేవు. నీవు పంది తీరుగ తింటావురా! కొద్దిగా నర్సిగానికి పెట్టురా!'' అని కేకవేసింది. నర్సిగాడు ఎంకి చంకలోంచి దిగి కాగితాన్ని లాక్కోబోయాడు. రంగడు ఒక్క బుక్కలో మ్రింగి కాగితాన్ని విసిరివేశాడు. వీళ్ళ నాటకాన్ని చూస్తున్న గజ్జికుక్క ఆ కాగితాన్నందుకుని పరుగుతీసింది. నర్సిగాడు కుక్క వెంబడి ఉరికాడు. కాని టెలిఫోన్ కేబుల్ జాయింట్ ఇండికేటర్‌కు తట్టుకొని బోర్లాపడ్డాడు. మోకాళ్ళు గీరుకొని రక్తం కారగా కోపంతో వాడు వాపసువచ్చి వాని అయ్యను ''బోసిడికే! నాకీయక అంతా తిన్నావు కదరా!'' అని రంగని జుట్టుపట్టుకొని లాగాడు. ఎంకి ఇదంతా మౌనంగా పరిశీలిస్తున్నది. దాని మొగుడి ఇంకో కాలును విరిచేయాలనుకున్నది. నర్సిగాడ్ని చంపి, తనను చంపుకోవాలనుకున్నది. దానికండ్లు ఈనిన పులికండ్లలాగ ఉన్నవి. నర్సిగాడ్ని ఒకటి చరచి బరాబరా లాక్కొనిపోయింది.

రంగడు అక్కడే కూర్చొని ''కుంటోన్ని బాబూ! దానం చేయండిబాబూ! మీ పిల్లలు చల్లగుంటారు'' అని లయబద్ధంగా దీర్ఘాలు తీస్తున్నాడు. చెప్పులుకుట్టే రామయ్య వీని కఠోర కంఠ శోషను సహించలేక ''సాలా! గాడిదలాగా ఓండ్ర పెడ్తవ్! పో!బే!! ఇక్కడనుంచి'' అని అరిచాడు. రంగడు పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యునిలాగా ''నీ అయ్య జాగానారా! ఇది సర్కార్ జాగారా! నీవైతే ఇక్కడ చెప్పులు కుట్టి వాళ్ళ పైసలు జేసికుంటవు! నేనేమోకూసో వద్దారా!'' అని ఘాంఢ్రించాడు. చెప్పులు కుట్టించుకొనే ఆసామి సుప్రీంకోర్టు జడ్జీలాగా ఇద్దరికి తీర్పు చెప్పాడు ''మీరిద్దరు పేదవాళ్ళే! మీలో మీరెందుకు పోట్లాడుతారు! ఇద్దరూ ఓర్చుకోవాలి'' అన్నాడు. రంగనికి ఆరోజు బాగలేదు. దేక్కుంటూ వేరే దగ్గఱకు పోదామనుకున్నాడు. వాడు ప్రెసిడెంట్ హోటల్‌వైపు పోయాడు. అక్కడ ఎంకి హోటల్ లోపలికి పోయి చేయిచాపింది. ఒకతను ఒక బన్ను ముక్కను విసిరాడు. ఇంకో ఆయన సమాసాను ఇచ్చాడు. ఒకాయన చాయ్‌ను గిన్నెలో పోశాడు. అట్లాపోసి మేనేజర్ మీద కేకలు వేశాడు ''ఇది హోటలా! లేక కబూతర్ ఖానానా!'' అని. మేనేజర్ ఎంకిపై వేడి వేడి చాయ్ చల్లాడు. చురుక్కుమనగానే నర్సిగాడ్ని వదిలేసి భూమిమీద పొర్లింది. హోటల్లో తింటున్న బాబులందరు ఈ హంగామాను చూచి నవ్వారు. ఎవ్వరూ ఆమెను పాపం అనలేదు. పోలీసు కానిస్టేబుల్ రావ్ ప్యారే పాన్ తింటూ రోడ్డులో పోయే జవ్వనిని తనివితీరా చూస్తున్నాడు. హోటల్ మేనేజర్ ''దొంగముండా! నీవు టేబుల్లమీదినుండి సమాసాలు ఎత్తుక పోతున్నావే! నిన్ను పోలీసులకు అప్పజెప్తా!'' అన్నాడు. ఎంకి ''నేను దొంగతనం చేయలేదు. బాంచను'' అంటూ లేచింది. చిరిగిన కొంగు దాని ఎండిపోయిన రొమ్ములను చాటు చేయలేకపోతున్నది. రంగడు ఇంతలోనే చేరుకొని ''పిచ్చిముండా! నీ విక్కడ ఎందుకడుక్కున్నావే! దిక్కులేనోల్లు అడుగు పెట్టే జాగా కాదే'' అంటూ కన్నీళ్ళు పెట్టుకొన్నాడు. అందరూ కలిసి మూనె షాప్‌లోకి పోయి కొంచెం నూనె అడుక్కొని కాలిన గాయాలకు రుద్దుకొని ఎంకి చేతగాక కూర్చొన్నది. అక్కడే పడివున్న సగం కుళ్ళిన జాంపండును నర్సిగానికి ఇచ్చింది. వాడు పరమ సంతోషంతో దాన్ని తిన్నాడు. మధ్యాహ్నం రెండుగంటలయింది. సంగం, సంధ్య, సుదర్శన్‌లలో మార్నింగ్ షోలు విడిచారు. జనమే జనం. ఈ సదవకాశాన్ని వాళ్ళు వినియోగించుకున్నారు లయబద్ధంగా వాళ్ళు బిచ్చమెత్తుకోవడానికి ఉపయోగించే పదజాలానికి ముగ్ధులయినా, కాకపోయినా ప్రజలు వాళ్ళకి మొత్తం 76 పైసలు ఇచ్చారు. వాళ్ళు చిక్కడపల్లి కూరగాయల మార్కెట్టుకుపోయి రెండు వంకాయలు, ఓ టొమాట, ఓ ఆలుగడ్డ, ఉల్లిగడ్డలు మూడు సంపాయించారు. వాళ్ళ సంతోషానికి అవధులులేవు. సాయంత్రం చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంముందు వాళ్ళ డ్యూటీ! అక్కడికి కాలేజ్ కుర్రాళ్ళు, ఆడవాళ్ళు, మగవాళ్ళు వస్తారు.

ఆరోజు శనివారం కావడంమూలాన రంగనికి ఎంకికి కలిసి రూపాయి న్నర వచ్చాయి రంగడు వంట చేద్దామా ! అన్నాడు. ఎంకి మండి పడి నా కాళ్ళు పొయ్యిలో పెట్టి వండాల్నా! అంది. చెత్తకుండీల్లో కాయితాలు, గుడ్డలు జమచేశారు. కట్టెపుల్లలు కొన్ని చేర్చారు. రూపాయితో నూకలు కొనుక్కొన్నారు. 8 గంటల రాత్రికి చిక్కడ పల్లి బ్రిడ్జిమీదికి చేరుకున్నారు. మట్టికంచుడులో వంట ప్రారంభ మయింది. రంగనికి, నర్సిగానికి స్వర్గమంటే ఇదేనేమో అనిపిం చింది. వాళ్ళ ముందునుండి మొన్ననే ఫిలిప్స్‌వాళ్ళు వేసిన నియాన్ లైట్ల వెలుగుల్లో పెట్రోలు దండగచేస్తూ కార్లు లొద చేస్తు న్నవి. ఎలక్షన్ల టైమ్ అది. ఎక్కడపడితే, అక్కడ పోస్టర్లు, ఝండాలు మరి లౌడ్ స్పీకర్ల గోలలు. ముప్పయి సంవత్సరాల పాలనలో ఎందరు క్రొత్తగా రంగనివంటి సమాజంలో చేరారో కాని బారు సోషలిజాలు, బీరు ఉపన్యాసాలు రాజకీయ నాయకులు ఇస్తూనే ఉన్నారు ప్రజలు సంతృప్తి పడ్తూనే ఉన్నారు. రంగడు కలలలోనే కడుపునిండా తింటాడు. నిద్రించడానికి మున్సిపల్ స్థలం, తినడానికి అడుక్కున్న తిండి, త్రాగడానికి సర్కార్ పంపునీళ్ళు. రంగడ్ని ఏ తరగతిలో విభజించాలి.

వంట అయింది. ముగ్గురూ మూడు భాగాలు చేసికొని అమృతం అనే అనుభూతితో తింటున్నారు నర్సిగాడు ఎంకని చిప్పలో చేయిపెట్టి రెండుసార్లు తీసికొన్నాడు నూకల అన్నం. నర్సి గాడు సంతోషంతో ''ఈ రాత్రికి బువ్వ దొరికింది. రోజ్ దొరికితే బాగుండు''అన్నాడు. వాని అయ్యవైపు చూచి ''ఈ షా గాడు నాకు పెట్టనే పెట్టడు'' అన్నాడు.

ఎంకి ''ఎవన్ని సాలా అంటున్నవ్.''

నర్సిగాడు ''ఇంకా ఎవన్ని, ఈ కుంటోన్నే!''

''తప్పురా, వాడు నీ నాయన!''

''ఈ కుంటోడు నా నాయన్నా?''

రంగనికి ఎవరో ఛాతిలో బాకుతో పొడిచినట్లయింది. ఎంకిని, నర్సిగాడ్ని పీక పిసికి చంపేయాలన్న కోపం వచ్చింది. తర్వాత వాడ్ని వాడే చంపుకోవాలనుకున్నాడు పురుగులకన్నా హీనంగా బ్రతికే వాళ్ళ జీవితాలు మనదేశ చరిత్రకు ఏమన్నా తెలుసా !

ఈ మహానగరంలో డబ్బుకోసం, పొట్టకూటికోసం శరీరా లను అమ్ముకునే వాళ్ళున్నారు. అరగంట ఆనందాన్నిచ్చే వాళ్ళ జీవి తాలు ఎంత హేయమయినవి. హైసొసైటీ లేడీసు వెరైటీకోసం, రుచులకోసం మరిగితే, బీదా బిక్కీ జానెడు పొట్టకోసంగడ్డి తింటు న్నారు. రంగనికి గుడిసెలో గుడ్డిదీపం వెలుగులో వ్యాపారం చేసే లచ్చి జ్ఞాపకం వచ్చింది. ఎంకితో ఏదో ఏదో సంగతి ఎత్తి లచ్చి గురించి పొగిడాడు. ఎంకికి కోపం ఆగలేదు. రంగని గొంతుని రెండు చేతులా పిసుకుతూ ''నీకు శోకులారా ! కుంటోడా! ఇంకోసారి ఆ లంజ ముచ్చట ఎత్తితివా! తలకాయ పలగ్గొడుతా!'' అని ఒక్క కుదుపు కుదిపింది. రంగడు ఎన్నో ఒట్లు పెట్టుకొన్నాడు మళ్లో సారి దాని ఊసు ఎత్తనని.

ఈమధ్య హైద్రాబాద్ పౌండ్రీ వాళ్ళు పారబోసిన బూడిద నుండి చిన్న చిన్న బొగ్గులేరి అమ్ముకొంటున్నది ఎంకి. దర్వానుకు రోజుకు 25 పైసలు కానుక ఇస్తున్నది ఎంకి. రోజుకు మూడు రూపాయల్దాకా సంపాయిస్తున్నది. ఒకవిధంగా మున్సిపాల్టీ వాళ్లని మెచ్చుకోవాలి, ఎన్నో రంగని సంసారాలవంటి వాటికి పండుకోడానికి జాగా, పబ్లిక్ పంపులో నీళ్ళు, రాత్రికి వీధిలో వెలుతురు ఉచితంగా ఇస్తున్నందుకు నిజంగా రోలింగ్ ప్లాను, పంచవర్ష ప్రణాళిక ఈవిధంగా ఉపయోగపడుతున్నందుకు మేధావులను అభినందించాలి. రంగడుమాత్రం బిచ్చమెత్తుకొంటూనే ఉన్నాడు. అందరు కలిసి రోజుకు 5 రూపాయలదాకా సంపాదిస్తున్నారు. నర్సిగాడ్ని స్కూల్లో వేయాలని, వాడ్ని బాగా చదివించాలని రంగడు, ఎంకి అనుకున్నారు. ఫుట్‌పాత్ జీవితాలు గడుపుతూ వాళ్ళు స్కూల్‌కు పంపాలను కోవడం భ్రమేనేమో. శీతాకాలపు రాత్రులు, వేసవి కాలపు మిట్ట మధ్యాహ్నాలు ఫుట్‌పాతులమీద గడపాలి వాళ్ళు. నర్సిగాడు ఎదుగు తున్నాడు. వాడు వారానికోసారి తలకు నూనె రుద్దుకుంటున్నాడు. ప్రతి రాత్రికి చిక్కడపల్లి బ్రిడ్జిమీద వంట చేసికుంటున్నారు. వాళ్ళు ఒకరిపై ఒకరు ప్రేమగా ఉంటున్నారు. నర్సిగాడు అడు క్కొనివచ్చే పిండి, నూకలు, బియ్యం అన్నీ కలిపి వండుతుంది ఎంకి. వాళ్ళ చిప్పల్లో గంజిలాంటి ఆ వంటకాన్ని పోసి తాను తృప్తిగా తాగుతుంది. ఈ కుటుంబపు ఆశలు చిగురిస్తున్నవి. వాళ్ళ జీవితాల వసంతాలు, ఝంఝూమారుతాలు అన్నీ ఆ పేవ్‌మెంట్లమీదనే.

ఆ రోజు సాయంత్రం, చిక్కడపల్లి బ్రిడ్జిమీద విశ్రాంతి తీసికుంటున్నారు రంగడు, ఎంకి, నర్సిగాడు. రోడ్డుకు ఆవల బెంగాలీ బాబులా ఉన్న ఒకతను కారు రిపేర్ చేసికుంటున్నాడు. అతన్ని డబ్బులడుక్కోవాలని నర్సిగాడు రోడ్డు దాటాడు. ఆయన 50 పైసల నాణాన్ని వాడికిచ్చాడు. దానితో వాడు చుడువా కొను క్కోవాలని మిఠాయి బండార్‌కు వెళ్ళాడు. అంతకుముందే రంగడు మున్సిపల్ డస్టుబిన్‌లో చచ్చి పడివున్న కాకిని తెచ్చాడు. ఎంకి దాన్ని వండడానికి ఉపక్రమిస్తున్నది. ఆ రోజు వాళ్ళకు విందు భోజనము.

ఇంతలో ఎక్కడినుండో ఓ గుంపు అలజడిచేస్తూ వచ్చింది. దుకాణాలకు నిప్పు అంటించింది. అంతా అలజడి, కేకలు. బస్సులన్నీ ఆగిపోయాయి. పోలీసు వ్యాను వచ్చింది. గుంపును చెదరగొట్టడానికి లాఠీచార్జి చేసింది గుంపు రాళ్ళు రువ్వారు. పోలీసులు ఫైరింగ్ చేశారు. ప్రజలు చెల్లాచెదరయ్యారు. ఎంకి, రంగడు వణుకు తున్నారు. తుఫాను తర్వాత ప్రశాంతంలా ఉన్నది. అగ్నిమాపక దళం కాలుతున్న దుకాణాలను ఆర్పుతున్నారు. నర్సిగాని శరీరం నెత్తుటి మడుగులో పడివున్నది. వాని చేతిలో చుడువాపొట్లం విచ్చి పోయి, చుడువా భూమ్మీద పడిపోయింది. ఎంకి లబో దిబోమంటూ వాని భౌతిక కాయాన్ని మోసుకొని వచ్చింది పేవ్‌మెంటుమీదికి. పొడుసగం కోసిన మేకలా వున్నాడు. ఎంకి, రంగని ఆవేదనకు

అంతంలేదు. వాళ్ళకు ఆ భౌతికకాయాన్ని స్మశానం తీసికపోవాలన్నా బిచ్చమెత్తుకోవాలి. వాళ్ళు బ్రతుకుకోసం బిచ్చమెత్తుకుంటారు, చావుకోసం బిచ్చమెత్తుకుంటారు.

తెల్లవారి అన్ని పత్రికలలో తాటికాయంత అక్షరాలలో వార్త ప్రచురించబడింది– ''మతకలహాల నణచడానికి పోలీసులు భాష్పవాయు ప్రయోగం చేశారు అది విఫలంకాగా రెండు రౌండ్లు కాల్పులు జరిపారు ఇద్దరు దుండగులు మరణించారు, అయిదు ్ రు గాయపడ్డారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా రాజధాని నగరంలో 48 గంటల కర్ఫ్యూ.''

చనిపోయినవారిలో నర్సిగాడు, ఇంకో బిచ్చగాడు ఉన్నారు. వాళ్ళ శవాలైనా పారేయకుండా కర్ఫ్యూ. వాళ్ళందరు ఎక్కడ వుంటారు? వాళ్ళు ఎక్కడ తింటారు? ఇదంతా ఎవరు ఆలోచిస్తారు. వాళ్ళ నెత్తురు రంగు నల్లన. మిగిలినవాళ్ళ నెత్తురు ఎర్రన.

సుప్తోస్మి జాగృతే

అల్మయిరాలో అస్థిపంజరాలు అంత
  రంగంలో అగ్ని
పర్వతాలు ఎన్ని
చోట్ల తిరిగి
నా వదలని నీడ
మలుపు
ల్లో చిరునవ్వులు నీ
రెండ తళుకుల్లో స్మృతి

పరాగాలు ఆశ
యాల ఆల
[illegible]ాలకు అశ్రు సో
'నాలు నిరంతర
యానాలు అపార్థాలకు అన
ర్థాల ఉపపత్తుల కొలిమి
తిత్తులు క్షమా

పణల దివా
లాలు బ్రతుకు కాగి
తంపై తెగిన గాలిపటం దా
రంలా తెగిన
ఊహ మనం చెయ్య
బడింది కలలు చెయ్య
బడిన పదార్థాలతో
రణాలతో రణాలతో !

ప్రార్థన

దూర తీరాల కదలాడే శాంతి భ్రాంతి
  చేరువ కాకున్నా
చిత్తాన్ని స్పృశించకున్నా
ఏదో ఉండనివ్వు ఆశే అయినా దురాశే అయినా
నిరాశకన్నా మేలు ...

పర్వతాలకన్నా బరువైన ఒంటరితనం
దీన్ని మీటి పారెయ్యటం ఎవరితరం
నిరంతరం ఆరాటం ...

ప్రభూ ! ప్రార్థన తెలియని పాపుల్నీ
కటాక్షించు
ఎలాంటివైనా ఏ రసాలవైనా ఏవో కొన్ని
మరచిపోకుండా మాకు మా రోజువారీ
కలల్ని ప్రసాదించు God !
Give us our daily dreams ... !

కేఎస్వీ

శ్రీ ఏ. కృష్ణారావు

రూసో "జనేచ్ఛ" సిద్ధాంతము

మానవుడు రాజకీయ జీవి అని, అతని జీవితం రాజ్యం లోపలే సార్థకమవుతుందన్న అరిస్టాటిల్ వాదాన్ని పునరుద్ధరించి వక్కాణించిన ఆధునిక రాజనీతి తత్త్వవేత్తలలో రూసో[1] ప్రథముడు. ఇతని రచనలు ఫ్రెంచ్ విప్లవానికి నాంది పలికినాయి. భావి కాలంలో ప్రముఖంగా రాజకీయ వ్యవస్థలను ప్రభావితం చేసిన రాజనీతి తత్త్వవేత్తగా రూసో ప్రాముఖ్యాన్ని మనం ఏ విధంగానూ కాదనలేము. ఇతడు ప్రతిపాదించిన జనేచ్ఛ (General Will) సిద్ధాంతము రాజనీతి భావాలలో ఒక ప్రముఖమైనదిగా ప్రసిద్ధి చెందినది.

మానవ స్వభావము

మానవ స్వభావం[2] గురించి రాజనీతి తత్త్వచరిత్రలో ప్రధానంగా రెండు భావాలున్నాయి. ఒకవైపు మానవ స్వభావం ఎంత చెడ్డగా ఉండగలదో అంత చెడ్డగా ఉంటుందని, కాబట్టి సరైన రాజకీయ వ్యవస్థ లేదా సరైన కళ మానవుడిని అటువంటి దుష్ట స్వభావం నుంచి రక్షించాలని చెబుతుంది ఈ వాదాన్ని మాకియవెలీ, హాబ్స్ మొదలైనవారు ప్రతిపాదించినారు. మరొక వైపు ప్లేటో మొదలైనవారు మానవుడు స్వతస్సిద్ధంగా మంచివాడని, సరైన రాజకీయ సాంఘిక వ్యవస్థలు అతనిలోని స్వాభావికమైన మంచితనాన్ని ఇనుమడింపజేస్తాయని వాదిస్తున్నారు. రూసో ఈ రెండవ తరహాకు చెందిన మానవ స్వభావ విశ్లేషణను అంగీకరించినాడు. నేటి ప్రపంచంలోని అవినీతి, దుష్టశక్తులు, మానవుడు సహజంగా చెడ్డవాడవటంవల్ల ఏర్పడలేదు. అవన్నీ కూడా వికృత సాంఘిక సంస్థలు. అవి మానవుడిని తప్పుదోవను పట్టిస్తున్నాయి. తప్పుడు భావాలవల్ల, సంస్థలవల్ల అతడు చెడ్డవాడవుతున్నాడు.[3]

రూసో అభిప్రాయంలో మానవుడి స్వభావంలో రెండు ప్రధాన గుణాలున్నాయి. అవి ఆత్మరక్షణ, సాంఘిక స్వభావము. సమూహంలో జీవించాలనే కోరిక సాంఘిక స్వభావం నుంచి జనిస్తుంది. అదిలేకపోయినట్లయితే మానవుడి జీవితం దుర్భరమైయ్యేది. పరస్పర సహాయం అనే గుణం ఉండటం వల్లనే సమాజం ఏర్పడి కొనసాగుతున్నది. మానవ స్వభావం గురించి రూసో ఇచ్చిన విశ్లేషణ సరైనదైతే మనం హాబ్స్[4] (Hobbes)వాదంతో అంగీకరించలేము.

ఆత్మరక్షణ, ఇతరులపట్ల సానుభూతి — ఈ రెండూ ఒకొక్కప్పుడు పరస్పరం ఘర్షణపడే సందర్భాలు ఏర్పడవచ్చు. కుటుంబ శ్రేయస్సుకోసం ఉన్న ఆతృత సమాజ ప్రయోజనంకోసం చేయవలసిన ప్రయత్నాన్ని పరిమితం చేయచ్చు; లేదా వ్యతిరేకించవచ్చు. ఇటువంటి విభిన్న ప్రయోజనాలు కొన్ని సమస్యలకు దారితీస్తాయి. ఈ రెండిటినీ మానవుడు సమానంగా సంతృప్తి పరచలేడు. అందువల్ల వీటిమధ్య రాజీ ఏర్పరచటానికి ప్రయత్నిస్తాడు. ఇటువంటి రాజీ ఫలితంగానే మరొక భావం ఏర్పడుతుంది దానిని అంతరాత్మ అంటారు. ఇది మానవుడికి ఏది మంచి ఏది చెడ్డ అనేది చెప్పదు. ఏది మంచి అని మానవుడు తెలుసుకొంటాడో దానిని చేయమని అంతరాత్మ ప్రోత్సహిస్తుంది. మంచిని మానవుడు మరొక భావం ద్వారా కూడా తెలుసుకొంటాడు. ఆ భావమే హేతువు[5] (Reason) మానవుడు ఏమి చేయవలెనో హేతువు అతనికి చెబుతుంది. అయితే అతనిని ఆ పని చేయటానికి పూర్తిగా పురికొల్పలేదు. అతనిచే మంచి పని చేయించగలిగేది ఒక్క అంతరాత్మ మాత్రమే. ఒక్క అంతరాత్మే మానవుడిని సన్మార్గంలోకి నడిపిస్తుంది.

మానవుడు వివేకంచేత పరిపూర్ణుడు కాగలడు. అయితే వివేకం అతనిని పూర్తిగా ప్రభావితం చేయలేదు. అతనిని కార్యోన్ముఖుని చేయటానికి కొంత ప్రేరణ లేదా ఉద్వేగం అవసరము. మానవుడు పూర్తిగా హేతుబద్ధంగా వ్యవహరించడానికి, మానసిక భావాలు, ఉద్రేకాలు, రాగద్వేషాలు అతనిని కార్యాచరణకు ప్రోత్సహిస్తాయని, మానవ సంబంధాలలో రాగద్వేషాల ప్రాముఖ్యాన్ని వివరించిన ప్రథమ రాజనీతి తత్త్వవేత్త రూసో.

స్వేచ్ఛ

ప్రాకృతిక వ్యవస్థ[6] (State of Nature) మానవుడు స్వేచ్ఛా జీవి. స్వేచ్ఛ అంటే మనకు కావలసిన జీవన విధానాన్ని ఎంచుకోవటం. ఇదే మానవులను జంతువుల నుంచి వేరుచేస్తుంది. స్వేచ్ఛ మానవుడికి పరిపూర్ణత్వాన్ని సాధించటానికి అత్యావసరము. అందువల్ల రూసో సోషల్ కాంట్రాక్ట్‌కు ఉపోద్ఘాతంలోనే ''మానవుడు జన్మతః స్వేచ్ఛాజీవి'' అని ప్రకటిస్తాడు.

రూసో స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికిఉన్న వ్యత్యాసాన్ని గుర్తించినాడు. స్వాతంత్ర్యం ఎటువంటి చట్టాలకు పరిమితం కాదు. ఇది ఒక రకంగా అపరిమితమైన స్వేచ్ఛ. అపరిమితస్వేచ్ఛ ఏ విధమైన పరిమితులను, విధులను గుర్తించదు. విధులులేని హక్కులు అరాజకాన్ని సృష్టిస్తాయి. ఇది మానవ ప్రగతిలో మొదటి దశ. దీని తరవాత రెండవ దశ పౌర సమాజము. ఇందులో మానవుడు పౌర

స్వేచ్ఛలను అనుభవిస్తాడు. చట్టం అనే భావంలో హక్కులు, విధులు మొదలైనవి ఏర్పడుతాయి.

పౌర సమాజంలో అనుభవించే స్వేచ్ఛ ప్రాకృతిక వ్యవస్థలో మానవుడికి ఉన్న స్వాతంత్ర్యానికి భిన్నంగా ఉంటుంది. మానవుడు తన ప్రగతికి కావలసిన స్వేచ్ఛను ఒక్క సమాజంలో మాత్రమే పొందుతాడు. ప్రతి వ్యక్తి సమాజంలో సభ్యుడిగా సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వ్యవహరించినప్పుడు అతడు కొన్ని నైతిక సూత్రాలను పాటించవలసి వస్తుంది. వాటితోపాటు ధర్మము, న్యాయము మొదలైన భావాలు సహజ వాంఛలను కొంత వరకు పరిమితం చేస్తాయి.

మానవుడు తన ఇచ్ఛను చట్టాన్ని, చట్టం ద్వారా హేతువుకు అనుగుణంగా రూపొందించుకొన్నప్పుడే అతడు నిజమైన స్వేచ్ఛను అనుభవిస్తాడు. వ్యక్తి ఇచ్ఛను సంఘ శ్రేయస్సుతో ఏ విధంగా సమన్వయం చేయాలనేది ఒక ప్రధానమైన ప్రశ్న.

రూసో అభిప్రాయంలో "మానవుడు స్వేచ్ఛా జీవిగా జన్మించినా అతడు ప్రతిచోటా బంధితుడై ఉన్నాడు." (Man is born free, but every where he is in chains). మానవుడు జన్మతః స్వేచ్ఛాజీవి అయితే అతడు ఏ విధంగా సంకెళ్ళతో ప్రతి చోటా నిర్బంధింపబడినాడు? అతడు నిజంగా అన్నిచోట్లా నిర్బంధితుడైతే స్వేచ్ఛా జీవిగా ఎలా జన్మించాడు? మానవుడికి స్వేచ్ఛ అనేది జన్మహక్కు. అది అతని ప్రగతికి మౌలికమైనది అని రూసో అభిప్రాయము

మానవుడు స్వేచ్ఛకోసం జన్మించినట్లయితే స్వేచ్ఛ అతనికి లభించాలి స్వ + ఇచ్ఛ = స్వేచ్ఛ. సంప్రదాయాలు, ఆచారాలు, వాడుకలు కృత్రిమ ప్రతిష్ఠ (false prestige) మొదలైన భావాలు అతనిని అదుపులో ఉంచినాయి. కాబట్టే మానవుడు అన్నిచోట్లా బంధితుడైనాడు. కృత్రిమ సామాజిక కట్టుబాట్లు మానవునిపై అనవసరమైన ఆంక్షలను విధించి అతని ప్రగతికి, వ్యక్తిత్వాభివృద్ధికి ప్రతిబంధకాలైనాయి. ఇటువంటి సమాజం నుంచి మానవుడిని విముక్తుడినిచేసి అతని సహజ స్వేచ్ఛను పెంపొందించటానికి సరైన నియమాలను రూపొందించుకొన్నా రాజకీయ సాంఘిక వ్యవస్థల నిర్మాణం, అవి ఏ విధంగా ప్రగతికి తోడ్పడాలి మొదలైన వాటిని చర్చించటం తన ప్రధాన కర్తవ్యంగా రూసో భావించినాడు ప్రాకృతిక వ్యవస్థకు మానవులు తరలాలి (Back to the nature) అని రూసో చెప్పటంలో అర్థం ఇదే. ప్రాకృతిక వ్యవస్థలో జీవించటం అంటే మనం జంతువులవలె జీవించాలని కాదు. నాగరిక సమాజం ఏర్పడకముందు మానవులు ఏ విధంగా స్వాభావికంగా మంచి చెడు తెలుసుకొని నిశ్చింతతో సాధారణ జీవితం గడిపారో అటువంటి జీవితాన్ని అలవరుచుకోవాలని రూసో బోధిస్తాడు.

సాంఘిక ఒడంబడిక

సాంఘిక ఒడంబడిక[7] ప్రాతిపదికపై ఏర్పడిన సమాజమే ప్రజలకు కావలసిన నైతిక స్వేచ్ఛను ఇస్తుంది. ఈ స్వేచ్ఛ చట్టాన్ని అంగీకరించటం ద్వారా లభిస్తుంది. చట్టం ప్రజలకు రక్షణ, భద్రతలను కల్పిస్తుంది; క్రమబద్ధమైన జీవితాన్ని నిర్దేశిస్తుంది.

పౌర సమాజం బలప్రయోగం ద్వారా ఏర్పడదు బల ప్రయోగంద్వారా ఏర్పడిన సమాజం వ్యక్తికి ఎటువంటి హక్కులను ఇవ్వదు బలప్రయోగానికి మానవుడు లొంగటానికి ఇష్టపడడు. తప్పని సరైతేనే బద్ధుడౌతాడు. రాజకీయాధికారం చట్టబద్ధం కావాలంటే, ప్రజలు దానికి బద్ధులై ఉండాలంటే అది వారి సమ్మతిపై ఏర్పడాలి ఈ సమ్మతి ఒడంబడిక ద్వారా వ్యక్తమవుతుంది. సాంఘిక ఒడంబడిక రాజ్యాన్ని ఒక నైతిక వ్యవస్థగా రూపొందిస్తుంది. రాజకీయబద్ధత మౌలికంగా నైతికమైనది; చట్టం అనేది తరవాత ఏర్పడుతుంది.

రూసో ప్రతిపాదించిన సాంఘిక ఒడంబడికలో ఈ క్రింది అంశాలుంటాయి :

1 ప్రతి సభ్యుడు తన హక్కులు, అధికారాలను మొత్తం సమాజానికి అర్పిస్తాడు. సమాజం సంపూర్ణాధికారాలను సంపాదించుకొన్నా పౌరుల స్వేచ్ఛను పూర్తిగా పరిమితం చేయలేదు. ప్రతి వ్యక్తికి కొన్ని వ్యక్తిగతమైన స్వేచ్ఛలు లభిస్తాయి.

2. ఒడంబడికవల్ల ఏ వ్యక్తీ నష్టపడడు. కొంత లాభాన్ని పొందుతాడు.

3. అధికారాలను ఒక బాధ్యతారహితమైన సార్వభౌముడికి లేదా ఒక సంస్థకు ఇవ్వటం లేదు సమాజమనే సంస్థలో సభ్యుడిగా సమాజ కార్యకలాపాలలో సమభాగాన్ని ప్రతి వ్యక్తికీ లభిస్తుంది

4. ఒడంబడిక ఫలితంగా ఏర్పడిన సమాజం ఒక సజీవమైన సంస్థ. దానికి ఒక నైతిక, సామూహిక గుర్తింపు ఉంటాయి. ఈ విధంగా రూసో హాబ్స్, లాక్ వాదాలను తిరస్కరించి గ్రీకు భావాలను పునరుద్ధరించినాడు[8] వ్యక్తికి ఉత్తమ జీవనం రాజ్యంలోనే సాధ్యమవుతుంది; రాజ్యం వెలుపల ఏమీకాదు. స్వేచ్ఛ, ప్రగతి ఒక రాజకీయ సమాజంలోనే సాధ్యమవుతుంది.

రూసో మానవుడిని వ్యక్తిగా భావించలేదు. ఒక పౌరునిగా అతని కర్తవ్యమేమిటో వివరించటానికి ప్రయత్నించాడు. రాజకీయాధికారానికి పౌరుడు నైతిక కారణాలవల్ల బద్ధుడౌతాడు. భౌతిక ప్రయోజనాలు మాత్రమే అతనిని నిర్దేశించలేవు. రాజకీయాధికారానికి బద్ధత (Political obligation) మొట్టమొదట నైతికమైనది. తరవాతనే చట్టం, అధికార వ్యవస్థ మొదలైనవి ఏర్పడుతాయి. రూసోలోని ప్రత్యేకత రాజకీయాధికారాన్ని మానవుడు నైతిక కారణాలవల్ల సమర్థిస్తాడని చెప్పటమే.

జనేచ్ఛ సిద్ధాంతము

రూసో ప్రతిపాదించిన 'జనేచ్ఛ'(General will) సిద్ధాంతం అతని రాజకీయ భావాలలో అత్యంత ప్రధానమైనది. రాజకీయాధికారం ప్రయోజనం, అధికారం ఏర్పడే పద్ధతులకంటే రాజకీయాధికారానికి మానవుడు ఎందుకు బద్ధుడై ఉంటాడన్న ప్రశ్నను రూసో ప్రధానంగా చర్చిస్తాడు. దానికి సమాధానంగా జనేచ్ఛ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినాడు

రాజకీయ సంస్థల అవతరణ గురించి రూసోకు పూర్వంఉన్న రాజనీతి తత్త్వవేత్తలు అనేక రకాలుగా వివరణలు చేసినారు. మాకియవెలీ, బోదిక్, హాబ్స్ అధికార వ్యవస్థ ఆవశ్యకతను వివరిస్తూ మానవులను శాసించటానికి, వారిని క్రమబద్ధంగా జీవింపచేయటానికి సంపూర్ణాధికారం ప్రభువుకు ఉండాలని వాదించినారు. రూసో రాజకీయాధికారాన్ని సమర్థించటం గాని, లేదా అది ఏవిధంగా రూపొందాలో, నిర్వహించాలో మొదలైనవాటిని చర్చించలేదు. సాంఘిక ఒడంబడికను సూత్రప్రాయంగా ఒక సాధనంగా మాత్రమే రూసో వినియోగించినాడు రాజ్యము ఒక అత్యున్నతమైన నైతిక వ్యవస్థ అని అందులోని సభ్యులు దాని అధికారానికిబద్ధులై ఉంటారని రూసో భావించినాడు.

రాజకీయాధికారాన్ని మానవులు కొన్ని పరిమిత ప్రయోజనాలను సాధించటానికి మాత్రమే రూపొందించుకోలేదు. పౌరసమాజం ప్రజలందరి సమ్మతిపై ఏర్పడుతుంది. దీనికి సభ్యులందరినీ శాసించే అధికారం ఉంటుంది. వీరు సమాజం ఆధిపత్యాన్ని అంగీకరిస్తారు; అధికారాన్ని శిరసావహిస్తారు. రాజకీయాధికారాన్ని ఎందుకు అంగీకరిస్తారు? ఎందుకు సమాజం సభ్యులను క్రమబద్ధంచేసే అధికారాన్ని సంతరించుకొన్నది? ఈ ప్రశ్నలకు సమాధానం రూసో 'జనేచ్ఛ' సిద్ధాంతంలో కనిపిస్తుంది.

సమాజం అవతరణ అందులోని సభ్యుల 'ఇచ్ఛ'పై ఆధారపడి ఉంటుంది. ఈ ఇచ్ఛ లేదా ప్రయోజనం రెండువిధాలుగా ఉంటుంది. ప్రతివ్యక్తికి వ్యక్తిగత ప్రయోజనం లేదా వ్యక్తిగత ఇచ్ఛ (Individual will) ఉంటుంది· ఇది ఎప్పుడూ వ్యక్తిని తన ప్రయోజనాన్ని సాధించుకోమని చెబుతుంది. అదే సమయంలో (విభిన్న ప్రయోజనాలున్నప్పటికీ) సమష్టి ప్రయోజనం—అందరికీ సమానంగా వర్తించే—కూడా ఒకటి ఉంటుంది. ఇది అందరి శ్రేయస్సునూ కోరుతుంది. ఇటువంటి సమష్టి లేదా సాధారణ ప్రయోజనం లేకపోతే సామాజిక జీవనం సాధ్యంకాదు. ఈ సమష్టి ప్రయోజనం మానవులను సమాజంగ రూపొందమని, క్రమబద్ధమైన జీవితాన్ని గడపమని ఆదేశిస్తుంది

వ్యక్తిగత ఇచ్ఛ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి 'వాస్తవ ఇచ్ఛ' (Actual will), రెండు నిజమైన ఇచ్ఛ (Real will). వాస్తవ ఇచ్ఛ వ్యక్తిని కేవలం తన ప్రయోజనాలను మాత్రమే సాధించేటట్లు చేస్తుంది. నిజమైన ఇచ్ఛ తాత్కాలిక ప్రయోజనాలను అదుపులో ఉంచి పరిపూర్ణతను సాధించుకొని, నైతిక ఔన్నత్యాన్ని పెంపొందించుకోమని చెబుతుంది. ప్రతివ్యక్తి నిజమైన ఇచ్ఛద్వారా ప్రభావితుడైనప్పుడు అటువంటి మొత్తం ప్రజల ఇచ్ఛ జనేచ్ఛగా రూపొందుతుంది.

జనేచ్ఛ అంటే మొత్తం ప్రజల ఇచ్ఛ[10] కాదు. లేదా అధిక సంఖ్యాకుల ఇచ్ఛకాదు. ప్రతివ్యక్తి ప్రయోజనాన్ని సాధించే ఇచ్ఛగా, మొత్తం సమాజ ప్రయోజనాన్ని కాపాడే ఇచ్ఛగా జనేచ్ఛ రూపొందుతుంది.

సమాజంలో సభ్యుడిగా వ్యక్తి బాధ్యతతో వ్యవహరిస్తాడు. ప్రాకృతిక వ్యవస్థలో జీవించిన విధానాన్ని పౌరసమాజంలో మార్చుకొంటాడు. జనేచ్ఛకు బద్ధుడై వ్యవహరిస్తాడు. జనేచ్ఛ ప్రజా శ్రేయస్సును, వ్యక్తి సర్వతోముఖాభివృద్ధినీ కోరుతుంది. అటువంటి జనేచ్ఛలో బాధ్యతాయుతమైన సభ్యుడిగా ప్రతివ్యక్తి పాల్గొంటాడు.

జనేచ్ఛకు సమాజ సభ్యులను నియంత్రణచేసే సంపూర్ణాధికారం (సార్వభౌమాధికారం) ఉంటుంది. సార్వభౌమాధికారం రూపొందించే చట్టాలు జనేచ్ఛను ప్రతిబింబించాలి.

రూసో వాదం జనేచ్ఛకు రెండు లక్షణాలను ప్రతిపాదిస్తుంది. ఒకటి, జనేచ్ఛ సామూహిక ప్రయోజనాన్ని కోరుతుంది; రెండు, ప్రజాహితాన్ని సాధించటానికి ప్రయత్నిస్తుంది. ప్రజాహితాన్ని పెంపొందించే జనేచ్ఛ వ్యక్తమవ్వాలంటే ప్రతివ్యక్తి స్వప్రయోజనాలను విస్మరించి సమాజంలో సభ్యునిగా, రాజ్యంలో పౌరునిగా తన కర్తవ్యాలను నిర్వహించాలి.

అయితే వాస్తవ రాజ్యాలలో ఇటువంటి నిర్వికారచిత్తత (disinterestedness) తో కూడుకొన్న జనేచ్ఛ వ్యక్తం అవటం సాధ్యంకాదు. అనేక సమాజాలలో ఎన్నికలలో ఓటర్లు విధానాలను గాక వ్యక్తిగత కారణాలవల్ల ప్రత్యేక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఓటుచేయటం సాధారణమయింది. అయితే అటువంటి సందర్భాలలో ప్రైవేటు ప్రయోజనాలు వర్గప్రయోజనాలకు ప్రాముఖ్యం ఇస్తాయేకాని ప్రజాశ్రేయస్సనే భావాన్ని పూర్తిగా నశింపజేయదు.

ప్రతివ్యక్తి పాల్గొనేవిధంగా జనేచ్ఛ రూపొందాలంటే అది ఏకగ్రీవంగా ఏర్పడాలి. అయితే ప్రతి అంశంపై ఏకగ్రీవాభిప్రాయం సాధ్యంకాదు. అయితే జనేచ్ఛ సంఖ్యాబలంపై ఆధారపడదు. సామూహిక ప్రయోజనాన్ని అనుసరించి అది ఏర్పడుతుంది. ఓట్లను లెక్కపెట్టటంద్వారా జనేచ్ఛను మనం కనుక్కోలేము.

జనేచ్ఛకు సంబంధించిన మరో రెండు అంశాలను రూసో ప్రస్తావిస్తాడు. అవి: ఒకటి, జనేచ్ఛ తప్పుచేయదు; రెండు, జనేచ్ఛ అవిభజనీయము. అయితే ఈ రెండు లక్షణాలున్న జనేచ్ఛ ఆధునిక రాజ్యాలలో ఆచరణ సాధ్యంకాదు. రూసో అభిప్రాయంలో ఒక్క ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో మాత్రమే జనేచ్ఛ వ్యక్తమవుతుంది.

రూసో ప్రతిపాదించిన జనేచ్ఛ సిద్ధాంతంలో ఈ క్రింది లోపాలు మనకు కనిపిస్తాయి :

1. రూసో ప్రధానలక్ష్యం వ్యక్తి స్వేచ్ఛను కాపాడటం అయినప్పటికీ అతని సిద్ధాంతం అధిక సంఖ్యాకుల నిరంకుశత్వాన్ని సమర్థించటానికి ఒక సాధనంగా రూపొందింది. మెజారిటీ నిర్ణయంతో ఏకీభవించని వ్యక్తి తన స్వేచ్ఛను వదులుకోవలసివస్తుంది. వాస్తవ రాజ్యాలలో అధిక సంఖ్యాకుల పీడన (Tyranny of the majority) సర్వసాధారణమయింది.

2. రూసో జనేచ్ఛ సిద్ధాంతం సమాజానికి రాజ్యానికి అపరిమితాధికారాలను ఇచ్చి వ్యక్తికంటే ఉన్నతస్థాయిలో వాటిని ఉంచటం వల్ల నిరంకుశ రాజ్యవిధానాలు ముఖ్యంగా నియంతృత్వ వ్యవస్థలు, సంపూర్ణాధికార రాజ్యాలు (Totalitarian states) ఏర్పడటానికి అవకాశం కల్పించింది.

3. "జనేచ్ఛ" ప్రభుత్వం ప్రాముఖ్యాన్ని పూర్తిగా తగ్గిస్తుంది. జనేచ్ఛ నిర్ణయాలను అమలు జరిపే ఒక సాధనంగా ప్రభుత్వం వ్యవహరించాలి.

4. సాంఘిక ఒడంబడిక వాదము, జనేచ్ఛ ఈ రెండూ పరస్పర వ్యతిరేకాలు. ఒడంబడిక వ్యక్తి ప్రయోజనాలను సూచిస్తుంది. జనేచ్ఛ సూచించిన విధంగా మానవుడు పరిణితి చెంది ఉంటే, 'సమాజం వ్యక్తిని నిర్బంధించే అవసరం ఉండదు. ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు జన్మతః స్వేచ్ఛా జీవి; తనకు తాను మాత్రమే బద్ధుడై ఉంటాడు; నాగరిక సమాజంలోనే నిజమైన స్వేచ్ఛను అనుభవిస్తాడనీ ఈ రెండు భిన్నభావాలు రూసోను ప్రభావితం చేసినాయి. "ఒకవైపు రూసో రాజ్యాన్ని నిరపేక్షంగా సమర్థించాడు మరొకవైపు వ్యక్తిస్వేచ్ఛను కాపాడటానికి ప్రయత్నించాడు. ఈ విభిన్నమైన లక్ష్యాలలో దేనిని ఒక దానికోసం మరొకటి వదులుకోటానికి రూసో సిద్ధపడలేదు."

రూసో ప్రభావము

ఏ రాజనీతి తత్త్వవేత్తా తన కాలంలో కాని తరవాత కాలంలోకాని జరిగిన సంఘటనలను, భావాలను రూసోలాగ ప్రగాఢంగా ప్రభావితం చేయలేదు. రూసో రచనలు ఫ్రెంచ్ విప్లవానికి పాఠ్యగ్రంథాలైనాయి. 20వ శతాబ్దంలో కారల్ మార్క్స్ "దాస్ కాపిటల్" రష్యాలో విప్లవకారులను ఏ విధంగా ఉత్తేజపరిచినదో రూసో సిద్ధాంతాలు కూడా అనేక విప్లవవాదులను అంత ప్రభావితం చేసినాయి.

మానవుడు రాజకీయ జీవి; రాజ్యంలోనే పరిపూర్ణతను పొందుతాడు అన్న అరిస్టాటిల్[11] వాదాన్ని పునరుద్ధరించిన ఆధునిక రాజనీతి తత్వవేత్తలలో రూసో ప్రథముడు.

సార్వభౌమాధికారసిద్ధాంతాన్ని (theory of sovereignty) చర్చించటంలో రూసో కొంత ప్రత్యేకతను ప్రదర్శించినాడు. సార్వభౌమాధికారాన్ని హాబ్స్‌వలె నిరపేక్షంగా రూపొందించినా అది వ్యక్తి స్వేచ్ఛలను కాపాడాలని వాదించినాడు.

రూసో ముఖ్యమైన భావాలను ఈ క్రింది విధంగా సంక్షిప్త పరచవచ్చు!

1 రాజకీయాధికారానికి మూలాధారం ప్రజలు.

2 సామూహిక ప్రయోజనం ప్రభుత్వంయొక్క ముఖ్య కర్తవ్యము.

3 రాజ్యము ఒక సజీవమైన సంస్థ

4 సజీవమైన సంస్థగా రాజ్య ఉనికిని, ఆసక్తిని కాపాడేది జనేచ్ఛ.

5 రాజ్యాధికారానికి, స్వేచ్ఛకు సమన్వయాన్ని సాధించటం సాధ్యమవుతుంది.

అధోజ్ఞాపికలు

1 రూసో ప్రముఖ ఫ్రెంచ్ రాజనీతి తత్వవేత్త. ఇతని రచనలు: Social contract (1762); Emile (1762); Confessions; Origin and Basis of Inequality (1750).

2 రూసో – మానవ స్వభావము – వి. కృష్ణారావు "తెలుగు" త్రైమాస పత్రిక – తెలుగు అకాడమీ, హైదరాబాద్ – 500029, జనవరి–మార్చి, 1977 చూడండి.

3 According to Rousseau man is not born evil but grows into it as a result of wrong art.

4 థామస్ హాబ్స్ సుప్రసిద్ధ ఆంగ్ల రాజనీతి తత్వవేత్త. లెవియథన్ (Leviathan) అనే గ్రంథంలో మానవ స్వభావం చంచలమైనది, స్వార్థపూరితమైనది అని ఇతడు వాదించినాడు.

5 రూసో హేతువును అంగీకరించలేదన్న వాదం ఒకటి ఉన్నది. రాజనీతి తత్వవిచారంలో హేతువు ప్రాముఖ్యాన్ని నిరశించి దానిని ప్రభావం మానవ కార్యకలాపాలపై లేదని చెప్పటానికి రూసో ప్రయత్నించాడు. హేతువు, విజ్ఞానము, కళలు మానవుని కలుషితం చేసినాయని రూసో అభిప్రాయం. హేతువు స్థానంలో స్వాభావికమైన మంచితనము, ప్రేమ, దయ, ఆదరము మొదలైన సాధారణ ఉద్వేగాలను అతడు ప్రతిపాదించాడు. రూసో అభిప్రాయంలో "ఆలోచించే మానవుడు నైతికంగా పతనమై జంతువుతో సమానుడవుతాడు." అయితే రూసో వ్యతిరేకించింది తప్పుడు హేతువు (wrong or false reason) ను కాని మంచి హేతువు (Right reason)ను కాదు.

6 హాబ్స్, లాక్, రూసో రాజకీయ సంస్థల అవతరణ గురించి చర్చించేటప్పుడు మానవ సమాజాన్ని రెండు దశలు – రాజ్య వ్యవస్థ ఏర్పడటానికి ముందు మానవ సమాజం (ప్రాకృతిక వ్యవస్థ), రాజకీయ సమాజం–గా విభజించినారు.

7 హాబ్స్, లాక్, రూసో మొదలైన రచయితలు రాజ్యము ప్రజల ఒప్పందంద్వారా ఏర్పడిందని చెబుతారు. రాజకీయ సమాజం ఏర్పడటానికి ముందు ప్రజలు–చట్టము, రాజ్యము, అధికార వ్యవస్థలేని ప్రాకృతిక వ్యవస్థలో జీవించారని వారి అభిప్రాయము. ప్రాకృతిక జీవనంలోని ఇబ్బందులు ప్రజలను రాజకీయ సమాజాన్ని ఏర్పాటు చేసుకోటానికి ప్రోత్సహించాయి. వారంతా ఒక ఒప్పందం ద్వారా పౌర సమాజాన్ని ఏర్పాటు చేసుకొంటారు. ఈ ఒప్పందం ప్రజలంతా చేసుకొంటారు. కనుక దానిని సాంఘిక ఒప్పందం (Social contract) అన్నారు.

ప్రాకృతిక జీవనం స్వభావం, సాంఘిక ఒడంబడిక షరతులు, రాజకీయ సమాజం నిర్మాణం ఈ రచయితల దృక్పథాలు, ఆశయాల కనుగుణంగా విభిన్నంగా ఉన్నాయి. హాబ్స్ సంపూర్ణ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. దాని కనుగుణంగా ప్రాకృతిక వ్యవస్థలో మానవ జీవనం దుర్భరమైనదని, అందువల్ల వారు ఆత్మరక్షణం తమ సర్వ హక్కులను, అధికారాలను ఒక వ్యక్తికి వదులుకోగా అతడు సంపూర్ణాధికారాలను వారిపై సంపాదించుకొన్నాడని హాబ్స్ వాదిస్తాడు జాన్‌లాక్ పరిమిత ప్రభుత్వాన్ని ప్రతిపాదించాడు. ఇతని కథనం ప్రకారం ప్రాకృతిక వ్యవస్థలో మానవులు శాంతి సంపదలతో సుఖంగా జీవించారు. ప్రతి వ్యక్తి సహజ హక్కులను అనుభవించాడు. అయితే ప్రభుత్వం లేకపోవటంవల్ల సాధారణ లేదా సమష్టి ప్రయోజనము దెబ్బతిన్నాయి. సమష్టి ప్రయోజనాల సాధనకు, స్వేచ్ఛలను కాపాడుకోటానికి ఒప్పందం ద్వారా ప్రజలు రాజకీయ సమాజాన్ని ఏర్పాటు చేసుకొన్నారని లాక్ వాదించినాడు.

8 హాబ్స్, లాక్ రాజకీయ సమాజం ఒడంబడిక ద్వారా ఏర్పడిందని చెప్పినప్పటికీ దాని ప్రధాన ప్రయోజనం వ్యక్తి ఆసక్తే. వ్యక్తుల ప్రమేయంతో ఏర్పడిన సమాజం వ్యక్తులను అధిగమించ మనలేదు. ఎందుకనగా ప్రజలపై (వారి వాదం ప్రకారం) సమాజానికి పూర్తి అధికారం లేదు.

9 Rousseau's "Conception of General will as the single and simple volition of the body politic regarded as a living entity." Presents

his greatest contribution to political thought. The theory of General will leads us to believe that :

(1) The body politic taken as a whole may be regarded as an organised living body resembling that of a man.

(2) The body politic is also a model being possessed of a will.

(3) This General will which tends always to the preservation and welfare of the whole and every part is the source of law.

(4) The general will "Constitute for all the members of the State in their relation to one another and to it, the rule of what is just and unjust."

(5) The general will is always for the common good, i. e. the general will is always in the side which is most favourable to the public interests, so that "it is needful only to act justly to be certain of following the general will —The political and social Ideas of the Age of Reason, edited by F. J. C. Hearnshaw P 192.

10 "There is often a great deal of difference between the will of all and the general will; the latter considers only the common interest while the former takes private interest into account, and is no more than a sum of particular wills; but take away from these same wills the pluses and minuses that cancel one another and the general will remains as the sum of the differences" — The social contract, edited by Ernest Rhys, Book No II, Chap III, P. 25

11 అరిస్టాటిక్ రాజ్యాంగతా వాదము. వి. కృష్ణారావు, భారతి అక్టోబర్ 1979 సంచికలో చూడండి.

సంప్రదింపు రచనలు

1 The social and Political Ideas of the Age of Reason-, Edited by F. J. C Hearnshaw.

2 The Social contract, Edited by Ernest Rhys.

3 Introduction to the Social contract. Edited by E Rhys

4 Readings in Political Philosophy — F. W Coker.

5 Rousseau and Naturalism—W. H.Hudson.

6 Jean Jacques Rousseau — F. Macdonald.

7 The Political writings of Rousseau—Ed. by C E Vaughan.

8 రూసో—మానవ స్వభావము—వి. కృష్ణారావు, "తెలుగు" Jan-March, 1977.

అభిగామి

కలికిరి ఎ. అబ్దుల్ ఖాదర్

అక్కడ —
ఆ లేమ కిమ్మీరాధరాల్లో
కిరణమాలి చిరునగవుల సొగసులకు
మంచులో తడిసి
మత్తుగా చిగురించిన
మందారపు మొగ్గల సోయగాలను ఏరి
సిగలో తురుముకొని
ఈ తుంటరి 'సమీరం'
ఎటు తూలిపోయిందో —

వెన్ను విరిచి
కన్ను కుట్టేలా సంచరించే
కోరికల శారికల్ని
ఒడిసి పట్టుకొని
ఇంతవరకు ఎవరి చరణాలూ సోకని
ఆ మంకెనపూల బాటమీదపడి
ఈ 'నెత్తురు పొద్దు'
ఎటు వలస పోయిందో -
ఎక్కడో
దిక్కుల గుంజలకు వేలాడే
చుక్కల పందిరి నీలిమ నీడలలో
అనుభూతిని తిని
ఆ జవంతో
అనుభవం విసిరిన కాంతిలో
ఒక 'తెలిమబ్బు తునక'
నవ నాడుల గోడల్లో
పొంగిన చైతన్యంలోకి తొంగిచూచి
ఎటు కదలిపోయిందో -

కసరే కాటుక కన్నుల్లో
కొసరి కాసిన వెన్నెల్లుచూచి
వెంటబడి తరిమే వాడివయసుకు
బెదరిన 'యౌవ్వనం'
అదరిన గుండెల్ని
స్మైత స్ఫోకులతో కొలవలేక
ఎటు వెళ్లిపోయిందో – !

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

శాస్త్ర, కళలలో సృజనాత్మక స్వవిమర్శ పోపరు భావములు

శాస్త్రానికీ కళకూ గల సామ్యభేదాలేవి? శాస్త్రమూ, కళా ఎలా ఉద్భవిస్తాయి? వాటి మూలమేమి? వంటి ప్రాతిపదిక ప్రశ్నలు ఎప్పుడూ పుడుతుంటాయి. వీటికి సమాధాన మీయగలిగినవాడు అటు శాస్త్రగతినీ, ఇటు కళావిలసనాన్ని ఆకళించుకొన్నవాడు కావలె. వాటిని సమరసింప జేయగల సమ్యక్ తాత్త్వికుడు కావలె. అట్టి కొద్దివాళ్లల్లో "పోపరు" ఎన్నికయినవాడు.

సర్ కర్ల్ రైమండ్ పోపర్ (Sir Karl Raimund Popper)–ఈ వ్యాసంలో ఇకమీదట పోపరు–1979లో సాల్జ్‌బర్గ్ (ఆస్ట్రియా)లో జరిగిన మొజార్ట్ సంగీతోత్సవంలో ఆహ్వానితమైన ప్రారంభోపన్యాసం చేసినాడు. ఆ ఉపన్యాసం ఎన్‌కవుంటర్‌లో ప్రచురితమైంది. దాని శీర్షిక Creative Self-Criticism in Science and in Art ఆ ఉపన్యాస వ్యాసం అలతి యలతి పదాలలో ఉన్నా, దార్శనిక గంభీరత కల్గి ఉంది. శాస్త్రంకూ, కళకూ గల సున్నిత సంబంధాన్ని తెలిపేదిగా ఉంది. పోపరుకు శాస్త్రకళలలోగల అభినివేశం, అభిరుచి ప్రతిబింబిస్తుంది అందుకే పోపరు తత్వమూ, శాస్త్రగతి ఆధారం చేసుకొనుచూ, పోపరు ఉపన్యాసంపై ఒక విమర్శాత్మక ప్రశంస (Critique) వ్రాయ సమ కట్టినాను.

పోపరు గురించి ఇంకా కొంత: పోపరు 1902 సంవత్సరం జూలై రెండవతేది వియన్నా నగరంలో జన్మించినాడు. వియన్నా నగరాన్ని "యూరపుఖండపు మేధావి రాజధాని" అంటారు. సంగీతజ్ఞులు, వైద్యులు, ఆర్థిక శాస్త్రవేత్తలు మున్నగు మేధావి వర్గానికిది కూడలి. పోపరు లండను విశ్వవిద్యాలయంలో 1941-69 మధ్య ఆచార్యుడుగా నుండినాడు. ఐన్‌స్టీను, జెంట్‌జార్జి, ష్వీట్జరులకువలె పోపరుకు సంగీతంలోనూ శాస్త్రాల్లోనూ అభినివేశం ఉంది. శాస్త్రాల గతితత్వంపై మౌలిక చింతన చేసినవాడు. ఇరువదవ శతాబ్దంలో పాశ్చాత్య దేశాల్లో ఎక్కువ ప్రభావం చూపిన అగస్టు కాంప్టు యొక్క "సకారాత్మకతత్వం" (Positivist philosophy)పై–ముఖ్యంగా వియన్నా సంప్రదాయముపై తీవ్రమైన దాడి చేసినవాడు. "విమర్శాత్మక హేతువాదం" (క్రిటికల్ రేషనలిజమ్)నూ, శాస్త్రనిగమనంలో "అసత్యీకరణ" (ఫాల్సిఫియబిలిటీ) సాధనాన్ని ప్రతిపాదించినాడు.

నా ఈ వ్యాసంలో పోపరు సాల్జ్‌బర్గ్ ఉపన్యాసమునేకాక, ఆయన సిద్ధాంతాలను సందర్భవశాత్తు పరామర్శిస్తాను. శాస్త్ర, కళల చరిత్ర గతిలో తటస్థపడే ఇతర సిద్ధాంతాలమూ ఉటంకిస్తాను.

మహా శాస్త్రజ్ఞుల సృజనాత్మకతకునూ, మహాకళాకారుల సృజనాత్మకతకూ గల సామ్యభేదాలను వివరింప మొదలు పెట్టుతాడు పోపరు. గొప్ప కళాకారుల కాసక్తి కేంద్రం వారి కృతియే. "కళ కళకోసమే" అనే అపార్థం ఇచ్చే నానుడికి పోపరిట్లా అర్థం చెబుతాడు. "కళాకృతి కోసమే కళ." శాస్త్రీయ రంగంలోనూ ఇంతే అంటాడు. మాక్స్ ప్లాంక్ కానీ, ఐన్ స్టీన్ కానీ, రూథర్‌ఫర్డ్ కానీ, బోర్ కానీ అణు సిద్ధాంతానికి ఉపయోగం ఉన్నట్లు భావించైనా ఉండరు. అన్వేషణ అన్వేషణకోసమే చేసినవారు సత్యంకొఱకే సత్యాన్ని అర్థించినవారు. వీరు భౌతిక శాస్త్రజ్ఞులంటాడు–"సృష్టి పరిశీలకులు" అంటాడు. గెటే పాత్ర ఫౌస్టు కోరినట్లు, "ఈ విశ్వాన్ని కూడగట్టుకొని ఉండే శక్తుల్ని తెలిసికోవడం" వీరి ఆశయం. సృష్టిరహస్యాన్ని తెలుసుకోవడం మానవజాతి ప్రాచీనస్వప్నం–కవుల తాత్వికుల కల. సృష్టి రహస్యాన్వేషణ ప్రాచీన నాగరికతలలో ఎల్లా మనం చూడవచ్చును. హోమరు (క్రీ. పూ. 1000) "ఇలియడ్"లోనూ, హీసియోద్ (క్రీ. పూ. 700) "థియోగని" (వీరిద్దరూ ప్రాచీన గ్రీకు కవులు) లోనూ సృష్టివిషయక చర్చలున్నాయి. ఇచట మనం "బైబిలు" ప్రారంభంలో వచ్చే "సృష్టి" ప్రకరణం గుర్తుకు తెచ్చికోవలెను. వీరందరికంటె పూర్వమే ఋగ్వేదంలోని "నాసదీయ" మనే సూక్తంలో ఈ సృష్టి ఎట్లు వచ్చింది అనే సమస్యపై ప్రశ్న పరంపరలున్నాయి. ఈ సృష్టి ఎట్లు వచ్చింది? ఎవరు చెప్పగలరు? ఎవరికి తెలుసు గనుక! దేవతలే ఈ జగత్తు తర్వాత వచ్చినవాళ్లు. కానీ ఈ జగత్తెట్లు వచ్చింది? పైన ఉండే పరమాధ్యక్షునకు తెలుసునేమో! ఆయనికీ తెలియదేమో! ఈలాగు సాగుతుంది సూక్తం. మన పురాణ పంచ లక్షణాలలో "సర్గ" అంటే సృష్టిక్రమము, ఒకటి–మొదటిది. భాగవతంలో మహాస్సర్గమే (మాక్రో కాస్మోలజీ)కాకుండా కపిలుడు దేవహూతికి కుమారసర్గం (మయిక్రో కాస్మోలజీ) వివరిస్తాడు – అంటే పిండోత్పత్తిక్రమం. మనిషి మయిక్రోకాసమ్.

సత్యాన్వేషకులైన శాస్త్రజ్ఞులే కాక, కేవలం పరిశ్రమలకుపయోగపడే విషయాలను సంగ్రహించేవా రుంటున్నారంటాడు పోపరు. ఇచట పోపరు ప్రాతిపదిక శాస్త్రంనూ (బేసిక్ సైన్స్),ఔప

యోగిక శాస్త్రం(ఎప్లయిడ్ సైన్స్)ను మనసులో పెట్టుకొన్నాడు. ఈ విభాగాన్నే శాస్త్రం (సైన్స్) అనీ టెక్నాలజీ అనీ పిలుస్తున్నారు. ఈనాడు పరిశోధనా రంగాలలో ప్రాతిపదిక, ఔపయోగిక శాస్త్రాలకుగల ఎడము చాలా తక్కువే ఇంజనీరింగు పరిశోధనలో ఆంతరిక రసాయన శాస్త్రజ్ఞుడూ, జీవశాస్త్ర పరిశోధనలో కమ్యూనికేషన్ ఇంజనీరూ ఉండడం చూస్తున్నాము. సత్యాన్వేషణకోసం చేసేదే శాస్త్రం అనే పోపరువాదం సమగ్రం కాదు. ఒక సూత్రం లోనూ, ఒక సమీకరణలోనూ, ఒక సిద్ధాంతంలోనూ ఇమిడిఉన్న శాస్త్రవిషయం సత్యమని ఎట్లా చెప్పగలం? అది మన అనుభవం లోనికి రావలెను అనుభవంలోకి రావడానికి దానిని ప్రయోగంద్వారా నైనా రుజువు పరచవలెను. లేదా దాని (శాస్త్రవిషయ) ఆధారంగా ఉపయోగాలు కనిపెట్టవలెను అప్పుడే శాస్త్ర సత్యం స్థాపితమవుతుంది. భౌతిక రసాయన శాస్త్రాల్లో తిరుగులేని ''ఉష్ణగతిక'' సూత్రాలు (థర్మో డయినమిక్ లాస్) హీట్ ఇంజన్లు మరియు రిఫ్రిజరేటరులవల్ల నిజమని భావింపబడుతూన్నాయి.

శాస్త్రకళల ఉత్పత్తి స్థితుల గురించి పోపరు మూడు ప్రతిపాదనలు చేస్తాడు.

ఒకటి–శాస్త్రమూలం ''పుక్కిటి పురాణం''లో ఉంటుందంటాడు. పోపరు **Myth** అనే మాట వాడుతాడు. మిత్ అను పదం గ్రీకు భాషలోని ముతోస్ నుండి వచ్చింది. ముతోస్ అంటే వాక్కు, మాట. అసలు అర్థం మూతి. కాబట్టి పుక్కిటి పురాణం అన్నాను. శాస్త్రం మిత్‌నుండి పుట్టినా, హేతుపూర్వక విమర్శనాన్ని ఎదుర్కొంటుంది. కవితా కల్పనతోనూ మతపరమైన ఐతిహ్యాలతోనూ శాస్త్రం ఉత్తేజితమవుతుంది. అంటే సారాంశం ఏమి? కవిత్వమూ శాస్త్రమూ ఒకే మూలము కల్గినట్టివి అని. ఆ మూలం మిత్ లు.

శాస్త్ర మిత్‌నుంచి హేతుపూర్వక విమర్శద్వారా పుట్టుతుంది అనడం శాస్త్రోత్పత్తిని సివ్ుప్లిస్టిక్‌గా వర్ణించడమే అని నా భావం. శాస్త్రగతి పుక్కిటి పురాణ (మిత్),విశ్వాసం(ఫెయిత్) ఊహ (కంజక్చర్), హఠాదావిష్కారం (సెరెండిపిటీ) మున్నగు హేతువిరోధ ప్రక్రియద్వారానే కాకుండా, అనుభవం, ఆలోచన, ప్రయోగం (ఎక్స్పీరియన్స్, తింకింగ్, ఎక్స్‌పెరిమెంట్) వల్ల కూడా కలుగుతుంది. ఆధునిక శాస్త్రీయ విధానాలకు బునాది వేసింది ఫ్రాన్సిస్‌బేకను గ్రంథం నోవమ్ ఆర్గానమ్ (క్రీ. శ. 1620) కేవలం తర్కం కాక అనుభవం ప్రధానమన్నాడు బేకను. శాస్త్ర సత్యాన్ని సూత్రీకరించడానికి ''సామాన్యంనుండి విశేషం''కు అనే పద్ధతి (డిడక్టివ్ మెథడ్)కన్నా, ''విశేషంనుండి సామాన్యం''కు అనే పద్ధతే తగిందన్నాడు బేకను. మొదటి పద్ధతి, ఒకే విశేషం యొక్క స్వరూప స్వభావాలను తెల్పుతుంది. ఈ అనుమతికి రావడానికి అన్ని సామాన్యాల పరిజ్ఞానం అవసరం. ఇది అసాధ్యం. ''సోక్రటీసు మూర్ఖుడు'' అనే ఒకే ఒక విశేషాన్ని సాధించడానికి ప్రపంచంలో ఉండే మూర్ఖుల సామాన్య లక్షణాలన్నింటినీ తెలిసికోవలసి ఉంటుంది. కొండను త్రవ్వి ఎలుకను పట్టడమంటే ఇదే. సోక్రటీసు ప్రయత్నించి ప్రయత్నించి ప్రపంచంలోని వాళ్ళు మూర్ఖులనీ తాను మాత్రమే మూర్ఖుడు కానివాడని నిరూపించుకోవడం అది వేరేకథ. రెండవ పద్ధతిద్వారా సర్వత్రా చెల్లుబడి ఉండే సూత్రాలనూ(లాస్), సిద్ధాంతాలనూ(తియరీస్), నిగమనములనూ (హయిపోతెసెస్), సమీకరణములనూ (ఈక్వేషన్స్) చేయవచ్చును. ఒక ప్రత్యేక పరిస్థితియందు నిజమైన అంశం, తత్పరంపరలో తక్కిన పరిస్థితుల్లోనూ నిజమగుననే ఇన్‌డక్టివ్ మెథడ్ శాస్త్ర సాంకేతిక ప్రగతికి దోహదం చేస్తుంది. అట్లని ఏవో కొన్ని పరిస్థితులను పరిశీలించి సార్వత్రీకరణంలోకి దూకవలదని బేకను హెచ్చరించినాడు. నిజమైన శాస్త్రప్రగతికి ఓపిక ఉండాలంటాడు (ఇది అప్పకవి చెప్పిన ''నిలుకడ వలయు కృతికి''తో పోలుతుంది). జాగ్రత్త అవసరం అని కూడా అన్నాడు. ఇంద్రియాలపై (senses) ఆధారపడ్డ అనుభవం (ఇదే శాస్త్రానికి ప్రాతిపదిక) సమగ్రం కాకపోవచ్చు మోసపుచ్చవచ్చు. అశక్తం కావచ్చు. అందుకే శాస్త్రవిషయాన్ని సరియని సూచించే సాక్ష్యాలకన్నా, తప్పు అని సూచింపగల సాక్ష్యాలే ముఖ్యం అని బేకను చెప్పినాడు. బేకను దృక్పథాన్నే విలియం వెవెల్ (క్రీ. శ. 1796 1866) బలపరచినాడు. శాస్త్రీయ సత్యప్రతిపాదనలో నకారాత్మక సందర్భాలు (నెగెటివ్ ఇన్‌స్టెన్‌సెస్) అని బేకను పేటినన్నాడో, ఆ సందర్భాలని పోపరు ఫాల్సిఫియబిలిటీ) క్రిందికి తెస్తాడు దీనిని మనం ''అసత్యీకరణం'' అని అనవచ్చును. కోర్టులో న్యాయమూర్తి ఎదుట అనుకూల సాక్ష్యాలేకాక ప్రతికూల సాక్ష్యాలు కూడ ఈయబడుతాయి. ప్రాతికూల్యానికి తట్టుకొని నిలద్రొక్కుకొనినప్పుడే న్యాయమూర్తి అనుకూలమైన తీర్పునిస్తాడు. శాస్త్రంలో కూడాయిట్లే. శాస్త్రీయ విషయ స్థాపనకు అనుకూల పరిస్థితులనే కాకుండా, ప్రతికూల పరిస్థితులనూ లెక్కలోకి తీసికొనవలెను. స్థిరమైన శాస్త్రీయ విషయం ఏది అంటే, ఆ శాస్త్రీయ సిద్ధాంతం తనను పూర్వపక్షం చేయగలిగిన ప్రతికూల పరిస్థితులను సూచించేదిగా ఉండవలెను. ఆ ప్రతికూల పరిస్థితులలో ప్రయోగం ఏర్పాటు చేయగలిగి ఉండవలెను. అంతరిక్షంలో ''ఈథర్'' అనే పదార్థం లేదని ఋజువుచేసిన మైకేల్సన్–మార్లీ ప్రయోగం (క్రీ. శ. 1887) ఈ కోవలోనికి చెందినది. గమనిక (అబ్సర్వేషన్), నిగమనం (హైపోతెసిస్), నిర్ధారణ (కన్‌ఫర్మేషన్) అనేవి శాస్త్రంలోని మూడుదశలు అని అనుకొనుట పరిపాటి. కానీ అవి సరికాదంటాడు పోపరు.* ఊహ, ప్రయోగం అనేవి శాస్త్ర పరిశోధనలో ముఖ్యమైనవి. ఇందు ''అసత్యీకరణం'' కీలక పాత్ర వహిస్తుంది. ఊహలు ఆధారంగా ప్రయోగాలు చేయవలెను. అసత్యం అని నిరూపించబడ్డ ఊహలు వదలివేయవలెను. నిజమని తేలినవి శాస్త్రాంశాలవుతాయి. ఇవీ తాత్కాలికాలే (ప్రొవిషనల్ ట్రూత్స్). వీటిని మరలా ఊహలనుకొని ప్రయోగాలు చేయవలెను. పోపరు ప్రకారం శాస్త్రప్రగతి డయాలెక్టికల్‌గా కన్పడుతుంది. గన్ లాస్, ఎటా

---

* The Logic of Scientific Discovery (1959) అనే గ్రంథంలో.

మిక్ తియరీ, కెటాలిసిస్, కెమికల్ కినెటిక్స్, జెనెటిక్ లాస్ ఇట్లు వృద్ధిజెందినవే పోపరు సిద్ధాంతానికి అపవాదాలు లేకపోలేదు. కొన్ని ప్రకృతిసిద్ధ విషయాలు ఊహా ప్రయోగాల కతీతాలు. గమనికకు మాత్రమే సాధ్యాలు డార్విన్ పరిణామ సిద్ధాంతం,ఖగోళ విషయాలు, ''వ్యాపారవశ్య''సిద్ధాంతం కొన్ని ఉదాహరణాలు. రెండవ ''ఉష్ణ గతిక'' సూత్రం అసత్యమని నిరూపించుటకు ప్రయోగం ఏర్పాటు చేయుట ఇంతవరకు సాధ్యంకాలేదు· ఎందుకంటే ఆ సూత్రమే మానవుని ప్రాతిపదికమైన అశక్తతమీద ఆధారపడి వుండడం చేతనట అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

రెండు—విమర్శ రెండురకాలు అంటాడు పోపరు. ఒకటి, అలంకార శాస్త్ర, సాహిత్యాంశాలచే ప్రేరేపితం. రెండవది హేతు వాదంచే ప్రేరేపితం. మొదటి విమర్శ 'పుక్కిటి పురాణం''(మిత్) నుండి కవిత్వానికీ, రెండవ విమర్శ ప్రకృతి శాస్త్రాలకీ దారితీస్తుంది మొదటిది భాషాసౌందర్యం, ఛందశ్శక్తి, భావదీప్తి,నాటకీయోద్వేగం, నయ బోధ మున్నగువాటికి విలువనిస్తుంది. ఇటువంటి విమర్శ ఐతి హాసిక కవిత్వానికీ, నాటక సాహిత్యానికీ, ఆభిజాత్య సంగీతానికీ దారి తీస్తుందంటాడుపోపరు. ఆయన ఉదాహరణలీలేదు కాని, మనం ''ఇలియడ్'', గ్రీకుత్రాసదములు, మొజార్ట్ సంగీతంను ఉదాహర ణాలుగా తీసికోవచ్చును.·

హేతువాది విమర్శ మిత్ నిజమా అబద్ధమా అని ప్రశ్ని స్తుంది. హీసియోడ్, బైబిలులోని ''సృష్టి'' ప్రకరణం (మనం మన పురాణాల్లోని సర్గ, ప్రతిసర్గలనిట అన్వయించుకోవలెను) చెప్పినట్లే సృష్టిజరిగిందా అని అడుగుతుంది ఇది విశ్వరహస్యా న్వేషణగా రూపొందుతుంది—తర్వాత మన పరిసర పరిశీలనగా పరిణమిస్తుంది. ప్రకృతి శాస్త్రం ఇట్లానే వచ్చింది అని పోపరు ప్రతిపాదన.

ఇక మూడవ ప్రతిపాదన ఏమంటే, కవిత్వంలోనూ, శాస్త్రం లోనూ మిత్‌ల అవశేషాలున్నాయి అనునది. ఈ మిత్‌లు మనలనీ, మన ప్రపంచాన్నీ అర్థం చేసుకోవడానికిఏర్పడ్డ అమాయక కల్పనలే. కవిత్వం శాస్త్రం కూడా సృష్టిని అర్థం చేసుకోవడానికిచేసే అమా యక పరికల్పనలే. అందుకే శాస్త్రం, సాహిత్యం, సంగీతం, రక్త సంబంధంకల బంధువుల్లాంటివట ! పాశ్చాత్య శాస్త్రం, సాహిత్యం గ్రీకు మిత్ నుంచి ''పునరుజ్జీవన'' ఉద్యమం ద్వారా వచ్చినవని పోపరు నిగమనం. దీన్నాధారం చేసికొని మనం ఆధునిక భారతీయ శాస్త్ర సాహిత్యాలు వేద పురాణేతిహాసాలచే ఎట్లు ప్రభావితాలై నాయో వివేచించుట అది ఒక గవేషణ కాగలదు. దురదృష్ట వశాత్తు ఆధునిక భారతీయ శాస్త్ర సాహిత్యాలు, పాశ్చాత్యులనే అనుసరిస్తూ, అనుకరిస్తూ ఉన్నాయి. మనకొక విట్‌జెన్‌స్టీన్ కావలెను.

కళకూ, శాస్త్రానికీ ఒకే మూలం ఉన్నా, వాటిమధ్య ముఖ్య భేదాలున్నాయి. శాస్త్రంలో ప్రగతి ఉంటుంది· దానికొక ఆశయం ఉంటుంది. సత్యాన్వేషణం శాస్త్రధ్యేయం సత్యానికెంత దగ్గఱగా పోవచ్చుననేది శాస్త్ర ఆశయం. కళలో అభివృద్ధి అంటూ ఉండక పోవచ్చు. చాలాకాలం ప్రకృత్యనుకరణ కళాధ్యేయంగా ఉంటూ ఉండేది చిత్రకళలో వెలుగు నీడల తారతమ్యం (కియరోస్కురో) దూరానుగత చిత్రణ (పెర్‌స్పెక్టివ్) ధ్యేయాలుగా ఉండేవి వ్యక్తి గతంగా, కళాకారునిలోని సృజనకు అభివృద్ధీ, శిథిలత ఉండవచ్చును కాని కళకు ''అభివృద్ధి'' ఉండదని అనుకోవలెను. శాస్త్ర రంగంలో తర్వాతి పరిశోధనలు, అంతకు ముందున్న శాస్త్రాన్ని అబద్ధమనో, పాక్షిక సత్యమనో నిరూపించవచ్చును టోలమీ ఖగోళ విజ్ఞానాన్ని కెప్లరు, కోపర్నికసు, గెలీలియోల పరిశోధనలు త్రోసిరాజన్నవి. న్యూటను కొన్ని సిద్ధాంతాలను ఐన్‌స్టీన్ సిద్ధాంతాలు తప్పని రుజువు చేసినాయి· అణు సిద్ధాంతము ప్రాచీన గ్రీకు దేశపు డెమొ క్రటీసు నుండి డాల్టన్, రూథర్ ఫర్డ్, భోర్, హైసెన్ బర్గుల ద్వారా విప్లవాత్మక మార్పులు చెందింది. అదే 'ఇలియడ్'' కాని రామాయణం కాని గుణవత్తరంగా చేయబడినాయా? షేక్సుపియరు చారిత్రక నాటకాల వాస్తవికతలు కల్గి ఉన్నా, కళా సత్యం కల్గి ఉన్నాయి

విమర్శకు మూలమయిన దోషముల గురించి పోపరు చెప్పేదే మంటే ఎన్ని తప్పులు ఎంత త్వరగా చేస్తే అంత మంచిది. వాటి నుంచి చాలా విషయాలను త్వరగా నేర్చుకోవచ్చు. ''తప్పు కలిగిన చోటనే యొప్పు కలుగు'' అన్న తెలుగు కవి పల్కులలో ఇట్టిభావమే ఇమిడి ఉందని నేననుకొంటాను వ్రాసేటప్పుడు కొట్టివేతవస్తే దానిని ఒక చిన్న బొమ్మగా గీచేవాడట టాగూరు. పోపరు తన ఉప న్యాసాని కిచ్చిన శీర్షిక ''శాస్త్ర కళలలో సృజనాత్మక స్వవిమర్శ'' బీథోవన్ సంగీత రచనల స్కెచ్ పుస్తకాలలో ఆయన చేసుకొన్న దిద్దుబాటులు, కొట్టివేతలు, దయాదాక్షిణ్యాలు లేక చేసిన సవర ణల ద్వారా ప్రేరేపించబడ్డదంటాడు. ఈ ఆత్మవిమర్శనా గుణమే బీథోవన్ సంగీత ప్రగతికి మూలం అంటాడు పోపరు ఇందులో విప్రతిపత్తి లేదు కాని తప్పులు దిద్దుకోవడం ఎవరికైనా సహజం. బీథోవన్ కాగితాలమీద వ్రాసుకునేవాడు కాబట్టితన చిత్తుప్రతుల్లో అన్ని కొట్టివేతలు, సవరణలు చేయగలిగినాడు. మన దేశంలో — ఆంధ్రలో పూర్వకాలం తాటాకులమీద గంటంతో అక్షరాలు గోకే వాళ్ళు. వ్రాసిన తర్వాత తప్పులు దిద్దడం ఏలా సాధ్యం ? తప్పు పోయిన తాటాకులు తీసిపారవేసే వాళ్ళా? పంద్రెండు వేలకు పైగా పద్యాలు రచించిన తిక్కన చెప్పడం, గురునాథుడు వ్రాయడం అని సంప్రదాయం. ''ఏమి సెప్పుదుం గురునాథా'' అని ఒక సందర్భంలో వ్రాయసకానికి చేసిన సంబోధన కూడా కథ కతికినట్లు చెప్పే ఐతిహ్యం బట్టి వాళ్ళ తప్పులు వ్రాస్తూ ఉండేవారు కాదని పిస్తూంది. కవులలో ఆత్మ విమర్శ సాగుతూనే ఉంటుంది. గొప్ప కవి గొప్ప విమర్శకుడు కూడ. విమర్శనం సాహిత్య జీవితం. తిక్కన గురించి ఆయన్ని ఖుద్దున చూచిన కేతన ఇట్లంటాడు : ''కవిత సెప్పి యుభయ కవి మిత్రు మెప్పింప నరిది బ్రహ్మకైన.'' యోగ సూత్రాలపై భాష్యం చెప్పడానికి పతంజలి కూర్చొన్నప్పుడెల్లా ఒక పాము వచ్చి పడగవిప్పి నిలిచేదట. దాన్ని ఆదిశేషునిగ భావించి, నిర

ర్థకంగా నేనేమన్నా అంటే కఱువుము (నిరర్థకశ్చేద్దశ) అని ప్రార్థించి మొదలు పెట్టేవాడట అంటే అర్థం ఏమి? చేసేతప్పు లన్నీ మనసులోనే చేసుకొని ఒప్పయిన దాన్ని మాత్రమే వ్రాయుట. గంటల తరబడి ఆశువుగ పద్యాలు చెప్పగలవారు మనలో నున్నారు. కొప్పరపు సోదర కవులవలె ''గడియకు నూరు పద్దెములు గంటము లేక రచింతు''నన్నాడు ఒక కవి పాశ్చాత్య భాషలలో ఇట్టి ఆశు కవిత ఉన్నట్లులేదు. ప్రపంచ సాహిత్యంలోని మొదటి కవిత ''అగ్ని మీళే పురోహితమ్'' ఆశువే. ''మానిషాద'' సద్యః కవిత ఇట తప్పపోయే ప్రసక్తే లేదు. సాధారణ కవుల వాక్కు అర్థము వెంబడి పోతూంటా యట. మహా కవుల వాక్కు వెంట అర్థము పోతూ ఉంటూందట. అటువంటప్పుడు సవరించుట అనే పనే లేదు.

లలిత కళల రచనలో ఇమిడి ఉన్న వివిధ దశలను పోపరు వర్ణిస్తాడు. సంగీత రచన తీసికొంటాడు సంగీత రచన జంత్ర సమ్మేళనంగా (Sonata) ఉండవలెననే నిర్ణయం, దానికి వస్తు నిర్దేశం చేయడం తర్వాత వీటిని కాగితంమీది కెక్కించడం. కాని వ్రాయడం మొదలుపెట్టినంతనే అసలు ప్రణాళికే మారిపోవచ్చు. కళాకారుని మనస్సులో స్వవిమర్శ, దోషపరిహరణ అనేవి మెదలుతూ ఉంటాయి. చిత్రకళలోకూడా ఇంతే. మొదట గీతలతో స్కెచ్ వ్రాస్తాడు. అప్పటినుంచి అతనిలో ఆత్మవిమర్శకత ప్రారంభమవు తుంది. కొంతరంగు పూస్తాడు. వెనుకకు పోయి తేరిపారజూస్తాడు. పూసినరంగు బొమ్మకు కొత్తదనంఇస్తుంది. అనుకొన్నది ఒకటయితే అయినది ఇంకొకటిగా కనపడుతుంది- అది బాగైనా, ఓగైనా. కళా కారునిలోని సృజనాత్మకత, స్వవిమర్శల సంఘర్షణా సామరస్యాలవల్ల కళాసృష్టి మారుతూపోతుంది. ఒక్కొక్కసారి కళాకారుడే గుర్తు పట్టలేనంతగా మారిపోతుంది. పోపరు రెండుదాహరణాలిస్తాడు. హేడిన్ సంగీత రచన ''సృష్టి''. షూబర్టు సింఫొని (జంత్ర సమ్మేళన) 'అసంపూర్ణం' ఈ రెండూ ఆయా కళాకారులు భావించిన దానికన్నా గొప్పగా రూపొందినాయి. సాహిత్యంలో నేను ఉదాహరణాలిస్తాను. గురజాడ ''మొదటి కన్యాశుల్కం'' కు రెండవ ''కన్యాశుల్కం''కు గల భేదం చూడండి మొదటిది ప్రహసనప్రాయం. రెండవది తత్కాలీన సంఘానికి దర్పణప్రాయం— తత్కాలీన సంఘ సమస్యలను గాజు కటకంవలె ఫోకస్ చేసినది. పిల్లల కథగా చెప్పబడిన యాలిస్ ఇన్ ది వండర్‌లాండ్, కాగితంమీద వ్రాసేసరికి ధ్వనిపూరితమైనట్టి, వివిధ ప్రతిధ్వనులిచ్చేటటువంటి సంకేత కావ్యంగా తయారయింది. విశ్లేషణచేస్తూ పోతే ప్రతి గొప్ప రచన, ఇట్టి మార్పులు చెందినట్లు తేలుతు ది.

కళలలో సృజనాత్మక విమర్శ ప్రాముఖ్యం వహించగా, శాస్త్రాలలో సహకార విమర్శ ముఖ్యపాత్ర వహిస్తుందంటాడు పోపరు. శాస్త్రజ్ఞుడు తప్పను చేసినా, చేసిన తప్పను కప్పిపుచ్చినా, ఇంకొక శాస్త్రజ్ఞుడు చూపెట్టుతాడు. శాస్త్రగతి, స్వవిమర్శవల్లనే కాక పరస్పర విమర్శవల్ల కూడా కలుగుతు ది. శాస్త్రంలోనేకాక కళారంగంలోకూడా సహకార, పరస్పర విమర్శలకు తావున్నదని నేనను కొంటాను. కొన్ని ఉదాహరణలిస్తాను. 1952–53లో దేవకీబోసు దర్శకత్వంలోని 'రత్నదీప్'' అనే చలనచిత్రం విడుదలైంది. ఉదాత్తతలోనూ కళలోనూ, ఈ చిత్రాన్ని మించిన చిత్రం రాలే దని విమర్శకుల అభిప్రాయం చిత్రం విడుదలైంతరువాత చిత్రం ముక్తాయింపు సమంజసంగా లేదని చలనచిత్ర విమర్శకుడు బాబూరావు పటేల్ వ్రాయగా, ఆ విమర్శాన్నిశిరసావహించి దేవకీ బోసు చిత్రకాపీలు వెనుకకు రప్పించుకొని ఆభాగాన్ని మరలాషూటు చేయించినాడు. ఆ చిత్రం ముగింపు మహోదాత్తంగా అజరామరంగా అయింది. ఇది సహకార విమర్శా ఫలిత కాదా! డికెన్స్ తన హార్డ్ టయిమ్స్ అనే నవలకు శీర్షిక పెట్టేందుకు ఇతరుల సలహాలు పొందినాడు. మోలియర్ అనుకుంటాను, తన ప్రహస నాలను బట్లరుకో, దాదికో వినిపించి తర్వాతనే ప్రచురించేవాడట. ఈలాగు కళారంగంలోకూడా ఒక కళాఖండం పూర్తయేలోపల ఎంతోమంది అజ్ఞాత విమర్శకుల అభిప్రాయ ప్రయోజనం పొంది ఉంటుంది. మౌలిక సైద్ధాంతిక శాస్త్రజ్ఞుడు కళాకారుని బోలు తాడని పోపరు అభిప్రాయం. భావనాశక్తి, అంతరంగ ప్రేరేపణ, రూపసౌష్ఠవతా పరిజ్ఞానం (సెన్స్ ఆఫ్ ఫారమ్) కళాకారునికి వలెనే శాస్త్రజ్ఞునికీ మార్గదర్శకాలు భోర్ అణుసిద్ధాంతం సంగీతధర్మం కలదియని ఐన్‌స్టీన్ అంటాడు. ఆదర్శ కళాసృష్టిని ఇంకా మేలుగా మార్చలేం. కాని శాస్త్రాంశాలను ఎంతయినా మార్చవచ్చును. శాస్త్రరంగంలో ఎంత సృజనాత్మక సిద్ధాంత మయినా భవ్యావేశంపై నాధారపడదు అనే పోపరు భావం సరియైనది.

పోపరు తన ఉపన్యాసాన్ని, 17వ శతాబ్దపు జ్యోతిశ్శాస్త్ర జ్ఞుడు కెప్లరు ప్రతిపాదించిన అంతరిక్షంలోని గ్రహాల చలనంలో నిక్షిప్తమైన సంగీత ప్రసక్తితో ముగిస్తాడు. గ్రహాల సక్రమబద్ధ చలనం బృందగానంవలె ఉంటుందట. (నవగ్రహ గానం ప్రాచీన గ్రీకు వేదాంతి, గణిత శాస్త్రజ్ఞుడు పుతగోరస్ సూచించినట్టిదే). ఈ సంగీతం భగవంతునికి ప్రతిధ్వనియట! ''వేదానాం సామవేదోఽస్మి''.

మోజార్ట్ సంగీతోత్సవంలో చేసిన పోపరు ప్రారంభోపన్యా సానికింతకంటె సుసంపన్న మయిన ముగింపు ఉండదు.

నగ్న సౌందర్యం

శ్రీ కె. ఎస్. రమణ

చినుకులు
  చినుకులుగా
తలపులు ...
తడిసి
బరువెక్కి
వొణుకుతూ
రెప్పల కన్నులు
మనసు
వెక్కిళ్ళమధ్య రోదిస్తూ
పంచాంగుళులతో
తడుముతూ వెతుకుతోంది
వూహ
చీకట్లోంచి
చీకటిని చూస్తూ
చూపుల్ని చిట్లిస్తోంది
ఎప్పుడో
ఎక్కడో
ఎందుకో
పారేసుకున్న వుదయంకోసం;
విగతస్మృతి
వివృత సమాధినుండి లేచి
వికృత నృత్యం చేస్తోంది

నిర్లిప్తత
సుఖాన్నీ
దుఃఖాన్నీ
అశ్రువులుగా చప్పరిస్తోంది
నిష్క్రియాతర్కవ్యాకులంలో
నేతి నేతి వేదాంతంలో
ఆలోచన అలిసిపోయి
చీకటిని కప్పుకొంది
అనుభూతి
జ్వాలలా
అంతరంగాన్ని అలముకుంటోంది
మంచు కత్తిలా
లోతు గాయాలను
తొలుస్తోంది.
బతుకు
పాట పాడటం మరిచిపోయింది
బాధాదగ్ధ రుద్ధ కంఠంలో
హీన దీన నిరాశాకుల
స్వర కల్లోలిత సుడిగుండంలో
తప్పిపోయిన పాటను
వెతకాలనే ధ్యానంకూడా
చివరికి నిశి నిశ్శబ్దంలో
వొరిగి వొదిగి పోయింది

ఆత్మ
అన్ని అలంకారాల్నీ వొదిలి
దిగంబర చైతన్యంలో
ఊయాదులాడుతోంది
నగ్నం నగ్నం నగ్నం
నగ్నతకన్నా లేదేదీ సౌందర్యం
నగ్న జీవనం
నగ్న హృదయం
నగ్న శరీరం
బాహ్యాంతరాల సంలీనం
చూడలేని స్థితిలో
దర్శించి
సందర్శించిన
ఆదర్శం తలపులు
చినుకులు
చినుకులుగా ...
అన్నీ
నోళ్ళు తెరుచుకున్న ఆల్చిప్పలే
కొన్నే
రహస్యులు ఫలించిన
రమణీయ ముత్యాలు
నగ్న కాంతి సత్యాలు!



జడప్రశ్న

డా. నాయని కృష్ణకుమారి

బరువై
 విడువరాని మమతై
కోరిక
ఎటు చూచినా నీవై !

ఈ వ్యాప్తికి
గుండెనిండా తీవ్రచలనాల
మౌన రాగాల హోరు !
బిగించిన పెదవుల వెనుక
రగిలే భావ గాఢత !

ఏవైపూ తిరగని చూపూ
ఏ నీడనూ సహించని తనువూ
ఈ నుదుట
ఎవరు లిఖించిన శాసనాలు !

అవ్యక్త కేంద్రం చుట్టూ
దూర దూరంగా
సున్నాలు చుట్టి చుట్టి
సతమతమయ్యే మనస్సు !

దూరం తరిగిపోవడం
ఏ జన్మలో కథ !

రెక్కలు విడగని పక్షిలో
కదలని వృక్షంలో
కాళ్ళులేవి పెను శిలల
ఉనికి బరువులో
నాకు నేనే కనిపిస్తూ
ఏమిటీ చిత్ర వ్యథ !

నన్నో గట్టుకు విసిరేసి
నీవంటూ ఏరూపమూ చిక్కని
ఈ మనస్సున మంథరమై
కాలం ప్రదర్శించే
భీషణ హేల !

ఈ కాలం
నాలాగే స్తబ్దంగా
ఆగిపోరాదో ?

అల

శ్రీ వలివల శ్రీనివాసరావు

ఒడ్డును తాకేవరకు
 కడలి కెరటం నన్ను
ఆనందపు టంచుల్లోకి
తీసుకెళుతుంది.

తీరాన్ని తాకిన వెంటనే
నా ఆశల అలలాగే
కుప్పకూలి విసిరేస్తుంది
నన్ను విషాదపు లోయల్లోకి.

కీ. శే. వేలూరి శివరామశాస్త్రి

గీతలలో ఆత్మ

పీఠిక

[ఆత్మతత్త్వమును గురించి గీతల మత మిట్టిదని తేల్చుట తేలికయైనగాదు; అట్లు తేల్చుకొనవలయునను పట్టుదలయు లోకులకు లేదు. గీతల కేరీతిగా వ్యాఖ్యానము చేయుచో తమ తమ సంప్రదాయములు సమర్థింపదగునో ఆ రీతిగా వ్యాఖ్యానము చేయుటయందే వారువారకు పట్టుదల. కాని నేనేమతమును సమర్థింప బూనుకొనను. గీతాకారుం డే యుద్దేశముతో గీతను రచించెనో, ఏ మతమును పోషించెనో దానినే వివరింతును. గీతలలోని ఆత్మతత్త్వము నాకుద్దిష్టము.

గీతారచనము ఐతిహాసిక ఘటనామూలకము కాదా యని విచారించుట నా పనికాదు. ఒకవేళ అది ఐతిహాసికము కాకపోవచ్చును గాని అచట జరిగిన దనిన పని యిది—కౌరవులును పాండవులును కురుక్షేత్రమున యుద్ధమునకు డీకొనిరి. చంపుకొనుటకిక ఆలస్యములేదు. అపుడు 'నేను యుద్ధము చేయను; జాతిని, కులమును, ధర్మమును నాశముచేసి నేను జయమును కోరను, రాజ్యమును కోరను' అని అర్జునుడనెను. గీతాకారుండీ సంగతిని ఉపలక్షించెను—కాని గీతాకారుని లక్ష్యము ఆత్మతత్త్వము శి. శా.]

ఆత్మతత్త్వము

౧

ఆత్మస్వరూపము

"నేను యుద్ధము చేయను" అని అర్జునుఁడు కృష్ణునితో పలికి, విల్లు క్రిందఁబడవయిచెను. అపుడు కృష్ణుఁడు 'ఆత్మకు మృత్యువు లే'దనియు, 'దేహము పోయినను ఆత్మకేమియు లోటు లే'దనియు అతనికి బోధచేసెను. కృష్ణుని మాటలివి—

'నీవు గాని నేనుగాని మఱి యీ రాజులుగాని వెనుక లేక పోము, ముందు ఉండకపోము—' (౨–౧౨)

'దేహి కౌమారము, యౌవనము, వార్ధకమును తాల్చు నటులనే ఆత్మయు మఱియొక దేహమును తాల్చును.' (౨–౧౩)

రెండు శ్లోకముల పిదప కృష్ణుఁడిటు లనుచున్నాడు: 'లేని దానికి ఉనికి ఉండదు. ఉన్నదానికి లేమిఉండదు.' (౨–౧౬)

ఇటు పైని తొమ్మిది శ్లోకము లున్నవి:

"ఎవడిది యంతయు వ్యాపించియుండునో ఆతం డవినాశి యని తెలిసికో. అవ్యయుఁడగు అతని నెవరును చంపలేరు" (౨–౧౭)

శరీరి నిత్యుఁడు, అవినాశి, అప్రమేయుఁడు, అతని శరీరములు నశ్వరములు. (౨–౧౮)

అతఁడు చంపువాఁడనియు, చంపబడువాఁడనియు తలచువారు తత్త్వమెఱుఁగనివారు. అతఁడు చంపువాఁడును గాఁడు, చంపఁబడువాఁడును గాఁడు. (౨–౧౯)

'అతఁడెన్నఁడును పుట్టువాఁడును కాఁడు, గిట్టువాఁడును కాఁడు; లేక అతఁడు పుట్టి మరల అస్తిత్వహీనుఁడగువాఁడును కాఁడు అతఁడు అజుఁడు, నిత్యుఁడు, శాశ్వతుఁడు, పురాణుఁడు; శరీరము నాశమయినను అతఁడు నాశముపొందఁడు.' (౨–౨౦)

'ఎవఁడితనిని అవినాశి యనియు, నిత్యుఁడనియు, అజుఁడనియు, అవ్యయుఁడనియు ఎఱుఁగునో, ఓ యర్జునా! అతఁ డెవరినేని చంపించుననియు చంపుననియు నెటు లెఱుఁగును?' (౨–౨౧)

'ప్రాతబట్టలు వదిలి క్రొత్తబట్టలు కట్టుకొనునటులు, దేహి—అనగా దేహముకల ఆత్మ ప్రాఁతగిల్లిన దేహములను వదలి క్రొత్తదేహములు తాల్చును.' (౨–౨౨)

'శస్త్ర మితని నఱకలేదు; అగ్ని తగులఁబెట్టలేదు; నీరు నానఁబెట్టలేదు; గాలి ఎండఁబెట్టలేదు.' (౨–౨౩)

'అతఁ డచ్ఛేద్యుఁడు, అదాహ్యుఁడు, అక్లేద్యుఁడు, అశోష్యుఁడు. అతడు నిత్యుఁడు, సర్వగతుఁడు, స్థిరుఁడు, అచలుఁడు, సనాతనుఁడు.' (౨–౨౪)

'అతఁడు అవ్యక్తుఁడు, అచింత్యుఁడు, అవికారి. ఇటులెఱిగి నీవు దుఃఖింపకుము.' (౨–౨౫)

ఓ భారతా! నిత్యుఁడును అవధ్యుఁడును అగు దేహి అనఁగా ఆత్మ అందఱ దేహములందును గలఁడు. కావున భూతసమూహము కొఱకు నీవు వగవఁదగదు. (౨-౩౦)

మనుష్యులను చంపవలసి వచ్చునను భయముచే 'నేను యుద్ధము చేయ'నని అర్జునుఁడనెను. ఈ విషయమున అర్జునునకుఁగల భ్రాంతిని పోగొట్టుటకే కృష్ణుఁడు ఈ వెనుకటి ఉపదేశములు చేసెను.

ఈ యుద్ధమునందు దేహము నశింపవచ్చును గాని ఆత్మ నశింపదు. ఈ దేహము నశించినను వగచుట కిసుమంతయుఁ బని లేదు. ఈ దేహముపోయిన పిదప ఆత్మ మఱొక దేహమును తాల్పఁగలదు. కావున యుద్ధము చేయకుండుటకు తగిన కారణమేమియు లేదని ఈ యుపదేశమునకు తాత్పర్యము.

కావున ఇక్కడఁ జెప్పఁబడిన ఆత్మ జీవాత్మయని తేటతెల్లము.

ఇఁక పూర్వము చెప్పఁబడిన అంశములను విడఁదీసి ఈ యాత్మ ప్రకృతి యెట్టిదో విచారించి చూతము :

౧ అనాది-అనంతము

మనుష్యునకు చావు పుట్టుకలున్నవి. కాని ఆత్మకు లేవు. (౨౦) ఆత్మలేని సమయ మొకటి యున్నదని సాధారణ మనుష్యులు తలఁచ వచ్చును; ఒకానొక నిర్దిష్ట సమయమున ఆత్మపుట్టి, పిమ్మట కొన్నాళ్ల బ్రతికియుండి, అటుపిమ్మట చచ్చిపోవును. ఈ మతము కూడ సత్యముకాదని గీతాకారుఁడు చెప్పెను (౨౦) వర్తమాన కాలమునం దున్నవారు భూతకాలములో లేరనిగాని, భవిష్యత్కాలములో ఉండఁబోవరని గాని చెప్పు మతముకూడ సత్యముకాదు. (౧౨) ఈ దేహము ధరించుముందును, దేహత్యాగము పిమ్మటను గూడ ఆత్మ కలదు. (౧౩-౨౨) కావున ఈ యీ ఆత్మ అనాదియు అనంతమును.

౨ అజుఁడు-అవినాశి

ఆత్మకు పుట్టుట గాని గిట్టుట గాని లేదని పలుతావులఁ గలదు. అనఁగా ఆత్మ అజుఁడు అవినాశియును. ఇంతియకాక పలు తావులలో ఆత్మ అజుఁడనియు (౨-౨౦,౨౧) అనాశి యనియు (౨-౧౮) అవినాశి యనియు (౨-౧౭,౨౧) స్పష్టముగాఁ జెప్పఁబడినది.

౩ నిత్యుఁడు, శాశ్వతుఁడు, పురాణుఁడు

ఈ యాత్మ నిత్యుఁడు (౨-౨౦,౨౧,౨౪) శాశ్వతుఁడు (౨-౨౦)పురాణుఁడు (౨-౨౦) సనాతనుఁడు (౨-౨౪).

మఱియొక అధ్యాయమునందు పరమాత్మయొక్క జీవభూతమగు అంశము కూడ సనాతనమని చెప్పఁబడినది. (౧౫-౭) సద్వస్తువునకు వినాశము లేదనియు, అసద్వస్తువునకు అస్తిత్వము లేదనియు ఈ దేశమున ప్రాచీనమత మొకటికలదు. గీతాకారుఁడును ఈ మతమునే ప్రచారము చేసెను. (౨-౧౬)

సత్, అసత్—అను ఈ రెండు పదములకును గల మూలార్థమును విచారింతముగాక. ఈ రెండును 'అస' ధాతువునుండి ఉత్పన్నములు (అస=భువి) అస ధాతువునకు ఉండుట అని అర్థము. ఉండునది సత్తు—ఉండనిది అసత్తు. సద్వస్తువు అని యనుచో అస్తిత్వముకల వస్తువు అని యర్థము. అసద్వస్తు వనఁగా అస్తిత్వహీనమగు వస్తువు అని అర్థము.

అసద్వస్తువునకు అస్తిత్వము లేదనిగాని, సద్వస్తువునకు అస్తిత్వము కలదనిగాని అనుట పునరుక్తి దోష దుష్టము. అసద్వస్తువనినచే లేని వస్తువనియు, సద్వస్తువనినచే కలవస్తువనియు అర్థము. కావున అసద్వస్తువునకు అస్తిత్వము లేదనిగాని, సద్వస్తువునకు అస్తిత్వము కలదని గాని వేఱ చెప్పఁబనిలేదు. కాగా ఎందులకీ పునరుక్తి యనినచో దీనికి తగినంత కారణము కలదు. లోకులకు సహజముగా కొన్ని విషయములు బోధపడవు. వారికి తెలియుటకుఁగాను, ఒక్కొక్కవాక్యమే ఇనుమాఱు లిచట ప్రవర్తించినది

గీతాకారుడు చెప్పిన సత్, అసత్ — అను విషయములలో ఇంకను గంభీరమగు తత్త్వము కలదు. గీతా మతములో ఏదిసత్తో అది యెల్లపుడును సత్తే. ఏది అసత్తో అది ఎల్లపుడును అసత్తే. 'ఈ జగత్తు ఇపుడు ఉన్నదనియు — అనఁగా సత్తనియు, కొంత కాలమునకు ఇది ఉండదనియు—అనఁగా అసత్తగుననియు' కొందఱు అనుకొందురు. కాని గీతాకారుని మతమిది కాదు. ఈ జగత్తెపుడయినను అసత్తు కాఁగలదేని అనఁగా లేకపోవునేని ఇది ఇపుడును అసత్తనియే—అనఁగా లేనిదనియే గీతాకారునిమతము. సత్తెప్పుడును అసత్తు కాదనియు, అసత్తెపుడును సత్తు కాదనియు తెలుపుటకే గీతాకారుఁడు — 'నాఽసతో విద్యతే భావో నాఽభావో విద్యతే సతః' (౨—౧౬) అని చెప్పినాఁడు.

అసత్తునకు భావము లేదు, సత్తునకు అభావము లేదు. అనఁగా అసత్తునకు సత్త లేదు. సత్తునకు అసత్త లేదు. కాఁగా ఆత్మ నిత్యము శాశ్వతము పురాణము అజము అవినాశి అని తేలినది.

౪ అవ్యయుఁడు-అవికారి

ఆత్మ సత్తనియు నిత్యమనియు శాశ్వతమనియు పురాణమనియు అవినాశి యనియు అనునెడల, ఆయాత్మ అవ్యయమనియు అవికారి యనియు అంగీకరింపవలయునని శాస్త్ర సిద్ధాంతము.

ఏదేని ఒక అవస్థకు మార్పు ఒప్పుకొనుచో ఆ అవస్థకు వినాశమును గూడ ఒప్పుకొనవలయును. ఎట్లనిన, ఒక తెల్లని వస్తువు కలదనుకొందము. అది నల్లగా మాఱెను. పూర్వము తెలుపు కలదు. ఇపుడా తెలుపు లేదు. తెల్లఁదనము స్థాయిగా లేదు.

అది వినాశము పొందెను. మొదట తెల్లఁదనమునకు వినాశమును, పిదప నల్లఁదనము పొడ చూపుటయు జరిగెను. ఈ రీతిగా ఏ వస్తువునందు ఈ మార్పు జరుగునో ఆ వస్తువునందే వినాశము కూడ జరుగును. ఏ యవస్థకుఁ గాని వినాశ మంగీకరింపనిచో మార్పు రాఁజాలదు. ఆధ్యాత్మిక ప్రపంచ మందును యిటులనే జరుగును. ఆత్మకు వికారముగాని మార్పుగాని అంగీకరించు నెడల ఆత్మయొక్క పూర్వ రూపము నష్టమయినదని అంగీకరింప వలయును. కాని ఆత్మయొక్క స్వరూపము అవినాశి. కావున ఆత్మ స్వరూపమున కెట్టి మార్పును ఘటిల్లఁజాలదు. ఆత్మ స్వరూపము నిత్యము శాశ్వతము. ఇందువలనఁ గూడ ఆత్మకే విధమయిన మార్పును లేదనియు, ఇది అవ్యయమనియు, అవికారి యనియు తేలుచున్నది. ఆత్మ అవ్యయమని (౨–౧౩, ౨౧) అవికారి యని (౨–౨౫) స్థిరమని అచలమని (౨–౨౪) పలుచోటుల స్పష్టముగాఁ గలదు.

మఱొక అధ్యాయమునఁ గూడ 'శరీరము నందున్న' ఆత్మ అవ్యయమని కలదు. (౧౩–౩౧, ౩౨; ౧౪–౫)

౫ సర్వగతుఁడు - సర్వవ్యాపి

ఆత్మ సర్వగతుఁడు (౨–౨౪) జగత్తంతయు వ్యాపించి అన్ని వస్తువు లందును అనుప్రవిష్టుఁడయిన వాఁడే సర్వగతుఁడు. గీతాకారుఁ డీ యర్థము నందే దేహి యగు ఆత్మను సర్వగతుఁడని చెప్పెను. ఈ భావనే– 'ఎవనిచే ఇది యంతయు వ్యాప్తమాయెనో అతనిని అవినాశి యని యారయుము.' (౨–౧౭) అని యీ రీతిగా కలదు. మనము లౌకిక భాషలో జీవాత్మ అని యందుము. ఆ జీవాత్మయే సర్వవ్యాపి యని యిచటఁ జెప్పబడినది.

౬ అవ్యక్త - అచింత్య

గీతల మతమున ఆత్మ అవ్యక్తము (౨–౨౫) సాంఖ్య దర్శనము నందును గీతలలో కొన్ని కొన్ని పట్టులందును అవ్యక్త పదమునకు ప్రకృతి యని యర్థము. కాని యిచట ఈ పదము 'అప్రకటము, అప్రకాశము' అను నర్థమున వాడఁబడినది. ఇంద్రియములకు ప్రకాశము కానిదియు, మనో బుద్ధ్యాదులకు విషయము చేయుటకు వీలులేనిదియు అవ్యక్తము. గీత లీ యర్థమునందే ఆత్మ నవ్యక్తమనును.

అవ్యక్తమయిన వస్తువు ఎన్నఁడును చింతా విషయము కాఁజాలదు దానఁజేసి ఆత్మ అచింత్య మనియుఁ జెప్పఁబడెను. (౨ –౨౫)

౭ అప్రమేయుఁడు

ఒకచో ఈయాత్మ అప్రమేయుఁడని చెప్పఁబడెను. (౨–౧౮) 'ఇతఁడు ఇట్టివాఁడు' అని నిరూపించుటకు వీలులేనివాఁడు అప్రమేయుఁడు లేక అపరిమేయుఁడు అనఁగా ఏ ప్రమాణమునకును అందఁడు ఈ దెసనే జీవాత్మయు అప్రమేయుఁడు.

పరమాత్మ ఒక్కఁడే సర్వగతుఁడు, సర్వవ్యాపి, అవ్యక్తుఁడు, అచింత్యుఁడు, అప్రమేయుఁడు. గీతలలో జీవాత్మయు ఇట్టివాఁడని చెప్పఁబడుటను గుఱించి, పిమ్మట ఆలోచించెదను. గీతాకారుఁడు జీవాత్మ పరమాత్మలలో భేదము చూపలేదనియు, ప్రకృత మతఁడు జీవాత్మ యని కాని పరమాత్మ యని కాని విచారింపలేదనియు మునుముందీ మాత్రము చెప్పవచ్చును. అతఁడు ఆత్మను విచారించెను. ఆత్మ విషయమును చెప్పెను. అతని మతమున ఆత్మ ఒకటియే కాని ఇందు విభాగము లేదు. 'ఇక్కడ ఆత్మ పదమునకు జీవాత్మ యనియు, ఇక్కడి ఆత్మ పదమునకు పరమాత్మ యనియు' మనమే విడఁబఱచి ఆయా యర్థములు చెప్పికొనుచున్నాము. కాని గీతాకారుని మతమున జీవాత్మయు పరమాత్మయు ఒకటియే గీతాకారుఁడు పరమాత్మకే విశేషణములు ఉపయోగించెనో, జీవాత్మకును ఆ విశేషణమునే ఉపయోగించెను. ఏల యనఁగా జీవాత్మయు పరమాత్మయు ఒకటియే.

౮ అకర్త

మనము ప్రధానముగా రెండవ అధ్యాయమును అవలంబించియే ఆత్మ తత్త్వమును వ్యాఖ్యానింతుము. కాని ఇతరాధ్యాయములందును అచట నచట ఆత్మ స్వరూపము వర్ణితమయియున్నది. ఈ యన్ని చోటులను కొండొక విశేష మేమనఁగా 'ఆత్మ అకర్త'గా చెప్పఁబడెను.

ఆత్మ అవ్యయుఁడనియు, అవికారియనియు ననువారు ఆత్మ యెన్నఁడును కర్త అని అనలేరు. కర్మతో కర్తకుఁగల సంబంధమును విడఁదీసి చూచిన యెడల ఈ విషయము సులువుగా తేలిపోవఁగలదు. కర్త యెవఁడేని తాను చేసిన కర్మను ఉదాహరణముగా గ్రహించి చూచుకొనుఁగాక! కర్తకు ప్రధానముగా అయిదవస్థలు కలవు. కర్మ చేయవలయునను ఊహలేని అవస్థ యొకటి. కర్మ ఆరంభము కాఁబోవు అవస్థ రెండవది. కర్మచేయు నవస్థ మూఁడవది. కర్మ చేయుట అయిపోయిన అవస్థ నాలుగవది. కర్మచేయఁబడి స్మృతిగా పరిణమించునది గాని, మఱపులో పడిపోయినది గాని అగు అవస్థ అయిదవది. ఈ అయిదవస్థలను ఒకదాని కొకటి యించుకయు కలిసియుండకపోవు. వీనిలో ఒకదానితో మఱియొకటి యేమాత్రమో కలిసియుండును. సులభముగా తెలియుటకొఱకే మనమీ అయిదవస్థలను విడివిడిగా కల్పన చేయుచున్నాము. ఈ అయిదవస్థలను ఎన్నడు సంపూర్ణముగా ఒక్కటి కావు. మొదటి అవస్థ యెల్లపుడును ఉండునెడల కర్మ మాటయే ఉండదు. మొదటి యవస్థకేదేని మార్పు జరుగునెడలఁ గాని కర్మ చేయవలయునని జ్ఞానము, ఇచ్ఛ కలుగునెడలఁగాని కర్మఆరంభమగుటకు వీలుకలుగును, అటులు కలిగిననే మనుష్యుఁడు కర్మ చేయఁబూనును. కర్త యెపుడు కర్మ చేయఁబూనుకొనునో అపుడే ఆ కర్మతోపాటు అతనికి నూతన జ్ఞానమును నూతన భావముల ఉద్రేకమును కలుగును మఱియు అతఁడు నూతన భావములతో ఇచ్ఛాశక్తిని ప్రయోగించుచుండును. ఈ సమయమునం దేవస్థ యుండునో కర్మ సమాప్తి యందతనికా యవస్థ యుండదు. కర్మను చక్కగాఁజేసి కర్త క్రొత్త యభిజ్ఞతను పొందును. నూతన భావములచే ఆక్రాంతుఁడగును. అతని ఇచ్ఛలు గూడ నూతన భావములచే చాలితములగును. ఈ నాల్గవ యవస్థ మూఁడవ యవస్థ కన్న వేఱు. కర్మచేసిన వెను వెంటనే యుండు నవస్థ చాలఁగాలముండదు. కర్మ యెపుడు ప్రాచీన కాలమున జరిగిన దానితో పాటగునో యెపుడా కర్మ మాట గుఱుతు నందేని యుండదో అపు డాకర్త కొక క్రొత్త యవస్థ కలుగును. కావున కర్తయొక్క మనోవస్థ అన్ని సమయములందును ఒక విధముగనే యుండదనియు వేఱు వేఱు వేళలందు వేఱువేఱుగా మాఱుననియు కనఁబడుచున్నది. కర్మను గుఱించిన ఊహయే లేనపుడు కర్త కర్తయే కాఁడు, మఱి అకర్త. అతని యవస్థకే మార్పును లేనంత వఱకు అతఁ డకర్తగనే యుండిపోవును. కర్మ చేయవలసి వచ్చుచో అతని అవస్థకు మార్పు కలుగవలసినదే. మఱియు ఎవఁ డెల్లపుడును కర్మశీలుఁడగునో అతని యవస్థయు ఎల్లపుడును మార్పు పొందుచుండవలసినదే. కర్మ యెటులు వేఱు వేఱో కర్మకు సంబంధించిన జ్ఞానమును భావమును ఇచ్ఛయు అటులనే వేఱు వేఱు.

కర్మతత్త్వ మింకను లోతు. ప్రకృతము మనము విచారించు కర్మ కర్త యొక్కయే బయటి చూపు. (బాహ్య ప్రకాశము) కర్త మనస్సులోని భావమే కర్మ రూపముగా ప్రపంచమునకు కనఁబడును. ఈ బాహ్యావస్థ యెటులు వేఱు వేఱో, యెటులు మార్పుచెందునో కర్తయొక్క మనోవస్థయు అటులనే వేఱు వేఱును, మార్పు చెందునదియును అగుచుండును. లోని అవస్థ మాఱనిదే బయటి అవస్థ మాఱఁజాలదు. కావున కర్మ పొసఁగి నంతనే కర్తకు వేఱు వేఱు అవస్థలు కలుగునని తేలుచున్నది; కర్తృత్వ మంగీకరించి నంతనే కర్తకు వికారమును మార్పును అంగీకరింపవలసివచ్చును.

గీతల మతమున ఆత్మ అవ్యయుఁడు; అవికారియు. కర్తృత్వ మొప్పితిమేని మార్పు నొప్పుకొనవలయును. కావున గీతాకారుఁడు ఆత్మకు కర్తృత్వ మప్పగింపలేదు.

ఈ విషయమున గీత సాంఖ్య మతమును గ్రహించెను. ఆత్మ ఏ పనిని చేయదు. ప్రకృతి పనిచేయును. ఇయ్యెడ ప్రమాణము :–

(క) ప్రకృతియొక్క గుణములచేత చేయఁబడు కర్మలను చూచి వానికి నేను కర్తనని మూఢుఁ డనుకొనును. (౩–౨౭)

(ఖ) దీనిపై శ్లోకము—గుణములనేమియో, కర్మ అననేమియో యెఱిఁగినవాఁడు గుణములే గుణములను అనువర్తించునని యెఱుఁగును. ఇది యెఱిఁగి అతఁడు వాని యెడల ఆసక్తుఁడు కాఁడు. (౩–౨౮)

గుణ, కర్మ పదములకు పెక్కు అర్థములు కలవు. ఆ వ్యాఖ్యల నన్నిటిని కలిపి చూచుచో గుణ కర్మల కంటె ఆత్మ వేఱని తేటపడును.

గుణసమూహము గుణసమూహము ననువర్తించువనఁగా ఇంద్రియములు విషయములలో ఆసక్తములగునని తాత్పర్యము.

(గ) 'ప్రకృతియే అన్ని విధములను కార్యము చేయును, ఆత్మ అకర్త' అని యెవఁడు తెలియునో వాఁడే తెలిసినవాఁడు. (౧౩–౨౯, 30)

(ఘ) మఱియొకచో నిటులు కలదు—'ఇంద్రియ సముదాయమే ఇంద్రియముల విషయమున ప్రవర్తించును. నేనేమియు చేయను'—అని తెలిసినవాఁ డనుకొనును. (౫–౮–౯)

(ఙ) ఈశ్వరుఁడు లోకులకు కర్తృత్వమును గాని కర్మలను గాని కర్మఫల సంయోగమును గాని సృజింపలేదు; స్వభావమే ప్రవర్తించుచున్నది.

(చ) ఈశ్వరుఁ డెవరి పాపమును గాని పుణ్యమును గాని గ్రహింపఁడు. కర్మ చేసినంతనే ఫలమును పొందితీరవలయును. ఆత్మ కర్మచేయడు. కావున అతనికి పుణ్యపాపములులేవు. (౫–౧౫)

పదమూడవ అధ్యాయమున ఈ శ్లోకము దొరుకుచున్నది—ఆది లేనివాడగుటవలనను, గుణము లేనివాడగుటవలనను అవ్యయుఁడగు ఈ పరమాత్మ శరీరమునందు ఉండియు ఏమియు చేయడు; లిప్తుఁడును కాఁడు. (3౧–3౨)

గీతల మతమున ఎవఁడు జీవాత్మయో, అతఁడు పరమాత్మ. కావుననే ఇచట శరీరమునందు ఉన్న ఆత్మ పరమాత్మగా చెప్పఁబడియె. శరీరమునందున్న ఈ యాత్మ అకర్త. ఇతఁడేమియు చేయఁడు. దేనివలనను లేపము చెందఁడు.

(జ) అంతటనుగల ఆకాశము అతి సూక్ష్మమయిన దగుటవలన దేనివలనను లిప్తము కానటులనే దేహమునం దంతటను ఉన్నను ఆత్మ దేనివలనను లిప్తముకాదు. (౧౩–౩౨)

ఆత్మ యెటులును దేహ వ్యాపారముతో లిప్తము కాదని ఇచటను చెప్పఁబడినది.

(ఝ) పదునాలవ అధ్యాయమున ఇటులు కలదు—'ఎవడు గుణముల కంటె కర్తను విడిగా చూడఁడో, మఱియు గుణములకంటె అతీతుఁడగు పరుని జూచునో అతఁడు నా భావమును పొందును. (౧౪–౧౯)

ఆత్మ కర్త కాడనియు, గుణసమూహమే కర్తయనియు, ఆత్మ గుణములకంటె వేఱనియు ఇచట తెల్లము.

౯ ఏక - అద్వితీయ

గీతాకారుఁడు 'ఆత్మ ఏకము, అద్వితీయము'— ఈ ప్రకారమగు భాష నెచటను వాడలేదు. ఉపనిషత్కాలమున నీ మతము తొలుత ప్రచార మాయెను. సత్యమేదేని క్రొత్తగా వెలువడినచో అది పలు తెఱఁగుల నుల్లేఖింపఁబడుటయు, వ్యాఖ్యానింపఁబడుటయు ఆవశ్యకముగా సంభవించును. అది సాధారణ సత్యముగా గ్రహింపఁబడిన పిదప దాని కిఁక వ్యాఖ్యతోఁగాని గీఖ్యతో గాని పనియుండదు. 'ఆత్మ ఏకమును అద్వితీయమును' అను నీ మతము గీతాకారుని కాలమునాటికి మూల సత్యముగా గ్రహింపఁబడెను. దానఁజేసి గీతాకారుఁ డీ విషయమున విశేషించి యే మాటయుఁ జెప్పలేదు. కాని అతని వాక్యములవల్ల 'ఆత్మ ఏకమును అద్వితీయమును' అను విషయము స్పష్టము.

అందులకు కొన్ని ప్రమాణములు :—

(క) గీతలలో ఆత్మశబ్దము నానావిభక్తులలో ఏఁబది తొమ్మిది మాఱు లుపయోగింపఁబడినది. జీవాత్మయనియు, పరమాత్మ యనియు భేదము లేకుండగనే పెక్కుతావుల ఈ ఆత్మశబ్దము వాడఁబడినది. అన్ని చోటులను ఇది యేక వచనాంతముగనే యున్నది. ద్వివచనాంతముగాఁ గాని బహువచనాంతముగాఁ గాని ఇది ప్రయోగింపఁబడలేదు. దీనివలన ఆత్మ ఏకమను మాట సులభముగా నిర్ధారితమగును.

(ఖ) ఒకచో నిటులు కలదు—'నిత్యుఁడును, అవినాశియును, అప్రమేయుఁడునగు శరీరికి ఈ దేహములు నశ్వరములు. (నిత్యస్య అనాశినః అప్రమేయస్య ఇమే దేహాః అన్తవన్తః—) (౨–౧౮)

శరీరిణః=శరీరము కలవానికి; ఇది షష్ఠ్యేక వచనాంతము—దేహాః—దేహములు; ఇది బహువచనాంతము. దేహములు పెక్కులనియు, ఈ దేహ సమూహములోని ఆత్మ ఒకటి యనియు దీనివలన తేలుచున్నది—

(గ) దేహి ముదిసిన శరీరములను వదలి క్రొత్త శరీరములను తాల్చును. (౨–౨౨)

దేహి=దేహవిశిష్టుఁడగు ఆత్మ—ఏకవచనాంతము. శరీర శబ్దము బహువచనాంతము — ఇచటఁగూడ ఆత్మ ఒకటి యనియు, శరీరములు మాత్రము పెక్కులనియు స్పష్టము.

(ఘ) ఈ యధ్యాయమునందే (౨–30)—'అన్ని దేహములయందును ఉన్న ఈ దేహి అనఁగా ఆత్మ నిత్యుఁడు, అవధ్యుఁడు' అని కలదు.

దేహీ=ఆత్మ–ఏకవచనాంతము. ఒక్క దేహియే దేహసమూహమందు ఉన్నాడు. ఇటను ఆత్మ ఒకటియని స్పష్టము.

(జ) 'ఓ భారతా! సర్వక్షేత్రములందును నన్ను క్షేత్రజ్ఞునిగాఁ గూడ నెఱుఁగుము.' (౧౩-౨,౩) క్షేత్రజ్ఞుఁ డొకఁడు–క్షేత్రములనఁగా దేహములు పెక్కు. దేహమునందలి జీవాత్మయే క్షేత్రజ్ఞుడని మనము సాధారణముగా వ్యవహరించుదుము. ఇచట ఈశ్వరుని క్షేత్రజ్ఞునిగా చెప్పుటవలన జీవాత్మకును పరమాత్మకును ఏకత్వము చూపఁబడినది. ఒక పరమాత్మయే సకల క్షేత్రములందును ఉలదనుటజేసి ఆత్మ ఒకటియని తెల్లము.

(చ) ఒకచో ఒక ఉపమచే ఈ మాటయే చెప్పఁబడినది :

'ఓ భారతా! సూర్యుఁ డొకఁడే ఈ లోకమునంతయు ప్రకాశింపఁజేయునటులు క్షేత్రి–అనగా ఆత్మ, క్షేత్రము లన్నింటిని ప్రకాశింపఁజేయును. (౧౩-౩౩,౩౪)

లోకులు పలువురు. క్షేత్రములును పెక్కు. సూర్యుఁడొకఁడు. క్షేత్రజ్ఞుడున ఒకడు. పెక్కు లోకులలో సూర్యుఁడొక్కరుఁడు. పెక్కుదేహములలో ఆత్మ ఒక్కఁడు.

(ఛ) ఆత్మ సర్వగతుఁడు. (౨-౨౪) సర్వభూతములయందు అనుపవిష్టుఁడై యున్నవాఁడు ఒక్కడే కాఁగలడు గాని పలువురు కాలేఁడు.

(జ) ఎవనిని మనము జీవాత్మయని యందుమో ఆ జీవాత్మ నుద్దేశించి ఒకచో- 'ఎవనిచే ఇది యంతయు నిండెనో' అని కలదు. (యేన సర్వ మిదం తతమ్ (౨-౧౭) ఏది సర్వ వ్యాపియో అది పెక్కుకాదు–ఒక్కటియే.

(ఝ) 'యోగయుక్తుఁడును, సమదర్శియు నగువాఁడు ఆత్మ నన్నిభూతములందును ఆత్మయందన్ని భూతములను చూచును.' (౧౩-౬౯)

ఇచట ఆత్మపదము ఏకవచనాంతము–భూతములు పెక్కుకాగా ఆత్మ అద్వితీయము.

ఇచట ఆత్మ పదమునకు పరమాత్మయని కొందఱు కొందఱు చెప్పుదురు. గీతాకారుఁ డిచట జీవాత్మ పరమాత్మల నడుమ ఒక గీటు గీయలేదనియే నా చెప్పునది అతఁడు ఆత్మనే యెఱుఁగును. ఈ శ్లోకమున ఈ ఆత్మమాటయే కలదు

ఉపసంహారము

పైని ఉదాహరింపబడినదాని సారాంశమిది :

ఆత్మకు ఆద్యంతములులేవు· అనాది, అనంతుఁడు. ఆతఁడు పుట్టఁడు, గిట్టఁడు. అజుఁడు. అవినాశి ఆతఁడు నిత్యుఁడు, శాశ్వతుఁడు, పురాణుఁడు, అవ్యయుఁడు, అవికారి. సర్వగతుడు, సర్వవ్యాపి. అకర్త, ఒక్కఁడు, అద్వితీయుఁడు.

పలువురు ఆత్మయనఁగా మనస్సు, చిత్తము, బుద్ధి, ఇచ్ఛ, సుఖము, దుఃఖము– ఈ మొదలుగా అర్థము చేసికొందురు. కొందఱు బహుశః అహంకారమని అనుకొందురు. అహంకారమను నదొక దార్శనిక పదము· 'అహంభావము'–నేను అను బుద్ధి అని దీని భావము. గీతాకారుని యుద్దేశమున ఆత్మయనఁగా నిది యేమియుఁ గాదు. ఈ సమష్టియుఁ గాదు. (౧౩-౫,౬,౭)

ఇది యెల్లయు అనాత్మవస్తువు. ఆత్మ దీనికెల్ల అతీతము. ఆత్మ వ్యక్తము, అచింత్యము మఱియు అప్రమేయము–ఇదియే గీతోపదేశము !!

అంతర్గీతం

శ్రీ కొల్లూరు సూర్యనారాయణ

చీకటి నా గుండెల్లో నిట్టూరుస్తున్నప్పుడు ...
ఏకాంతపు ప్రకృతి నాకీ సంగీతం వినిపిస్తుంది
ఎక్కడో అనుభవాకాశంలో మిలమిలలాడే కళ్ళు
మనసొక్కక్కటిగా రాల్చిన మౌనపు చుక్కల్లో
నే నెవరో నాకు చెప్పాలనుకుంటుంది.
తన నిశ్శబ్ద- నిరామయ ధ్వని తరంగం
నాఅంతరంగపులోతుల్లో,తొట్రువడిసుళ్ళుతిరుగుతున్నప్పుడు
హృదయాకాశంలో స్పందించిన విన్యాసం
స్వగతంలో కృంగుతూ గతంలో నర్తిస్తోంది.

అపుడు నాకు తెలుస్తోంది గుండెలోని గతం నీడ
అనుభవాల ప్రవాహాన నేపాడిన ఎదురుపాట
ఆత్మీయత గోపురాన నేనుంచిన పావురాయి.

రాత్రి

తాకగానే
నా గుండెల్ని పరవశింపజేసే
ఈ రాత్రి
నేపథ్యంలోంచి
సూర్యుడు పాడుతున్న నల్లని పాట —

'వృక్షం తంబురా' మోగిస్తున్న
శృతితో ఐక్యమై, ఊపిరై
నాలోకి జొరబడి
జోకొట్టినట్టే జోకొట్టి
మరింత ఉత్తేజితుణ్ణి చేస్తున్న
ఈ రాత్రి
ఎంత మహత్తరమైంది !

లేస్తున్న
'దివ్వెల పడగల్ని' అనుకొని
పక్కనే సంచరిస్తున్న ఈ రాత్రి
ఎంత ధైర్యవంత మైంది !

తన శక్తినంతా ధారబోసి
ప్రతి కనుగుడ్డునీ
ఒక నల్లని వజ్రాన్ని చేయాలనుకొని
సందు సందులో జొరబడే
ఈ రాత్రి
ఎంత త్యాగశీలమైంది !

ప్రపంచమంతా కలిసినా
కలవలేని రెండు గుండెల్ని
ఏకంచేసే ఈ రాత్రి
ఎంతటి క్రియాశీలమైంది !

ఓ అనంత ఆనంద నీల సాగరమా !
ప్రియమైన రాత్రీ !
నా పాటలకు తల్లీ !
ఒకసారి నాతో ఐక్యమై
మరో పాటను ప్రసాదించు.

కవిత్వం

చీపురు కదులోంది
చిర్ చిర్ శబ్దాల చిరుచీపురిలా కదుల్తూనేఉంది.
పెరట్లో
గిలగిలా కొట్టుకుంటున్న గిలకా,
వీధిలో బండీ జారిపోతున్న ధ్వనీ,
పక్కింటి కుర్రాడేస్తున్న ఏడ్పు తంబురాశృతీ,
ఎముకల పందిర్ని అల్లుకొని
'రోగం తీగ' చేసే సవ్వడీ,
రైలు కదలికల 'ఛుక్ ఛుక్' లూ
ఆకాశాన్నేలేస్తున్న 'బ్లాక్ ఏరోప్లేన్' ఝుంకారమూ,
అందమైన రెండుకళ్ళూ రెపరెపలాడింగి
రివ్వున కదిలే గాలిపిల్లా
అన్నీ ఎగిరొచ్చి
చీపురు శబ్దంలో లీనమౌతూ —

ఏ కవో, ఏ అడవిలోనో పారేసుకున్న కలంపడే వేదనా,
జ్వలించే అడవీ,
పల్లే, పట్నమూ,
చాదర్‌ఘాట్ బ్రిడ్జి కింద,
అమీబాలా పరుచుకున్న మూసినదీ,
గలగలమంటున్న పండుటాకుల 'రెస్టరాంట్‌చెట్టూ',
చెట్టు వెనక
చిల్లులుపడ్డ కళ్ళకుండలూ,
రైలుపట్టాలపై నగ్నంగా విసిరేయబడ్డ
ఆడపిల్ల శవమూ,
ఆవేదనలో క్రమంలేకుండా తోసుకొచ్చే
నా పద చిత్రాలూ,
గాలిదుమ్మూ,
దుమ్ముగాలీ,

చీమిడి కుండలూ,
సికిందరాబాద్ స్టేషన్‌లో
రాత్రిపూట
శవాల్లా పడుకున్న దీనత్వాలూ,
దీనత్వాన్ని పొడుస్తున్న రూపాయిగద్దలూ,
గద్దల్ని గోళ్ళని చేసుకున్న రాక్షస ఖజానా,
ఖజానా కళ్ళున్న వ్యవస్థా,
అన్నీ,
అన్ని శబ్దాలూ.
ఆవేదనా, సంక్షోభం, కోపాలూ,
రక్తనదుల గలగలలూ
మోట చిమ్మల్నుంచి దూకే పిల్లలై
చీపురు శబ్దంలో దూకుతూ

ఇంకా ఈ చీపురు కదులుతూనేఉంది.
బాధలూ, కన్నీళ్ళూ
అన్యాయాలూ, అక్రమాలూ పేరుకున్న
ప్రపంచాన్ని ఊడుస్తూ
ఇంకా ఈ చీపురు కదులుతూనేఉంది!

శ్రీ గుడిహాళం రఘునాథం

వసంతం కోసం

తిరునగరి

ఎన్నెన్నో దుఃఖాల తిమిరాలావరించిన ధరిత్రిలో
ఒక్క ఆనందజ్యోతి వెలగదా ?
ఎన్నో ఎన్నో వికారాలు మూల్గుతున్న వ్యవస్థలో
ఒక్క సౌందర్యజ్యోత్స్న విరియదా ?
ఏమిటీ! ఈ నిరాశా పరివృతమైన ఆకురాలుకాలం పోదా?
ఇన్ని నవ్వాశలు చిగిర్చే వసంతవేళ జగతికిరాదా ?
నేడు మనిషి మనిషి హృదయం
ఎండిపోయిన బీడు
కాకుంటే స్వార్థ ద్వేషాలు రగులు తున్నకాడు
ఇల అంతటా ఇవోరకం పట్టింపుల పానీపట్టుయుద్ధాలు
ఎక్కడనుంచో ఇవోరకం రుజాప్రకోపక రాజకీయ
దుర్వాసనా పవనాలు
ఈ బీళ్ళలో ఒక మానవతామేఘం వర్షించాలి
ఈ కార్పణ్యజ్వలదగ్నులనార్పే కారుణ్య గంగలు పెల్లుబుకాలి
యుద్ధాల పాఠాలు వదలి విద్యార్థులు సమైక్యబుద్ధులను
గూర్చి చదవాలి
ఈ కల్లోల పవనాల తొలగించి
హృదయోద్దీపనం కలిగించే మంచిగంధవాయువులు
వ్యాపించాలి
అప్పుడీ ధరిత్రి ఆనందజ్యోతిర్నేత్రి
అప్పుడీ వ్యవస్థ సౌందర్యజ్యోత్స్నాప్రపూర్ణ
ఆ వసంతం కోసం
ఈ నిరీక్షణం.

ఒక పరిశీలన

విల్లీబ్రాంట్ నివేదిక మానవజాతి మనుగడ

శ్రీ బి. వెంకటేశ్వర్లు

శ్రీ కె. వెంకటనారాయణ

రెండవ ప్రపంచ యుద్ధానంతరం మానవ సమాజం ప్రస్తుతం మున్నెన్నడూ ఎరగనంత ప్రమాదావస్థను ఎదుర్కొంటున్నది. మానవజాతిని పీడిస్తున్న నిరంతర దారిద్ర్యం, రోగాలు, బాగు చేయటానికి వీలులేదేమోనన్నంతగా నిరాశాజనకమైన వెనకబడిన తనం మొదలైన వాటిని రూపు మాపందే మానవజాతి పురోగతి సాధ్యపడేట్టులేదు. ఈ సమస్యల ప్రభావం మానవ జాతిపై యుద్ధాలవల్ల కలిగే నష్టాల ప్రభావంకన్నా తీవ్రమైనటువంటిది. ఈ సమస్యలను ప్రపంచ దేశాలు, అంతర్జాతీయ సంస్థలు, మేధావులు ఎన్నడో గుర్తించారు. కాని వీటి పరిష్కార మార్గాలే సక్రమంగా పేర్కొనబడలేదు.

1972 లో బ్రెజిల్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఆర్థికశాస్త్ర నిపుణుల సమావేశం[1] పై సమస్యలకు శాస్త్రీయమైన పరిష్కారాలను కనుక్కోవడంకోసం చేసిన ప్రయత్నంలో ప్రపంచ వనరుల పంపకం ప్రపంచ దేశాల జనాభా ప్రాతిపదిక ఆధారంగా జరగందే మానవజాతి అది ఎదుర్కొంటున్న భయంకరమైన సమస్యలనుండి విముక్తి పొందజాలదని నొక్కి చెప్పారు. 1977 లో పారిస్‌లో సమావేశమైన 'అంతర్జాతీయ ఆర్థిక సహకార సంఘం' (Conference on International Economic Cooperation) యీ సమస్యల గురించి ఆలోచించేందుకే సమావేశమైనప్పటికీ ఆశించిన ఫలితాల కొరకు నిర్ణయాలు గైకొనడంలో విఫలమైంది. 1979లో 'అంక్‌టాడ్' (UNCTAD) మనిలాలో సమావేశమై అతిముఖ్యమైన చాలాసమస్యల పరిష్కారాలపై అంగీకారం కుదరక విఫలమైంది. 1980 లో ఢిల్లీలో జరిగిన 'యునిడో' (UNIDO) సమావేశం అభివృద్ధి చెందిన దేశాలకు, అభివృద్ధి చెందని దేశాలకు మధ్యనున్న అగాధాన్ని పూడ్చలేకపోయింది. ఈ సమావేశం జరిగిన కొద్ది రోజులకు — 1980 ఫిబ్రవరి 11వ తేదీన — అంతర్జాతీయాభివృద్ధిని గురించిన సమస్యలకు పరిష్కారం కనుగొనే నిమిత్తం పశ్చిమ జర్మనీ ఛాన్సలర్‌గా పనిచేసిన విల్లీబ్రాంట్ అధ్యక్షతన ఏర్పడిన ఒక స్వతంత్ర సంఘం తన నివేదికను ఐక్యరాజ్య సమితికి సమర్పించింది.[2] ఇంతకుముందు ప్రపంచ సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనేందుకు ఏర్పడిన ఎన్నో సంఘాల నివేదికల కన్నా బ్రాంట్ సంఘం సమర్పించిన నివేదికకు ఎంతో ప్రాముఖ్యత వుంది దీనికి కారణాలున్నాయి. అవి —

(1) ఈ సంఘం స్వతంత్రంగా ఏర్పడింది [ఇది ఏర్పడేందుకు ఐక్యరాజ్యసమితి నుండి గాని, ఏ అంతర్జాతీయ ఆర్థికసంస్థల నుండి గాని — ప్రపంచ బ్యాంకు (IBRD), అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) — ఆర్థిక సహాయం పొందలేదు.]

(2) దీనిలోని సభ్యులు కేవలం వ్యక్తులుగానే తప్ప వారి వారి దేశాల ప్రతినిధులుగా నియమితులు కాలేదు. సభ్యులు ఏ ఏ దేశాలకు చెందినవారో ఆయా దేశాలలో కొందరు కీలకమైన పదవులను నిర్వహించిన అనుభవం గలవారు.[3]

(3) సభ్యులు వారి వారి దేశాల ప్రభుత్వాలచే ప్రభావితం చేయబడలేదు.

(4) పైన పేర్కొన్నవారేకాక సంఘంలో వివిధ రంగాలలో అనుభవం గడించిన (వ్యాపారం, పరిశ్రమలు, పత్రికా రంగం, శ్రామికరంగం మొదలైనవి) వారు కూడా సభ్యులు.

(5) పైగా వీరు ఏ ప్రాతిపదికగా చూసినా ప్రపంచంలోని అన్ని దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. (సంపన్న దేశాలు — పేద దేశాలు; నూనె ఎగుమతి దేశాలు — నూనె దిగుమతి దేశాలు; పెట్టుబడిదారీ దేశాలు — సామ్యవాద దేశాలు.)

(6) ఏ కోణం నుండి చూసినా ప్రపంచంలోని అన్ని దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నవనుకున్న ప్రదేశాలలో సమావేశాలు జరిపి (అమెరికా, మాలి, సౌదీ అరేబియా, కువైట్, మలేషియా, రష్యా, చైనా) అక్కడి ప్రభుత్వాధికారులతోనూ, మేధావులతోనూ ఫలవంతమైన చర్చలు జరిపారు.

(7) ఈ సంఘం యింతకు ముందు ఏర్పడిన సంఘాలవలె అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలలోని రుగ్మతలను, వృద్ధిరేట్లను, మిగుళ్ళను, లోట్లను మొద

లైన ఆర్థికపరమైన అంశాలనేకాక తత్సంబంధమైన అంశాలెన్నింటినో – నిరాయుధీకరణ, కాందిశీకులు, తూర్పు దేశాలతో సంబంధాలు, పరిసరాలు, జీవ పరిస్థితి (Ecology), ఆహారం, జనాభా, ఇంధన సంక్షోభం, దేశాలలో మరియు వివిధ దేశాలమధ్య పెరుగుతున్న అసమానతలు మొదలైన విషయాలు – పరిగణనలోకి తీసుకొని పరిశీలించి సమగ్రమైన నివేదికను సమర్పించగలిగింది.

(8) సభ్యులందరూ స్వేచ్ఛగా, నిర్వివాదంగా నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఇన్ని ప్రత్యేకతలున్న ఒక స్వచ్ఛంద అంతర్జాతీయ సంఘం ప్రపంచ సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పడటం మానవజాతి చరిత్రలో అపూర్వమైన విషయం.

ఈ సంఘం సమర్పించిన నివేదికలోని ముఖ్యాంశాలను పేర్కొని ప్రపంచ దేశాలన్నీ—పేద, ధనిక తారతమ్యం లేకుండా — పరస్పర సహకారంతో అమలు పర్చుకోగలిగితే కలుగు లాభాలను, అమలుపర్చుకో లేకపోతే కలిగే పరిణామాలను సూక్ష్మంగా పరిశీలించడం ఈ వ్యాసం వుద్దేశ్యం.

II

విల్లీబ్రాంట్ నివేదిక "నార్త్ – సౌత్ : ఎ ప్రోగ్రాం ఫర్ సర్వైవల్" అని పిలువబడుతుంది.[4] అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలలో అన్ని దేశాలకు ప్రయోజనం చేకూరగల ఒక 'నవ్య వ్యవస్థ' ఏర్పడగలదని సంఘం నమ్ముతున్నది. 'పరస్పర ప్రయోజనం' అనేది (Mutuality of Interest) నివేదికకు మూలాధారంగా పేర్కొనబడింది. అయినప్పటికీ నిరంతర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న బడుగుదేశాల – ముఖ్యంగా నిరుపేద దేశాల – ప్రగతికి ఈ 'పరస్పర ప్రయోజనం' చాలదనీ, దీనికన్న వున్నతమైన మానవ విలువలూ, అంతర్జాతీయ సాంఘిక న్యాయం అనేవి అవసరమనీ నివేదిక భావిస్తున్నది.

ము ఖ్యాం శా లు

(1) నిరంతర దారిద్ర్యానికి (Endemic Poverty) కారణాలు 'భౌగోళిక-భౌతిక'మైనవనీ (Geo-Physical) భావిస్తూ ప్రపంచంలో రెండు 'భౌగోళిక – భౌతిక దుర్భిక్ష స్థావరాలను' (Poverty Belts) సంఘం గుర్తించి (ఒకటి మధ్య ఆఫ్రికాను చీలుస్తూ పోతున్నది. రెండవది, ఆసియాలోని యామెన్ నుంచి బయల్దేరి ఆఫ్ఘనిస్తాన్ ద్వారా నేపాల్, భూటాన్, బాంగ్లాదేశ్ భారతదేశంలోని కొన్ని భాగాలగుండా వియత్నాం కంపూచియాల వరకు) వీటి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నది. ఈ దేశాలన్నింటిలో సంపూర్ణ దారిద్ర్య నిర్మూలనకు నీటిపారుదల, వరదల నిరోధం, భూమి కోత నివారణ, అటవీ పరిరక్షణ, జలవిద్యుదుత్పాదన, ప్రచార సాధనాలు కల్పించాలనీ, ఇదంతా వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, వలసలు మొదలైన మార్పు సాధనాలద్వారా సాధ్యమౌతుందనీ పేర్కొన్నది. ఇందుకుగాను హిమాలయాల, గంగా బ్రహ్మపుత్రానదుల నీటివనరులను–ప్రత్యేకంగా భారతదేశానికి–ప్రాంతీయ దృక్పథంతో, బాహ్యమైన ఒత్తిడులకు లొంగక, ఆంతరంగికంగా నిర్వహించుకోగలగాలి. పైన పేర్కొన్న రెండు భౌగోళిక దారిద్ర్య ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ఏటా, ప్రస్తుతం అందుతున్న సహాయంపై కనీసం నాలుగు బిలియన్ల డాలర్ల అదనపు సహాయం ఈ శతాబ్దాంతంవరకు అందించవలసి వుంటుంది.

(2) అభివృద్ధి చెందిన దేశాలను పీడిస్తున్న సమస్యలను గురించి ప్రస్తావించవలసిన అవసరాన్ని 'పరస్పర ప్రయోజనం' అనేది సూచిస్తున్నది కాబట్టి ఆయా దేశాల సమస్యలను కూడా నివేదిక పరిశీలించింది. అభివృద్ధి చెందని దేశాలు అభివృద్ధి చెందిన దేశాలనుండి వాంఛించేదేమిటో అందరికీ విదితమే. కాని అభివృద్ధి చెందిన దేశాల అవసరాలేమిటో చాలామందికి అంతగా తెలియదు. అభివృద్ధి చెందిన దేశాలలో 5% ఉపాధి అవకాశాలు పేద దేశాలకు చేసే ఎగుమతులపై ఆధారపడి వున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలమధ్య వ్యాపారం ప్రస్తుతం నిలకడగా వున్నప్పటికీ తగ్గిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయి. సంపన్నదేశాలు తమ ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలంటే లేదా నిరుద్యోగ సమస్య జటిలం కాకుండా చేసుకోవాలన్నా అభివృద్ధి చెందని దేశాల కొనుగోలుశక్తిని పెంచవలసిన అవసరం ఎంతైనావుంది. ఇందుకు అభివృద్ధి చెందిన దేశాలనుండి పెద్ద ఎత్తున బడుగు దేశాలకు వనరులను బదిలీచేస్తూ వీటి అభివృద్ధికి సహాయపడాలి. దీని ఫలితంగా అభివృద్ధిచెందిన దేశాల ఎగుమతులకు గిరాకీ పెరిగి ఆయా దేశాలలో ఆర్థికమాంద్యం ఏర్పడే పరిస్థితులు తొలగిపోతాయి. అంటే నిరుద్యోగ సమస్య తీవ్రతరం కాకుండా నిరోధించబడుతుంది. రెండవది : బడుగు దేశాలనుండి చౌక వస్తువులను దిగుమతి చేసుకోవడంద్వారా తమ దేశాలలో ధరలను అదుపులో పెట్టవచ్చును. ఈ విధంగా అభివృద్ధిచెందిన దేశాలు బడుగు దేశాలకు సహాయం చేయడం అనేది సాధారణంగా వారు భావిస్తున్నట్లు వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడినది కాక అది నిజానికి వారి మనుగడకే అత్యంత దోహదకారిగా వుపయోగపడుతున్నది. ఆ విధంగా అటు బడుగు దేశాలకు ఇటు సంపన్న దేశాలకు బ్రాంట్ ప్రణాళికయొక్క సత్ఫలితాలు సమానంగా లభించగలవు

(3) నివేదిక నూనె ఎగుమతి దేశాలను గురించి ప్రస్తావిస్తూ వూహించ వీలులేనంతగా నానాటికి పెరుగుతున్న నూనె ధర బడుగు దేశాలనేకాక సంపన్న దేశాలను సహితం పీడిస్తున్నదనీ ఈ స్థితిని చక్కపర్చేందుకు అందరికీ ఆమోదయోగ్యమైన కొన్ని సూచలను చేసింది. అవి– నూనె వనరులు స్వల్పం కాబట్టి ఉపయోగించిన కొలది తరిగిపోయి తద్వారా ధరలు పెరిగి ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను లోటుకు గురిచేస్తుంది కాబట్టి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రపంచ దేశాలన్నీ కలిసి, సమైక్యంగా

పరిశోధనల ద్వారా కనుగొనే ప్రయత్నం చేయాలి. అంతకాలంవరకు నూనె ఎగుమతి దేశాలవద్దనుండి ఆయా దేశాలకు అవసరమైనంత ద్రవ్యానికి సమానమైన విలువగల ఇంధనాన్ని మాత్రమే అమ్మగలిగేటట్లు ప్రపంచ దేశాలు జాగ్రత్తపడాలి. అదీగాక నూనెధర కనీస భవిష్యత్తులో ఏ విధంగా వుండగలదనేది స్పష్టంగా వూహించగలిగేట్టుగా వుండాలి ఈ విధంగా నూనె దిగుమతి దేశాలకు లభించే ఇంధనాన్ని అభివృద్ధి చెందిన దేశాలకు, అభివృద్ధి చెందని దేశాలకు–ముఖ్యంగా పేద దేశాల అవసరాలు తీర్చడం అనే అంశాన్ని దృష్టిలో వుంచుకుని–సమానంగా పంచుకునే విధానాన్ని పెంపొందించుకోవాలి.

(4) వనరులు : ఈ ప్రణాళికను అమలు పర్చేందుకు ఎన్నో వనరులను సమీకరించవలసిన అవసరాన్ని నివేదిక గుర్తించింది. ప్రపంచంలోని గుర్తించబడిన దుర్భిక్ష ప్రాంతాల అభివృద్ధికి ప్రస్తుతం లభించే సహాయంకాక ప్రతి ఏటా 4 బిలియన్ల డాలర్లు అవసరమౌతుంది. ఇంత ద్రవ్యాన్ని సమీకరించడం చాలా కష్టంతో కూడుకున్న పనియని చాలామంది భావిస్తారు. కాని ఇది నిజం కాదు. నివేదిక పేర్కొన్న అభివృద్ధి ప్రణాళికను అమలుపర్చటానికి అయ్యే ఖర్చును ఆయుధాల వుత్పత్తిపై వెచ్చిస్తున్న ఖర్చుతో పోలిస్తే అతిస్వల్పం.[5]

నూనె ఎగుమతి దేశా· మిగులు ధనాన్ని అభివృద్ధిచెందని దేశాలకు దీర్ఘకాల ప్రాతిపదికపై వుదారమైన రాయితీలతో ఆర్థిక సహాయం చేయాలి.

ప్రపంచ బ్యాంకు ఋణసేకరణ స్తోమతను రెట్టింపుచేస్తూ, దానిని నిర్వహించడంలో, అదుపు చేయడంలో అభివృద్ధిచెందని దేశాల పాత్రను పెంచాలి. అంతర్జాతీయ ద్రవ్యనిధియొక్క స్వాధీనంలోని బంగారాన్ని తనఖా పెట్టుటద్వారా రుణాలను సేకరిస్తూ, అవసరమైతే కొంత బంగారాన్ని విక్రయించి వనరులను సమీకరించాలి. అదీకాక ఈ రెండు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఇంతకుముందువలె బడుగు దేశాలకు రుణాలివ్వడంలో అనుసరించిన తీవ్రమైన ఆంక్షలను సడలించి రుణాలుపొందే దేశాల అభివృద్ధిపైగల రాజకీయార్థిక ఒత్తిడులను పరిగణనలోకి తీసుకొని ఆర్థిక సహాయం చేయాలి. ఇకపోతే, బడుగుదేశాలు తమ తమ దేశాలలో 'విధాన నిర్ణయ ప్రవృత్తిని' (Process of Decission making) వికేంద్రీకరించి పెద్ద పెద్ద పథకాలకు కాక తక్షణావసరాలను తీర్చే చిన్న చిన్న పథకాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రాంతీయ ద్రవ్యసంస్థల నిధులను (జాతీయ బ్యాంకులు – వ్యాపార బ్యాంకులు మొ॥వి) సంపూర్ణంగా వినియోగించుకోవాలి నివేదిక క్రొత్త అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను రూపొందించుటకు విముఖత కనపర్చుతూనే "ప్రపంచాభివృద్ధి నిధి" (World Development Fund) అనే క్రొత్త సంస్థను సూచించింది. ఇది ప్రపంచబ్యాంకుకు భిన్నంగా ప్రపంచ దేశాలన్నిటికీ సభ్యత్వం–రష్యా, తూర్పు ఐరోపా దేశాలతో సహా 6 –కల్పిస్తూ అభివృద్ధిచెందిన, అభివృద్ధిచెందని దేశాలకు దాని యాజమాన్యంలో, ఆజమాయిషీలో సమానమైన అధికారాన్ని అన్ని దేశాలు పంచుకునే అవకాశాన్ని కల్పిస్తుంది.

ఈ నిధి ఇంతకుముందు ఏ ఏ బడుగు దేశాలు ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయాన్ని సక్రమంగా పొందలేకపోయాయో గమనిస్తూ వాటి అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలపై శ్రద్ధ వహించవలసి వుంటుందని నివేదిక పేర్కొంటున్నది.

ప్రస్తుతం బడుగుదేశాలు సంపన్న దేశాల జాతీయాదాయం నుండి పొందుతున్న ఆర్థిక సహాయం 1985 నాటికైనా 0.7%కు చేరుతూ యీ శతాబ్దాంతానికి 1%ను అందుకోవాలి. మరోవంక అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించుకునేందుకు పశ్చిమ దేశాలే కాక, తూర్పు దేశాలు మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలు (అత్యంత పేద దేశాలు మినహా) ఒక విశ్వజనీనమైన వ్యవస్థగా రూపొందాలి. ఈ వ్యవస్థద్వారా ప్రపంచదేశాలలో బడ్జెట్లను ప్రభావితం చేయని అంతర్జాతీయ వనరులను–మానవ జాతికి సమానంగా వర్తించే సముద్ర ఖనిజాలు, ఆయుధాల ఎగుమతిపై పన్నులు, అంతర్జాతీయ వ్యాపార పన్నులు–సక్రమంగా పంపిణీ చేసుకోవాలి.

నివేదికలోని యీ పైన పేర్కొన్న ముఖ్యాంశాలన్నీ ఒకే సారి అమలుపర్చడం సాధ్యం కాకపోవచ్చుననీ సంఘం అభిప్రాయపడుతూనే 1980–85 మధ్యకాలంలో గైకొనవలసిన తక్షణ కర్తవ్యాన్ని కూడా సూచించింది. అవి—

—అభివృద్ధి చెందుతున్న దేశాలకు పెద్ద ఎత్తున వనరుల తరలింపు,

—అంతర్జాతీయ ఇంధన వ్యూహం (Energy Strategy)

—అంతర్జాతీయ ఆహార ప్రణాళిక,

—అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన సంస్కరణలను ప్రారంభించడం—అనేవి.

ఇది నివేదిక సారాంశం. దీనిని అమలు పర్చుటకు అవసరమైన రాజకీయ వాతావరణం (Political will) సృష్టించేందుకు గాను ఎన్నుకోబడిన కొన్ని పారిశ్రామిక దేశాలనుండి మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలనుండి నాయకులను సమావేశపరచి ప్రపంచ దేశాలతో సంప్రదింపులు జరపకపోతే నివేదిక అలంకార ప్రాయంగానే మిగిలిపోతుందని బ్రాంట్ సంఘం అభిప్రాయపడింది.

III

ఈ నివేదిక సమర్పించిన సభ్యుల చిత్తశుద్ధిని గాని, నివేదికలో పేర్కొన్న అంశాల గుణాత్మకతను గానీ – వివాదాస్పదతకు ఎంతో అవకాశమున్నప్పటికీ— శంకించ నవసరంలేదు. మానవజాతి సుఖశాంతులతో మనుగడ సాగించటానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టించేందుకు, ప్రస్తుత అంతర్జాతీయ మానవ సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను ఎత్తి చూపేందుకు గాని

యిలాంటి చింతనయొక్క అవసరం ఎంతైనా వుంది. ప్రపంచ దేశాలన్నీ యీ నివేదికను అంగీకరించి చిత్తశుద్ధితో అమలు చేయ గల రాజకీయ వాతావరణాన్ని సృష్టించుకోవటానికి సిద్ధపడితే సంభవించగల సత్ఫలితాలు విశ్వమానవ కుటుంబ స్థాపనకు ఎలా దోహదంచేస్తాయో పైన పేర్కొన్న నివేదికలోని ముఖ్యాంశాల పరిశీలనద్వారా తెలుసుకోవచ్చు.

అయితే యీ ప్రణాళికను సంపన్న దేశాలు—వారే బడుగు దేశాల అభివృద్ధికి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం చేయవలసిన అవసరం దృష్ట్యా—అంగీకరిస్తాయా? అభివృద్ధి చెందిన దేశాలు ప్రస్తుతం బడుగుదేశాలకు చేస్తున్న తమ జాతీయాదాయంలో 0.3% ఆర్థిక సహాయాన్ని 1% చేయమని ఇటీవలే ఢిల్లీలో జరిగిన 'యునిడో' సమావేశంలో బడుగుదేశాలు అడిగినప్పుడు యిప్పట్లో చేతకాదని లేచిపోయాయి ఈ 0 3%ను 0.7%వరకు 1970 నాటికి పెంచగలమని 1960లోనే అంగీకరించిన సంపన్నదేశాలు కనీసం 1980 నాటికైనా 0.7%కు పెంచలేకపోగా ప్రస్తుతం ఆ యిస్తున్న 0.3%కూడా తగ్గిపోతోంది.[7] ఆవిధంగా ఆ సమావేశం ఏ నిర్ణయాలు గైకొనకుండానే ముగిసింది. ఈ కొద్ది సహాయానికే వెనుకాడిన సంపన్న దేశాలు ప్రస్తుతం చేస్తున్న సహాయం కాక ప్రతి ఏటా నాలుగు బిలియన్ల డాలర్ల సహాయం ఈ శతాబ్దాంతం వరకూ చేయటానికి ముందుకొస్తుందా?[8] ఆయుధ సామగ్రిపై వెచ్చించే ధనం, తద్వారా తయారవుతున్న అధునాతన ఆయుధాలు ప్రపంచాధిపత్యం కొరకు రెండు అగ్రరాజ్యాలమధ్య జరుగుతున్న తీవ్రమైన పోటీయొక్క పరిణామాలు. ప్రపంచాధిపత్యాన్ని కాంక్షించే దేశాలు 'జాతుల స్వయంనిర్ణయాధికారం' అనే అంశాన్ని అంగీకరించి బడుగుదేశాల అభివృద్ధికి సహాయపడటమనేది సంశయాస్పదం కాదా ? గతించిన కాలంలో బడుగుదేశాలు తీసుకున్న రుణాలపై వడ్డీలు చెల్లించటానికే ప్రస్తుతం సంపన్న దేశాలు చేసే ఆర్థిక సహాయం చాలడంలేదు. ఈ రుణాలను 'రైటాఫ్' చేయందే ముందు ముందు చేయబోయే ఆర్థిక సహాయం (ఒకవేళ చేస్తే!) అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవీలుండదు. ఆ రుణాలను సంపన్న దేశాలు 'రైటాఫ్' చేయటానికి అంగీకరిస్తాయా? పెట్టుబడిదారీ దేశాలలో సమస్యలు లేవనికాదు.[9] పెట్టుబడిదారీ దేశమంటేనే అసమానతలుంటాయని అర్థం అయితే యీ అసమానత కనీసావసరాలకు లోటు కలిగించేంత తీవ్రమైందికాదు. ఈ సమస్యను పరిష్కరించుకొనేందుకు యీ దేశాలు ప్రస్తుతం బడుగు దేశాలకు చేస్తున్న సహాయంకాక ఏటా నాలుగు బిలియన్ల డాలర్లు అదనపు సహాయాన్ని ఇవ్వటానికి అంగీకరిస్తాయా? ఎలుకలున్నాయని ఎవరైనా ఇంటికి నిప్పెట్టుకుంటారా ? సంపన్న దేశాలు వీటన్నిటికీ సిద్ధపడ్డాయే అనుకుందాం. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలలో రోజురోజుకూ పెరుగుతున్న 'సామాజిక, సాంకేతిక ద్వైవిద్యాలు' ఆ దేశాలలో ఏ తరహా అభివద్ధికి దోహదం చేస్తాయి? జాతీయ సంస్కృతి ప్రమాదంలో పడదా? ఇట్టి పరిస్థితుల్లో నివేదిక సూచించిన అభివృద్ధి ప్రణాళిక ఈ దేశాలలో యిముడుతుందా?

ఇంకొక జటిలమైన సమస్య—ఈ ప్రణాళికను అమలు పర్చేందుకు అనుకూలమైన ఒకేరకమైన రాజకీయ వాతావరణం సమకాలీన పేద దేశాలలో వున్నదా ?

ఈ పైన పేర్కొన్న సమస్యలన్నింటికి నివేదిక పరిష్కారాలు సూచించలేకపోయినప్పటికీ దాని విలువను శంకించనవసరం లేదు.

దీనిని చిత్తశుద్ధితో అమలు పర్చవలసిన బృహత్తరమైన బాధ్యత సంపన్న దేశాలపైననే వుంది. దీనికి పేద దేశాల సహకారం ఎంతో అవసరం. ఈ దేశాలు అందుకు ఎప్పుడా సిద్ధమయ్యే వున్నాయి. ప్రపంచ దేశాల ఆర్థిక సంబంధాలలో మౌలికమైన మార్పులు రానట్లయితే మానవజాతి చాలా దుష్పరిణామాలకు గురి అవుతుంది. టాంజానియా అధ్యక్షుడు జూలియస్ నైరేరే[10] మాటల్లో—

> "Change – fundamental change – has to come. Together we can make it an orderly change If we do not, there will be change through the effects of depression, voilence – spilling over from the poor countries to the rich, and reverberating areas of chaos."

NOTES

1 ప్రపంచంలోని అన్ని భావనా సాంప్రదాయాలకు ప్రాతినిధ్యం వహించే శాస్త్రజ్ఞులు మొదటిసారిగా ఒకచోట సమావేశమై మానవ జాతిని పీడించే సమస్యలను గురించి చర్చించడం యీ సమావేశం ప్రత్యేకత.

2 ఈ నివేదికను 'పాన్‌బుక్స్' అనేసంస్థ 'నార్త్-సౌత్' అనే హైటిల్‌తో ప్రచురించి గత మార్చి 7వ తేదీన ఇంగ్లండ్‌లో విడుదల చేసింది. 'ఎ ప్రోగ్రాం ఫర్ సర్వయివల్' అనేది దీనిని సబ్ హైటిల్. ఈ వ్యాసం రాసే నాటికి భారత దేశానికి దీని ప్రతులు యింకా చేరవలసే వుంది.

చూడు : జి. జె. రామారావ్; బ్రాంట్ కమిషన్ రిపోర్ట్: పర్పస్ అండ్ ప్రాస్‌పెక్ట్స్, పార్టీ లైఫ్, సంపుటం XVI, నెం. 6, 22 మార్చి 1980.

3 సంఘానికి అధ్యక్షుడైన విల్లీ బ్రాంట్ పశ్చిమ జర్మనీకి ఛాన్సలర్‌గా గతంలో పని చేశాడు. ఎడ్వర్డ్ హీత్ విల్సన్‌కు ముందు బ్రిటిష్ ప్రధాని. పామె స్వీడన్‌కు ప్రెయ్ చిలీకి

అధ్యక్షులు. యల్. కె యూ భారతదేశంలో రిజర్వ్ బ్యాంకు గవర్నర్‌గా, ప్రస్తుతం కాశ్మీర్ గవర్నర్‌గా వున్నారు.

4 యల్. కె. యూ; 'ఎ ప్రోగ్రాం ఫర్ సర్వయివల్'; ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా, సంపుటం CI 15, ఏప్రిల్ 13–19, 1980.

జి. జె. రామారావ్; 'బ్రాంట్ కమిషన్ రిపోర్ట్ : పర్సన్ అండ్ ప్రాస్‌పెక్ట్స్', పార్టీ లైఫ్ సం. XVI, నెం. 6, 22 మార్చి, 1980.

5 సంపన్న దేశాలు ప్రతి ఏటా ఆయుధాలపై వెచ్చిస్తున్న ధనం నాలుగువందల యాభయి బిలియన్ల డాలర్లు.

6 ఈ దేశాలకు యిప్పటి వరకు ప్రపంచ బ్యాంకులో గాని, 'అంతర్జాతీయ ద్రవ్యనిధి' సంస్థలో గాని సభ్యత్వం లేదు. ఇటీవలె కొద్దిరోజుల క్రితం చైనాకు దీనిలో సభ్యత్వం ఇచ్చారు.

7 టాంజానియా అధ్యక్షుడు జూలియస్ నైరేరి వియన్నాలో 'ఆస్ట్రియన్ యిన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్ నేషనల్ అఫేర్స్'లో మార్చి 11, 1980 నాటి ప్రసంగంలో వెల్లడయింది

చూడు : మెయిన్ స్ట్రీమ్,సం. XVIII, నెం.32, ఏప్రిల్ 6, 1980.

8 ప్రస్తుతం చేస్తున్న సహాయం మరియు నివేదిక సిఫారసు చేస్తున్న 4 బిలియన్ల డాలర్ల సహాయం కలిపితే సంవత్సరానికి 50 నుండి 60 బిలియన్ల డాలర్ల వరకు వుంటుంది. ఇది 1980 ధరల ప్రకారం

చూడు : జి. జె. రామారావ్ పయిన చెప్పినదే.

9 ఇప్పటికే అమెరికా మొ॥న పశ్చిమ దేశాలలో ఆర్థిక మాంద్యం ప్రథమ దశ ప్రారంభమైంది.

10 జూలియస్ నైరేరి, పయిన చెప్పినదే.

నిరీక్షణ

చైతన్య

ఇవాళ నీ రహదారిని
ఈ ఎద కన్నులు
కవాటాలు తెరుచుకొని
ఎదురు తెన్నులు చూస్తున్నాయి.

నీ జ్ఞాపకాల జడివానలో
తడిసిపోయిన మానసం
బీజాంకురమై
ఏపుగా పెరిగి
ఎంతో తియ్యగా పూసిన పూలు
ఏకాంత శిలపై ఒక్కొక్కటిగా
రాలిపోతున్నాయి.

సుతిమెత్తని
సుధామయ సుందర చాందినీ బింబం
కురిపించే వెన్నెలంతా
'కురూపి'లాతోచి
వృధా అయిపోతున్నది
ఈ రేయి ఒడిని ...
విరహ విపినాన ...

వేకువనే
పాలిపోయి

వాలిపోయిన చంద్రునితో
చచ్చిపోతున్న ''కొన ఊపిరి ఆశ''
రవి కిరణాలతో మళ్ళీ
రగుల్కొని జీవిస్తోంది
రమ్యమైన ఆగామి రాత్రికోసం ...
నీ ఆగమన వాసంత ధాత్రికోసం ...

ఎవరిచ్చారీ తీర్పు?

శ్రీ పణుతుల రామచంద్రయ్య

ఉషోదయాల అంచుల్లో స్నేహాశకలాల్ని వెదికే పిట్ట
 ఉదారంగు వర్షపు బరువులో రెక్కలు ముడుచుకుంది
నిద్రలో పొర్లే ఏటిమీది మెలకువతో మోహరిస్తూ
ఏకాంతాన్ని గర్జనలో దాచుకుంది నిన్నటి సింహం.

మబ్బుల చుంబనాల్లో ప్రోగుపడిన రహస్యాల్ని చీల్చబోయి
తననే చించుకుంటోంది పుంస్కోకిల కంఠం
గజేంద్రుడి విన్నపాలు నమోదు చేసుకునే అధికారి
గైర్ హాజరయ్యాడని ప్రకటిస్తోంది వైకుంఠం.

సందేహాల గాడ్పులూ, రేపటి దారుల్లోని భయాలూ
రాతియుగంలో వేడి అందించిన రాళ్లలోనివనీ,
ప్రేమలోని ప్రాచీనత్వాలూ, వేదనా స్వరధునులూ
ఏవో తెలియని వైశాల్యాల్లో ఉబుకుతుంటాయనీ,
ఈ కుడ్యాలమీది అక్షరాలు గొడవచేస్తోంటే
వినలేదా, ఈ సంకేతా లెవ్వరూ చూడలేదా ?
ఇంత చరిత్రకు వ్యతిరేకంగా ఎవరిచ్చారీ తీర్పు –
మనువు సంతతి వారంతా మందహాసాలు ధరించాలని ?

కన్నీటి కెరటాలు

శ్రీ హెచ్. పార్వతీశ్వర్

నీవు స్త్రీవైనా పురుషుడివైనా
 నా ప్రేమను చెప్పనీయ్
 కోమలమైనా పరుషమైనా రెంటిని ఆదరిస్తాను
నీ రహస్య విషయాలు ఎలా తెలుపుతాను
తమ విలాస పద్ధతులు నీకు తెలిపి తీరుతాను.

* * *

ఈ కరుణా భరిత హృదయంలో
మ్రోగుతుంది ఇదే వికలరాగ విపంచి
ఎందుకో హా హా కార స్వరాలలో
హద్దులేని వేదనా స్వరం ధ్వనిస్తుంది.

మానస సాగరపు ఒడ్డున
ఎందుకో కదిలే కెరటాలు కొట్టుకొంటూ
కలకల ధ్వనితో చెబుతున్నాయి
కొన్ని గత స్మృతుల వివరాలు.

వస్తున్నాయి శూన్యమగు క్షితిజంనుండి
ప్రతిధ్వనులుగా ఎందుకో తిరిగి తిరిగి నన్ను
కొట్టుకొ టూ విలపిస్తున్నట్లు
పిచ్చెక్కినట్లు చుట్టూ తిరుగుతున్నాయి.

ఎందుకో వ్యధిత ఆకాశగంగవలే
వ్యాపిస్తుంది రెండు కొనలనుండి
చేతనా తరంగిణి నానుండి
తీసుకొంటుంది మృదులమైన అలలను.

స్మృతులనే ఈ హృదయంలో
ఒక నివాస స్థానముంటే చాలు
అట్లే ఈ నీలిమాకాశంలో
నక్షత్రలోకము వ్యాపిస్తుంది.

[హిందీ కవి శ్రీ జయశంకర్ ప్రసాద్‌కు కృతజ్ఞతతో...]

శ్రీ పి. సుందరరామశాస్త్రి

విష్ణుకుండినులు వంశ, కాలానుక్రమణికలు

(గత సంచిక తరువాయి)

V విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికలు

తుమ్మలగూడెం శాసనద్వయం

ముందు ప్రస్తావించినట్లు తుమ్మలగూడెం శాసనద్వయం వెలుగులోనికి రావడంతో విష్ణుకుండిన చరిత్రపై క్రొత్త ఆసక్తి కల్గింది. ఆ వివరించిన పూర్వపు సిద్ధాంతాలు చాల వరకు నిరుపయోగమైనాయి. అయినప్పటికి, పొలమూరు శాసన గతమైన సాక్ష్యాధారాలు చరిత్రకారులను గాఢంగా ప్రభావితం చేసియుండడాన, ఈ శాసనాల వలన లభించే సాక్ష్యాధారాలతో తమ పూర్వ సిద్ధాంతాలను బలపరచుకొనడానికి, లేదా స్పష్టపరచుకొనడానికి చరిత్రకారులు బహుళంగా ప్రయత్నించారు. తత్ఫలితంగా ఈ వంశ చరిత్ర మరింత క్లిష్టమైంది.

తుమ్మలగూడెం రెండవ శాసనంలో విష్ణుకుండిన వంశక్రమం గోవిందవర్మతో ప్రారంభించి వివరించబడడంతో, మొదట్లో డా. డి. సి. సర్కారుగారు సూచించినట్లు ఈపూరు మొదటి శాసన ప్రదాత (అలాగే పొలమూరు శాసన ప్రదాత)యైన మాధవవర్మ చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలో ప్రశంసించబడిన మాధవవర్మేనని స్పష్టపడుతున్నది.[126] ఈ వంశ క్రమనిర్మాణంలో గోవిందవర్మ స్థానమేదో నిర్ధారించలేకపోతున్నది. అందుచేతనే, డా. మారేమండ రామారావుగారు[127] తుమ్మలగూడెం శాసనాల వలన తాను పూర్వం సూచించిన విష్ణుకుండిన వంశానుక్రమణికకు భంగంలేదని, దానిని శాసనం బలపరుస్తుందని సంతసించారు. కాగా, తుమ్మలగూడెం మొదటి శాసనం పేర్కొంటున్న రాజపరంపర మాత్ర మాయనను కొంత తికమక పెట్టింది.[128]

తుమ్మలగూడెం మొదటి శాసన ప్రదాత అయిన గోవిందవర్మను, రెండవ శాసనంలో పేర్కొనబడిన సనామధేయునిగా గ్రహించినట్లయితే, రెండు శాసనాలలో చెప్పబడిన వంశక్రమ వివరాలతో నవిచ్ఛిన్నంగా విష్ణుకుండిన వంశవృక్ష మేర్పడుతుంది. మొదటి ఈపూరు శాసనంలో చెప్పబడిన వంశక్రమ వివరా లందులో చక్కగా సరిపోతాయి. తుమ్మలగూడెం రెండవ శాసనంలోని శక కాల సూచికతో, తుండి శాసనం వలన తెలియ రాజ్యసంవత్సరాలతో కలిపి, రెండవ విక్రమేంద్రవర్మ పరిపాలనా కాలాన్ని క్రీ. శ. 555-570 సంవత్సరాల మధ్య,[129] ఖచ్చితంగా నిర్ణయించవచ్చును. మిగిలిన రాజుల పరిపాలనా కాలాలను వారి వారి శాసనాల నుండి తెలియవచ్చే రాజ్య సంవత్సరాల వలన నిర్ణయించడం ద్వారా[130] సమగ్రమైన విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికలను నిర్మించవచ్చు.

అయితే, అలా ఏర్పరచిన విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికలలో, ఏకాదశాశ్వమేధ క్రతు సహస్రయాజులైన మాధవవర్మ నామధేయులందఱి నొక్కరుగా భావించి, క్రీ. శ. 5వ శతాబ్ది తుది పాదం నుండి 6వ శతాబ్ది ప్రథమపాదం లోపుగా పరిపాలించినట్లు నిర్ణయించవలసి వస్తుంది. రెండు పొలమూరు శాసనాల మధ్య అంతరమొక శతాబ్ది కంటె నధికంగా ఉంటుంది. అంతేకాక, గోవిందవర్మ తండ్రి పొలమూరు శాసనంలో విక్రమహేంద్రుడని పేర్కొనబడగా, తుమ్మలగూడెం మొదటి శాసనాన్ననుసరించి, మాధవవర్మగా గ్రహించవలసివస్తుంది

ఈ కారణాలచేత తుమ్మలగూడెం శాసనాలను మొదట ప్రకటించిన శ్రీ బి. యన్. శాస్త్రి[131] విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికలను పొలమూరు శాసనానికి విరోధమైనరీతిలో ఈవిధంగా నిర్మించారు.

మొదటి ఇంద్రవర్మ (క్రీ. శ. 388–400)

మొదటి మాధవవర్మ (క్రీ. శ. 400–418)

మొదటి గోవిందవర్మ (క్రీ. శ. 418–455)
[మొదటి తుమ్మలగూడెం శాసన ప్రదాత]

రెండవ మాధవవర్మ
(క్రీ. శ. 455–490)

దేవవర్మ
క్రీ. శ. 490–493

మూడవ మాధవవర్మ
క్రీ. శ. 493–522

మొదటి విక్రమేంద్రవర్మ
క్రీ. శ. 522–528

ఇంద్రవర్మ
క్రీ. శ. 528–556

రెండవ విక్రమేంద్రవర్మ
క్రీ. శ. 556–570
(చిక్కుళ్ళు, తుండి, రెండవ తుమ్మలగూడెం శాసనాల ప్రదాత)

రెండవ గోవిందవర్మ
క్రీ. శ. 570–576

నాలుగవ మాధవవర్మ
క్రీ. శ. 576–623

మంచన్న భట్టారకుడు
క్రీ. శ. 623–624

ఇచట శ్రీశాస్త్రిగారు, ఆర్.యన్. పంచముఖిగారిచే నిర్ణీతమైన పాలమూరు శాసనకాలాన్ని, క్రీ. శ. 624 లో కుబ్జ విష్ణువర్ధనుడు వేంగిలో పరిపాలన ప్రారంభించినాడన్న శ్రీ నేలటూరి వేంకట రమణయ్యగారి సిద్ధాంతాన్ని[132] అనుసరించినారని భావించవచ్చు. పాలమూరు శాసనాలు రెండింటి మధ్య కాలాంతర మొకతరమేనన్న పూర్వచరిత్రకారుల మతానికాయన కట్టుబడియున్నట్లు తెలుస్తున్నది.

అయితే, డా. సర్కారుగారి వాదాన్ననుసరించి, సమాన లక్షణాలు కల్గిన ఇద్దరు గోవిందవర్మలు, ఇద్దరు మాధవవర్మలను కల్పించడాన్ని వ్యతిరేకించే డా. మారేమండ రామారావుగారు[133] పై యనుక్రమణికలను తిరస్కరించి వేరొక పద్ధతిలో నిర్మించి ప్రకటించారు. తుమ్మలగూడెం మొదటి శాసన సంపుటి లిపి పరిణామ శాస్త్రాన్ననుసరించి, రెండవ శాసనానికి తుల్యమైన అక్షరవిన్యాసాన్ని కల్గియుండడమూ, అందు పేర్కొనబడిన విష్ణుకుండిన వంశక్రమం మిగిలిన యే శాసనప్రోక్తమైన వంశక్రమ వివరాలతో నేకీభవించక భిన్నంగా ఉండడమూ రామారావుగారా ముగ్గురు రాజులను విష్ణుకుండిన మూలవంశములోనివారు కారని నిర్ణయించ పురికొల్పాయి. ఆయన గోవిందవర్మను, అతని పూర్వులను వేఱొక విష్ణుకుండిన దాయాద శాఖీయులుగా భావించి, రెండవ విక్రమేంద్రవర్మ యనంతరం మూల వంశాన్ని కూల్రదోసి అధికారాన్ని హస్తగతం చేసుకొన్నవారని అభిప్రాయపడినారు. ఆయన నిర్మించిన విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణిక లీ క్రింద చూపిన విధంగా ఉంటాయి.[134]

విక్రమహేంద్రుడు క్రీ. శ. 450–458

గోవిందవర్మ క్రీ. శ. 458–468

మొదటి మాధవవర్మ క్రీ. శ. 468–518
(ఏకాదశాశ్వమేధి, క్రతు సహస్రయాజి)

దేవవర్మ

రెండవ మాధవవర్మ

మొదటి విక్రమేంద్రవర్మ
క్రీ. శ. 518–528

ఇంద్రవర్మ
క్రీ. శ. 528-555

రెండవ విక్రమేంద్రవర్మ
క్రీ. శ. 555–566
(తుమ్మలగూడెం రెండవ శాసనం)

ఇంద్రవర్మ
క్రీ. శ. 566–570

మాధవవర్మ
క్రీ. శ. 520–575

గోవిందవర్మ
క్రీ. శ. 575–615
(మొదటి తుమ్మలగూడెం శాసనం)

ఈ విధమైన వంశ కాలానుక్రమణికల నిర్మాణంతో ఆయన తృప్తిపడక మఱొక పద్ధతిని కూడా సూచించారు.[135] అందాయన మొదటి తుమ్మలగూడెంశాసనంలో చెప్పబడిన ఇంద్రవర్మను ఇంద్రభట్టారకవర్మ (క్రీ. శ. 525–555)గా భావించి, ఆతని కుమారుడైన మాధవవర్మ రెండవ విక్రమేంద్రవర్మ (క్రీ. శ. 555–570) తర్వాత సింహాసన మాక్రమించినాడని, ఆతని కుమారుడు, మొదటి తుమ్మలగూడెం శాసన ప్రదాతయైన గోవిందవర్మ క్రీ.శ. 595–615 సంవత్సరాల నడుమ పరిపాలిస్తూ దుర్జయులచే నోడి, వేంగిని పోగొట్టుకొని యుండవచ్చునని భావించారు. దుర్జయులు క్రీ. శ. 615–620 సంవత్సరాల నడుమ వేంగిని పాలించి, ఆ పిమ్మట చాళుక్యుల వలన వేంగిని పోగొట్టుకొన్నారని ఆయన అభిప్రాయం.

తర్వాత డా. రామారావుగారు తుమ్మలగూడెం శాసనాల నుండి లభిస్తున్న అసమగ్ర సమాచారం విష్ణుకుండిన చరిత్రలో కొన్ని సంశయాలను రేకెత్తిస్తుందని భావిస్తూ, కొన్నింటిని పేర్కొన్నారు.[136] వాటిని క్రింది విధంగా క్లుప్తీకరించి సమీక్షించవచ్చు.

1) రెండవ తుమ్మలగూడెం శాసనం వలన రెండవ విక్రమేంద్రవర్మ యొక సామంత రాజవంశంనుండి మాధవరాజనే బాలుని పుత్రప్రేమతో స్వీకరించినాడని తెలుస్తున్నది. ఆ బాలుడు తన పెంపుడుతండ్రి యనంతరం సింహాసనము నధిష్ఠించినాడా? లేదా?[137]

2) అదే శాసనం పరమ భట్టారికా మహాదేవి శ్రీ పృధ్వీమూల రాజవంశంలో జన్మించినట్లు చెబుతున్నది. ఈ పృధ్వీమూలుడు గోదావరి తామ్రశాసన ప్రదాత అయిన పృధ్వీమూలునిగా భావించవచ్చునా? ఈ పరమ భట్టారికా మహాదేవికి, రెండవ విక్రమేంద్రవర్మకు కల సంబంధ మెట్టిది?

3) పరమ భట్టారికా మహాదేవి గోవిందరాజుయొక్క ఘనతను ప్రదర్శింప దలచి ఇంద్రపురము నలంకరించినట్లు పై శాసనం పేర్కొంటున్నది. గోవిందరాజునకు ఆ మహాదేవితోగల సంబంధమెట్టిది? వారి సంబంధాన్నిబట్టి గోవిందరాజు విష్ణుకుండిన మూలవంశంలోని వానిగా భావించ వచ్చునా?

డా. అజయమిత్ర శాస్త్రిగారు[138] మారేమండ రామారావు గారి వాదాన్ని చాల సహేతుకంగా ఖండించి, తుమ్మలగూడెం మొదటి శాసన ప్రదాతయైన గోవిందవర్మ రెండవ శాసన సంపుటిలోని వంశక్రమ వివరణలో తొలుత పేర్కొనబడిన మహారాజుగా గుర్తించారు. ఇరువురు రాజులు బౌద్ధమతావలంబులుగా, బౌద్ధ తత్త్వాన్నామూలాగ్రంగా నవగాహన చేసికొన్న జ్ఞానులుగా, అనేక బౌద్ధ విహార నిర్మాతలుగా రెండుశాసనాలలో సమానంగా వర్ణింపబడినారు. కను వారిరువురి నొకరుగా గ్రహించడమే యుక్తము. రెండు శాసనాలలోను పేర్కొనబడిన గ్రామదానాలు పరమ (భట్టారికా) మహాదేవిచే నిర్మించబడిన మహా విహారానికే చేయబడినట్లు, ఆమె గోవిందవర్మ అగ్రమహిషిగాను పేర్కొనబడింది.[139] ఈ విధంగా డా. శాస్త్రిగారు తుమ్మలగూడెం రెండు శాసనాలలోని వంశక్రమ వివరాలను క్రోడీకరించి సమీకరించారు ఆయన రూపొందించిన విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికలు ఈ వ్యాసాంతాన చూపబడినాయి.

తుమ్మలగూడెం రెండవ శాసన ప్రదాన భాగంలోని పరమ భట్టారికా మహాదేవి ప్రశంసను సరిగా అర్థం చేసికొంటే, డా. రామారావుగారు లేవనెత్తిన సమస్యలు కేవల మాయన ఊహా జనితాలని స్పష్టపడతాయి. రెండవ విక్రమేంద్రవర్మచే మాధవ రాజను బాలుడెవరు, ఏ సామంత వంశంనుండి దత్తస్వీకారం చేసికొనబడలేదు.[140] అతడు విష్ణుకుండిన సామ్రాజ్య నిర్మాత, ఏకాదశాశ్వమేధియైన మాధవవర్మ మహారాజే!

అయితే, మొదటి తుమ్మలగూడెం శాసన ప్రదాతను, అతని పూర్వులను ఏకాదశాశ్వమేధియైన మాధవవర్మ మహారాజుకంటె ముందు తరాలవారని భావించి, విష్ణుకుండిన వంశానుక్రమాన్ని నిర్మించిన పలువురు చరిత్రకారులు పాలమూరు శాసనంవలన తెలియవస్తున్న వంశ, కాలానుక్రమ వివరాలను త్రోసిరాజనలేకపోయారు. డా. రామారావుగారి తర్వాత వారి సిద్ధాంతాలు ప్రకటింపబడినాయి.

డా. నేలటూరి వెంకటరమణయ్య[141] గారు శాసనంలోని విక్రమహేంద్రుని, మొదటి విక్రమేంద్రవర్మగా భావించి, పాలమూరు, మొదటి ఈపూరు శాసనాలవలన తెలియవస్తున్న రాజ పరంపర, తేవారు ప్రాంతంలో పరిపాలించే వేరొక విష్ణుకుండిన శాఖగా నిర్ణయించారు. విక్రమహేంద్రుని రెండవ విక్రమేంద్ర వర్మతో నేకీకరించడానికి క్రీ. శ. 617లో రెండవ పులకేశి దండయాత్ర, తత్పూర్వం వేంగి దుర్జయుల పరిపాలనలో నున్నట్లు కన్పిస్తున్న శాసనాధారాలు ఆయన ననుమతించలేదు.[142] అందుచేత క్రీ. శ. 546లోనే పాలమూరు శాసన ప్రదాత అయిన (నాలుగవ) మాధవవర్మ రాజ్యపాలన ప్రారంభించి క్రీ. శ. 594వరకు పాలించినాడని; క్రీ. శ. 570 వరకు పరిపాలించిన రెండవ విక్రమేంద్ర వర్మకు, అతని తండ్రియైన ఇంద్రవర్మకు సమకాలికంగా నాలుగవ మాధవవర్మ పరిపాలించినాడని ఆయన నిర్ణయించారు. నాలుగవ మాధవవర్మకు త్రివరనగరంతో గల సంబంధాన్నిబట్టి అతడు ప్రారంభంలో తేవారు ప్రాంత పరిపాలకుడని; "దశశత సకలధరణీతల నరపతి" యన్న బిరుదునుబట్టి అతడు క్రీ. శ. 570 తర్వాత

వేంగి నాక్రమించుకొని యుంటాడని ఆయన నమ్మకం[143] ఆయన నిర్ణయించిన వంశ, కాలానుక్రమణికలీ విధంగా ఉంటాయి:[144]

ఇంద్రవర్మ క్రీ. శ. 358–383
|
మొదటిమాధవవర్మ క్రీ. శ. 383–408
|
మొదటి గోవిందవర్మ క్రీ. శ. 408–445
|
రెండవ మాధవవర్మ క్రీ. శ. 445–482

- దేవవర్మ
  - మూడవ మాధవవర్మ క్రీ. శ. 482–527
- మొదటి విక్రమేంద్ర (విక్రమహేంద్ర) వర్మ
  - ఇంద్రభట్టారకవర్మ క్రీ. శ. 529–556
    - రెండవ విక్రమేంద్రవర్మ క్రీ. శ. 556-570
  - గోవిందవర్మ
    - నాలుగవ మాధవవర్మ క్రీ. శ. 546–594
      - మంచన్న భట్టారకుడు

క్రీ. శ. 594 తర్వాత 617లో జరిగిన పులకేశి దండయాత్రవరకు వేంగిలో దుర్జయులు పరిపాలిస్తున్నట్లు ఆయన భావించినారు.

డా. శంకరనారాయణన్[145] కూడ పై విధంగానే విష్ణుకుండిన వంశక్రమ నిర్మాణంచేసి, మరొక విధమైన కాలానుక్రమణికతో దానిని సమర్థించుకొన్నారు. రెండు పాలమూరు శాసనాల నడిమికాలం సుమారు 25 సంవత్సరాలన్న నమ్మకంతో, ఆయన విష్ణుకుండిన శాసనం క్రీ. శ. 612లో నీయబడినట్లు నిర్ణయించారు.[146] తత్ప్రదాత అయిన (నాలుగవ) మాధవవర్మ రాజ్యకాలం క్రీ. శ. 562–63 నుండి 611-12 వరకునని, అందుచే క్రీ. శ. 555–570 సంవత్సరాల మధ్య పరిపాలించిన రెండవ విక్రమేంద్రవర్మ కతడు మనుమడు కాజాలడని శంకరనారాయణన్ గారి అభిప్రాయం. అందుచేత ఆయన విక్రమహేంద్రుని మొదటి విక్రమేంద్రవర్మగా ఆయన గుర్తించారు.[147] కాని, ఆయన మొదటి ఈపూరు శాసన ప్రదాత అయిన మాధవవర్మను పాలమూరు శాసన ప్రదాత అయిన మాధవవర్మకంటె భిన్నవ్యక్తిగా, ఉభయులకు త్రివరనగర భవనగత యువతులతోగల సంబంధాలను, హిరణ్యగర్భ మహాదానం చేసినట్లు, సూచించే బిరుదులు సమానమైనంత మాత్రాన వారిరువురు నొకరుకాదని ఆయన నిర్ణయం.[148] మొదటి ఈపూరు శాసన ప్రదాత రెండవ మాధవవర్మగాను, పాలమూరు శాసన ప్రదాత నాలుగవ మాధవవర్మగాను, ఆయన అభిప్రాయం. ఆ రెండు శాసనాల భాషా, లిపి లక్షణాలయందు తీవ్ర వ్యత్యాసం[149] ఆయన నిలా నిర్ణయింపజేసినాయి. పాలమూరు శాసనంలోని "విక్రమాదాప్త భూరిభూః" అనే సమాసం వలన, నాలుగవ మాధవవర్మ తన తండ్రి గోవిందవర్మనుండి కాక, రెండవ విక్రమేంద్రవర్మనుండి రాజ్యం పొందినాడని; అతని తండ్రి కేవలం "విక్రమాశ్రయ" బిరుదాంకితుడైన ఒక సామంతుడు, ఇంద్రభట్టారకునివెంట పోరాటాలకు వెళ్ళి, తన యుద్ధనైపుణ్యంతో ఆ బిరుదు సంపాదించి యుంటాడని ఆయన ఊహ.[150] ఆయన సూచించిన విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికల[151] స్వరూపమిది:

ఇంద్రవర్మ క్రీ. శ. 375–400
|
మొదటి మాధవవర్మ క్రీ. శ. 400–422
|
మొదటి గోవిందవర్మ క్రీ. శ. 422-462

- దేవవర్మ
  - మూడవమాధవవర్మ
- మొదటి విక్రమేంద్రవర్మ క్రీ. శ. 502–507
  - ఇంద్రభట్టారకవర్మ క్రీ. శ. 527–555
    - రెండవ విక్రమేంద్ర (భట్టారక)వర్మ క్రీ. శ. 555–572
  - రెండవ గోవిందవర్మ
    - నాలుగవ మాధవవర్మ క్రీ. శ. 564-612
- మంచన్న భట్టారకుడు

VI పాలమూరు శాసన ప్రాధాన్యత పునర్విమర్శ

పై పరిశీలన వలన మాత్రం సాక్ష్యాధారాలయిన తుమ్మలగూడెం శాసనాలకు, పూర్వ సాక్ష్యాధారమయిన పాలమూరు శాసనానికి మధ్యగల తీవ్రభేదాలు చరిత్రకారులను తికమకచేస్తూ, విష్ణుకుండిన చరిత్రను కల్లోలపరుస్తున్నట్లు స్పష్టమవుతున్నది. చాల కాలం క్రితమే డా. డి. సి సర్కారుగారు సహేతుకంగా ఖండించినా, ఏకాదశాశ్వమేధ క్రతుసహస్రయాజులైన ఇద్దరు మాధవవర్మలున్నట్లు భావించక తప్పడంలేదు. డా. శంకరనారాయణన్‌గారు పాలమూరు, మొదటి ఈపూరు శాసన ప్రదాతలను ప్రత్యేకీకరించడంతో ఈ అసహజవాదం మరింత అతివేల మవుతున్నది. పాలమూరు శాసన భాషా, లిపిలక్షణాలను సరిగా గుర్తించినా, వాటి నాధారంగా ఆయన చేసిన నిర్ణయం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

1976 డిసెంబరులో రామచంద్రపురంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెసు–ద్వితీయ సమావేశంలో, పాలమూరు

శాసనం వలన విష్ణుకుండిన చరిత్రలో నేర్పడుతున్న క్లిష్టతల గూర్చి నేనొక పరిశోధనా వ్యాసం సమర్పించాను.[152] ఆ వ్యాసంలో పొలమూరు శాసనం విష్ణుకుండిన మాధవవర్మకంటె, వాస్తవంగా విష్ణుకుండిన సామ్రాజ్యాస్తమయం తర్వాత ''తయారుచేయబడిన'' కృతక (Spurious) శాసనమని, ఆ వంశ చరిత్రకు విశ్వసనీయమైన సాక్ష్యాధారం కాదని ప్రతిపాదించాను. తర్వాత పరిశీలనలు నా వాదాన్ని మఱింత బలపరుస్తూ, మఱికొన్ని అంశాలను బహిర్గతం చేశాయి. ఆ వ్యాసంలో పేర్కొన్న, తర్వాత పరిశీలనలవలన అంశాలను సంక్షిప్తంగా నిచట పొందుపరచడం యుక్తమని భావిస్తాను.

1. మాధవవర్మ లెందఱు ?

మొదటి ఈపూరు, పొలమూరు శాసన ప్రదాత అయిన మాధవవర్మను, రామతీర్థం,చిక్కుళ్ళ శాసనాలలో ప్రశంసించబడిన మాధవవర్మనుండి ప్రత్యేకీకరించడానికి; తద్వారా ఏకాదశాశ్వమేధ క్రతు సహస్రాయాజులైన ఇద్దరు మాధవవర్మల కల్పనకు ప్రబల కారణమైనది—రెండు పొలమూరు శాసనాలు ఒక తరమో, లేక అర్థశతాబ్దమో కాలాంతరం కలవనే ప్రగాఢ విశ్వాసం. దీనికి రెండు సమర్థనలున్నాయి ఒకటి, మొదట చెప్పిన శాసన ప్రదాతకు తర్వాత శాసనాలలో కన్పించే మాధవవర్మకు బిరుద ప్రశస్తులలోని వ్యత్యాసం.[153] రెండు, రెండవ విక్రమేంద్రవర్మ క్రీ. శ. 570, లేదా 572 వరకు మాత్రమే పరిపాలిస్తే, ఆ తర్వాత క్రీ. శ. 617లో రెండవ పులకేశి దండయాత్రవరకు ఆంధ్రదేశ చరిత్ర ఇదమిత్థమని చెప్పరాని శూన్యకాలంతో ఏర్పడుతుందన్న వాదను.[154] ఈ రెండు అంశాలను ఒకదాని తర్వాత ఒకటి పరిశీలించడం అవసరం.

ప్రథమంగా మొదటి ఈపూరు, పొలమూరు శాసనాల ప్రదాతకుగల ప్రత్యేక బిరుదాలను పరిశీలిస్తే, అవి మాధవవర్మల ప్రత్యేకీకరణకు తోడ్పడవని స్పష్టమవుతుంది ఇంద్రవర్మ, రెండవ విక్రమేంద్రవర్మలా బిరుదాలను తమ శాసనాలలో మాధవవర్మను ప్రశంసిస్తూ, బుద్ధిపూర్వకంగా వదలివేశారని గ్రహించవచ్చు. రెండవ విక్రమేంద్రవర్మ శాసనాలలో మాధవవర్మ అనేక ''వివిధ పృథు గురు వర శత సహస్రయాజి''యై ''క్రతు వరానుష్ఠా తాధిష్ఠ పరమేష్ఠి''గా కీర్తింపబడినపుడు అందు హిరణ్యగర్భ మహాదానం పరితూగదని స్పష్టమవుతుంది. ఆ దానం అధమ కులజుల నుత్తమ కులజులుగా గుర్తింపజేసేందు కుద్దేశింపబడింది.''[155] అనేక వివిధక్రతువుల నిర్వహణతో పరమేష్ఠిత్వాన్నందిన మహారాజును గూర్చి వర్ణిస్తూ, అతడు హిరణ్యగర్భ మహాదానం చేసినట్లు ప్రస్తావించడం, విద్వత్కవులైన వారిని ప్రశంసిస్తూ వారికి అక్షరమాల పూర్తిగా తెలుసునని చెప్పినట్లుంటుంది. ఆ దాన మహత్త్వంతో విష్ణుకుండిను లున్నతకులజులై, అనేకానేక క్రతునిర్వహణ కర్తృలై యుండగా, ఆదాన ప్రస్తావన వారి పూర్వపుస్థితిని జ్ఞప్తిచేస్తుంది. మాధవవర్మ అటువంటి ఉత్తమ కులస్థితిని స్వకర్మానుష్ఠానంచేత పొందినాడు. కనుక తన కాలంలో అది ఘనకార్యమే !

అలాగే రెండవ విక్రమేంద్రవర్మ శాసనాలలో మాధవవర్మ, మొదటి ఈపూరు, పొలమూరు శాసనాలలో కంటె ననేక వివిధ క్రతువుల నధిక సంఖ్యలో చేసినట్లు కన్పించేమాట వాస్తవమే! అయితే, అది మాధవవర్మల ప్రత్యేకీకరణకు తోడ్పడదు. పైన చెప్పినట్లే, రెండవ విక్రమేంద్రవర్మ మాధవవర్మను ''పరమేష్ఠి'', ''దేవాతిదేవుడ''ని వర్ణిస్తూ, తదనుగుణంగా అనేక పృథువర గురు శత సహస్రయాజిగా, వేయని క్రతువులను సైతం చేసినట్లు వర్ణించినాడని గ్రహించవచ్చు.[156] అసలు మాధవవర్మ నామధేయులైన విష్ణుకుండినరాజులను వారుచేసిన వివిధయాగాలను దృష్టిలో నుంచుకొని గుర్తించపూనుకొంటే, చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలోని మాధవవర్మ లొకరు కారేరు! రామతీర్థం, రెండవ ఈపూరు శాసనాలలోని మాధవవర్మలు చిక్కుళ్ళ, తుండి, తుమ్మలగూడెం శాసనాలలోవలె బహుసువర్ణ, పౌండరీక, పురుషమేధ, రాజసూయాది క్రతువులు చేసినట్లు చెప్పబడలేదు. అయినా, హుల్ట్జ్ దొర గారి నుండి, నేటివరకు చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలోని మాధవవర్మలు వేర్వేరుగా ఏ చరిత్రకారునిచే భావించబడలేదు.

కనుక, ఏకాదశాశ్వమేధ, క్రతు సహస్రయాజులైన మాధవవర్మలను ''హిరణ్యగర్భ ప్రసూత'' బిరుదమూ, ఇతర క్రతువుల వివరాలు వేరుపరచలేవు అలాగే త్రివరనగర భవనగతుల యువతుల ప్రశంసను గూర్చిన బిరుదం మాధవవర్మలను ప్రత్యేకీకరించలేదు.

త్రివర నగరమనే పేరుగల ఏ దేశపు రాజధానినో మాధవవర్మ జయించినాడని, అది కళచురి రాజుల ప్రధాననగరమైన త్రిపురి (తేవార్) కావచ్చునని,[157] కోసల రాజయిన మహాశివగుప్త తీవర దేవుని రాజధానియై, ఆ రాజుపేర త్రివర నగరంగా విష్ణుకుండిన శాసనాలలో ప్రస్తావించబడిందని,[158] చరిత్రకారులలో తీవ్రమైన మత భేదాలున్నాయి. మొత్తంమీద చరిత్రకారులలో బహుళంగా, మాధవవర్మ త్రివర నగరాన్ని జయించినాడని, అచటి రాచకన్యను వివాహమాడినాడని అభిప్రాయం నెలకొని ఉంది. ఆ మాధవవర్మ మొదటి ఈపూరు, పొలమూరు శాసనాల ప్రదాత యని, చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలోని సనామధేయుడుకాడని, ఆచార్య నీలకంఠ శాస్త్రి, ఓరుగంటి రామచంద్రయ్య[159] ప్రభృతుల అభిప్రాయం. డా.శంకరనారాయణన్ గారి అభిప్రాయంలో అనేక ఏకాదశాశ్వమేధులే కాక, త్రివర నగర యువతులతో రాసక్రీడలాడిన అనేక మాధవవర్మ లున్నట్లు అర్థమవుతున్నది.

త్రివర నగరాన్ని గూర్చి, మాధవవర్మ కచటి యువతీజనాన్ని చర్చించేందుకు ఇది తగిన సందర్భం కాదు. కాని ఫలితాంశమేమంటే త్రివర నగరమనే పేరుగల నగరమేదీ లేదు, అచటి రాచకన్యలను మాధవవర్మ వివాహం చేసుకొనలేదు. అందుచే ఆ బిరుదు కలవారి, లేనివారిమధ్య ఎట్టి వివక్షతను చూపనవసరం లేదు. ఆ బిరుద వాక్యాన్ని మూడు ప్రధాన రాజ్యాల రాజధానులు మాధవవర్మచే

జయించబడి, ఆ రాజ్యలక్ష్ములు మాధవవర్మను వరించినట్లు అర్థం చేసికొనడం యుక్తం.[160] ఇంద్రవర్మ రెండవ విక్రమేంద్రవర్మలు తమ శాసనాలలో మాధవవర్మ పాదాలు సకలమహీపాలుర శిరోభూషణాలలోని మణి కిరణాలచే ప్రకాశించినవని, నయ పరాక్రమాది గుణ సందోహంచేత ఆ రాజు అన్య రాజవంశాలను సాత్మీభూతం చేసికొని పృథివీపతి పదాన్నందినాడని అతిశయోక్తులతో వర్ణించడం "త్రివర నగర భవనగత..." ఇత్యాది బిరుదానికి ప్రత్యామ్నాయమని గ్రహించవచ్చు.

అదే విధంగా స్మృతి మతి బలధైర్యాది గుణ గణ వర్ణన మొదటి ఈపూరు, పొలమూరుశాసనాల ప్రదాతను చిక్కుళ్ళ రామతీర్థం శాసనాలలోని మాధవవర్మ నుండి వేరు చేయజాలవు. అటువంటి గుణగణవర్ణన సామాన్యంగా రాజులు అతిశయోక్తులతోకాక నిరాడంబరంగా వర్ణించుకొన్న తొలి కాలపు శాసనాలలో కన్పిస్తాయి. కాలక్రమేణ అతిశయోక్తులతో పదాడంబరంతో వంశ పూర్వులను "దేవాతి దేవుడ"ని వర్ణించే సమయాన ఈ గుణగణకీర్తన మనావశ్యకం కద! ఈపూరు, పొలమూరు శాసనాలలో ఆ బిరుదాలు కన్పించినంత మాత్రాన తత్ప్రదాతలే అట్టిగుణయుతులని; చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలో కన్పించనంతమాత్రం అందలి మాధవవర్మ కట్టి గుణాలు లేవని అర్థం చేసికొనడానికి వీలులేదు.

కనుక, ఏకాదశాశ్వమేధ క్రతు సహస్రయాజులయిన మాధవ వర్మల నందఱ నొకరిగా భావించినపుడే యుక్తియుక్తమయిన విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణిక లేర్పడతాయి. అయితే, పొలమూరు శాసనం మాత్రం తద్భాష, లిపి లక్షణాల వలన ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి, తత్ప్రదాతను ప్రత్యేకీకరిస్తుంది. అయితే, మిగిలిన అంశాలన్నిటా సరిపోయి, అన్ని శాసనాలు సమర్థిస్తున్నా, ఒక్క పొలమూరు శాసనం విరుద్ధ సాక్ష్యాన్నియ్యడాన్నిబట్టి ఆ శాసన ప్రామాణికత శంకాస్పదమవుతుంది. అంతేకాని, ఏకాదశాశ్వమేధ క్రతుసహస్రయాజులైన ఇద్దరు విష్ణుకుండిన మాధవవర్మలు — ఇద్దరూ గోవిందవర్మ నామధేయుల కుమారులే ఉండినారన్న అసహజవాదాన్ని శుష్కతర్కం సాయంతో సమర్థించబూనడం[161] సబబుకాదు.

2. పొలమూరు శాసనం : ప్రామాణికత

చరిత్రకారులు నేటివరకు మొదటి ఈపూరు, పొలమూరు శాసన ప్రదాత లొక్కరేయని భావిస్తున్నా[162] ఆ రెండు శాసనాల మధ్య లిపి, భాషలలో తీవ్ర వైవిధ్యమున్నది. మొదటి ఈపూరు శాసనం చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాల కంటె నించుక పూర్వమైనది, నాటికి తగినట్లు చక్కని అక్షర విన్యాసంతో చెక్కబడింది. స్ఫుటమైన, నిరాడంబరమైన రాజప్రశంసలు ఆ శాసన కాలాన్ని సమర్థిస్తున్నాయి. కాని పొలమూరు శాసనం చిక్కుళ్ళ, తుండి మొదలైన శాసనాల కంటె తర్వాత కాలానికి చెందినట్లు, అశ్రద్ధతో చెక్కబడిన అక్షరాలతో కన్పిస్తుంది కొన్ని కొన్ని అక్షరాలు తూర్పు చాళుక్యుల పొలమూరు శాసనం కంటె తర్వాత కాలానికి చెందినవిగా కన్పిస్తాయి. లిపి లక్షణాలనుబట్టి ఆ శాసనం ఏడు, ఎనిమిది శతాబ్దాలకు చెంది కొన్ని తూర్పు చాళుక్య, తూర్పు గంగ రాజుల శాసన లిపితో పోలి ఉన్నట్లుగా కన్పిస్తుంది. భాషా విషయికంగా చూస్తే విష్ణుకుండిన పొలమూరు శాసనంలో రాజ ప్రశస్తులు, అదే రాజుల గూర్చి ఇతర విష్ణుకుండిన శాసనాలలోని ప్రశస్తులతో సరిపోలవు, లేదా, తర్వాత కాలపు ప్రశస్త్యర్థాలను ధ్వనిస్తాయి అంతేకాక, అది విష్ణుకుండిన శాసనాలన్నిటిలో దీర్ఘతరమైనది;[163] బహు శబ్దాడంబరంతో మధ్య మధ్య శ్లోక రూపమైన, సుదీర్ఘమైన రాజప్రశంస కలది. అటనట అర్థస్పష్టతలేని వాక్యాలు[164] వికృతాక్షరాలు ఆ శాసన ప్రామాణికతకు భంగకరంగా కన్పిస్తాయి.

గోవిందవర్మ ఈ శాసనంలో ప్రశంసించబడిన తీరును చూస్తే—అన్ని విష్ణుకుండిన శాసనాలలో స్ఫురించే దాన ధర్మ తత్పరత, పరిపాలనలోని ప్రజారంజకత్వం[165] ఈ శాసనంలో లుప్తమైనట్లు స్పష్టంగా గోచరిస్తుంది.[166] అంతేకాక, ఈ శాసనంలో గోవిందవర్మ ప్రశంస వ్యక్తినామాలను మినహాయించి చదివితే, తూర్పు చాళుక్య పొలమూరు శాసనంలోని మక్కికి మక్కి నకలు.[167] పరనరపతు లనేకులను పాదాక్రాంతుల జేసికొన్న వానికి "మహారాజ" బిరుదం లేకుండటం విచిత్రం. అతడు కేవలం సామంత మాత్రుడై విక్రమాశ్రయునిగా ప్రఖ్యాతి చెందినాడనో రాజ్యపాలన చేయలేదనో వ్యాఖ్యానించడం చరిత్రకారుల ఉపజ్ఞతకు చిహ్నమేమోకాని, వాస్తవమని విశ్వసించరానిది. ఈపూరు మొదటి శాసనంలో ఈ రాజు "మహారాజ"నే పేర్కొనబడినాడు.

ఈ శాసనంలోని విక్రమహేంద్రుని గూర్చి విచారిస్తే— అతనినే విక్రమేంద్రవర్మగా గ్రహించినా, అతనికి, అతని కుమారునిగా చెప్పబడిన గోవిందవర్మకు రాజోచిత బిరుదాలుండి తీరాలి.[168] వారికట్టి బిరుదాలు లేకపోవడం శాసన పాఠంలోని లోపమే కాని, మరేవిధంగాను, సమర్థనీయంకాదు నూతనంగా స్వతంత్ర పాలకులైన రాజులు తమ పూర్వులను గూర్చి ప్రశంసించేటప్పుడు, వారస్వతంత్రులైనా, "మహారాజ" బిరుదాలతో సమ్మానించడం కద్దు.[169] అలాంటప్పుడు మాధవవర్మ దాయాదవంశానికి చెంది, సింహాసనం కొరకు మూలవంశంతోపోరాడి, సగర్వంగా సార్వభౌముడనని ప్రకటించుకొంటూ, తన పూర్వ రాజులను మహారాజులుగా పేర్కొనకపోవడం ఆలోచనీయాంశం.[170]

ఇక మాధవవర్మ బిరుదాలను పరిశీలిస్తే అతని ప్రశంస మొదటి ఈపూరు శాసనంలో సౌమ్యగంభీరంగా ధ్వనిస్తే, పొలమూరు శాసనంలో దురహంకార పూరితమైన ప్రగల్భంగా, మధ్యయుగీన రాజుల ప్రశంసలను పోలి ఉంటుంది ఈపూరు మొదటి శాసనంలో "స్మృతి మతి బల సత్వ ధైర్య వీర్య వినయ సంపన్ను"డనని చెప్పుకొనగా, పొలమూరు శాసనంలో "అనన్య నృపతి సాధారణ దాన మాన దయాధర్మ ధృతిమతికాంతి శౌర్యౌదార్య గాంభీర్య ప్రభృత్యనేక గుణసంపజ్జనిత రయసముత్థిత భూమండల వ్యాపి

విపులయశుడ''నని పదాడంబరత్వంతో, భావ ప్రాగల్భ్యంతో చాటుకొంటున్నాడు. మొదటి ఈపూరు శాసనంలో ''త్రివరనగర భవన గత పరమ యువతీ హృదయనందనుడ''ని చెప్పుకొనగా, పొలమూరు శాసనంలో ''త్రివర నగర భవనగత పరమ యువతీ జనవిహరణరతి'' వని యభివర్ణించుకొన్నాడు. ఇందులో ఈపూరు శాసనంలో కన్పించని దురుసుదనం, అసంస్కృత ధోరణి వ్యక్తమవుతున్నాయి.

మాధవవర్మ వర్ణనలో పొలమూరు శాసనం మొదటి ఈపూరు శాసనంలో ధ్వనించని సార్వభౌమత్వ ధోరణి స్ఫురిస్తుంటుంది. ''సర్వభూత పరిరక్షణ చంచు''వని ఆ శాసనం చెప్పడం, తుండి శాసనంలోని ''సర్వమేధా వ్యాప్త సర్వభూత స్వారాజ్యస్య'' యని చెప్పిన ధోరణిని తలపిస్తుంది. మాధవవర్మచే సర్వమేధయాగం చేయబడిందని నమ్మడాని కాధారం లేదని పైన వివరించబడిన విషయాన్నిచట జ్ఞప్తి చేసికొనాలి. అలాగే ''ఉద్వహమ్నరు భారిభాతి విక్రమాదాప్త భూరిభూ''[171] అని చెప్పుకొన్న తిరు తుమ్మలగూడెం రెండవ శాసనంలో ''భువోభర్తుః''[172] అని, చాళుక్యుల శాసనాలలోని ''పృధ్వీవల్లభ'' బిరుదాన్ని జ్ఞప్తికి తెస్తుంది.

మాధవవర్మ ఖానాపూరు శాసనంలో సార్వభౌముడని చెప్పబడినాడు. కాని, ఆంధ్రదేశంనుండి ఆతడిచ్చిన ఈపూరు శాసనంలో అటువంటి ధ్వని లేకపోవడం, ఖానాపూర్ శాసనం కూడ కృతకమని చరిత్రకారు లభిప్రాయపడడంచేత,[173] పొలమూరు శాసనంలోని సార్వభౌమార్థక బిరుదాలు,మాధవవర్మ కాలానికి సమర్థనీయం కాలేకపోతున్నాయి. ఈ సందర్భంలో పొలమూరు శాసనంలో మాధవ వర్మకున్న రెండు బిరుదులను గూర్చి కొంచెం వివరించవలసిన అవసరం ఉన్నట్లు తోస్తుంది.

1. జనాశ్రయ బిరుదం.[174] పొలమూరు శాసనంలో మాధవ వర్మ, అతని గోవిందవర్మ వరుసగా జనాశ్రయ, విక్రమాశ్రయ బిరుదాలు కల్గియున్నట్లు చెప్పబడినారు. పూర్వచరిత్రకారుల మతాను సారం ఈ బిరుదాలు, ముఖ్యంగా జనాశ్రయ బిరుదం పొలమూరు శాసన ప్రదాతను, ఆ బిరుదంలేని మిగిలిన మాధవవర్మల నుండి వేరుచేస్తుంది. కాని, వాస్తవంగా ఆ బిరుదం ఆ శాసనం చాల తర్వాత కాలంలో కృతకమైందన్న వాదాన్ని బలపరుస్తుంది. మిగిలిన విష్ణుకుండిన శాసనాలలో ఈ బిరుదులు ప్రస్తావించబడక పోవడం, ముఖ్యంగా రెండవ విక్రమేంద్రవర్మ తన వంశపూర్వుల ననేక అత్యుక్తులతో వర్ణిస్తూ యీ బిరుదులను వదలివేయడం వలన, ఆ రాజులకు వాస్తవంగా ఆ రాజులకా బిరుదాలు లేవని యనుమానం కల్గుతున్నది. ఇవి ఉపమానాలు (Surnames) కావడాన మరే యితర ప్రత్యామ్నాయ పదాలతో సూచించరానివిగా భావించాలి. ఆలోచించగా, రెండవ తుమ్మలగూడెం శాసనంలో ఇంద్రవర్మకు, అతని కుమారుడైన రెండవ విక్రమేంద్రవర్మకు కల సత్యాశ్రయ, ఉత్తమాశ్రయ బిరుదాల ననుసరించి, పొలమూరు శాసనాన్ని తయారుచేసినవారు అటువంటి ''ఆశ్రయాంత'' బిరుదాలు మాధవవర్మకు, గోవిందవర్మకు కల్పించారని సహేతుకంగా నిర్ణయించవచ్చు.

2. దశశత సకల ధరణీ తలనరపతిః—[175] ఈ కావ్యానికి కల వాస్తవార్థ ప్రాధాన్యతలు చరిత్రకారులలో తర్జన భర్జనలకు దారి తీశాయి. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు[176] ''దశశత సకల ధరణీతల'' మంటే వేంగీదేశమని, అనేక మధ్యయుగ శాసనాలలో ''వేంగిసహస్ర''మని ఈ దేశం పేర్కొనబడిందని,[177] అందుచే ఈ బిరుదం విష్ణుకుండినులు వేంగీమండలంపై తమ ప్రాబల్యం సూచిస్తూ ధరించినారని వ్రాశారు. అంతట చరిత్రకారులు సాధారణంగా ఈ సూచన నామోదించి అనుసరించారు. కొందరు వేంగీమండలాన్నాక్రమించిన మొదటి విష్ణుకుండిరాజు మాధవవర్మయని[178] మరికొందరు తేవారు ప్రాంతంనుండో[179] లేదా మరే ప్రాంతంనుండో[180] వేంగీ మండలాన్నాక్రమించినాడని భావిస్తారు. కాని తేవారు ప్రాంతంలో నేకాలంలో గాని విష్ణుకుండినుల పరిపాలన సాగినట్లు చెప్పడానికెట్టి ఆధారములేదు. ఆ నిర్ణయం త్రివరనగరం తేవారన్న భ్రమపై నాధారపడింది.

పై సమాసం దశశత ధరణీతల మంటే వేంగీ మండల మన్న అర్థం రావచ్చు. కాని దశశత సకల ధరణీతలమంటూ చెప్పినప్పుడు నాటికీ ఏకాదశాశ్వమేధయాజియైన మహారాజు వేయి గ్రామాలతో కూడిన మండలాన్ని (పూర్తిగా!) పరిపాలించినాడని అర్థంచేసికొనడం యుక్తంగా కన్పించదు. ఆ దేశాన్ని మొదట ఆక్రమించినవాడు మాధవవర్మ మహారాజని, అది పొలమూరు శాసన ప్రదానానికి ముందుగా ననడంలో కూడ అంగీకరించదగిన భావం తోచదు. మాధవవర్మ తన 37వ రాజ్య సంవత్సరంలో గుద్దవాది విషయంలో స్కంధావారగతుడై[181] ఈపూరు శాసనాన్ని ప్రదానంచేసినప్పుడు, నాటికి వేంగీదేశాన్ని జయించలేదని, అందుకై మరల 48వ రాజ్య సంవత్సరంలో మరొకమారు దండెత్తి వెళ్ళినాడని భావించడంలో సరియైన అర్థమున్నట్లు కన్పించదు. అందుచే ఆ శాసనం పేర్కొంటున్న రాజ్యసంవత్సరం కూడ విశ్వసనీయమైంది కాదు. పొలమూరు గ్రామదానం కూడ ఈపూరు శాసన సమయంలో 37వ లేక 38వ రాజ్య సంవత్సరంలోనే జరిగియుంటుందని సహేతుకంగా నిర్ణయించవచ్చు. అప్పటికే మాధవవర్మ వేంగీ దేశాధీశుడై యుండి యుండవచ్చును.[182] కాని ఈపూరు శాసనమలా చెప్పకపోవడం గమనించదగిన అంశం.

సరిగా యోచిస్తే, దశశత సకల ధరణీ తలమనగా, దశశత (యోజన) పర్యంతమైన సకల ధరణీ తలమనే వాస్తవార్థం స్ఫురించగలదు. రాజశేఖరుని కావ్యమీమాంస, ఆసేతు శీతాచలమైన భారతదేశం వేయి యోజనాల పర్యంతమైన ''చక్రవర్తిక్షేత్రం''గా వ్యవహృతమవుతున్నట్లు తెలియవచ్చు.[183] ఇటువంటి భావద్యోతక సమాసం పొలమూరు శాసన కాలాన్ని మధ్యయుగానికి తెస్తుంది. అయితే కౌటిల్యుని అర్థశాస్త్రంకూడ భారతావని వేయి యోజనాల

(మిగతా 63వ పేజీలో)

కలగూరగంప

"కథకులుగా శ్రీ అందే నారాయణస్వామి"

ఆధునిక సాహిత్యంలో తెలుగు కథకు విశిష్టమైన స్థానం ఉంది. కథాసాహిత్యం తెలుగు వాళ్ళకు కొత్తేమీగాదు. తరతరాల మన చరిత్రను తరిచి చూసుకుంటే ఎన్నో కథలు ఎన్నెన్నోరకాలుగా మనకు అనుశ్రుతంగా వినబడుతూ వుంటాయి. అందుకే తెలుగు దేశం కథలకు కాణాచియనుట. అయితే ఆధునిక కాలంలో కథా రచయితలు అరుదుగా ఉన్నారనే చెప్పాలి. ఈ కథా రచయితలను స్థూలంగా మూడు రకాలుగా పేర్కొనవచ్చును. రాశిలో ఎక్కువా తక్కువ ప్రమేయం లేక వాసిగాంచిన కథా రచయితలు. రాశిలో ఎక్కువగా వుండి వాసిగాంచిన కథా రచయితలు. రాశిలో ఎక్కువా లేక తక్కువగా వుండి ఏ మాత్రం వాసికెంచని కథారచయితలు. వీరిలో రెండవ రకమునకు చెందిన కథా రచయితలు శ్రీ అందే నారాయణస్వామిగారు.

శ్రీ నారాయణస్వామిగారు సుమారు ఏనభై కథలు వ్రాశారు వాటిలో మూడు వంతులకు పైగా చెప్పుకోదగిన కథలున్నాయి. నారాయణస్వామిగారి కథలు ఉత్తమశ్రేణికి చెందినప్పటికి వాటికి తగిన ప్రచారం లేకపోవడంతో నారాయణస్వామిగారు తెలుగు కథా ప్రపంచంలో మరుగున పడిపోయారు ఆధునిక కథా సాహిత్యంలో నారాయణస్వామిగారి కృషిని సాహిత్య విమర్శకులు గుర్తించక పోవడం తెలుగు కథకే చిన్నతనం. ఈ వ్యాసంలో నారాయణస్వామి గారి జీవితాన్ని, సాహిత్య జీవితాన్ని రేఖామాత్రంగా పరామర్శించటానికి ప్రయత్నం చేస్తాను.

శ్రీ నారాయణస్వామిగారు 1908 లో జన్మించారు. ప్రస్తుతం స్వస్థలమైన మంగళగిరిలోనే ఉంటున్నారు. దైవికంగా వీరికి సుమారు 40 సంవత్సరాలకు పూర్వమే దృష్టి మాంద్యం ఏర్పడింది. వ్యక్తిగతంగా వారికి దురదృష్టము సంభవించినప్పటికీ, తెలుగు కథా సాహిత్యానికి మాత్రం చాలా లాభం కలిగిందనే చెప్పాలి. కారణం వీరి కథలన్నీ వీరికి దృష్టి మాంద్యం ఏర్పడ్డాక వచ్చినవే.

[1]కొద్ది వయసులోనే నాకు యిటీవల దైవికంగా దృష్టి మాంద్యం కలిగింది. ఎన్ని చికిత్సలు చేయించినా చదవటానికీ, వ్రాయటానికీ కుదరలేదు. జీవితంలో అశాంతి ఏర్పడ్డది. మహాత్ములను కొందరిని సందర్శించాను. వారి వచనామృతంవల్ల నా మనస్సుకు కొంత శాంతి కలిగింది. చేతులకు పని తప్పిపోయి విశ్రాంతి చిక్కింది.

మనసు ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యలను తలచుకొని విచారపడ్డాను. అదివరకు కథలు వ్రాసే అలవాటు కొంత ఉండటం చేత నా బుద్ధిని రచన మీదికి తిప్పి ఇట్లా కథలు చెప్పి వ్రాయించటానికి పూనుకున్నాను అని నారాయణస్వామిగారే స్వయంగా చెప్పుకున్నారు

[2]వీరికి దృష్టి మాంద్యం కలగకపూర్వం మొత్తం రెండు కథలను మాత్రం వ్రాశారు. ఒకటి "మొద్దు పంతులు" ఇది మద్రాసు నుంచి వెలువడే 'చిత్రగుప్త' అనే పత్రికలో అచ్చయింది. రెండవ కథ 'ప్రభాత'మనే పత్రికలో అచ్చయింది ఈ కథ పేరు గాని, ఇతర వివరాలుగాని తెలియరాలేదు. ఈ రెండు కథలు మినహాయిస్తే వీరి కథలన్నీ దృష్టి మాంద్యం కలిగాక వచ్చినవే.

శ్రీ నారాయణస్వామిగారు కథలను మాత్రమేగాక "ఇద్దరు తల్లులు," "కష్టసుఖాలు" అనే రెండు నవలలు, సుమారు ఆరు దాకా రేడియో నాటికలు, ఐదు రేడియో కథానికలుకూడా వ్రాశారు.

వీరి తొలి కథా సంపుటి[3] 'వ్యత్యాసాలు' 1940 లో అచ్చయింది. ఆ తరువాత నారాయణస్వామిగారు, వీరి గురువులైన శ్రీశ్రీశ్రీ శివ శంకరస్వామిగారు, శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి గారు, మరికొందరు మంగళగిరి పుర ప్రముఖులు కలిసి "సమరస గ్రంథమాల"ను స్థాపించి తద్వారా భారతి, ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక, ఆనందవాణి, తెలుగుస్వతంత్ర మొదలైన పత్రికలలో అచ్చయిన కథలను మూడు సంపుటాలుగా వెలువరించారు. అవి "స్నేహితుడు (1956)", "ఉపాసనా బలం (1957)" "కారుణ్యం (1958)." ఇంకా వివిధ పత్రికలలో అచ్చయి గ్రంథ రూపంలో రాని రచనలు సుమారు యాభైకి పైగా ఉన్నాయి. ఈ వ్యాసంలో గ్రంథరూపంలో వచ్చిన కథలను మాత్రమే పరామర్శించటం జరిగింది.

గ్రంథరూపంలో వచ్చిన మొదటి కథాసంపుటి 'వ్యత్యాసాలు.' ఇందులో మొత్తం మూడు కథలున్నాయి. అవి 'ప్రతిఫలం', 'పుత్ర సంతానం', 'పరివర్తనం'. మొదటి కథ 'ప్రతిఫలం'. దీనిలో ఇతివృత్తం శ్రీమంతుడు, వృద్ధుడు, కురూపి అయిన భర్త కిచ్చిన సుందర యువతి అనుభవించే అవస్థలూ, దారిద్ర్యంలోవున్నా కష్టాలకు కాలొడ్డుతూ, సంసార సాగరం సంతరిస్తూ, పరస్పర ప్రేమతో ప్రవర్తించే సమవయస్కుల దాంపత్యం చక్కగా వర్ణితము. కథలో కరుణరసం, గమనం హెచ్చిన కొలదీ కరుణరసం, పరాకాష్ఠకు చేరుకొని పాఠకులను కంట తడి తెప్పిస్తుంది. లోకంలో ఇటువంటి కష్టాలు కూడా ఉంటాయా ? అని పాఠకుడు నోటిమీద వేలు వేసుకోవాల్సిందే.

'పుత్ర సంతానం' రెండవ కథ. ఇందులో ఆడపిల్లల కంటే మగపిల్లల మీద తల్లి దండ్రులకుండే విపరీతానురాగము, మమకారంతో పెరిగే పిల్లలుచేసే ఆగడాలు, తోడు కోడళ్ళకూ, అత్తా కోడళ్ళకూ, తండ్రీ కొడుకులకూ, భార్యాభర్తలకూ మధ్య సంభవించే అంతః కలహాలు, సంభాషణలు, స్వాభావికముగా, చమత్కారంగా చిత్రితములైనవి.

ఇక చివరి కథ 'పరివర్తనం.' సంఘ సంస్కారము ఈకథలో అంతర్వాణి. పంచముడైన సూరదాసు సాధువర్తనము, దైవభక్తి, శాంత గుణము, భూతదయ. ఆచార్యులే అయినను మాధవాచార్యుల వారి మూఢభక్తి, పూర్వాచార పరాయణత్వము, పారుష్యము. కాంగ్రెసువాది అయిన కృష్ణశాస్త్రి సంఘసేవ, అస్పృశ్యతానిర్మూలనము, హరిజనోద్ధరణము విపులంగా వర్ణించబడినాయి. దైవ భక్తికీ, మంచికి కులంతో పనిలేదని చక్కని సందేశాన్ని అందిచ్చారు. ఈ కథా సంపుటికి ప్రముఖ సంఘ సంస్కర్తలు శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు పీఠిక వ్రాయడం విశేషం. ఈ కథా సంపుటికి 'వ్యత్యాసాలు' అనే నామము సార్థకంగా ఉన్నది. భాగ్యవంతులకూ బీదలకూ, సుఖవంతులకూ దుఃఖభాజనులకూ, గొప్పవారికీ తక్కువ వారికీ, మంచివారికీ చెడ్డవారికీ, పూర్వాచార పరాయణులకూ సంఘ సంస్కర్తలకూ, కొడుకులకూ కూతుళ్ళకూ ఉండే వ్యత్యాసము ఈ కథలలో కనిపిస్తుంది. ఈ కథలలో తెలుగుదనం ఉంది. తెలుగు నుడికారపు సొంపు స్వేచ్ఛగా వ్యావహారిక భాషలో అందిచ్చారు రచయిత.

''స్నేహితుడు'' కథల సంపుటిలో మొత్తం పదకొండు కథలున్నాయి. 'స్నేహితుడు', 'గాలిలో దీపం', 'వ్యత్యాసాలు', 'చేతులు కాలాక ఆకులు', 'శిల్పి', 'కొత్తమేడ', నువ్వుకాదూ?', 'జీవ కారుణ్యం', 'మడ్డిరకం', 'సృష్టితేడా', 'పుణ్యాత్మురాలు', మొదలగున్నవి. ఇందలి కథలన్నీ వైవిధ్యం కలవి. ఈ సంపుటిలోని కథలన్నీ దాదాపు గ్రామీణ జీవితంతో సంబంధం కలవి. వీటిలో 'నువ్వుకాదూ?' అనే కథ వస్తురీత్యా, శిల్పంరీత్యా చెప్పుకోదగిన కథ ఇందులో యితివృత్తం రైతు పశువుమీద ఆధారపడి జీవించును. అయినా వాటిని సరిగా మేపడు. కాని రామభజనలు చేయును. ప్రాణులయందు దయలేని భగవద్భక్తి భగవద్భక్తికాదు. ఈ విషయాన్నే రచయిత సూటిగా పాఠకుడి గుండెకు గురిచూసి కొడతారు. ఈ కథలో రచయిత కొత్త టెక్నిక్ ప్రవేశపెట్టారు. అంతే కాక ఈ కథలో ఎద్దుభాష యుంది. ఉదాహరణకు ఈ క్రింది సన్నివేశం చూడండి :

యెద్దులు రెండూ చావట్లోకి వెళ్ళినవి. ఒకటి పుల్లదీ, ఒకటి తెల్లదిన్నీ, పుల్లది బక్కచిక్కి ఎముకలు బయటపడివున్నది. తెల్లది దానికంటే కొంచెం నయం అవిగూడా మేత తిని ఒకరోజయింది. వాటికి కూడ ఆకలి విపరీతంగా వేస్తూవుంది పుల్లది త్రాణ లేకపోవడంవల్ల ఆకలికి నిలువలేక మరీ తపించిపోతున్నది. చెవులు దిబ్బెళ్ళు పడుతున్నవి. కాళ్ళు భూమ్మీద ఆనటంలేదు. గాట్లో చూసింది. మేతలేదు. ఏది కనబడితే అది తినివెయ్యాలనిపించింది దానికి. తిందామని చావడి కప్పు తాటాకు నోటితో లాగింది. అది ఎన్ని సంవత్సరాల నాటిదో, కుళ్ళి వుండటంవల్ల పట్టుకోగానే చూర్ణమయిపోయింది. ఎదురుగా అన్నం తింటూ యజమాని కనిపించాడు. దానికి ఒళ్ళు మండిపోయింది. ''ఏం! నీతో పాటేగా మేమూ తిన్నది. హాయిగా బండిమీద కూర్చున్నవాడికి నీకే అంత ఆకలివేస్తే గుండెలు పడలాగిన మాకు ఎట్లా ఉండాలి?'' అన్నట్టు అతనివంక చురచుర చూసింది. తెలుగు కథా వికాసంలో ఈ కథ ఒక మైలురాయి. తెలుగు కథలో ఆధునికతా లక్షణానికి ఈ కథ మచ్చుతునక.

'స్నేహితుడు' కథలో నిజమైన స్నేహం ఎలా ఉండాలో చక్కగా నిరూపితము. కలతలన్నీ సమసిపోయాక పార్థసారధిని క్షమించమంటాడు ముకుందం. అప్పుడు పార్థసారధి ''అయితే నీ తప్పుకు శిక్ష వేస్తున్నాను, యిప్పుడు నాతో మా యింటికి భోజనానికి రారా!'' అంటూ కథ ముగిస్తారు రచయిత. కథ ముగింపులో పాఠకుడు తాదాత్మ్యం చెందుతాడు. తెలుగువారి వ్యక్తిత్వం ఈ కథలో తొంగిచూస్తుంది.

'గాలిలో దీపం', కథలో భూమిలేని పేద రైతు కామందుల వల్ల కలిగే కష్టనష్టాలను చిత్రించారు. 'వ్యత్యాసాలు' కథలో ధనవంతుల హృదయము లేమిడాన్ని నిరూపించారు. 'శిల్పి' కథలో చేనేత నేతగాని కష్టములు, చేనేత పరిశ్రమపై ప్రభుత్వమువారి శీతకన్ను, ఇందలి యితివృత్తము. 'కొత్తమేడ' కథలో ధనము లేని వారి శీలము విచారణీయము, నింద్యము. ధనమున్న వాని శీలమును గూర్చి విచారణేలేదు. ఇది లోక వృత్తము. పేదరికంలో నున్నపుడు కూతురు సంగీతము పాడినచో తప్పుగా కనిపించును తండ్రికి కాని ఆ కూతురే ప్రముఖ సినిమా తారయై ధన మార్జించిన తరువాత నామె సంపాదించిన మోటారు కారులో సరదాగా తిరుగును. మరియాదలేని లోకము ధనము వెంటబడి యెట్లు పోవుచున్నదో యీ కథలో చక్కగా చిత్రించారు. ఈ విధంగా నే ఇందలి కథలన్నీ సామాజిక పరిస్థితులను ప్రతిబింబింప చేస్తాయి. ఈ కథల్లో గ్రామీణ వాతావరణం కనిపిస్తోంది. వ్యవసాయ సంబంధమైన పదాలు కొల్లలుగా వాడారు రచయిత తెలుగు గ్రామాలలోని, తెలుగు సమాజంలోని సంఘటనలు ఈ కథల్లో దర్శనమిస్తాయి.

''ఉపాసనాబలం'' కథా సంపుటిలో మొత్తం తొమ్మిది కథలున్నాయి. అవి వరసగా 'సంఘ సంస్కర్త', 'ఉపాసనాబలం', 'దొంగా—దొర', 'చిన్ననాటిచంద్రయ్య', 'కలిగే దరిద్రం', 'సుడి గుండాలు', 'సన్మానం', 'మూషికా యాగం', 'ఉపదేశం'.

మనిషిలో మంచితన మనేది ఎలా ఉండాలో చెబుతుంది ''ఉపాసనాబలం'' అనే కథ. ఇందులో జయరామయ్యకు బి. యే.లు, ఎమ్.యే డిగ్రీలు లేవు. అతడు చదివింది కొద్ది. వీధి బడిలో సుమతీ శతకం, కృష్ణశతకం మాత్రం. పోనీ ధనవంతుడని చూద్దామా అదీ లేదు. మరి ఏ కారణంవల్ల గ్రామం మొత్తం అతని మాటమీద నడుస్తున్నది? కేవలం అతనిలోని మంచితనం, కలగలపుతనం మాత్రమే యిందుకు కారణం. ఈ సంపుటిలోని కథల యితివృత్తాలన్నీ వైవిధ్యం పుష్కలంగా ఉన్నవే. ముఖ్యంగా వాడుక భాషను ఉన్న దున్నట్లుగా చిత్రించడంలో పాఠకుణ్ణి చదివించే గుణం అలవరచుకున్నాయి ఇందులోని కథలు. తెలుగు పలుకుబడి బాగా బాగా కనిపిస్తుందీ కథల్లో.

“కారుణ్యం” కథా సంపుటిలో మొత్తం ఐదుకథలున్నాయి. ‘అమ్మ’, ‘పెంకెపిల్ల,’ ‘తానొకటి తలిస్తే’, ‘కారుణ్యం’, ‘ప్రాణి ఎప్పుడూ స్వార్థాన్ని వెదుకుతుంది’ మొదలగున్నవి. ఇందులో ‘తానొకటి తలిస్తే’ పెద్ద కథ. ‘కారుణ్యం’ కథలో రామోజీ తీవ్రమయిన అహింసావాది. ఇంట్లోకి వచ్చిన తేళ్ళనూ, పాములనూ కూడా చంపడు. అయితే అతని జీవులమీద ఎంత ప్రేమో వడ్డీ మీద కూడా అంత ప్రేమ. అతడు తన వడ్డీ బిడ్డకు రోజులు, వెలలు, సంవత్సరాలు ఆహారంగా ఇచ్చి సాకుతాడు. జుట్టు మునిగిన బాకీదారు డెవడైనా కాస్త వడ్డీలో రాయితీ చెయ్యమని నోరు తెరిచి అడిగాడా తన వడ్డీ బిడ్డకు ఎంతో నొప్పి కలిగినట్లు బాధపడతాడు. రామోజీలోని భిన్న మనస్తత్వం యిందులో చక్కగా చిత్రించటం జరిగింది. ఈ కథాసంపుటిలోని కథలన్నీ వాస్తవిక ప్రపంచంతో సంబంధం కలవియే. ఇతివృత్త స్వీకారంలో ఈ రచయిత శ్రద్ధ ప్రత్యేకంగా మెచ్చుకోదగింది. సమాజంలోఉండే విభిన్న మనస్తత్వాలను చిత్రించడంలో వీరి శిల్పాని కున్న బలం అనల్పం. శ్రీ నారాయణస్వామిగారి కథల్లో మనం గమనించాల్సిన విషయం మరొకటి ఉన్నది. అది ప్రేమ. [4]శారీరకమైన ప్రేమ తుచ్ఛమని వీరి అభిప్రాయం. అందుకే వీరి కథల్లో అటువంటి ఇతివృత్తాలు గాని, వర్ణనలుగాని మనకు కన్పించవు. సమాజంలోని వివిధ సమస్యలను కథా వస్తువులుగా స్వీకరించి తద్వారా వాటి పరిష్కార మార్గాన్ని వెదకాలంటారు. [5]ఆంధ్రకథా రచయితలలో శ్రీ నారాయణ స్వామిగారు ‘మపాసా’ వంటి వారని శ్రీ విశ్వనాధ సత్యనారాయణ గారభిప్రాయపడినారు.

[6]నారాయణస్వామిగారి “పుత్ర సంతానం” అనే కథను భారతీయ భాషలలోకి అనువదించే నిమిత్తం సాహిత్య అకాడెమీవారు స్వీకరించారు.

కేవలం సాహిత్యపరంగానే గాక శ్రీ నారాయణస్వామిగారు ‘చిత్ర లేఖనం’, ‘సంగీతం’లో కూడా మంచి ప్రవేశమున్నవారు. దృష్టి మాంద్యంవల్ల చిత్రలేఖనం ఆగిపోయింది. కాని [7]సంగీతం మాత్రం సాధనలోనే ఉంది. [8]“నాకు కళ్ళుపోయినానాలో కళాకారుడు మాత్రం చచ్చిపోలేదు” అంటూ ఉండేవారి కళాతృష్ణ సరసత, సహృదయత మెచ్చదగింది. వీరికి [9]మంగళగిరిలో కనకాభిషేకము, ఐలవరంలో సన్మాన మేర్పాటుచేసి ‘కథకచక్రవర్తి’ బిరుదు ప్రదానం చేయటం జరిగింది. కథకులుగా తమపేరు ప్రచారంలో లేకపోయినా తమ కథలు పదికాలాలపాటు నిలవగలిగితే చాలనుకునే వినయశీలి. వార్ధక్యం మూలంగా గత పదిహేను సంవత్సరాల నుంచి సాహిత్య వ్యాసంగానికి ఫుల్‌స్టాప్‌పెట్టి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. కంటి దృష్టి లేకపోయినా కళాదృష్టి వీరిచే కథలు చెప్పించి తెలుగు కథా వికాసంలో ఒరవడి తెచ్చిన కథల జాబితాలోకి వీరి కథలను చేర్పించింది· ‘కళాకారుడు చావుగాక. కళ మాత్రం చావదు’ అనే సూక్తిలో కళాకారుడు అంటే భౌతికమైన దేహం కలవాడని అర్థం· భౌతికమైన దేహానికి మరణం ఉంది. ఆ దేహంలోని కళాత్మకు మాత్రం మరణంలేదు. అది చిరంజీవి. అటువంటి అదృశ్యమైన శక్తి శ్రీ నారాయణస్వామి గారిచేత ఎన్నో కథలను చెప్పించి తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసింది. శ్రీ నారాయణ స్వామిగారు ధన్యులు.

అధోజ్ఞాపికలు

1 వీరి ‘వ్యత్యాసాలు’ కథా సంపుటిలో ‘మనవి’ నుండి.

2 ఈ విషయాలు శ్రీ నారాయణస్వామిగారు స్వయంగా నాతో చెప్పారు. ‘చిత్రగుప్త’పత్రికకు సంపాదకులు శ్రీ ఎస్. జి. ఆచార్య. రెండో కథ పేరు శ్రీ నారాయణస్వామిగారికి గుర్తులేదట. ప్రస్తుతం ఆ కథ దొరకలేదు.

3 ‘వ్యత్యాసాలు’ కథా సంపుటి. 1940 లో నవ్య సాహిత్య పరిషత్తు, గుంటూరు వారిచే ప్రకటితము.

4 ఈ విషయం శ్రీ నారాయణస్వామిగారు పదే పదే నాతో అన్నారు. శారీరక సంబంధమైన ప్రేమకు విశ్వజనీనత ఉండదని వారభిప్రాయం. వారి యవ్వనకాలంలో రైలు బండ్లలో ‘ప్రేమ సాహిత్యం’ అతి చౌకగా అమ్మేవారట. నారాయణస్వామిగారు కూడా వాటిని బాగా చదివారట. ఆ పుస్తకాలలో భౌతికమైన ప్రేమ మినహాయిస్తే చెప్పుకోదగింది ఏమీలేదట. ఇటువంటి సాహిత్యాన్ని వారి కాలంలో “రైలు సాహిత్యం” అని పిలిచేవారట. బహుశా ఈ రైలు సాహిత్యమే వారిపై ప్రభావంచూపి ‘ప్రేమ’ను యితివృత్తాలుగా తీసుకోనివ్వలేదేమో...

5 నారాయణస్వామిగారి ‘స్నేహితుడు’ అనే కథాసంపుటికి పీఠిక వ్రాస్తూ అన్న మాటలు.

6 ఈ విషయం కూడా నారాయణస్వామిగారే చెప్పారు. అకాడెమీ పక్షాన ప్రకటితమైన ‘కథా మంజూష’ సంకలనంలో ఈ కథ ముద్రితమైనది

7 ఇప్పటికిని నారాయణస్వామిగారు హార్మోనియమ్‌ను జనరంజకంగా వాయించటం ఈ వ్యాసకర్త ప్రత్యక్షంగా చూశాడు.

8 ఈ మాటలు నారాయణస్వామిగారు చాలాసార్లు చెప్పారు.

9 నారాయణస్వామిగారు స్వయంగా నాతో చెప్పిన మాటలు. వారి కనకాభిషేక మహోత్సవం ప్రముఖపత్రికలలో వార్తగా వచ్చిందట.

సంప్రతించిన గ్రంథాలు

1 “తెలుగు వాణి” – (ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక) ‘కథ – కథానిక’ వ్యాసం – రచయిత – శ్రీ పోతుకూచి సాంబశివరావు. పేజి – 251.

2 శ్రీ నారాయణస్వామిగారి నాలుగు కథా సంపుటాలు. (ఈ వ్యాస రచనలో కొన్ని ముఖ్యమైన వివరాలను అందించిన మిత్రుడు శ్రీ సభాపతిరావుకు కృతజ్ఞతలు.)

శ్రీ ఎ. రజాహుస్సేన్

తెలుగులో క్త్వార్థక ప్రత్యయం

శ్రీ ఎ. రజాహుస్సేన్

వ్యాకర్తలు* ఈ క్రింది వాక్యాల్లోని –ఇ ప్రత్యయాన్ని క్త్వార్థకంగా పరిగణింతురు.

1) వనజ ఆడి ఇంటికి వెళ్ళింది. (ఆడ్+ఇ)

2) వనజ గుడ్లు తిని లావైంది. (తిన్+ఇ)

3) సుశీల ఊరికి వెళ్ళిపోయింది. (వెళ్ళ్+ఇ)

4) సుశీల కాఫీ తాగేసింది (తాగ్+ఇ+వేసింది)

ఈ వ్యాసంలో రెండు –ఇ ప్రత్యయాలు, 1. క్త్వార్థక ప్రత్యయం, 2. సహాయక క్రియా ప్రత్యయం ఉన్నట్లు చూపుటకు ప్రయత్నం చేయబడింది. పై నుదహరించిన (1) – (2) వాక్యాల్లోని –ఇ ప్రత్యయాన్ని క్త్వార్థక ప్రత్యయంగాను, (3)–(4) వాక్యాల్లోని –ఇ ప్రత్యయాన్ని సహాయక క్రియా ప్రత్యయంగాను చూపడం జరిగింది.

పైన చెప్పిన ప్రతిపాదన కాధారముగా దిగువ నాలుగు వాదము లివ్వబడినవి:

I భావానువాదము

పై నుదహరించిన (1) – (2) వాక్యాలు దిగువ చూపబడిన (5) – (6) వాక్యాలకు భావానువాదాలుగా చెప్పుకోవచ్చును.

5) వనజ ఆడి తర్వాత ఇంటికి వెళ్ళింది.

6) వనజ గుడ్లు తినడం వల్ల లావైంది.

(5) –(6) వాక్యాలు (1) – (2) వాక్యాలకు భావానువాదాలుగా తీసుకున్నప్పుడు (1) లోని –ఇ ప్రత్యయాన్ని అనుక్రమార్థం (Sequentiality) లోను, (2)లోని –ఇ ప్రత్యయాన్ని ప్రేరణార్థం (కాన్షన్)లోనూ వాడబడినట్లు తర్వాత, వల్ల అనే పదాలు వాడ్డంవల్ల తెలుస్తుంది. ఇదే విధంగా (3)-(4) వాక్యాలనీ దిగువ ఇవ్వబడిన వాక్యాలకు భావానువాదాలుగా చెప్పుకొనుటకు వీలుపడకుండుటయేగాక వ్యాకరణ విరుద్ధములు కూడా.

7) *సుశీల ఊరికి వెళ్ళి తర్వాత పోయింది.

8) *సుశీల కాఫీ తాగి వల్ల వేసింది.

II ప్రతిషేదము

అనుక్రమ, ప్రేరణార్థములలో వాడబడిన క్త్వార్థకమునకు వ్యతిరేక ప్రతిభాగములు (నెగెటివ్ కౌంటర్ పార్ట్స్), –అకుండ, –అక అనునవి క్రమముగా వాడబడును.

ఈ క్త్వార్థకముయొక్క స్వభావమును ఈక్రింద ఇవ్వబడిన [9] – [10] వాక్యాల్లో చూడవచ్చు.

9) వనజ ఆడకుండ ఇంటికి వెళ్ళింది (ఆడ్+అకుండ)

10) వనజ గుడ్లు తినక లావవలేదు (తిన్+అక)

–ఇ ప్రత్యయం తర్వాత సహాయక క్రియ ఉన్న యెడల ఆ –ఇ ప్రత్యయానికి వ్యతిరేక క్త్వార్థకములుగా –అకుండ, –అక లను వాడుటకు వీల్లేదు. కనుక ఈ క్రింద ఇవ్వబడిన వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

11) *సుశీల ఊరికి వెళ్ళకుండ పోయింది.

12) *సుశీల కాఫీ తాగక వేసింది.

దీనివల్ల –ఇ ప్రత్యయం తర్వాత సహాయక క్రియ ఉన్నట్లైతే ఆ –ఇ ప్రత్యయానికి వ్యతిరేక ప్రతిభాగాలు లేనట్లు తెలుస్తుంది.

III సమానాధికరణము

[1] – [2] వాక్యాల్లోని క్త్వార్థక ప్రత్యయం అనుక్రమ, ప్రేరణార్థాలతోబాటు సమానాధికరణార్థమును కూడ తెలుపుతుంది. ఉదాహరణకు [1]వ వాక్యాన్ని దిగువ చూపిన రెండు సామాన్య వాక్యాల నుండి సమానాధికరణ పరివర్తన సూత్రంవల్ల నిష్పన్నమైనట్లు చెప్పవచ్చు.

13) వనజ ఆడింది.

14) తర్వాత వనజ ఇంటికి వెళ్ళింది.

ఈ విశ్లేషణం (ఎనాలిసిస్) [3] [4] వాక్యాలకు వర్తించదు. ఎందుకంటే, వాటిని రెండు సామాన్య వాక్యాలనుండి క్రముగ నిష్పన్నం చేయలేము. కనుక (4) వ వాక్యాన్ని ఈ క్రింద ఇవ్వబడిన రెండు సామాన్య వాక్యాల నుండి నిష్పన్నం చేయలేము.

15) సుశీల కాఫీ తాగింది.

16) సుశీల కాఫీ వేసింది.

---

* ఎ. హెచ్. ఆర్డెన్(1873); చిన్నయసూరి పి. (1857); కృష్ణమూర్తి భ. (1968); సుబ్రహ్మణ్యం పి. ఎస్. (1974)

అందువల్ల [3]-[4]వాక్యాల్లో వాడబడిన –ఇ ప్రత్యయం సమానాధికరణార్థంలో వాడబడలేదని తెలుస్తుంది.

IV ద్విగుణనము

క్త్వార్థకాన్ని అనిరుద్ధార్థం (కంటిన్యుయేషన్) లోనూ వాడతారు. ఉదాహరణకు ఈ క్రింది వాక్యము లీయబడినవి.

17) వనజ ఆడి ఆడి ఇంటికి వెళ్ళింది.

18) వనజ గుడ్లు తిని తిని లావైంది.

సహాయక క్రియా నిర్మాణంలోనున్న –ఇ ప్రత్యయం అనిరుద్ధార్థాన్ని తెలుపదు. ఉదాహరణకు [3]-[4] వాక్యాలను గమనిస్తే తెలుస్తుంది. కనుక ద్విగుణనమువల్ల ఈక్రింది వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

19) *సుశీల ఊరికి వెళ్ళి వెళ్ళి పోయింది.

20) *సుశీల కాఫీ తాగి తాగి వేసింది.

ఈ వ్యాసంలో చెప్పబడిన నాలుగు వాదాల నాధారం చేసుకుని ఈ క్రింది విధంగా చెప్పవచ్చు. [1]-[2] వాక్యాల్లోని –ఇ ప్రత్యయకార్యం [3] [4] వాక్యాల్లోని –ఇ ప్రత్యయకార్యం ఒకటి కాదు. కాబట్టి [1]-[2] వాక్యాల్లో ఉన్న –ఇ ని క్త్వార్థక ప్రత్యయంగాను, [3]-[4] వాక్యాల్లో ఉన్న –ఇ ని సహాయక క్రియా ప్రత్యయంగాను చెప్పకోవచ్చు.

1. Arden A. H. 1873.
A Progressive Grammer of the Telugu Language.
The Christian literature Society, Madras.

2. Chinnayasuri, P. 1857.
Balavyakaranamu (in Telugu) V. Ramaswami Sastrulu & sons, Madras.

3. Krishnamurti, Bh. 1968.
"Compound Verbs in Telugu" Indian Linguistics Vol. 27 (Supplement) Poona.

4. Rama Rao, C. 1971.
"Coordination or Subordination ?" Indian Linguistics, Vol. 32, No. 1, Poona.

5. Subrahmanyam, P. S. 1974.
An Introduction to Modern Telugu, Dept. of Linguistics, Publn. No. 34, Annamalai Nagar.

శ్రీ ఎస్. పి. కిలారి

భావోద్యమాలు - వర్గతత్వం సమాధాన సరళి

'భావోద్యమాలు - వర్గతత్వం' ఒక సమాధానం పేరిట శ్రీ ముదిగొండ వీరభద్రయ్యగారు ఏప్రిల్ 'భారతి'లో వ్రాసినదాన్ని చూచాను. వెంకటాద్రిగారికి సమాధానం ఇవ్వటానికి చేసిన ప్రయత్నం చూచి ఆనందంకల్గినా, సమాధానం ఇచ్చిన తీరులో ఎంతో వెలితి, దుందుడుకుతనం కన్పించాయి వీరభద్రయ్యగారు తమ సమాధానంలో వెంకటాద్రిగారిలో ఓర్మి అహంకారాన్ని, అమాయకతను, చారిత్రక జ్ఞాన అంధత్వాన్ని చూచారు అదెంతవరకు సమంజసమో–లేక వెంకటాద్రిగారిపై వాడిన పదాలు తమకు చెందినవైతే పొరపాటుగా వీరభద్రయ్యగారు వేరొకరికి అన్వయించారో పాఠకులే నిర్ణయించగలరు.

ఆర్థికాన్ని కాకుండా మరేదో సమాజంలో బలీయంగా వున్నవనే దృష్టి యెంత అహేతుకమో, సామాజిక శాస్త్ర అధ్యయనం వల్ల తెలుస్తుంది· (భారతి, ఏప్రిల్, పుట. 64.)

మార్క్సిజంపేరుతో ఈనాడు చెలామణి అవుతున్న ముఖ్య సూత్రమిది. దీన్ని కాదనడం వీరభద్రయ్యగారి దృష్టిలో అహేతుకం. అలాకాదనే వారికి సామాజిక శాస్త్రాధ్యయనం లేదని వారి అభిప్రాయం. అయితే ఈ క్రింది అభిప్రాయాన్ని చూడండి:

"చారిత్రక భౌతికవాదం ప్రకారం వాస్తవ జీవితంలోని వుత్పత్తి, పునరుత్పత్తి చివరకు నిర్ణాయకాంశ మవుతుంది. మార్క్స్ కానీ, నేను కానీ అంతకుమించి యేమీ చెప్పలేదు. అందువల్ల దీనికి ఎవరయినా ఆర్థిక అంశం ఒక్కటే నిర్ణాయకశక్తి అని అర్థం తీస్తే, దాన్ని అర్థరహితమైన శుష్కసమాసంగా మార్చివేసిన వారవుతారు. రాజకీయ, న్యాయ, తాత్త్విక సిద్ధాంతాలు కూడా చారిత్రక పోరాటాలమీద వాటి ప్రభావాన్ని చూపుతాయి. చాల సందర్భాల్లో వాటి స్వరూపాన్ని నిర్ణయించడంలో పైచేయి అవుతాయి."[1]

ఈ మాటలు అన్నది యేంగిల్సు. దీనినిబట్టి యేంగిల్సు అహేతుకవాది, సామాజిక శాస్త్ర అధ్యయనంచేయని వ్యక్తిగా ముదిగొండవారు అనగలరా ? ఇలాంటి మార్క్సిస్టులను గురించి కూడా యేంగిల్సు పేర్కొనకపోలేదు.

"Unfortunately, however, it happens only too often that people think they have fully understood a theory and can apply it without more ado from the moment they have mastered its main principles, and those even not always correctly. And I can not excempt many of the more recent "Marxists" from this reproach, for the most wonderful rubbish has been produced from this quarter too "[2]

ఇవి సాక్షాత్తూ యేంగిల్సు మాటలే సుమండీ! మరి యేంగిల్స్ ప్రకారం మార్క్సిజం అర్థమయితే అలా వ్రాయరన్న మాటేగా! వీరభద్రయ్యగారు వ్రాసింది 'wonderful rubbish' అని నేను అనముగాని, మరేం అవుతుందో ఆయనే తెల్పాలి.

''ఆర్థికాన్ని కాకుండా మరేమీ సమాజంలో బలీయంగా లేవు'' అన్న వీరభద్రయ్యగారే తరువాతి వాక్యంలో ఏమన్నారో గమనించండి.

''మార్క్సిజం ఊరకే గాలిలో పుట్టలేదు. దాని పుట్టుకకు వెనకవ ఫ్రెంచి భౌతికవాదు తత్వం, హెగెల్ గతితర్కం, బాబూఫ్ కమ్యూనిజం-ఇంకా ప్రధానంగా డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం, అనేక శాస్త్ర విజ్ఞాన పరిశోధనలు నిల్చాయి'' అన్నారు. ఆయన మాటలనుబట్టి చూచినా మార్క్సిజానికి పునాది ఆయా సిద్ధాంతాలే కాని, ఆర్థికం కాదనే గదా! వరుసగా ఉన్న ఈ రెండు వాక్యాల్లోని భావవైరుధ్యాన్ని ఏ విధంగా సమర్థించాలి? ఇందులో ఆయన 'అసలు' భావమేదని మనం గ్రహించాలి?

ఉనికి చైతన్యాన్ని నిర్ణయిస్తుందని (Being determines consciousness) మార్క్సు అనేకచోట్ల అన్నాడు. ఆ వునికి (పరిసరాలు) ఆర్థికం ఒక్కటే అనుకొని పొరబడి ఆయన జీవితంలో విలువైన కాలాన్నంతా దాని సమర్థనకోసమే వృధాచేశాడు. చివరకు ఆర్థికత ఒక్కటే నిర్ణాయకశక్తి కాదని మార్క్సు, యేంగిల్సులు గ్రహించారు వారు గ్రహించినా, గ్రహించకపోయినా వాస్తవం అవాస్తవంగా మారదుకదా! మనిషికి ఉండే పరిసరాలు ఆర్థికం ఒక్కటే కాదు రాజకీయం, మతం మొదలైన ఆర్థికేతర కారణాలు చరిత్ర గతిని మార్చినాయని వెర్నర్ సోంబర్టు తెల్పాడు. సాంఘికాభివృద్ధికి ఆర్థికేతరంగా దోహదం చేసిన కారణా లనేకం ఉన్నాయని — జార్జి సోరెల్ భావించాడు. చారిత్రక సంఘటనలకు, లోక సంప్రదాయాలకు, జాతీయ కాంక్షలకు, జాతివైషమ్యాలకు ముఠా బలహీనతలకు వెనక దాగివున్న ప్రగాఢ విశ్వాసాలను కమ్యూనిజమ్ గుర్తించలేదని వెర్నర్ ఆరోపించాడు. చరిత్రగతిని అర్థం చేసుకోవటంలో భాష, భౌగోళిక ప్రకృతి, భావోద్యమాలు, వ్యక్తుల ప్రజ్ఞాపాటవాలు, సంకల్పాలు తదితరములైన బహుళ పరిసరాలను గుర్తించకతప్పదు.

''వర్గాలున్నంతవరకు మనిషిని వర్గాలకు చెందినవాణ్ణిగా తప్ప, మరోవిధంగా చూడడం అవాస్తవ విధానం అవుతుందని'' (పుట. 64.) వీరభద్రయ్యగారు అన్నారు. మరి వారి ఆ తర్కాన్నిబట్టి 'మతాలున్నంతవరకు, జాతులున్నంతవరకు, కులాలున్నంతవరకు' మనుష్యుల్ని వర్గాల్లో చూడటం అవాస్తవ విధానం కాదా? ఈనాడు మతాలు, జాతులు, కులాలులేవా? వారి వాదంప్రకారం అవి 'సామాజిక వాస్తవాలు' కావా? హిందూ శ్రామికులూ, ముస్లిం శ్రామికులూ (వర్గభావానికి తిలోదకాలిచ్చి) పరస్పరం చంపుకోవటంలేదా? రెండు జాతీయ (సోషలిస్టు) శ్రామిక ముఠాలు ఒకరిమీద ఒకరు బాంబులు వేసుకోవటంలేదా? ఒకే ఫ్యాక్టరీ శ్రామికులు రెండు కమ్యూనిస్టుపార్టీల ఆధ్వర్యాన 'మేడే'ని రెండు శ్రామిక దినాలుగా చేసుకొంటూ, పరస్పరం కత్తులతో పొడుచుకున్న సంఘటనలు లేవా? అక్కడ ఏరకమయిన వర్గసమష్టి పనిచేస్తున్నది? ఏకమతస్థుల సమష్టికీ, ఏకజాతీయుల సమష్టికీ, ఏకకులస్థుల సమష్టికీ, ఏకవర్గస్థుల సమష్టికీ తేడా ఏమిటి? జాతి, కుల, మత, వర్గ సమష్టిలోని మనిషికి 'మానవ చైతన్యం'వస్తుందా? పరిసరాల ప్రభావంచేత నిర్ణయించబడే 'సమష్టి మానవ చైతన్యం' పరిసరాల ఆర్థిక వ్యవస్థను మారుస్తుందా? తద్వారా మానవుడు స్వతంత్రుడు కావడానికి ప్రయత్నిస్తాడా? వ్యష్టిలో (మనిషిలో) నిష్పన్నంకాని స్వేచ్ఛాభావం సమష్టిలో చైతన్యంగా మారుతుందా? కోట్లకొలది సున్నాలు కలిపితే ఒకటవుతుందటండీ?

''మార్క్సిస్టు వ్యాఖ్యానాలకు విరుద్ధంగా పెట్టుబడిదారీ రాజ్యాలమధ్య అంతర్జాతీయ ఐక్యత కన్పిస్తున్నదిగదా! యెందువల్ల? అన్న ప్రశ్నకు సమాధానం ఇంగితజ్ఞానం వల్లనని, వాళ్ళకు వెంకటాద్రికన్నా ఎక్కువ చారిత్రక దృష్టి ఉండటంవల్ల'' (పుట. 65.) అని వీరభద్రయ్యగారు అన్నారు. ఆ ప్రశ్నకు ముందు 'సెప్టెంబరు, భారతి'లో మార్క్సిస్టు వివాదాలకు అనుకూలంగా సోషలిస్టు రాజ్యాలమధ్య అంతర్జాతీయ ఐక్యత కన్పించడం లేదుకదా! యెందువల్ల? అని వెంకటాద్రిగారు అడిగిన ప్రశ్నకు వీరభద్రయ్యగారు అసలు సమాధానం ఇవ్వలేదు. పోనీ వీరభద్రయ్యగారి ప్రకారం పెట్టుబడిదారీ రాజ్యాలమధ్య ఉన్నపాటి యింగితజ్ఞానం సోషలిస్టు రాజ్యాధినేతలమధ్య లేకపోవటం వల్లనేనా? లేక వెంకటాద్రిగారికన్నా ఎక్కువ చారిత్రక దృష్టి వారిమధ్య లేకపోవడం వల్లనా? ఇక్కడ వీరభద్రయ్యగారి తర్కం ప్రకారం కూడా చరిత్రను యింగితజ్ఞానం నిర్ణయిస్తుందే గాని ఆర్థికత నిర్ణయించడం లేదని తెలవటంలేదా? మరి వారన్న బలీయమైన ఆర్థికేతర కారణాలు లేవనడంలోని చిదంబర రహస్యమేమిటి?

''సామాజిక ఆర్థిక శాస్త్రాలు ఆధారంగా ఫ్రాంసు, బ్రిటన్ లలో జరిగిన బూర్జువా విప్లవాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయడంచేత వర్గదృష్టిని తీసుకోవడం జరిగింది మార్క్సుకు'' (పుట. 66.) అంటూ మార్క్సు వేడిమేయరుకు వ్రాసిన లేఖాభాగాన్ని వీరభద్రయ్యగారు అధోజ్ఞాపికలో యిచ్చారు. తరువాత... ''వాళ్ళు పాలసీతో తత్త్వశాస్త్రాన్ని నిర్మించలేదు. వాస్తవలోకంలో చరిత్రగతికి సంబంధించిన శాస్త్రీయ సూత్రాల్ని వాళ్ళు కనుక్కొన్నారే తప్ప అదే శాశ్వత సత్యంగా వాళ్ళు చెప్పలేదు'' అని అన్నారు.

అయితే ఫ్రాన్సు, బ్రిటన్లలో బూర్జువా విప్లవాల తర్వాత శాస్త్రీయంగా; రావలసిన సోషలిస్టు విప్లవాలింతవరకు రాలేదని మనం గమనించాలి. అలాగే బూర్జువా విప్లవాలు రాకుండగనే అశాస్త్రీయంగా వచ్చిన సోషలిస్టు విప్లవాలను కూడా మనం దృష్టిలో వుంచుకోవాలి. అప్పుడు మార్క్సుయొక్క ''శాస్త్రీయ అధ్యయనం'' మనకు అవగాహన అవుతుంది. తరువాత పేర్కొన్నదాన్లో 'శాస్త్రీయ సూత్రాల్ని వాళ్ళు కనుక్కొన్నా'రన్నారు. అవి 'శాశ్వత సత్యంగా వాళ్ళు చెప్పలే'దన్నారు. శాస్త్రీయ సూత్రాలు సత్యంకాని పరిస్థితులేవో మనం గుర్తించాలి.

పాలసీ పెట్టుకోకుండానే తత్త్వశాస్త్రాన్ని మార్క్స్, యేంగిల్సు విభజించారన్నారు వీరభద్రయ్యగారు. తాము కనుక్కోకుండానే మార్క్స్, యేంగిల్సు నిజానికి యితరులనుండి గ్రహించిన సూత్రాలను కలిపి ఒక విధానాన్ని నిర్మించారు. వర్గాలను, వర్గపోరాటాలను బూర్జువా చరిత్రకారులు తనకంటే చాలముందే వర్ణించినట్లు మార్క్స్ అంగీకరించాడు.[3] ఉత్పత్తి అభివృద్ధి యొక్క ప్రత్యేక చారిత్రక దశలకు వర్గాల ఉనికిని అతకటం, వర్గపోరాటం అవశ్యంగ శ్రామిక నియంతృత్వానికి దారితీస్తుందనడం, ఆ నియంతృత్వం వర్గరహిత సమాజానికి దారితీస్తుందనడం—తాను కొత్తగా చేశానంటాడు మార్క్స్.[4] వీటిని మార్క్స్ కనుక్కొన్నాడని యేంగిల్సు అంటారు.[5] వీరభద్రయ్యగారు యేంగిల్సు మాటే అంటున్నారు నిజానికి ఆ సూత్రాలు ఎంతవరకు మార్క్స్ సొంతమో చూద్దాం.

చరిత్ర అంతా వర్గపోరాటాల(?) మయమనీ, విప్లవాలు అందులోని గంతులనీ, ఫ్రాన్సులో జరిగింది బూర్జువా విప్లవమనీ, ఫ్రెంచి చరిత్రకారులు గిజాట్, థియర్రీ వ్రాసిన అంశాలు మార్క్స్ వర్గ సిద్ధాంతానికి పూతం ఇచ్చినవి.[6] ఈ విషయం మార్క్స్ గూడా అంగీకరించాడు 'సొంత ఆస్తి రద్దు' భావాన్ని ఆయన మోరెల్లీనుంచి తీసుకున్నాడు కార్మిక విప్లవ భావాన్ని బాబూఫ్, బోనరోటీలనుంచి తీసుకున్నాడు. బ్లాంకీనుంచి విప్లవ నియంతృత్వ భావాన్ని తీసుకున్నాడు. లూయీబ్లాంక్‌నుంచి సోషలిస్టు వ్యవస్థ భావాన్ని తీసుకున్నాడు. రాజ్యం అంతరించిపోతుందనే భావాన్ని మొదట యేంగిల్సు ప్రౌధాన్‌నుంచి తీసుకోగా, ఆయననుంచి మార్క్స్ గ్రహించాడు. హెగెలీయ గతి తర్కాన్ని క్రింది మీదు చేసి తత్త్వశాస్త్రాన్ని వృద్ధిచేశాడు. ప్రౌధాన్‌నుండి గతి తర్కాన్ని సమాజానికి అన్వయించడం నేర్చుకున్నాడు. వైకో, హెర్డర్‌లనుంచి చరిత్ర నేర్చుకున్నాడు. ఆడంస్మిత్, రికార్డోలనుంచి ఆర్థిక విషయాలు నేర్చుకున్నాడు. మార్క్స్ తన గ్రంథాలనుండి చాల విషయాలు తస్కరించాడని రాడ్ బర్టస్ అభియోగం తెచ్చాడు. రాజకీయ సిద్ధాంతంలో మార్క్స్ మాకియవెల్లీ సాంప్రదాయాన్ని కొనసాగించినట్లు 'క్రోస్' వాదించాడు. సామాజిక శాస్త్రంలోమార్క్స్ ఒక్క కొత్త భావాన్ని కూడా ప్రవేశపెట్టలేక పోయాడన్నంతవరకు 'సోరోకిన్' పోయాడు.[7] ఏమయినా మార్క్స్ భావాలకు పునాది అంతకుముందున్నవారి భావాలే కాని సామాజిక ఆర్థిక పరిస్థితికాదని పై అంశాలద్వారా తెల్సుకోవచ్చు. పై అంశాలన్నింటినీ క్రమబద్ధంచేసి, ఒక చట్రంలో బిగించడంలో మాత్రం ఆయన విశిష్టతను తక్కువ చేయవలసిన పనిలేదు.

''మానవునికి స్వేచ్ఛ ఒక అవసరం అయ్యేదశ రావడానికి భౌతికంగా యేవి అడ్డంకులో వెంకటాద్రిగారిలాంటి వాళ్ళకు కూడా తెలియలేదని'' (పుట. 66) వీరభద్రయ్యగారు వెంకటాద్రిగారిపై జాలిని కురిపిస్తూ — మానవుడికి స్వేచ్ఛ 'అవసరమయ్యే దశ ఒకటి' రావాలని కోరారు. అంటే ఇప్పుడు మనిషికి స్వేచ్ఛ అవసరం లేదన్న మాటేనా? స్వేచ్ఛ అవసరం లేని మనుష్యులతో తప్ప కమ్యూనిస్టు ఉద్యమాలు నడవవనేనా? ఆయన భావం. స్వేచ్ఛను అవసరమయ్యే దశను, అనవసరమయ్యే దశను కనిపెట్టి దాన్ని కూడా ద్వంద్వాల్లోకి వీరభద్రయ్యగారు లాక్కుపోతున్నారు. ఇది సోషలిస్టు ముసుగులోని ఫాసిస్టు భాషకాదు గదా! స్వేచ్ఛ ఒకరిస్తే తీసుకునేది, పొందేదికాదు. నెత్తిమీద రుద్దితే అనుభవించగలిగేది కాదు. **Freedom can not be imposed from above.** స్వేచ్ఛ అనేది దాన్ని నిరోధించే సిద్ధాంతాలు, మతాలు, పార్టీలు, శక్తులు లేనప్పుడు అనుభవించగలిగేది. మనిషి యే మేరకు జ్ఞానాన్ని ఆర్జిస్తాడో ఆ మేరకు పొందగలిగేది. వెల్లుల్లి యెరను చూపి బోనులోకి యెలుకను లాగడం దాని స్వేచ్ఛకోసంకాదు; దాని స్వేచ్ఛవల్ల వున్న ప్రమాదాన్ని నివారించుకోడానికే 'మనుష్యులు' ఆ పనిచేస్తారు. నాయకులు తమ నాయకత్వాన్ని దక్కించుకోవటానికే యెరలను చూపి ఆ పని చేయటానికి ప్రయత్నిస్తారు. బోనులో చిక్కిన మనుష్యులు స్వేచ్ఛ అవసరమయ్యే దశ రాకకోసం కాచుకొని వుంటారు అలాకాక మనిషి స్వతంత్రాలోచన చేసే హక్కు మాత్రమేకాక శక్తిని పొందగలిగేటట్లు చేయటమే భావోద్యమాల లక్ష్యం. భావోద్యమాలపై ఇంకా వివరణ కావాలంటే గుడివాడ హేతువాద మిత్రులు రెండున్నర రూపాయల వెలతో ఏప్రెల్ '80లో ప్రచురించిన వెంకటాద్రిగారి 'భావవిప్లవం-వర్గతత్వం'' పుస్తకం చూడండి. వర్గతత్వంమీద వివరణకైతే 1955లో వెంకటాద్రిగారిచే వ్రాయబడి, 62లో ప్రచురించబడిన 'మార్క్సిస్టు భౌతిక వాదం' చూడండి.

ఇంతకూ వెంకటాద్రిగారు లేవనెత్తిన ఒక ప్రధానాంశాన్ని వీరభద్రయ్యగారు ప్రక్కకు నెట్టారు. ఈనాడు సోషలిస్టు రాజ్యాలనబడే వాటిమధ్య యే వర్గ సంబంధాలు కక్షలు రేపుతున్నాయి? అక్కడ ఆర్థికం ఏవిధంగా ప్రభావం చూపుతున్నది? వర్గ సంబంధాన్ని కాదని జాతీయత యే విధంగా చోటుచేసుకొంటున్నది? సోషలిజం జాతిపరమైతే — జాతీయవాదంగా మారితే, ఫాసిజానికి భిన్నంగా దాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సమాధానం చెప్పుకోవలసిన ఈ ప్రశ్నలను వదలి ఎదుటి వారిని అమాయకులనో, అహంకారులనో, చారిత్రక జ్ఞాన అంధులనో అనడం ఏ ప్రయోజనం నెరవేర్చుకోవటానికి?—వీరభద్రయ్యగారు చెప్తారనుకొంటాను.

అధోజ్ఞాపికలు

1 Marx and I are ourselves partly to blame for the fact that the younger people sometimes lay more stress on the economic side than is due to it. (Engels to Joseph Bloch on 21/22-9-1890).

2 Ibid.

3 Marx's to Joseph weydemeyer on 5-3-1852.

4 Ibid.

5 "As Darwin discovered the law of evolution to organic nature, so, Marx discovered the law of evolution in human history', Engel's funeral address after Mar'xs death (Karl Marxs by F. Mehring, P 531)

6 "Not only can one claim no credit for recog, nising the existence of a class struggle' but it is almost ridiculous to deny it.-' ఈ మాటలు వ్రాసింది మార్క్సుకాదు. మార్క్సును ఫ్రాన్సునుండి వెళ్ళగొట్టే ఆర్డరుమీద సంతకం చేసిన గిజాట్. ('Marxism-Bertram D. wolfe, P. 291)

7 M. N. Roy, Reason-Romanticism and Revolution Vol II; Wolfe : Marxism; V. P. Varma, political philosophy

శ్రీ కామేపల్లి రామారావు

శిశు సంబోధన చక్రం

1980 మే 'భారతి' (పుటలు 67–68) లో శ్రీ తిరుమల రావుగారు కలగూర గంపలో రాసిన సమీక్షలో వేసిన ప్రశ్నలకు సమాధానాలు నా వ్యాసంలో వున్నాయి. దయచేసి మళ్ళీ ఓసారి చదువుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఇటీవలి పరిశీలనలో బయటపడ్డ మరికొన్ని విషయాల్ని ఈ 'నోట్' లో పరిచయం చేస్తాను. మొదట శిశుభాషా స్వభావాన్ని గురించి కొన్ని మాటలు.

సమాజాల్లో జానపద నాగరిక 'సమాజాలు ఎలాంటివో మనుష్యుల్లో శిశువులు పెద్దలు అలాంటివారు. స్త్రీలు పురుషులు అలాంటి మానసిక ప్రవృత్తి కల్గినవాళ్ళు. మానసిక రుగ్మత ఉన్న వాళ్ళు వివేకవంతమైన మనస్సుకల్గినవాళ్ళు అలాంటివాళ్ళు. అంటే విశ్వ వ్యాప్తమైన అంతశ్చేతన పొందే వ్యక్తీకృతిలోని భేదాలే పైన చెప్పబడ్డ అంతరాలన్నీ—అని అర్థం. ఈ అంతరాలకు లోనుకాని ఒక విశ్వనాదాన్ని కవి, తాత్త్వికుడు, మహావిజ్ఞాని తమ తమ రీతుల్లో దర్శిస్తారు. ఆ నాద ప్రథమ స్పందమే (ప్రయిమార్డియల్ స్టేస్ లేదా ఇనిషియల్ స్టేస్) శిశు భాషగా వ్యక్తమవుతోంది. బాలవాక్కు బ్రహ్మవాక్కన్న జానపదుల సామెతకు అర్థం ఇదే. శిశువులకు పెద్దలకులాగా వ్యావహారికమైన సామాజిక పరిధులకు లోబడిన ఆలోచన లేదు. వాళ్ళవివేకం (ఇంటలెక్ట్) ఆ విశ్వజనీన స్పందనకు అనుగుణంగా వుంటుంది. అందుకే అక్కడ శబ్దం — చేష్ట వేరువేరుగా వుండవు. జానపదుల్ని గురించి పరిశోధించిన వాళ్ళూ ఈ విషయాన్ని అంగీకరించారు. శిశువుల్ని గురించి పరిశీలించిన వాళ్ళూ ఇదే నిర్ణయానికి వచ్చారు. 'చిల్డ్రన్ స్పీక్ ఇన్ సోఫార్ యాస్ దే యాక్ట్' అని అర్థం.

భాషోత్పత్తిని గురించి భిన్న సిద్ధాంతాలు పుట్టాయి. ఈ సిద్ధాంతాల్ని కొన్నివర్గాలుగా చూడొచ్చు. ఈ వర్గాల్లోనూ రెండు తాత్త్వికదృష్టులు ప్రధానం : ఒకటి అనుకరణ (ఇమిటేషన్) దృష్టి రెండవది సహజ ప్రేరణ (ఇన్స్టిన్క్టివ్ స్టిములస్) దృష్టి. భాషలు పుట్టడాన్ని గురించి చెప్పడంలో చారిత్రకదృష్టి పనికివస్తుంది ఒక భాష కొన్ని మాండలికాలుగా ఆ మాండలికాలే అనంతర కాలాల్లో భాషలుగా మారాయని చెప్పడం ఉదాహరణం. కాని భాష పుట్టడాన్ని గురించి చెప్పడానికి భిన్నమైన ప్రణాళిక కావాలి. చారిత్రకతతో నిమిత్తంలేని మానసిక భౌతిక సమన్వయ దృష్టి ఒకటితప్ప మరోటి దీనికి సమర్థంకాదు. ఎంత అనాగరక సమాజాన్ని, ప్రాచీన మానవ సమూహాన్నీ పరిశీలించినా భాష ఉనికి స్పష్టంగా కనిపిస్తోంది. అందువల్ల ఇలాంటి సందర్భాల్లో 'భాష మానవుడికే దత్తమైనవరం' అని సర్దుకోవడంతో సరిపోతోంది. దత్తమంటే భగవంతుడిచ్చాడనా! అధి భౌతికవిషయ మీమాంస శాస్త్రత్వానికి చుక్కెదురుకాదా! మరి దత్తమంటే ఏమిటని ?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే — మౌలికంగా భాషా నిర్వచనంలోఉన్న ఒక సందిగ్ధతను శాస్త్రజ్ఞుడు మొదట తొలిగించుకోవాలి. భాష సామాజికమైన వస్తువన్నంత వరకు శిశువు సమాజంనుంచీ భాషాపరిజ్ఞానాన్ని అనుకరణంద్వారా గ్రహిస్తున్నాడనటంలో తప్పులేదుకాని — భాషా నిర్మాణ పరిజ్ఞానం ఒకటి సామాజికమైన అనుకరణలకు అతీతంగా, అంతర్గతంగా, సహజంగా, పుట్టుకతోపాటు — ఒకటి ఉందని అంగీకరించకపోతే — శిశువు ఒకసారిగా రెండు మూడు భాషల్ని ఎలా నేర్చుకోగలుగుతున్నాడో — పెద్దలు-శిశువులు అన్న భేదం లేకుండా ఒక భాషనుంచీ మరో భాషకి అనువాదం ఎలా సాధ్యమవుతోందో చెప్పడం కుదరదు. అందువల్ల సాంఘికమైన ప్రమాణంకంటే భిన్నంగా భాషను నిర్మాణాత్మకంగా నిర్వచిస్తేతప్ప ఈ సందిగ్ధతపోదు. (చూ. బ్రహ్మానంద. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక 1980 వాక్కు — భాష పుటలు 13–18). 'వాక్కు' ఆ ప్రమాణం

ఆ నిర్మాణానికి రెండు ముఖాలున్నాయి. 1. శబ్దం 2. అర్థం. శిశు వాగ్వ్యవహారంలో ఈ రెండూ అన్వయరూపంలో సంవదిస్తాయి. అంటే శిశుశబ్దం—చేష్టాముఖంగా—భావంతో నిత్య సంబంధాన్ని బోధిస్తుందని అర్థం. ఎప్పుడో 1926 ప్రాంతంలో Jean piaget చెప్పి వదలి వేసిన విషయాలు మళ్ళీ ఈనాడు భాషా పరిశీలకులకు నూతన ఉత్తేజాన్ని కల్గిస్తున్నాయి. (వివరాలకు చూ. శిశుభాష—మాతృపితృ వాచకాలు. మార్చి. 1980—భారతి. పుటలు 48-55) అందుకే అమెరికాలో ఈనాడు శిశు వాగ్వ్యవహారంలోని అర్థస్వరూపాన్ని Piaget నాధారంగా నిర్ధారిస్తున్నారు. (చూ 'Meaning in child language'– Lawrence B. Leonard (1976).)

అందువల్ల శిశువ్యవహారంలో బయటపడే మాతృ పితృ వాచకాలకు అర్థ నిర్ణయం వృద్ధవ్యవహారంలోలాగా వ్యక్తి సూచ

కాలు అనడంకః టె సంబోధన రూపాలుగా చెప్పడం సమంజసమని పూర్వవ్యాసంలో విస్తృతంగా చర్చించాను.

అంచేత శిశువ్యవహారం ఎక్కువగా సంబోధనా రూపం. చేష్టాసహితమైంది. ఆకలి, సంతోషం, ఏడుపు, బాధ – వీటిని సూచించేవి. ఆకలి అమ్మస్తనం–పాలు–అన్నం–మజ్జిగ– వీటితో సంబంధంఉన్నవి. అమ్మలాంటి–అంటే–ఆ పనులుచేసే వ్యక్తుల్ని పిలిచే వ్యాపారాన్ని కల్గినవి. క్రమంగా వయసు రానురానూ వాటికి సాంఘిక నియమాలు ఏర్పడుతున్నాయి. అంటే శిశువుకి వయసుతో పాటు సామాజికావసరాలు పెరుగుతాయని అర్థం. దీనికి నిదర్శనం కొన్ని రూపాల్లోని 'బాలభావాన్ని' కొంత పెరిగిన శిశువులుకూడా గుర్తించడం. (మా పాపకు నాల్గు సంవత్సరాలు, 'జీవు' తాగుతావా ! అంటే–'జీవు'కాదు–'ఈల్లు' అంటుంది–'నీళ్ళని' అర్థం –పదాది నకారం ఏర్పడ్డంలో ఇంకా 'ఫార్మేటివ్ పిరియడ్'లోవున్నా 'జీవు' లెవెల్ని దాటిందన్నమాట).

కొన్ని శిశు వాగ్వ్యవహారాలైనా వృద్ధ భాషలోకి ఎందుకు ప్రవేశించాయన్నది పెద్ద ప్రశ్న. బ్యాక, లాల. త్తువ, బజ్జి, కక్క, టాటా లు అలాంటివి – ఇవి వృద్ధ వ్యవహారంలో లేవు. శిశువులతో వ్యవహరించేటప్పుడు మాత్రమే వున్నాయి. మరి అమ్మ, మామ, అత్త, తాత, అప్ప, పాప, అన్న, నాన్న, అక్క, కక్క (బాబాయి అని అర్థం) ఈ పదాలు వృద్ధ వ్యవహారంలోకూడా ఎందుకు నిలిచిపోయినాయి ?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే మన సాంఘిక జీవితంలోనికి 'లౌకి కత్వానికి', కుటుంబ జీవితంలోని 'సెంటిమెంటాలిటీ'కి మధ్యనున్న భేదాన్ని గురించి ఆలోచించాలి.

'ఢిల్లీకి దొరైనా తల్లికి కొడుకే' అని మా అమ్మ ఓ సామెత చెప్పేది. జానపద మనస్తత్త్వం కుటుంబదిశలో బంధువుల నడుమ ఇలా వుంటుంది. ఇది ఆయా వ్యక్తుల్ని మనం చూసే దృష్టికి సంబంధించింది. నాకొక అక్కవుంది. ఇప్పటికీ నన్ను 'వద్దు నాన్నా' అని ఆమె వారిస్తూ వుంటుంది – ప్రతి పనికీ. నాకు తెలిసిన అరవయ్ సంవత్సరాల పెద్దమనిషిని వాళ్ళ అన్నయ్య 'ఏరా అబ్బాయ్' అనే ఇప్పటికీ పిలుస్తాడు. ఈ సంబంధాలు ఏ జీవిత విధానంలో వుంటాయో అక్కడే శిశు వ్యవహారంలోని రూపాలూ వృద్ధ వ్యవహారంలో వుంటాయి. విధానం మారితే వుండనక్కరలేదు. (కొందరు పురుషులు స్త్రీలని ఏమండీ ! అంటారు. కొందరు ఏమ్మా ! అంటారు. మరికొందరు ఈ రెండూ అనరు. నువ్వు/మీరు – ఇవేం లేకుండా వ్యవహరించడమూ వుంటుంది.) అందువల్ల సాంఘిక జీవితవిధానానికీ శిశువృద్ధ వ్యవహార సామీప్యానికీ చాలా సంబంధం వుంటుంది.

నాకు పరిచయం వున్నంతవరకు – అ [మ/ప–బ/త–ద/న/క/య/వ – లతో కూడిన శిశు సంబోధన రూపాల్ని ఇక్కడ అందిస్తాను, అ [అంటే – అకారం ముందున్న అని అర్థం. తర్వాత ఉన్న హల్లులు ద్విత్వ (మ్మ, ప్ప... ఇలాగా) రూపాన్ని పొందే సామాన్యంగా కనిపిస్తున్నాయి. లోపలఉన్న గడి శిశు వ్యవహారం బయటిగడి వృద్ధవ్యవహారం.

గడికి పైన గుర్తించిన విషయం ఆ రూపాలలోని నిర్మాణ మాత్రం. కుడి ఎడమలవైపు భాషా పరిధులు 'Note' చేయబడ్డాయి. ఈ చక్రం (చట్రం) కేవలం ఒక ప్రయత్న మాత్రంగా చూపడం జరిగింది. దీనిమీద ఇంకా చాలా పరిశోధన సాగాలి అప్పుడు చాలా కొత్త విషయాలు బయట పడవచ్చు–భాషాచరిత్ర, తత్త్వాలకి సంబంధించి.

ఉదాహరణకు అ[వ్ం అన్న 'అట్టరెన్స్'కి ఉన్న వ్యాపార భేదాలను మొదట చర్చించాలనుకోండి. మొదట గుర్తించాల్సిన విషయం అ[వ్ం అన్నది ఒక శిశుభౌతిక ప్రక్రియలో బయటపడుతున్న ధ్వని సముదాయమని. అది 'తల్లి' అన్న అర్థాన్ని బోధించే నైఘంటిక పదం కావడం అనంతర దశల్లోనని ['తల్లి' అనే అర్థాన్ని బోధించే పదాలు తెలుగులాంటి ద్రావిడ భాషల్లో 9 గణవాచకాల్ని కల్గివుంది. ఉదాహరణానికి చూ. DED, 46, 53, 133, 154, 232, 300, 308, 2560, 3625).

సంబోధన వాచకాలైన ఇలాంటి 'అట్టరెన్స్'లు ఇంకా కొన్ని ఉన్నాయి, అ [ప్/బ్, అ [త్/ద్, అ[న్, అ[క్, అ[య్/వ్లు ఇలాంటివి. ఇక్కడ కనిపిస్తున్న అంతర్నిర్మాణాన్ని ఇలా సూచించవచ్చు :

V + C

అచ్చు + హల్లు

క్రింది రూపాల్ని పోల్చి చూడండి.

(1) అవ్ంవ్ంఅ — వ్ం ఆవ్ం ఆ

అమ్మా — మామా

(2) అప్పా — పాపా

(3) అబ్బా — బాబ్ (అ) / (అ)

(4) అత్తా — తాతా

(5) అద్దా — దాదా

(6) అన్నా — నా(న్)నా

(7) అక్కా — కాక్(అ)/(ఆ)

(8) అయ్యా — యాయ్ (ఈ)

(9) అవ్వా — వావా

5, 9 లలో గిరి గీట్లు చుట్టబడ్డ రూపాలు తెలుగులో కనిపించకపోవచ్చు. కాని కేవలం తెలుగు శిశువును దృష్టిలో వుంచుకొని మాత్రమే ఈ రూపాలు గుర్తించడం జరగలేదు. ఉదాహరణలు బాబ, దాదా, యాయి, కాక, ఇలాంటివే. మలయాళంలోనిది ఈ కింది జంటలోని మొదటిరూపం. రెండోరూపం హిందీలో వుంది.

(10) accá — Cácá

మొదటి పదానికి అర్థం 'నాన్న', రెండవదానికి 'మామ', ఈ రూపాల్లో వేటికీ నిర్దిష్టమైన లింగబోధకత కనిపించడం లేదు. (ద్రావిడ భాషల్లో తల్లి – తండ్రి గణరూపాలకు తప్ప) [చూ. DED, 2494, 2560)

పై 10 రూపాల జంటల్లోనూ ఒక ప్రక్రియాసామ్యం కనిపిస్తోంది. ఆ లక్షణాన్ని ఇలా సూత్రించవచ్చు.

(ఎ) మొదటి వరసలో హ్రస్వాచ్చు తర్వాత హల్లు ద్విత్వాన్ని పొందడం (VCC)


(బి) రెండవ వరసలో దీర్ఘాచ్చుకు అటు ఇటు సమాన హల్లు కనిపించడం. ($C\bar{V}C$)

పై (ఎ) (బి) లను కలిపి ఆలోచిస్తే రెండు ప్రక్రియలు 'Operate' అవుతున్నట్లు గుర్తించవచ్చు,


(1) $VC \rightarrow C\bar{V}$ గా వర్ణవ్యత్యయం పొందడం (మెటాతీసిస్)

(2) $C\bar{V}$ పునరుక్తిని పొందడం. (రిడూప్లికేషన్) ఈ రెంటిని గుర్తించడంలో ప్రయోజనం ఒకటుంది. వర్ణవ్యత్యయ, పునరుక్తులు బాల భాషా పదజాలంలో ఎక్కువ భాగాన్ని కల్పిస్తున్నవని చెప్పడం.[1] ఈ లక్షణాన్నే 'ప్రొడక్టివిటీ' అంటాం.

ఇప్పుడు అమ్మకి సంబంధించిన సంబోధనచక్రం చూడండి. (ముద్రణ సౌలభ్య దృష్టితో చట్రంగా ఇవ్వడం జరిగింది)



పై చట్రం లోని భిన్న అర్థము పొరొల్ని ఇలా సూచించవచ్చు



శిశువాక్కు–లో ఒక శబ్దాంశ, మరొక అర్థాంశ, రెండూ కలిసే వున్నాయి. ఇవి రెండూ కలిసిన ఒక భావాంశం శిశు వాగ్వ్యవహారంలో మౌలికమని చెప్పడం ఈ చక్రాన్ని గుర్తించడంలో ఉద్దేశ్యం. తక్కిన ఇలాంటి వాగ్రూపాల్ని కొన్నింటిని ఉదాహరిస్తాను.(వాక్కు–భాషలమధ్యముండే)

భేదాన్ని తెలుసుకోవడానికి (చూ. వాక్కు-భాష) ఇంకా ఇలాంటి చక్రాలు 5 చూపించవచ్చు. వాటిలో–

(2) a [P/b

రూపాలు : అప్ప పాప, అప్పం, పప్పి, (food), Pupil, సిన్నప్ప, పెద్దప్ప, రామప్ప, అప్పయ్య, అప్పి, అప్పా (సంబోధన, ప్రాంతీయం, స్త్రీ / పు). పాపాయి, అప్పగారు (స్త్రీ. ప్రాం) పాయి (>పాలు?) అబ్బ / బాబు, అబ్బి (హ) అబ్బా, అబ్బో, అబ్బబ్బ, బాబు (గారు) బాయ్, బేబి, బూచి, బూబు, బేబి, బిక్కి, బజ్జి, బుజ్జి, బూచి, బుచ్చి, బాయి < (పాయి)

(3) a [t/d

రూపాలు : అత్త / తాత, తాయి. తాతి, తాయం (ఆహారం) తాతయ్ / తత్తయ్ (నాట్యం), హత్త (beat), దా (రా) దీ (నన్ను దింపు), తా (తీసుకురా). టాటా (వీడ్కోలు శబ్దం), డాడీ, దాదా

(4) a[n

రూపాలు : అన్న / నాన్న (ప్రాం) అన్నయ్య, అన్నాయ్, నా(య్) నమ్మ, నాని, ననన, అన్నన్న (పూర్వదశల్లో)

(5) a[k

రూపాలు : అక్క / కక్క (బాబాయి, కర్నాటక ప్రాం.) అక్కయ్య, అక్కాయ్, కక్కి (పిన్ని, c̄ d) కాకా (కాకి శబ్దం) / (బాబాయి సం). కక్క (అశుద్ధం, మలం) (అనుకరణ దశలో)

(6) a[y/w

రూపాలు : అయ్య, ఆయి· (అశుద్ధం, మలం), ఆయా (నర్స్) అయ్యప్ప, తాయి, అయ్యా (సోదరి సం) అయ్యా (పు. సం) అయ్యా (తండ్రి. కులమాండలికం. సం) అయ్యగారు (Sir), అయ్యయ్య, అయ్యా, (హ) అయ్యో, (హ) అవ్వ,

పై రూపాల అర్థాల్ని పరిశీలించేటప్పుడు చాలా ఆసక్తిని కల్గించే అంశాలు కొన్ని ఉన్నాయి. వాటిని చూపిస్తూ విరమిస్తాను.

(1) పైన చూపబడ్డ వర్ణవ్యత్యయ, పునరుక్తులు ప్రాకృత భాషా లక్షణాలుగా గ్రంథాలు చెబుతున్నాయి. అర్థ దృష్టితో వీటి సంబంధం అన్వేషణీయం.

సం. అంబా. ప్రా. అమ్మో. తె. అమ్మ.

(2) తెలుగు రూపాలైన అత్త, అక్క, అజ్జ, ప్రాకృతంతో సమానమైన సాంఘికార్థాల్ని కల్గి వున్నాయి.

చూ· DED	24	Pkt· akka	'సోదరి'	
	121	Skt· atta	'తల్లి', తల్లిసోదరి వగయిరా,	
		Pkt· atta	'తల్లి, అత్తగారు' మేనత్త మొగుడు	
,,	46	Pkt ajja	'తండ్రి'	
,,	163	Pali. ayya	'తండ్రి'	

పై రూపాల్లో 'అజ్జ' విషయం కొంత చూడాలి. తెలుగులో acca 'ajja లేవు. కన్నడంనుంచి వరమాండలికంగా కొన్ని సరిహద్దుల్లో ఈ రూపాలున్నాయి. తెలుగులోని ayya 'పాళి'నుంచి ఏర్పడ్డ సాంఘికార్థాన్ని కల్గించే 'ఆర్య' శబ్దంలోని విశిష్టత ఇందులో లేదు.

(3) అప్ప / అన్న అన్న రూపాల విషయకంగా ప్రాకృత సంస్కృత సంబంధ నిరూపణం కుదరదు. (చూ. DED 133, 112). అంటే వీటి సాంఘికార్థాలు కేవలం దేశీయ పరిధిని కల్గినవని అర్థం. అలాంటి రూపాలే తల్లి (DED.2560) తండ్రి DED 2494)[2]

(4) అజాది రూపాలకి ముందు కంఠమూలీయ హల్లు ఇ—'హ'గా రాయబడింది) చేరి భావార్థకరూపాలు ఏర్పడుతున్నాయి.

అధోజ్ఞాపికలు

1 ఇక్కడ మరో పద్ధతి కూడా ఆలోచించడానికి అవకాశం వుంది. 'ma' అన్న ఒక Syllable నే ప్రమాణంగా తీసుకొంటే /మామా/వంటి రూపాల్ని 'సిలబిల్ రిడూప్లికేషన్' (అక్షర పునరుక్తి)గా చెబితే అసలు సమస్య వుండదు. హిందీ (మా), ఇంగ్లీషు (మమ్మీ)లలో ఈ ప్రక్రియకు అవకాశం లేకపోలేదు. అప్పుడు కూడా అమ్మ అమ్మయ్య (హోవ్, రష్యన్) వంటి భావార్థక రూపాలకి స్వరూప నిర్దేశం చేయాల్సి వచ్చినప్పుడు వర్ణవ్యత్యయాన్ని, హల్ పునరుక్తిని గుర్తించక తప్పదు. యాకబ్‌సన్ (1971, చూ. పూర్వ వ్యాసం. పుట. 52) – ఇలాంటి రూపాలను దృష్టిలో వుంచుకొనే 'నోరు తెరిచి మూయటం వలన కలిగే శబ్దం అతి సహజమయినది అని చెప్పాడు. నేను గమనించినంత వరకు 36 మాసాలదాకా శిశువులో ఈ వర్ణవ్యత్యయం, వర్ణపునరుక్తి (హల్ సమీకరణం వల్లకూడా) కనిపిస్తూ ఉన్నాయి. ఉదా॥ గుడ్డు–డుగ్గు, బిక్కి-కిప్పి, కంప–కప్ప, చెంబు–చెమ్మ, బిస్కెట్–బిక్కి, హలాది రూపాలు అజాది రూపాల తర్వాతనే సామాన్యంగా కనిపిస్తున్నాయి. మా పాపలో 12–20 మాసాల మధ్యనే అయ్యా, ఆయ్యయ్య, అమ్మయ్యలాంటి భావార్థక రూపాల్ని విన్నాను. అందుకే యామ్ – ని మౌలికమైన యూనిట్‌గా ఈ వ్యాసంలో గ్రహించడం జరిగింది–భౌతిక ప్రక్రియా

దృష్టితోనే ఈ 'ప్రెఫెరన్స్' జరిగింది. భిన్నభాషల్లోని పిల్లల్ని తులనాత్మకంగా పరిశీలిస్తే ఈ విషయం ఇంకా స్పష్టంగా తెలియవచ్చు.

2 తల్లి/తండ్రి రూపాల్ని ''హయ్యర్ ఫారమ్''లుగా ముందటి వ్యాసంలో గ్రహించాను (పుట 50). శ్రీ రావుగారు దాన్ని తప్పుగా అర్థం చేసుకొన్నారు. వ్యుత్పత్తి చెప్పగల్గిన పదాలు వృద్ధవ్యవహార లక్షణాల్ని కల్గినవన్న ప్రతిపాదనతో ఆ వ్యాసం మొదలు పెట్టాను. తలి ∫ తల్లి ∫ తలిరి రూపాలకు ప్రయిమరీ, ఫండమెండల్ ప్రెషర్ అన్న అర్థాల్ని నిఘంటువులు చూపిస్తున్నాయి. తన్–టి అన్న విభాగం 'తండ్రి'–లో సాధ్యం. ఇలాగే అణ్ణ (అన్న) రూపానికి వ్యుత్పత్తిని చూపుతూ DED తమిళం–అణ్–'ఉపరితలం / ముందటి' - అనే అర్థాల్ని చూపింది. ఈ ఉపపత్తులు కారణంగా వాటిని హయ్యర్ ఫారమ్‌లుగా గ్రహించడం జరిగింది.

రిఫరెన్సులు (పూర్వవ్యాసంలో లేనివి)

1 తిరుమలరావు, సర్వేశాయి, 'అయ్య శబ్ద చర్చ', భారతి, మే, పుటలు 67 – 68 (1980)

2 బ్రహ్మానంద హెచ్. ఎస్., 'శిశుభాష, మాతృ పితృ వాచకాలు', భారతి, మార్చి, పుటలు 48–55 (1980)

3 ,, 'వాక్కు–భాష', ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, పుటలు 13–18 (1980)

4 Leonard Lawrence B. 'Meaning in child language' issues in the study of early semantic development, Grane & Saration, Newyork (1976) Q from the Review of Keith T. Kernan, UCLA Lg. 55-1 PP. 245-247 (1979)

5 Burrow T, & Emenean M. B; 'The Dravidian Etymological Dictionary' (DED), Oxford. 1961.

డా. హెచ్. ఎస్. బ్రహ్మానంద

త్రికాండ శేష విశ్వ ప్రకాశములు

ఏప్రిల్ నెల 'భారతి'లో త్రికాండ శేష విశ్వ ప్రకాశ కోశములను గూర్చి శ్రీ విక్రాల శేషాచార్య విరచితమయిన ఒక వ్యాసము ప్రకటించబడినది. వారి వ్యాసమును చదివిన తరువాత నా పరిశీలనలో కనబడిన విశేషాలను పాఠకులముందు పెట్టుచున్నాను.

త్రికాండ శేషము

త్రికాండ శేషము, అమరకోశమను పేర ప్రసిద్ధమయిన అమరసింహుని నామలింగాను శాసనమునకు శేషగ్రంధమని వాడుకలో గలదు. త్రికాండమను కోశమొకటి ఉన్నట్లు 'ఆనందా ప్రెస్' వారి అమరకోశ పీఠికలో ఉదాహరించిన శ్లోకములవల్ల తెలియుచున్నదని శ్రీ విక్రాలవారు వ్రాసినారు. త్రికాండి – అను పేరుగల కోశమొకటి కలదని గురుబాల ప్రబోధికవల్ల తెలియుచున్నది. ''వరరుచి వాగురి వామనాది కృతాన్ త్రికాండ్యుత్పలినీ ప్రభృతీన్ గ్రంథాన్'' (గురు బాల ప్రబోధిక) ఈ త్రికాండీ కోశమే త్రికాండ కోశము కావచ్చును.

త్రికాండ శేషము దేనికి శేషము ?

త్రికాండ శేషములో ''అమరః స్వకోశే''–అనియు, ''అమరకోశవత్''–అనియు ఉండుటచేత అమరకోశముగా ప్రసిద్ధి కెక్కిన నామ లింగాను శాసనమున కిది శేష గ్రంధమన్న వ్యవహార మేర్పడినట్లు కనబడుచున్నది. ''ఈ త్రికాండ శేషము దేనికి శేషమో పండితులు తెలిపెదరుగాక'' అని శ్రీ విక్రాలవారు వ్రాసినారు. నామలింగాను శాసనము మనకు లభించుచున్నది గాని త్రికాండమను పేరు గల కోశము లభించలేదు. నామలింగాను శాసనములో మూడు కాండలే ఉండుటచే త్రికాండ శేషమనగా నామలింగాను శాసన శేషమన్న వాడుక ఏర్పడినట్లు కనబడుచున్నది. త్రికాండ శేషము నామలింగాను శాసన శేషమా? కాదా?–అన్న విషయమును తేల్చగలిగినచో అప్పుడది త్రికాండమను వేరే కోశమునకు శేష గ్రంధమని చెప్పవచ్చును. త్రికాండ శేష పీఠికలో శ్రీ శేషాద్రి రమణ కవులు త్రికాండ శేషమును గూర్చి ఇట్లు తెలిపినారు :

''త్రికాండ శేషమను పేర నామలింగాను
శాసనమున నుదాహరింపఁబడని పదము
లను సమకూర్చి యీ నిఘంట రాజమును
రచించిన మహామహుఁడు పురుషోత్తమ దేవుఁడు''

పయి వాక్యమునుబట్టి నామలింగాను శాసనములో లేని పదములను సమకూర్చి రచించుటచేత త్రికాండ శేషము నామలింగాను శాసన శేషమని పీఠికాకర్తలు భావించిరనుట స్పష్టము. కాని, పీఠికాకర్తల వ్రాత సరికాదు. నామలింగాను శాసనములోని కొన్ని పదములు త్రి కాం డ శేషములో ఉన్నవి. మచ్చునకు కొన్ని ఉదాహరణములు—

అగ్నాయీ :— అథాగ్నాయీ స్వాహా చ [నామలిం] స్వాహా త్వగ్నాయీ [త్రి శే]

అచల :— అచల శైల శిలోచ్చయాః [నామలిం] శైలేఽచలః [త్రి. శే.]

అచలా :— భూర్భూమి రచలా [నామలిం] అచలా భూమౌ [త్రి. శే.]

శంభుః, స్థాణుః :— శంభురీశః పశుపతి శ్శివః ... .. స్థాణూ రుద్ర ఉమాపతిః [నామలిం] శంభుః......స్థాణుః...... శివశ్చాస్య [త్రి. శే.]

బ్రధ్నః, రవిః, మిహిరః :— బ్రధ్న ప్రభాకర విభాకరాః... మిహిరః...రవిః [నామలిం] రవిః...బ్రధ్న...మిహిర మహిర పీథాః [త్రి. శే.]

పయి పరిశీలనమును బట్టి నామ లింగాను శాసనములోని కొన్ని పదములు త్రికాండ శేషములో ఉన్నట్లు తెలియుచున్నది. త్రికాండ శేషము నామలింగాను శాసన శేషమే అయినచో అందలి పదము లిందులో పునరుక్తములు కారాదు. కాబట్టి త్రికాండశేషము నామలింగాను శాసన శేషము కాదని నిర్ణయించవచ్చును ఇది త్రికాండములే — అను వేరే కోశమునకు శేషగ్రంథము కావచ్చును.

విశ్వ ప్రకాశము - విశ్వకోశము

వావిళ్లవారు విశ్వకోశమను పేర విశ్వ ప్రకాశమును ప్రకటించియున్నారు. పీఠికలో శ్రీమాన్ ఉత్పల వేంకట రంగాచార్యులు గారు విశ్వ ప్రకాశమే విశ్వ కోశమని ఇట్లు వ్రాసినారు :

> ''ఈ కోశమునకు విశ్వ ప్రకాశమని పేరిడి నట్లు కవియే 'కోశం విశ్వ ప్రకాశాఖ్యం' అని చెప్పియుండెను. కాని, మల్లినాథాది కృత వ్యాఖ్యానముల యందు 'ఇతి విశ్వః' అని యున్నది. ఇట్లుండచే నిది వ్యాఖ్యాత లిచ్చిన దాని కంటె భిన్నమని పెక్కురు తలంచుచున్నారు. కాని యట్లు కాదు. కవి నైపుణ్యమును బట్టియుఁ దాఁజూచిన గ్రంథ నిర్దేశములను బట్టియు నీ గ్రంథము చూచిన వారలకు రెండు నొకటియే యని తెలియక మానదు. వ్యాఖ్యాతలు 'విశ్వః' అని యనుట యుచ్చారణ సౌకర్యమునకే యని యూహింపవలసియున్నది.''

పయి పీఠికాకర్తల వాక్యములు పునః పరిశీలన కోరుచున్నవి. మల్లినాథుఁడు మేఘ సందేశ వ్యాఖ్యలో ఒకచోట విశ్వప్రకాశమని, ఇంకొకచోట 'ఇతి విశ్వః'అని పేర్కొన్నట్లు శ్రీ విక్రాలవారు నిర్దేశించినారు. ఇట్లు, మల్లినాథుడు నిర్దేశించిన నిఘంటు వచనములు విశ్వ ప్రకాశములో ఎట్లున్నవో వారు పరిశీలించలేదు. ''గంధో గంధక ఆమోదే లేశే సంబంధ గర్వయోదిత్యు భయత్రాపి విశ్వ ప్రకాశః''—అని మల్లినాథుఁడు తొమ్మిదవ శ్లోక వ్యాఖ్యలో వ్రాసినా డని శ్రీ విక్రాలవా రుదాహరించినారు. ఈ నిఘంటు వచనము వావిళ్లవారు విశ్వకోశ మనుపేర ప్రకటించిన విశ్వప్రకాశ కోశములో కనబడుచున్నది. పదవ శ్లోక వ్యాఖ్యలో మల్లినాథుడు ''ఆశాదిగతి కృష్ణయోరితి విశ్వః''—అని ఉదాహరించినట్లు శ్రీ విక్రాలవారు పేర్కొన్నారు. ఈ నిఘంటు వచనము విశ్వ ప్రకాశములో ఈ విధముగా లేదు. ''ఆశా తృష్ణాదిశోః ప్రోక్తా'' — అని విశ్వ ప్రకాశములో గలదు. దీనినిబట్టి విశ్వప్రకాశము 'ఇతి విశ్వః' — అని పేర్కొనబడిన విశ్వకోశము ఒకటి కావని చెప్పవచ్చును. 'ఇతివిశ్వః' అని మల్లినాథుడు పేర్కొన్న నిఘంటు వచనములు విశ్వ ప్రకాశములో వేరు విధముగా ఉన్నవనుటకు మరి కొన్ని ఉదాహరణములు రఘువంశ కుమార సంభవముల మల్లినాథ వ్యాఖ్యల నుండి చూపుచున్నాను.

(1) ఆత్మా జీవే ధృతౌ దేహే స్వభావే పరమాత్మ నీతి విశ్వః [రఘు 1–14 మల్లినా] ఆత్మా దేహమనో బ్రహ్మ స్వభావ ధృతి బుద్ధిషు ప్రయత్నే చాపి [విశ్వ ప్ర]

(2) వేలాకూలేపి వారిధేరితి విశ్వః [రఘు 1 – 30 మల్లినా] వేలా కాలేచ జలధేస్తీర నీర వికారయోః [విశ్వప్ర]

(3) శస్త్రమాయుధ లోహయోరితి విశ్వః [రఘు 2–40 మల్లినా] శస్త్రంలో హాస్త్రయోశ్శస్త్రీ ఛురికాయాం సవిశ్రుతా [విశ్వ ప్ర]

(4) తమోనుదోగ్ని చంద్రార్కా ఇతి విశ్వః [రఘు 3–33 మల్లినా] తమోదను దగ్నీం ద్వర్కేషు [విశ్వప్ర]

[5] భిత్తిః ప్రదేశేకుడ్యే చేతి విశ్వః [రఘు 5 – 43 మల్లినా] భిత్తిః కుడ్యే ప్రదేశేచ సవిభాగావకాశయోః [విశ్వప్ర]

(6) నిర్వేశో భృతి భోగయోః ఇతి విశ్వః [కుమార 1–29 మల్లినా] నిర్వేశో మూర్ఛనే భోగేనిర్వేశో వేతనేపిచ [విశ్వప్ర]

(7) ప్రసాదాన్ని జ నిర్మాల్యదానే శేషేతి కీర్తితా ఇతివిశ్వః [కుమార 3–22 మల్లినా] ప్రసాదో నిగ్రహే కావ్య గుణ స్వాస్థ్య ప్రసక్తిషు [విశ్వప్ర]

పయి ఉదాహరణములను బట్టి మల్లినాథుడు నిర్దేశించిన విశ్వకోశము, విశ్వప్రకాశము వేరు వేరు కోశములని తెలియుచున్నది. ఇంతేకాక మల్లినాథుడు విశ్వకోశము లోనివిగా నిర్దేశించిన కొన్ని నిఘంటు వచనములు విశ్వప్రకాశములో లేనేలేవు. ''గుణోఽప్రధానే రూపాదౌ...ఇతి విశ్వః'' [రఘు 3–27 మల్లినా], నమే రుస్సుర పున్నాగః ఇతి విశ్వః [కుమార 1–55 మల్లినా] ఇత్యాదులు విశ్వ ప్రకాశములో లేవు. లేవనగా అసలు గుణనమేరు శబ్దములే విశ్వ ప్రకాశమున గ్రహింపబడలేదు. కనుక, 'ఇతి విశ్వః' — అని

మల్లినాథుడు పేర్కొన్న విశ్వకోశము, విశ్వ ప్రకాశము వేరు వేరు కోశములే యని నిర్ణయించవచ్చును.

మల్లినాథుని విశ్వకోశమేది ?

మల్లినాథుడు నిర్దేశించిన విశ్వకోశము విశ్వప్రకాశము కాదని పయి పరిశీలనవల్ల తెలియుచున్నది. అట్లయిన మల్లినాథుడు నిర్దేశించిన విశ్వకోశమేది? అను విషయము పరిశీలించవలసియున్నది. విశ్వ ప్రకాశ కోశ కర్తయగు మహేశ్వరుడు తాను సంప్రతించిన పూర్వ కోశకర్తల నిట్లు విశ్వ ప్రకాశ ప్రారంభములో పేర్కొని యున్నారు :

''భోగేంద్ర కాత్యాయన సాహసాంక
వాచస్పతి వ్యాడిపురస్స రాణాం
సవిశ్వ రూపామల మంగళణాం
శుభాంగవో పాలిత ఖాగురాణాం
కోశావకాశాత్ప్రకట ప్రభావ
సంభావితా నర్ష్య గుణస్స ఏషః''

పయిని నిర్దేశించిన శ్లోకములో విశ్వరూప కోశమొకటి కనబడుచున్నది. ఈ విశ్వరూప కోశమునే మల్లినాథుడు ''ఇతివిశ్వః'' అని నిర్దేశించినట్లూహింప వచ్చును. మల్లినాథుడు 'ఇతి విశ్వః'— అని నిర్దేశించిన కొన్ని నిఘంటు వచనములు విశ్వ ప్రకాశములో యథా తథముగా కన్పట్టుచున్నవి. కొన్ని కొలది మార్పులతో గ్రహించినట్లు కన్పట్టుచున్నవి యథాతథముగా నున్నందుకుదాహరణములు :

(1) శాద[ః] కర్దమ శష్పయోరితి విశ్వః [రఘు 2–17 మల్లినా]

(2) శుచి శ్శుద్ధేను పహతే శృంగారాషాఢ యోస్సితే, గ్రీష్మేహుత వహేపిస్యాదితి విశ్వ; [రఘు 3–3 మల్లినా]

(3) ధృతిర్యో గాంతరే ధైర్యే ధారణాధ్వర తుష్టిష్వితి విశ్వః [రఘు 3–10 మల్లినా]

(4) ధాత్రీ జన న్యామలకే వసుమత్యుప మాతృష్వితి విశ్వః [రఘు 3–25 మల్లినా]

(5) క్షౌద్రం మధుని పానీయ ఇతి విశ్వః [రఘు 4–63 మల్లినా]

పయి విశ్వ కోశవచనములు విశ్వప్రకాశములో యథాతథముగా గ్రహించబడినవి కొలదిమార్పులతో గ్రహించినందుకుదాహరణములు:

(1) రసో గంధే రసే స్వాదే తిక్తాదౌ విష రాగయోః, శృంగారాదౌ ద్రవే వీర్యే దేహ ధాత్వంబు పారద ఇతి విశ్వః [రఘు 1–18, కుమార 1–29 మల్లినా]. ఇది దేహధాతౌ చపారదే — అన్న మార్పుతో విశ్వప్రకాశమున గ్రహించబడినది. తక్కిన భాగము రెండింట సమానమే.

(2) ప్రవాళో వల్లకీ దండే విద్రుమే బాల పల్లవే ఇతి విశ్వః [కుమార 1–44 మల్లినా]. ఈ నిఘంటు వచనము 'నవ పల్లవే' — అన్న మార్పుతో అట్లే విశ్వ ప్రకాశమున గ్రహించబడినది ఇట్లు పూర్వ కోశముల ననుసరించుట పరిపాటియే. ''అవష్టంభస్సు వర్ణేచ స్తంభ ప్రారంభయో రపి.'' ఈ నిఘంటు వచనము విశ్వ ప్రకాశములోను, మేదినీ కోశములోను సమానముగానే ఉన్నది. మేదినీ కోశకర్త దీనిని విశ్వప్రకాశము నుండి యథా తథముగా గ్రహించెను.

కాగా, మల్లినాథుడు పేర్కొన్న విశ్వకోశము విశ్వరూప కోశమయి ఉండును. విశ్వప్రకాశము నానార్థ నిఘంటువు. విశ్వరూప కోశము నానార్థ నిఘంటు మాత్రము కాకపోవచ్చును ఎందుకనగా, మల్లినాథుడు ''నమేరు స్సుర పున్నాగః ఇతి విశ్వః'' — అని పేర్కొనెను. నమేరు శబ్దమునకు నానార్థములు లేవుకాబట్టి విశ్వ ప్రకాశములో నమేరు శబ్దమేలేదు. దీనినిబట్టి కూడ మల్లినాథుని విశ్వకోశము విశ్వప్రకాశము కాదని చెప్పవచ్చును.

శ్రీ విక్రాలవారు విశ్వప్రకాశములో బహుదోషములు గలవని మేదినీ కోశకర్త చెప్పిన వాక్యమును పేర్కొని ఆ దోషము లేవో ప్రకటింపవలెనని కోరినారు. అవి కోశకర్త దోషములయి ఉండవు. లిపికర ప్రమాదాదులై యుండును. ''మూలము విషయములో నాగర లిపి ప్రతికిని, దీనికిని [అప్పన్నశాస్త్రిగారి ప్రతికిని] చాల పాఠభేదములును, దోషములును గలవు''— అని శ్రీ ఉత్పల వేంకట రంగాచార్యులుగారు చెప్పియున్నారు. కాన విశ్వ ప్రకాశ ప్రామాణ్య విషయమున సందేహములకు తావు లేదు

పయి చర్చకు సారాంశ మిది (1) త్రికాండ శేషము నామ లింగాను శాసన శేషము కాదు. త్రికాండమను పేరుగల వేరేకోశము సకల శేష గ్రంధము కావచ్చును. (2) మల్లినాథుడు నిర్దేశించిన విశ్వకోశము విశ్వప్రకాశముకాదు. ఇది విశ్వరూపకోశము కావచ్చును. (3) విశ్వ ప్రకాశములో మేదినీకర్త కలవన్న దోషములు లిపికర ప్రమాదాదులు కావచ్చును.

సంకేతాక్షర వివరణ

(1) త్రి. శే — త్రికాండ శేషము
(2) నామలిం — నామలింగాను శాసనము
(3) రఘు — రఘు వంశము
(4) మల్లినా — మల్లినాథ వ్యాఖ్య
(5) విశ్వప్ర — విశ్వ ప్రకాశము
(6) కుమార — కుమార సంభవము.

శ్రీ వి. చిరంజీవి

ప్రశేశిక

కీ శే. దేవులపల్లి కృష్ణశాస్త్రి స్వహస్తంలో వ్రాసిపెట్టు కున్న యీ సొంత భోగట్టాను నాకు దయతో ఇచ్చినవారు, కావలి జవహర్ భారతి ఆంధ్ర శాఖాధ్యక్షులైన శ్రీ యస్. వి. భుజంగ రాయశర్మగారు, అద్భుత విషయాల ప్రస్తావనలేవీ మెరుమెట్లు గొల్పకపోయినా, ఎంతో సంయమంతో సాఫీగా వ్రాసిన యీ సమా చారం కొంతైనా పరిశోధకులకు పనికిరాగలదు.

శ్రీ కె. వి. రమణారెడ్డి

కృష్ణశాస్త్రి స్వీయచరితాత్మక రచన (అముద్రితం)

Publications :

కన్నీరు (**book of Songs**); కృష్ణపక్షము, ప్రవాసము, ఊర్వశి (**volumes of poems etc**); మహతి (**Volume of one hundred devotional lyrics**); ఋగ్వేధి (**Translations into verse of Nayudu Garu's Sayings**;) ని శ్రేణి (**a volume of Songs**).

Unpublished :

(ఏ) బదరిక, ఆకలి, కార్తికి మొదలైన పద్యకృతులు, (బి) గుహుడు, ప్రసన్న పారిజాతం, విప్రనారాయణ, ధనుర్దాసం, ఆండాళ్ కల్యాణం, సాయుజ్యం, క్షీరసాగరమథనం (**The last one, a yakshaganam of the Kuchipudi type, use staged in the pre-ence of the president of the Kuchipudi troup, which has now taken up** విప్రనారాయణ; **I am now wri- ting** మాళవికాగ్నిమిత్రం (**a yakshaganam for 'Kalidasa' day) and some others.**

(c) Plays lyrical of Social

శర్మిష్ఠ, విద్యాపతి, శ్రీకృష్ణ జననం, కార్తికి, ఏడాది పొడుగునా, వేణుకుంజం, కొత్తకోవెల, రాజఘట్టము (**B 'cast on Gandhiji's anniversary day**) మహామేళనం (**The harmong of harmonies based on the National Anthem and some other songs of Tagore**), మదన సాయకు, ఋతుచక్ర, మైలురాయి, బహుకాల దర్శనం **and many others.**

(d) Literary essays (B' cast as talks)

ఊర్వశి (**The aesthetic ideal of the modern poet; its is the first literary talk b' cast from the Madras Station 25 years back much appreceites by the late Mutnuri Krishna Rao garu**): అప్పుడు పుట్టి ఉంటే; శ్రీనాథుని కవిత, తిక్కన ప్రతిభ; వేమన; ప్రాక్పశ్చిమ సమ్మేళనం సాహిత్యంలో **Blake, Edgan Allan Poe, Houseman,** రవీంద్ర స్మృతి, రవీంద్రుని ఉపనిషద్వాణి **and many others.**

(e) Creative Essays (B'cast as talks & skits)

కొలను కోవెల, సుగంధ ద్రవ్యాలు, మలుపు తిరిగితే, పుష్ప లావికలు, అమూల్యాభిప్రాయాలు, మా ఊరుపోయింది, గ్రామ వీధి అరుగు, రావిచెట్లు, నే నెరిగున్న రిక్షావాడు, జోళ్ళకు రంగువేసే వాడు, బహుకాల దర్శనం, సుబ్బమ్మవ్వ **and many others.**

రేడియోకి మొదటినుంచీ నేను వ్రాసినన్ని నాటికలూ, రూపకాలూ, ప్రసంగాలూ పాటలూ మొదలైనవి ఎవరూ వ్రాయ లేదు. రేడియోకి వ్రాసినప్పటికీ, అన్నిటికీ గొప్ప సాహిత్యపు విలువ ఉన్నవని విజ్ఞులూ, సాహిత్యనేత్తలూ అయిన కాటూరి, పద్మ రాజు వంటివారు ఎందరో అన్నారు నాటికలలో చాలా గొప్ప పద్యాలూ, పాటలూ ఉన్నాయి. ప్రసంగాలలో కొన్ని **English literature**లోని రకరకాల గొప్ప వ్యాసాల శ్రేణికి వచ్చేసి న్నాయని కొందరంటూరు **All India Radio** కూడా మొదటినుంచీ నా రచనలను ఉత్తమ శ్రేణిలో వేస్తున్నారని విన్నాను. అందుకనే 1952లో **B'casting Ministry** ఒక **Light Music conference** ఢిల్లీలో పిలిచినప్పుడు **South**నుంచి నేనొక్కణ్ణే వెళ్ళాను. దానికి సుమిత్రానందన్ పంత్, పంకజమల్లిక్ మొదలైన అయిదారు గురే ఆహూతులు. తర్వాత రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో మొదటి సారి ఢిల్లీలో ఏర్పాటుచేసిన కవిసమ్మేళనానికి మళయానికి శంకర్‌కురూప్, కన్నడానికి బేంద్రే, సుమిత్రానందన్ పంత్‌ని ఇలాగ ఆయా భాషలలో **foremost lyric poet**ను పిలిచారు. వాళ్ళం దరూ తర్వాత **AIR** లో **Producers**గా ఉండి, దరిమిలాని **literary Advisers**గా తీసుకోబడ్డారు. దాదాపు నా యీడువారే వాళ్లందరూ. వాళ్ల సాహిత్యజగత్తులో వాళ్లకు నేడు ఏ స్థాన ముందో, నాకు తెనుగు కవిలోకంలో ఆ స్థానమున్నది, **foremost lyric poet**గా. 1925 తర్వాత, కొన్ని సంవత్సరాలు నాదొక శకంగా సాగింది. కొన్ని యేళ్లపాటు, నా ప్రభావం పడని కొత్తకవి లేడు. శ్రీశ్రీ ప్రథమ గ్రంథం చదివితే ఈ సంగతి తెలుస్తుంది. తిరుపతి వేంకటకవులవల్ల ఒక తరంలో కవిత్వం ఉద్యమం అయి ఎంతో ప్రచారం పొందితే, తర్వాత నా తరంలో నవ్యకవిత్వం నావల్ల అంత ప్రచారం పొందింది-దేశం అంత కొన్నేళ్లపాటు తిరిగి కావ్య పఠనంచేస్తూ, ప్రసంగిస్తూ తిరగడంవల్ల 1922లో 'ఏకాంతసేవ'కు నేను వ్రాసిన పీఠిక-కొత్తకవుల **Literary Testament**గా ఎందరో కొంతకాలం అనుకున్నారు. దీనిని డాక్టరు బెజవాడ గోపాల రెడ్డిగారు ఇంగ్లీషులోకి తర్జుమా చేశారు. 1922 ప్రాంతాల్లో ఆంధ్రసాహిత్య పరిషత్తులో కార్యవర్గ సభ్యుణ్ణి. తరువాత 1943లో నవ్యసాహిత్య పరిషత్తు అధ్యక్షుణ్ణి. నా తరవాత కాటూరివారూ, మల్లంపల్లివారూ అయారు. 1945లో ఆంధ్ర

అభ్యుదయ రచయితల మహాసభకు అధ్యక్షుణ్ణి. ఇలాగ ఎన్నో సాహిత్య సభలకు అధ్యక్షుణ్ణి.

hailed as a New & original voice & leader of a New literary Movement

[ప్రస్తుతం నెల్లూరు కలెక్టరుగా ఉన్న శ్రీ రాజగోపాలన్ త్రివేండ్రం AIR స్టేషనుకు డైరెక్టరుగా ఉన్నప్పుడు శ్రీ శంకర్ కురూప్ అక్కడ Producer. రాజగోపాలన్ D G. తోనూ అప్పటి మంత్రితోనూ మాట్లాడి Literary adviserగా వేయించానని తానే నాతో చెప్పారు.]

కొన్ని వందల యేండ్లనుంచి కవిపండిత కుటుంబం. తండ్రి పెదతండ్రి మహాపండిత కవులు. నవ్య కవిత్వోద్యమంలో ఒక పీఠం నాది. కవిత్వంకోసం, సాహిత్యంకోసం, బ్రతికినవాణ్ణి. కాక, వీరేశలింగం, నాయుడుగార్ల ప్రభావంతో మత సంఘ సంస్కరణోద్యమాల్లో పడి, యిరవై యేళ్లపాటు సంఘబహిష్కారాన్ని అనుభవించినవాణ్ణి. నాపేరు కొందరు హరిజనులు పిల్లలికి పెట్టుకున్నారు; పిఠాపురంలో కళావంతులకు వివాహాలు ఇద్దరు ముగ్గురు స్నేహితులతో కలసి చేయించాను. నా తరం కవుల అందరిలోనూ, ప్రాత క్రొత్తలూ ప్రాక్పశ్చిమాలూ నాలో సమరసంగా కలిసినట్లు మరెవ్వరిలోనూ లేవని నేను చెప్పగలను. ఈ దృష్టితో చూస్తే రవీంద్రులు మొదలైన నేటి నాయకులకు నా అంత సన్నిహితుడు సంస్కృతిలో మరొకడులేడు.

సినీమాల్లో 'మల్లీశ్వరి' నా మొదటి చిత్రం ఇప్పటికీ classic గా నిలిచింది. మహాత్మునికి సంబంధించిన 'భారతవాణి' అనే చిత్రానికి శ్రీ దేవదాస్‌గాంధి నాచేత తెలుగులో వ్రాయించుకున్నారు. దాదాపు నావి వెయ్యి గేయాలకి తక్కువఉండవు. పోయిన సంవత్సరం మా స్టేషన్ డైరెక్టరు శ్రీ నాయర్ నన్ను గూర్చి ఢిల్లీకి Information పంపాలని నన్నేదో అడిగాడు, As a song writer (వాగ్గేయకారుడు)గ, ఎవరికో State award ను President's award ఇవ్వాలనిన్నీ, దానికోసం నా విషయం వ్రాయాలనిన్నీ.

నామీద త్రివేణి, కృష్ణాపత్రిక మొదలైన పత్రికలెన్నింటిలో విమర్శ వ్యాసాలు పడ్డాయి. 1925 తరువాత నావలె దూషణ భూషణలకు గురియైన ఆంధ్రకవి మరొకడు లేడు.

As a speaker.

నన్ను బలవంతపెట్టి, హైదరాబాద్‌లో ఈ ఉద్యోగానికి ఒప్పించారు.

నేను అడగకుండా ఆర్డరు వచ్చింది. వచ్చిన 6 నెలలు ఒప్పుకోలేదు. నాకూ నా పిల్లలకూ యిష్టంలేదు. వచ్చాక మా అమ్మాయి పోయింది. ఇప్పుడు దాని పేరున ఏదయినా endowment పెట్టాలని కాని, లేకపోతే ఉద్యోగం అక్కర్లేదు.

As a literary adviser like Kurup, Bendre, Sumitranandan pant who are all above Sixty.

or

as zonal producer.

లేఖలు

సవరణ

జూన్ (80) భారతిలో నా లేఖ పడింది. అందులో కొన్ని వింత తప్పులు (అచ్చువి) దొర్లాయి!

9. Sagtకి నేను 'జాగ్‌ట్' రాస్తే 'జాగ్'టో అని అచ్చు పడింది.

17. Ken అని రాస్తే Ren అని తప్పుపడింది.

22 త్వతి పేరాలో talk కి talr అని అచ్చు అయింది. అదే పేరాలో 'మాట'కి అనవసరంగా 'లు' చేరింది.

శ్రీ గంటి రామలింగం

శ్రీ పాలడుగు విమర్శ

ఏప్రిల్ 'భారతి'లో ''కలిసి వచ్చిన కలిమి'' (పిల్లల కథలు) అన్న నా పుస్తకంపై శ్రీ పాలడుగు వేంకటేశ్వరరావుగారి విమర్శ చదివాము. చాల బాగుంది. ముఖ్యంగా ముద్రణ, గెటప్ విషయాల్లో ఉన్నదిఉన్నట్లు వ్రాయుటమే అందుకుగల కారణం. బాలసాహిత్యమే కాదు ఏ సాహిత్యమైనా రచయిత తనకు తానుగా ప్రచురించుకొనే పుస్తకాలు కానీ, ప్రచురణ సంస్థలు ప్రచురించే ఏ రచయితల పుస్తకాలైనా ''గెటప్'' విషయంలోను, అచ్చు తప్పుల విషయంలోను, అతి జాగరూకతతో మెలగలన్న మెలకువను వారి విమర్శ మరోమారు జ్ఞాపకం చేసింది. ఐతే బహు చిన్నదే ఐనా, నా పుస్తకానికి సంబంధించినంతవరకు వారు పేర్కొన్న ''లక్ష్యశుద్ధి''కి అర్థమేమిటో నాకు అంతు దొరకలేదు.

నిష్పాక్షికంగా చక్కటి విమర్శను సాగించిన శ్రీ పాలడుగు వారికి నా అభినందనలు.

శ్రీ నరిశేపలి లక్ష్మీనారాయణ

బోపదేవకృత భాగవతము ?

ఈమధ్యన 'భారతి'లో శ్రీ విశ్వేశ్వరరావుగారు, శ్రీ విశ్వనాథమయ్యగారు వ్రాసిన లేఖ లో బోపదేవకృత భాగవతము అను గ్రంథమున్నట్లును, మహాభాగవతంతోడను, జైమిని భారతము తోడను దీనిని పోల్చి పరిశీలించవలసిన అవసరమున్నట్లును తెలిసింది. కాని ఈ అంశంలోని నిజానిజములను గ్రహించవలెనను ఉద్దేశ్యముతో, నేను బరోడాలోని తాళపత్ర గ్రంథాలయ పరిశోధనా సంస్థ

కును, పూనాలోని భండార్కర్ ఓరియంటల్ పరిశోధనా సంస్థ వారికిని బోపదేవకృత భాగవత సంబంధమైన తాళపత్రములున్నవా యని తెలుప ప్రార్థించితిని. పూనా, బరోడా సంస్థలు — అట్టి గ్రంథమునకు సంబంధించిన తాళపత్రములు లేవని వ్రాయగా, బరోడావారు మాత్రము "కొందరు భాగవత గ్రంథకర్తృత్వమును బోపదేవునికి ఆపాదింతురు" అని కూడ సమాధానమిచ్చిరి. కావున బోపదేవకృత భాగవతము ఎవరివద్దనైనను ఉన్నచో వారు ముద్రించి, లోకమున కెరుకపరచినచో, అనుమానములను, వివాదములను పరిష్కరించి, సాహితీ లోకమునందలి ఈ వివాదగ్రస్థ విషయమునకు ఒక మార్గము చూపిన వారగుదురని 'భారతి' పత్రికా ముఖమున విన్నవించుకొనుచున్నాను.

డాక్టర్ ముదిగొండ వీరేశలింగము

పరిశోధకుడి మనవి

ఆర్యా, పల్నాడు తాలూకా గామాలపాడు గ్రామమునకు చెంది, పై కళాశాలలో ఉద్యోగము చేయుచున్న నేను నాగార్జున విశ్వవిద్యాలయమువారి అనుమతితో పల్నాటి సోదర కవుల సాహిత్యమును పరిశోధనాంశముగా గ్రహించుట జరిగినది.

1 పల్నాటి సోదర కవులు, కీర్తిశేషులైన శ్రీ కన్నెకంటి ప్రభులింగాచార్యులు (1947), శ్రీ చినలింగాచార్యులు (1968), శ్రీ వీరభద్రాచార్యులు (1974) లను గూర్చి

2 వారితో పరిచయమున్న వివిధ కవి పండితులను, రాజకీయ నాయకులను గూర్చి

3 వారికి, గురువర్యులైనవారు, శిష్యులు, శిష్యప్రాయులైన (విద్యాభ్యాసము, కవితాభ్యాసములలో) వారిని గూర్చి

4 శతాధిక గ్రంథములతాలూకు పఠనములు. శతాధికావధానములు, హరికథా పురాణ ఉపన్యాసాదులు, రాజకీయ సభా సంబంధములు, సన్మానాది విశేషములు మొదలగు వానిని గూర్చి

5 పై వానిలో ఏ కార్యక్రమమైన మీ గ్రామములో లేదా మీ ప్రాంతములో జరిగినదో తత్సంబంధమైన విపులమైన విశేషములను గూర్చి

6 వారికి మీకు పరిచయమున్నచో పరస్పర పరిచయ విశేషములను గూర్చి

7 ఆర్థిక బాధలకు తరచుగా లోనయ్యెడి ఆ కవులకు మీ రెప్పుడైన సహాయ సహకారము లందించినచో వానిని గూర్చి

8 ఆ కవుల తాలూకు వీధినాటకములనుగూర్చి, కవితా సంబంధమైన విశేషములను గూర్చి, వారిపైగల ఇతర కవుల, వ్యక్తుల ప్రభావమును గూర్చి

9 కవుల కుటుంబములలో కూడా వారికి సంబంధించినవి, వారు వ్రాసిన గ్రంథములలో ఎక్కువ గ్రంథములు లభ్యమగుటలేదు. కనుక ఆ కవులకు సంబంధించిన ముద్రితాముద్రిత గ్రంథములు, లేఖలు మొదలగునవి మీ దగ్గర నున్నచో వానిని గూర్చి, మీ గ్రామ గ్రంథాలయములో లేదా సమీపములోనున్న గ్రంథాలయములలోనున్న వాని విశేషములను గూర్చి

10 ఆ కవులను గూర్చి మీరు చెప్పగలిగిన ఇతర విశేషములు.

11 ఆ కవులకు సంబంధించిన బంధుమిత్రులు, ఇతర పల్నాటి కవులకు సంబంధించిన విశేషములను గూర్చి తెలియజేసి

12 ఆయా కవులకు సంబంధించిన జీవితము, రచనలు, అవధానములు, మొదలగువాని విషయ సేకరణలో మీరు సముచితపాత్ర వహించి సహకరించ గలరని ప్రార్థించుచు,

శ్రీ చిట్టిప్రోలు సుబ్బారావు

1979 సం. 'భారతి' జనవరి, మే నెలలోను, 1980 సం. మే నెల యందును డా. జి. జవహర్లాలుగారు జైనులచరిత్ర గురించియు, వారి మతమును గూర్చియు వ్రాసిన వ్యాసములు చాల విషయములను తెలియజేయుచున్నవి. అవి కేవలము చరిత్రకు సంబంధించినవైనను సాహిత్య మాసపత్రికలో ప్రకటింపబడుటచే చరిత్రకు సాహిత్యమునకు నున్నకర్షత హెచ్చుచేయుచున్నవి.

'79 జనవరి సంచికలో జైనముచే ప్రభావితము కాని గ్రామము ఒక్కటి కూడ లేదనుచు, తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురము, ఆర్యవటాలు పేర్కొనినారు. తాటిపాక, నేదునూరు గ్రామములు పేర్కొనబడలేదు. తాటిపాకలో జైన విగ్రహము, మఠము ఉండెడివి. ఇది రాజోలు తాలూకాలో తాలూకా కేంద్రమైన రాజోలుకు 5 కి. మీ. దూరములో ఉన్నది. నేదునూరులో మహావీరుని రాతి విగ్రహమొకటి ఒక యింటి గోడలకు పునాదులు త్రవ్వుచుండగా కనిపించినది. దానిని బైటకుతీసే అవకాశము లేక భుజము వఱకు త్రవ్వి 20,30 సం.లు అట్లేయుంచిరి 1978 సం.లో పూర్తిగాత్రవ్వి విగ్రహము కొన్ని శతాబ్దములుగా పడియున్న చోటనే ఒక చిన్న ఆలయము నిర్మింపబడినది.

కళింగాధిపుడైన ఖారవేలుడు (క్రీ.పూ. 168) గాఢ జైనమతాభిమానియని శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు వ్రాసిన "ఆంధ్రదేశములో జైనావశేషములు" అను గ్రంథమువలన తెలియుచున్నది. మగదాధిపతియగు మహాపద్మనందుడు మున్నెన్నడో కళింగము నుండి మగధకు గొనిపోయిన కళింగ జైనవిగ్రహమును మఱల తిసికొనివచ్చుటకై ఖారవేలుడు మగధపై దండయాత్రచేసి, అప్పటి మగధ రాజైన పుష్యమిత్ర సుంగుని ఓడించి జైన విగ్రహమునకై కొనివచ్చెనని హాథీగుంఫా శాసనములో ఉన్నది. ఖారవేలుడు తదుపరి తన ప్రతిభను ఆంధ్రదేశముపై కూడ చూపవలెనని దండయాత్ర

జరిపి ముషిక నగరమును బెదిరించినట్లు కూడ ఆ శాసనములో ఉన్నది. ఖారవేలుడు జయించిన 'పిథుండ'ను 'పృథు + అండ' అని సంస్కృతీకరించి, పిథుండ అనగా గ్రుడ్డుపల్లి – అదియే గుంటుపల్లి–అది పశ్చిమగోదావరి జిల్లాలోని దనుట సరిగాలేదు. ఏలయన 'పృథు+అండ' అనగా గొప్ప (పెద్ద) గ్రుడ్డు అని అర్థము; 'పిథుండ' పెద్ద అండలూరు కావలయును. శాతవాహనరాజుపై తన ప్రతిభను చూపుటకు ఖారవేలుడు కృష్ణానదిని చేరి, మచిలీపట్టణమువద్దనున్న పిథుండను ధ్వంసం చేసినట్లు ఆ శాసనము వలన తెలియుచున్నది. కావున ఖారవేలుడు కళింగమునుండి సముద్రయానమున దక్షిణ దిశగా పయనించి, నదీ ముఖద్వారమున కృష్ణానది (మైసొలెస్)లో ప్రవేశించి, విజయవాడకు ఉత్తరముగా 10 కి. మీ. దూరమున ఆ నది యొడ్డునయున్న గుంటుపల్లిని చేరుకొనియుండవలెను. కాని ఈ గుంటుపల్లిలో జైన, బౌద్ధమతావశేషము లేమియును ఇప్పుడు లేవు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న గుంటుపల్లి మొన్నమొన్నటి వఱకు బౌద్ధమత క్షేత్రమనియే పలువుర విశ్వాసము. కావున ఖారవేలుడు కృష్ణానదిలోవచ్చి మచిలీపట్టణమునకు చేరువుగ ఉన్న పిథుండను ధ్వంసంచేసి వెళ్ళెనని చెప్పు శాసనమందలి గుంటుపల్లి పశ్చిమ గోదావరి జిల్లాలోనిదో, కృష్ణాజిల్లాలోనిదో తేల్చవలసియున్నది.

జైన తీర్థంకరులు 24మంది, వారిలో ఆదినాథుడు ఋషభుడు మొదటివాడు, రెండవవాడు ఋషభుని రెండవకుమారుడైన బాహుబలి, అజితనాథుడు, ఎనిమిదవవాడు చంద్రప్రభు, పదియవవాడు శీతలనాథుడు, పదారవవాడు శాంతినాథుడు, ఇరువది రెండవవాడు నేమినాథుడు, ఇరువది మూడవవాడు పార్శ్వనాథుడు, ఇరువది నాల్గవవాడు మహావీరుడు అని వ్రాయుటయేగాని ఆ ఇరువదినాలుగు తీర్థంకరుల పేర్లు కాల నిర్ణయముతో ఉన్న చరిత్ర గ్రంథ మిత్రులకును వెలువడలేదు. సిద్ధార్థినామ సంవత్సరాది సంచికయందు అరుద్రగారు వ్రాసినట్లు జైనుల విషయములో చేయవలసిన పరిశోధన ఇంకను ఎన్నో ఉన్నవి. 22వ తీర్థంకరుడైన అరిష్టనేమి శ్రీకృష్ణభగవానుని మేనత్త కొడుకనుట కాల నిర్ణయమునకు కొంత తోడ్పడవచ్చును.

శ్రీ కె. విశ్వేశ్వరరావు,
హైదరాబాదు.

"శైలి – పాశ్చాత్య పండితాభిప్రాయ పరామర్శ" అన్న వ్యాసంలో (మే 1980) రచయిత పాశ్చాత్య విమర్శకుల అభిప్రాయాలను చక్కగా క్రోడీకరించినారు. కాని చేస్తున్న పనిని మరచి– "సంస్కృత భాషలో ఈ శబ్దంఉన్నా అది ఒక సాహిత్య సంప్రదాయంగా రూఢికెక్కింది పాశ్చాత్య సాహిత్యంలోనే. శైలీసిద్ధాంతం పాశ్చాత్య సాహిత్యం నుంచే మనకు దిగుమతి అయింది" అని అన్నప్పుడు తమ అజ్ఞత్వాన్ని బయటపెట్టుకున్నారు. సంస్కృతాలంకారికు లెవరు శైలి అన్న శబ్దాన్ని పేర్కొనలేదు. అది సంస్కృత శబ్దమే అయినా కొత్తగా మాత్రమే వాడుకలోకి వచ్చింది. అయితే మన ప్రాచీనాలంకారికులు "శైలి"కి మారుగా శైలి కన్న విస్తృతార్థాన్ని చెప్పే "రీతి" శబ్దాన్ని ప్రయోగించినారు. "... **it is neither impossible nor incorrect to render Riti by the English word style, that Riti comprehends not only Gunas but Alankaras and Rasas also ... ...**" అని శ్రీ వి. రాఘవన్‌గారి అభిప్రాయం.[1]

నాట్యశాస్త్రకర్త భరతుడు వృత్తులను గూర్చి మాత్రమే చెప్పినా తర్వాత కావ్యశాస్త్రాలను వ్రాసిన వామనకుంతకాదులు రీతులకు పీటను వేయకపోలేదు. వామనుడు "రీతిరాత్మా కావ్యస్య" అని రీతి సంప్రదాయాన్ని స్థాపించినాడు కూడ. అటువంటప్పుడు శైలీ సిద్ధాంతం పాశ్చాత్య సిద్ధాంతం నుంచే మనకు దిగుమతి అయిందనడం ఎంత పొరపాటో రచయిత గ్రహించాలి.

మొదట భౌగోళిక ప్రాంతీయ భాషాభేదాన్ననుసరించి రీతుల భేదము ఏర్పడినా, కవిచేత ప్రయోగించబడిన విశిష్టపద సంఘటనయే రీతి అని రూఢి కెక్కింది. భౌగోళిక ప్రాంతాన్నిబట్టి రీతని పేర్కోవటం ఇష్టంలేని కుంతకుడు రీతిని 'మార్గ'ంగా చెప్పినాడు. కవి శక్తి, వ్యుత్పత్తినిబట్టి రీతి వుంటుందని కుంతకుని అభిప్రాయం గమనించదగింది. రీతిని మార్గంగానేకాక ఇతరాలంకారికులు గతి, పంథా, ప్రస్థానాలుగా పేర్కొన్నట్లు తెలుస్తున్నది. పాశ్చాత్యులు కూడ **grave, medium, attenuate** అనీ **plain, elegant** అనీ **style** లోని భేదాలను గుర్తించినారు.

రసానికే పట్టం కట్టిన అలంకారికులు రీతిని కూడ రసానికి చేదోడు వాదోడుగల సఖిగా చేసిపెట్టినారు. అట్లయినా రీతిని గుర్తించి ప్రత్యేక కవితా ప్రస్థానం ఆదరించిన ఆలంకారికులున్నారు, కవులు కూడ వున్నారు.

ఇకపోతే కవి ఆత్మీయతకు, శీలానికి శైలి ప్రతిబింబమనే మతాన్ని గూర్చి మన అలంకారికులు ఎక్కువ చర్చించకున్నా అది పూర్తిగా వారి దృష్టిని తప్పించుకోలేదు. ఒకచోట కుంతకుడంటాడు– "...కవి స్వభావ భేద నిబంధ నత్వాద్ అనంత భేద భిన్నత్వ మనివార్యం ."[2] శ్రీ వి. రాఘవన్‌గారి అభిప్రాయం – "**...that Ritis are not so few as two or six but really as infinite as poets and that at least one or two Alankarikas and poets have related Riti to the poet.**"[3]

తద్భేదాస్తు న శక్యన్తే వక్తుం ప్రతికవి స్థితాః
ఇక్షుక్షీర గుడాదీనాం మాధుర్య స్యాంతరం మహత్
తథాపి న తదాఖ్యాతుం సరస్వత్యాపి శక్యతే[4]

కవి రీతులు అనంతాలు. వాటి భేదాలను తెలపడం సరస్వతికి కూడ శక్యం కాదని దండి అంటాడు.

1 Some concepts of Alankara Sastra, Page 140.
2 వక్రోక్తి జీవితమ్. పుట 102.
(ఆత్మారాం అండ్ సన్స్. ఢిల్లీ)
3 Some concepts of Alankara Sastra Page 140.
4 కావ్యాదర్శః. –101, 102.

డా. ముదిగంటి సుజాతారెడ్డి

మరలా గురజాడ

"టెంపర్ కోల్పోకుండా అనంతంగా వాదించగల" శ్రీ తిరుమలరావుగారు, టెంపర్ కోల్పోయి, నాకు 'శిశుపాల వారసత్వాన్ని' అంటగట్టిన లేఖను చదివాను. ఈ శుష్క వివాదాలు, సాహితీపురోగమనానికి ఏవిధమైన ఆస్కారమూ చేయవు. అయినా కొన్ని విషయాలను స్పష్టీకరించేందుకు ప్రత్యుత్తరాలు ఇవ్వాల్సి వుంటుంది.

శ్రీ సూరిగారు పేర్కొన్నట్లు గురజాడ, ఆంగ్లేయుల సంస్కృతివలన ప్రభావితుడైన వ్యక్తి అన్నది స్పష్టమైన విషయం ఆంగ్లేయులు ఈ దేశాన్ని దోచారనడమూ చారిత్రాత్మక సత్యం, మీరెంత కష్టపడి సమర్థించినా, గురజాడ వంటి "లిబరల్"లు, ఏనాడూ ప్రగాఢ దేశభక్తులు కాలేరు. సాంఘిక సమస్యలలో ఎంత తిరోగమన దృష్టి అవలంభించినా (అసలు విశ్వనాథ వారి వేయిపడగలలో చర్చించిన కొన్ని విషయాలు, మావో సిద్ధాంతాలలో కొన్నిటికి సామీప్యంగా వున్నాయి. ముఖ్యంగా విపరీతమైన యంత్రాలపై ఆధారపడటం, ఏ విధంగా సామాజిక సహకారాన్ని నమ్మచేసి, మానవులలో స్వార్థపరత్వాన్ని పెంపొందిస్తుందని హెచ్చరించడం మొ॥ దీన్ని గురించి మరోమారు) విశ్వనాథవారి ప్రగాఢ దేశాభిమానాన్ని ఎవరూ ఏనాడూ శంకించలేరు. వారు ఏ 'దేశపు' ఏజెంట్లూ కారు.

ఈ సంఘ సంస్కర్తలకు, దేశాభిమానం, ప్రజలలో రాజకీయ చైతన్యం కల్గించడం వంటివి అసలు దృష్టిలో లేవు. వారు హిందూదేశ సంస్కృతిని, హిందూ సమాజాన్ని ఆంగ్లేయులు రంగుటద్దాలలో చూశారు. వారికి కనపడింది అంతా చెడే. దీనికై, "లింగిరీజుల" పాదాలను భక్తితో సేవించారు. దాన్ని గర్వంగా చెప్పుకొన్నారు ఇది ఏదో చరిత్ర అవగాహనలో వారి పొరపాటుగా మర్చిపోవాలే కానీ, వారికి లేనిపోని బిరుదులిచ్చి సత్కరించడం ఏమంత సమంజసనీయమైన విషయం ?

అసలు మన దేశ దురదృష్ట జాతకంవల్లన, మనకు స్వాతంత్ర్యం మరీ చౌకగా దొరికింది కానీ, భగత్‌సింగ్, సావర్కర్ వంటి విప్లవయోధుల ఆధ్వర్యంలో రక్తపాతంతో స్వారజ్యం మనం సాధించివుంటే, ఈ దేశపు చరిత్రే మరో మాదిరీ వుండేది. అటువంటప్పుడు గురజాడ వంటివారు, ప్రజాకవులో, దేశద్రోహులో చరిత్రే నిర్ణయించేది.

హిందూ సమాజంలో చెడులేదని ఎవరూ అనరు. అసలు చెడులేని సమాజ మెచ్చటనూలేదు. ప్రతి సమాజమందును, ప్రతి మతమందునూ, కొన్ని అవాంఛనీయ పరిస్థితులుండును. కానీ, వాటిని, ఆ సమాజంలోని వ్యక్తులే, కుటుంబ వ్యవహారమట్లు పరిష్కరించుకొనుట యుక్తమము కానీ, ఇతరుల సహాయ మాపేక్షించుట, వారి ఆధిక్యతను అంగీకరించుటయే కదా ! "ఎవరి వీపు దురదైతే వారే గోక్కోవాలి" అనేదే మా వుద్దేశ్యం. కానీ గురజాడ వంటివారు, ఈ వీపు గోకునకు, విదేశ సహాయం అర్థించారు. తత్ఫలితంగా జరిగే, ఆర్థిక దోపిడీని గుర్తించలేకపోయారు. ఇది వాస్తవం. ఇక దీనిపైన మీరు చిత్రవిచిత్రం వ్యాఖ్యానించి, "ఆ దరిద్ర హిందూ సమాజంకన్నా పసందైన, తెల్లదొరల తెల్లటి అదలింపు ఎంతో మేలని" అనుకోవొచ్చు. అది మీ వ్యక్తిగత అభిప్రాయం. అయితే, మావంటి సంకుచిత దేశాభిమానులు, మా కొద్దీ తెల్లదొరతనమూ అని పాడిన వారికి అశ్రుతర్పణం చేస్తాం, అల్లూరి సీతారామరాజును, ఒక విప్లవకారునిగాకాక–రాజద్రోహిగా చిత్రించింది మీ "లిబరల" సంస్కృతి. శూద్రుడైన బద్దన్నను "మహా సేనానిగా' చిత్రించింది "వైశ్వనాథ ఛాంధసత్వం". మరి వీరు ప్రతిద్వంధులు కారా ?

గురజాడ రచయిత కాదు అనేటటువంటి మూర్ఖత్వం నాకింకా అబ్బలేదు. అయితే, విశ్వనాథతో పోల్చిచూసీ ఏ కోశానా, గురజాడవలె, విశ్వనాథ ప్రజాకవి కాలేడన్న అన్న మీ విపరీత సిద్ధాంతం ఒక పట్టున జీర్ణంకాదు. ప్రజలంటే మనకు తెలుగువారే కదా. మరీ ఈ తెలుగువారి సంస్కృతిని, జీవితాన్ని, అలవాట్లను, ఆచార వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి గొప్పతనాన్ని ప్రశంసించి, తన నవలల ద్వారా, పద్యాల ద్వారా, వాటికి శాశ్వతస్థానాన్ని యిప్పించిన విశ్వనాథ ప్రజాకవి కాడా ? తుదకు జ్ఞానపీఠ బహుమతి పొందిన వారి రామాయణ కల్పవృక్షంలో కూడా సీతారాముల కళ్యాణాన్ని, తెలుగు వారింటి పెండ్లివలె ముచ్చటగా వర్ణించాడే, ఇది ప్రజా కవిత్వంకాదా? 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' ద్వారా, మన భాష గొప్పతనాన్ని తెలిపినారు. "లింగరీజులు" పన్నిన కుతంత్రం వలన తయారైన భారతదేశ చరిత్రకు, తమ పరిశోధనల వలన నూతన రూపమొనరించి, కాశ్మీరదేశపు చరిత్రను మనకందజేసినారు. ఆర్య, ద్రావిడ వంటి విభజన. ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు, మన ఐక్యతను చీల్చడానికి ఏర్పాటుచేసారని, ఈ సిద్ధాంతాన్ని నిరాకరించారు.

వారి ఆంధ్రప్రశస్తిలో మాధవవర్మ చరిత్ర నిజంగా ప్రజాకవిత్వమే. రథ ప్రమాదంలో మృతి నొందిన తన "మృత పుత్ర కళేబరాన్ని" రాజు ముందుంచిన, ఆ వృద్ధమాత ద్వారా, కవి పలికించిన పల్కులు పరిశీలించండి : "రాజులైన అదలించవొచ్చు ... సరే, ప్రజలనిట్లు నకారణంబుగ చంపనేటికిన్" అని, ఆ వృద్ధ పేదరాలుచే రాజును నిలదీసి ప్రశ్నింపజేస్తాడు కవి. (ఇటువంటి ఉదాత్త రచనల నొనరించిన వ్యక్తినిగాక, మన సమాజాన్ని ఒకే రీతిగా వెక్కిరించిన వ్యక్తిని, ప్రజాకవిగా అనాలనుకొంటే, అది మీ వ్యక్తిగత అభిప్రాయాన్ని సమాజంమీద రుద్దడం వంటిదే అవుతుంది.) ఈవిధంగా ప్రజాశక్తిని, రాజశక్తికి ఎదురుగా నిలపెట్టిన

సంఘటనలు విశ్వనాథవారి నవలలో వేలకువేలు. గురజాడలో అటు వంటివి మచ్చుకు చూపమని ప్రార్థన.

'ఆస్థాన విదూషకుడు' తనను పోషించే రాజులకు వినోద ప్రియంగ కొన్ని ప్రసంగాలు చేస్తాడు. వాటిద్వారాజరిగే, సాంఘిక ప్రయోజనం, బై ప్రోడక్ట్సులుగా స్వీకరించాల్సిందేగాని, ఉద్దేశపూర్వకంగా జరిగినవి కావు. పులిచెర్లగారు, గురజాడ ఏ ఉద్దేశ్యంతోనూ కన్యాశుల్కం రాయలేదని అన్నారు. ఒకవేళ గురజాడకు, సాంఘిక ప్రయోజనమే, అంతదీక్షతో వుంటే, మరి ప్రదర్శనయోగ్యంకాని, చౌడయ్య భాషలో ఎందుకు రచన చేసారో దురూహ్యం. ఏమైనా, దీనిపైన కొద్ది రిసెర్చి అవసరం. ముక్కు తిమ్మన్నగారి పారిజాతాపహరణానికి మూలకారణం, రాయలవారు ఏకాంతంగా వున్నప్పుడు స్త్రీలు ఏవిధంగా ప్రవర్తిస్తారో తెలుసుకోవాలి అన్న వాంఛట, అని ఎవరో చెప్పగా విన్నాను. అటువంటి ఏ కారణమైనా జమీందార్‌ను ప్రోత్సహించిందేమో ?

గురజాడవారి పూర్ణమ్మ కథ చదివాను. పుత్తడిబొమ్మ పూర్ణమ్మ కథ కరుణామయమైనది. అయితే అటువంటివి మన భాషలో లేనేలేవా ? అనంతపురం దగ్గరవున్న ముసలమ్మ కట్ట కథ అంతకంటే కరుణామయమైందే. జంధ్యాల వారి కరుణశ్రీలో లేనంత కరుణ ఇంకెక్కడైనా వుందా. కంకటవారి సీతాపరిత్యాగంలో లేదా కరుణ? మరి వీరెవ్వరికీలేని కిరీటం గురజాడకెందుకు ?

నాకు కడుపు ఉబ్బరానికి హాము నిర్ణయించారు. సంతోషం. మన దేశపు ఆయుర్వేద మందులే నాకు చాలా ఇష్టం. బహిఃప్రదేశానికి పోయినప్పుడు పేపర్లతో తుడుచుకొనే, ఆ ఇంగిరీజుల సంస్కృతికన్నా కడుపుబ్బరానికి హాము తినే ఛాందసత్వమే నాకు మేలు. నమస్తే సార్ !

డా. మురళీధర్,

బొంబాయి.

విష్ణుకుండినులు వంశ, కాలానుక్రమణికలు

(43వ పేజీ తరువాయి)

పరిమితిగల చక్రవర్తి క్షేత్రంగా పేర్కొన్నది.[184] కాని అది కేవలం గ్రంథగతం. పొలమూరు శాసన కాలానికి పూర్వం దక్షిణదేశమేలిన యే మహామహారాజూ ఇట్టి బిరుదాన్ని ధరించి యుండలేదు. అందుచేత ఈ సమాసం కౌటిల్యునికంటె రాజశేఖరునికే చేరువవుతున్నది. అంతేకాక, దక్షిణ దేశంలోనికి సంస్కృతభాషా వ్యాప్తి జరిగిన విధానాన్నిది విశదీకరిస్తున్నట్లు భావించవచ్చు. మొదట రాజభాషగాను, తర్వాత పండిత భాషగాను సంస్కృతవ్యాప్తి జరిగిందని, అందుచేనే తొలి సంస్కృత శాసనాలు సారస్వత లక్షణాలు కల అలంకారిక భాష నుపయోగించక, కాలక్రమేణ అట్టి పరిణామం జరిగిందని తోస్తుంది.

ఇక శాసన ప్రణాళికలో రెండు పొలమూరు శాసనాలకు ప్రదాన భాగంలో దాన గ్రహీతను, అతని తాత తండ్రులను వర్ణించిన తీరు ఒకేవిధంగా ఉంది.[185] అంతేకాక, శాసనాజ్ఞప్తులను గూర్చిన ప్రస్తావనలో పొలమూరు శాసనం పేర్కొంటున్న "హస్తికోశ, వీరకోశ" పదాలు[186] మరే యితర విష్ణుకుండిన శాసనంలో కానరావు. అవి జయసింహ వల్లభుని పొలమూరు శాసనంలో కన్పిస్తాయి.[187] అలాగే ప్రదాన ప్రకటన, దాన సంరక్షణను గూర్చి గ్రామస్థులకు చేసిన హెచ్చరికలు రెండు శాసనాలలో మక్కికి మక్కిగా ఒకే పాఠం.[188] అటువంటి పాఠం మరే ఇతర విష్ణుకుండిన శాసనంలోను కన్పించదు.

ఈ పరిశీలన వలన విష్ణుకుండిన మాధవవర్మచే నీయబడినట్లు చెప్పకొంటున్న పొలమూరు శాసనము, వాస్తవంగా తూర్పు చాళుక్య శాసన ప్రదానానంతరం అందలి కొంత పాఠాన్ని గ్రహించి; ఆనాటికి విష్ణుకుండినుల సార్వభౌమత్వము, బిరుద ప్రశంసల గూర్చిన జన శ్రుతులను కొంతవరకు మేళవించి, కల్పించబడిందని స్పష్టంగా నిశ్చయించవచ్చు. మాధవవర్మ న్యాయ పరిపాలన గూర్చి జన బాహుళ్యంలో వ్యాపించిన కట్టుకథలను పొలమూరు శాసనం "అవసిత వివిధ దివ్య"[189] అన్న బిరుదుతో సూచిస్తున్నదనవచ్చు. అలాగే విక్రమహేంద్రుడనే రాజును శాసనకర్త కల్పించినట్లే భావించవచ్చు. ఈ కల్పన కాధారం విష్ణుకుండిన రాజులలో మాధవవర్మ తర్వాత అధిక సంఖ్యాకుల నామధేయం విక్రమేంద్రవర్మ కావడమో, లేక తుది విష్ణుకుండిన రాజును జ్ఞప్తిలో నుంచుకొని ప్రస్తావించడమో కావచ్చు.

అయితే, ఈ పరిశీలనా ఫలితంగా పొలమూరు శాసనం స్వత్వమైనది కాదని నిర్ణయించినా, మాధవవర్మ ఆ గ్రామదానం చేయలేదని మాత్రం చెప్పరాదు. విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికల నిర్మాణానికి మాత్రమది విశ్వసనీయమైన సాక్ష్యాధారం కాదనేదే ప్రస్తుతవాదం. ఆ దానం జరిగిన బహుకాలానంతరం, బహుశః అసలు శాసనం నష్టమైనందున, దానిని పునర్నిర్మించ వలసి వచ్చిందని తోస్తుంది. నష్టమైన శాసనాలకు మారుగా, సరియైన దాఖలాలను చూపి, క్రొత్తగా తామ్రపత్రాలను దాన గృహీతలు పొందడం ప్రాచీన భారత దేశంలో ఉంది.[190] కాని, విష్ణుకుండినుల పొలమూరు శాసన మా కోవకు చెందక, దాని వికృతాక్షరాలు, అసంబద్ధ సమాచారాన్ననుసరించి, దానగృహీత వంశీయుడెవడో, అప్పటికప్పుడేదో అవసరాన్ని పురస్కరించుకొని, కల్పించి, చెక్కించినట్లు కన్పిస్తుంది.

(ఇంకా వుంది)

గ్రంథ విమర్శలు

చారు చర్య
(Good Conduct)

[సంస్కృత మూలకర్త : క్షేమేంద్రుడు. ఆంధ్రానువాద కులు శ్రీ పి. వి. రమణారెడ్డి, ఎం. ఏ., డెమ్మీ 124 పుటలు. వెల : 4 రూ. ప్రతులకు : చిరునామా పి. వి. రమణారెడ్డి, వాణీ నిలయం, 11-14 3ఎ, వెస్ట్ ఎక్స్ టెన్షన్సు, నరసరావుపేట]

మహాకవి క్షేమేంద్రుడు కాశ్మీర దేశస్థుడైన మహాపండితుడు. సాహిత్యాది శాస్త్రాలలో పెక్కు గ్రంథాలు రచించి విఖ్యాతి పొందినవాడు. అతని ఔచిత్య విచార చర్చ, చారుచర్య మిక్కిలి ప్రచారాన్ని పొందాయి. ఔచిత్య విచార చర్చ అలంకార శాస్త్రానికి సంబంధించినది. చారుచర్య నీతిశాస్త్ర గ్రంథం. భారతీయుల ఉత్తమాచారాలు ఎటువంటివో, ఉత్తమ శీలం సంపాదించుటకు ఏవిధంగా నడుచుకోవలెనో యీ "చారుచర్య" లో సంగ్రహంగా వివరించబడినది.

ఇందులో నూరు శ్లోకాలున్నవి. మొదటి రెండు శ్లోకాలను, చివరి శ్లోకాన్నీ విడిచి పెట్టి తక్కిన శ్లోకాలన్నింటిలోనూ ఒక నీతి, దానికి దృష్టాంతం చూపబడినవి. శ్లోకాలన్నీ అనుష్టుప్ ఛందస్సునకు చెందినవే! వీటిలో మొదటిభాగం నీతిని బోధించేది. రెండవ భాగం — ఆ నీతికి చెందిన ఉదాహరణను మిక్కిలి సంగ్రహంగా ఉంటుంది. అవి పురాణ గాథలు తెలిసేవారికి మాత్రమే అర్థం కాగలవు. ఈ విషయాన్ని గ్రహించే దీనికి హిందీలో వ్యాఖ్య రచించిన దేవదత్త శాస్త్రిగారు ఆయా సందర్భాల ననుసరించి ఆ పురాణ కథలను వివరిస్తూ విపులమైన వ్యాఖ్యను రచించారు. వారి వ్యాఖ్యకు పూర్వం దీనికి వ్యాఖ్య ఉన్నదో, లేదో? ఉన్నా అది ఎక్కువ ప్రచారంలో లేదని అనుకోవాలి.

ఇట్టి ఉత్తమ గ్రంథానికి ఇంతవరకు అనువాదం గాని, వాఖ్యానంగాని తెలుగులో ఉన్నట్లు కానరాదు. అధ్యాపక వృత్తిలో ఆరితేరి, విద్యార్థుల మనస్తత్వాన్ని బాగుగా గ్రహించిన రచయిత బాలబాలికలలో లోపిస్తూ వున్న క్రమశిక్షణారాహిత్యాన్నీ, దురభ్యాసాలను పోగొట్టి ఉత్తమ శీలం అలవడేటట్లు చెయ్యడానికి ఈ గ్రంథం ఎంతో ఉపయుక్తమయినదని గ్రహించి దీనిని విపులమైన వ్యాఖ్యతో కూడ ప్రకటించాలని పూనుకొనడం సంతోషింపదగినది. (దీని అట్ట పైని—ఇది అనువాదమని చెప్పబడింది· కాని మూలానికిది విపుల వ్యాఖ్య అని అనుకోవడమే సముచితం.)

శ్రీ రమణారెడ్డిగారు సంస్కృతంలో సాహిత్యంలో ఉన్నత బిరుదు "విద్యాప్రవీణ"ను సంపాదించారు. ఎం. ఏ. పట్టం పొందారు కాశీ, లాహోరు మున్నగుచోట్ల సంస్కృత, హిందీ భాషల్లో ఉత్తమ బిరుదాలు గడించారు. అన్నివిధాలా వారు చారుచర్యను వ్యాఖ్యానించుటకు సమర్థులు. ఈ సందర్భంలో వీరికి దేవదత్త శాస్త్రిగారి హిందీవ్యాఖ్య ఉపకరించింది. వ్యాఖ్య పిన్నలకే కాక పెద్దలకు కూడా ఉపయోగపడే విధంగా తయారయింది. మచ్చుకు ఒక శ్లోకం—

> "న పుత్రాయత్త మైశ్వర్యం
> కార్య మార్యైః కదాచన,
> పుత్రాయత్త ప్రభుత్వోఽభూత్
> ధృతరాష్ట్ర స్తృణోపమః."

[శ్లోకం 80]

దీని తెలుగు వ్యాఖ్య —

"వివేకముగల మానవుడు తొందరపడి తన ఐశ్వర్యమును పుత్రులకు అప్పగింపరాదు. ధృతరాష్ట్రుడు తన ప్రభుత్వమును పుత్రులకు అప్పగించుటవలననే తృణముతో సమానముగా చూడబడెను."

పయిది శ్లోకాభిప్రాయము మాత్రమే! విశేష వివరణ మింకను కలదు. పురాణ గాథలు వచ్చినచోట అవి విపులముగా వివరింపబడినవి.

సర్వజనోపయుక్తమగు ఈ గ్రంథము అందరి ఆదరమును పొందగలదని నా నమ్మిక.

ఆధ్యాత్మ ప్రచారక సంఘంవారి రెండు గ్రంథాలు

ఆధ్యాత్మ రామాయణము

[డెమ్మీ సైజు, 416 పుటలు. వెల : సాదా ప్రతి రు. 15లు., బైండ్ చేసిన ప్రతి రు 20/-]

వాల్మీకి రామాయణానికి తర్వాత వచ్చిన రామాయణాలు సంస్కృతంలోనే చాలా ఉన్నవి. వాటన్నింటిలోనూ, వాల్మీకం తర్వాత చెప్పకోదగిన రామాయణం ఆధ్యాత్మ రామాయణం. రామాయణ కథను నారదుడు వాల్మీకి మహామునికి చెప్పగా, ఆయన ఆది కావ్యాన్ని—రామాయణాన్ని రచించినట్లున్నది. ఆధ్యాత్మరామాయణాన్ని పార్వతీదేవి కోరికపై పరమేశ్వరుడు ఆమెకు చెప్పినట్లు తెలుస్తున్నది.

ప్రధానంగా జ్ఞాన, వైరాగ్యాలను బోధించడమే దీని ప్రధానోద్దేశం. ఆధ్యాత్మ రామాయణమనే పేరే యీ విషయాన్ని వ్యక్తం చేస్తున్నది. తెలుగులో దీనికి పద్యాను వాదాలు వచ్చినా, వానికి తగిన ప్రచారం లేక పోయింది. మునిగోష్టి సుబ్రహ్మణ్య కవి రచించిన "అధ్యాత్మ రామాయణ కీర్తన"లకే బహుళ ప్రచారం లభించినది. గద్యాను వాదాలు వచ్చినట్లు నాకు తెలియదు. ఇట్టి గ్రంథాలు ప్రజామోదం పొందాలంటే వచనంలో ఉండడమే శ్రేయం. ఈ విషయాన్ని గ్రహించే కాబోలు రాధాకృష్ణమూర్తిగారు దీని వచన రచనకు పూనుకున్నారు.

పురాణపండ కుటుంబంవారి దృష్టి ఆధ్యాత్మికమైనది. ఆ కుటుంబపు విద్వాంసులు పురాణాలను వచనంగా అనువదించి, ప్రచారం చెయ్యడంలో సిద్ధహస్తులు. ఈ రచయిత రామాయణం కంటె కొంత కఠినమైన ఆధ్యాత్మ రామాయణాన్ని వచనంగా రచించడం ప్రశంసనీయమే; ఇది గ్రాంథిక భాషలో నడిచింది. వ్యావహారిక భాషలో దీని రచన సాగినట్లయితే ఇంకా బాగుండేదని తోస్తున్నది. ఇప్పట్లో పండితులకు ఆమోదాన్ని కూర్చే యీ రచన వ్యావహారికంగా ఉంటే అందరి ఆమోదాన్నీ పొంది ఉండేది. అయినా యిది సరళమైన భాషలోనే రచింపబడుటవల్ల జనసామాన్యానికి ఉపయోగించగలదనే చెప్పవలసి ఉన్నది

ఆధ్యాత్మ రామాయణ మహాత్మ్యము

[డెమ్మీసైజు, 60 పేజీలు. వెల: 3 రూ. రెండిటికీ కర్త రాష్ట్ర భాషా విశారద శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి, ప్రకాశకులు—ఆధ్యాత్మ ప్రచారక సంఘము, జయశ్రీ టాకీస్ రోడ్, రాజమండ్రి 4]

దీనికి "ఆధ్యాత్మ రామాయణ మాహాత్మ్య"మనే పేరున్నా, ఆ మాహాత్మ్యాన్ని గురించి ఇందులో ఆరు పుటలు మాత్రమే ఉన్నవి. తక్కిన పుటలలో వరుసగా విశేష వ్యాఖ్యానంతో కూడిన గాయత్రీ రామాయణం (19 పుటలు), ఆంజనేయ స్తోత్రం (2 పుటలు). శ్రీరామరక్షా స్తోత్రం (5 పుటలు), శ్రీ ఆంజనేయ దండకం (2 పేజీలు), శ్రీరామనామమహిమ (4½పుటలు). తిరిగీ గాయత్రీ రామాయణం (2½ పేజీలు), కోదండరామాస్త్రం (1 పేజీ) శ్రీరామరక్షా స్తోత్రం అనువాదం (5 పేజీలు), బాలాస్తుతి (1 పేజీ), శ్రీరామపూజావిధానం (8 పేజీలు)· ఫలశ్రుతి (1 పేజీ) ఉన్నాయి. అట్టమీద సూచించిన "శ్రీరామస్య ప్రాతః స్మరణమ్" పుస్తకంలో కానరాదు. ఇన్ని విషయాలున్న దీనికి "ఆధ్యాత్మరామాయణ మాహాత్మ్యము" అనే పేరు తగిఉన్నట్లు కానరాదు.

వ్యాఖ్యాసహితంగా తొలుత గాయత్రీ రామాయణాన్ని ఇచ్చి తిరిగీ మూలాన్ని మరొకచోట ఇవ్వడం పుటలను పుటలను పెంచడానికేమో అని అనిపిస్తున్నది. గాయత్రీ రామాయణ వ్యాఖ్య వ్యావహారికంలో ఉన్నది. తక్కినవి గ్రాంథికంలో ఉన్నాయి.

"అంగీరస"

శ్రీ రమణాశ్రమ స్మృతులు

[రచన: సూరి నాగమ్మ, వెల: రు. 1–25; ప్రకాశకులు: టి. యన్. వెంకటరామన్, ప్రెసిడెంటు, శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై.]

భారతీయ తత్వశాస్త్రం బహుముఖమయినది. అలాగే భారతీయతత్వవేత్తలు కూడా బహుముఖ ప్రజ్ఞగలవారు. రుషుల దేశంగా వినుతికెక్కిన భారతదేశంలో యిటీవలి కాలంలో అవతరించి, తపసుచేసి, స్థితప్రజ్ఞుడై కూడా సామాన్యులతో సరసంగా స్నేహంగా మసులుకొని, ప్రాజ్ఞులకు తత్వబోధచేసిన మహనీయుడు శ్రీ రమణమహర్షి.

సర్వసంగ పరిత్యాగి అయి కూడా తనవద్దకు వెళ్ళిన వారందరనూ ఆదరించి, సన్మార్గాన నడిపించిన మహాతత్వవేత్త శ్రీ రమణమహర్షి. తిరువణ్ణామలైలోని శ్రీరమణాశ్రమము విదేశీయులనే ఆకర్షించగలిగినప్పుడు ప్రాయికంగా ఆధ్యాత్మికచింతనాపరులయిన సూరినాగమ్మగారి వంటివారిని ఆకర్షించి, ఆధ్యాత్మిక మార్గాన నడిపించడంలో విశేషం యేముంటుంది! ఈ రచయిత్రి పట్ల శ్రీ రమణమహర్షికి ప్రత్యేకమైన ఆదరణ వుండేదని యీ చిన్న పుస్తకం విశదం చేస్తుంది. నాగమ్మగారు కవి కూడా. నిజానికి భక్తికీ కవిత్వానికీ అయినాభావసంబంధం వున్నది. నాగమ్మగారు ఆ విషయాన్ని యీ పుస్తకంలో విశదం చేశారు. ప్రతి చిన్న సంఘటనలోనూ భగవాన్ ఆమెకు ఎంతో వేదాంతం బోధించారు.

రావమ్మా పోదాం, వంటలవాడు, బ్రైటిల్స్, ఈ శబరిదెంతభాగ్యం వంటి ఇరువది ఎనిమిది శీర్షికలున్నాయి 74 పుటల యీ పుస్తకంలో. "ఓహో! అదా మీ సందేహం? నేను నేను అంటే మహాత్ములు చెప్పే నేను శరీరాన్ని గురించికాదు. నేను అంటే ఆత్మ అన్నమాట. ఆ నేను అంతఃకరణతో (అంతఃకరణ అంటే మనోబుద్ధి చిత్త అహంకారములన్నమాట) కూడి అహంకార మవుతుంది. ఆ అంతఃకరణ రహితమైనదే ఆత్మ. ఆ నేనే బహిర్ముఖమైతే జగత్తుగా పరిణమిస్తుంది. అంతర్ముఖమైతే అహంస్ఫురణరూపంగా అంతటా నిండివుంటుంది" అన్నారు భగవాన్ (25వ పుట). భారతీయ వేదాంతానికి, తత్వశాస్త్రానికి ఆత్మవంటిది ఈ వివరణ.

పరమాత్మకు ప్రారబ్ధం ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానంగా, "పరమాత్మ నిష్క్రియుడు గదా? ప్రారబ్ధమెలా వస్తుందీ? అంటారు మీరు...దుర్మార్గులు పాపకార్యములచేత సాధువులను బాధిస్తూవుంటే, ఆ సాధుజనులు ఎలాగైనా ఈ బాధ పోగొట్టమని, పూజ, జప, తప యజ్ఞయాగాది సత్కార్యాచరణచేత భగవంతుణ్ణి ప్రార్థిస్తారు. ఆ దుర్మార్గుల పాపం, ఈ సాధుజనుల

పుణ్యం కలసి ప్రారబ్ధంగా పరిణమించి భగవంతుడు రూపం ధరిస్తాడు. దానినే ''పరేచ్ఛా ప్రారబ్ధం అంటారు'' అని శ్రీ రమణ మహర్షి వివరించారు. వేదాంతంలో ఇది కూడా చాలా ప్రధానాంశమే. శ్రీరమణమహర్షి చెప్పిన మాటలను యీ రచయిత్రి ఇంత సరళంగా వ్రాయడం ప్రశంసించదగిన అంశం. ఈ పుస్తకంలోని మంత్రోపదేశాలు, చిన్నబిడ్డ, కుంజుస్వామి తిరుపతి ప్రయాణం, కోపతాపాలువంటి వ్యాసాలు ఆసక్తిదాయకంగా వున్నయ్. ఇది వేదాంత గ్రంథం మనకెందుకులే అని యువకులు నిర్లక్ష్యం చేయదగిన పుస్తకంకాదు—ఏదో ఒక నెపాన నిరీశ్వరవాదులు తోసివేయదగినది కూడా కాదు. ఒక మంచి కథ చదివించినట్టు పాఠకులచేత చదివి ఆలోచించేటట్టు చేసే మంచి పుస్తకాలలో ఇదొకటి.

శ్రీ రమణ కరుణావిలాసము

[రచన: సూరినాగమ్మ, వెల: రెండు రూపాయలు. ప్రకాశకులు: యస్. వెంకట్రామన్, ప్రెసిడెంటు, శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై.]

1941 జూలైనుంచి శ్రీ రమణ భగవానుని సన్నిధిలో వుండిన యీ రచయిత్రి పది శీర్షికలతో 117 పుటలలో హృద్యంగా యీ పద్యాలు వ్రాశారు.

''శ్రీ రమణ భక్తవత్సల!
కారణ కార్యాది పరమ కారుణ్యనిధీ!
చేరితి నీ పద సన్నిధి!
దారుణ భవబంధములను దప్పింపగదే!

శరణాగతి మనస్సును ఈ పద్యం విదితం చేస్తుంది. శరణాగతి పలికే ప్రతి ఒక్కమాట కవిత అవుతుందని ఒక మహాకవి అభిప్రాయం.

ఏదో చేసేసి లేకపోతే అనేసి క్షమించండి — పొరపాటయింది అనడం కాదు శరణాగతి లక్షణం ఆత్మార్పణం ఆ స్థితిలో భక్తుడు తన వునికినే మరచిపోతాడు. అయితే మరి యీ పద్యాలు అక్షర రూపం ధాల్చడం ఎలా జరిగిందీ? అదుగో అదే భక్తిపారవశ్యత, ఆశ్రమం మహర్షి' అనే ఖండికలో యీ రచయిత్రి ... ...

''బూరక మాత్మ విద్యలకు
బుట్టిన యిల్లని చెప్ప నొప్పగున్''

అని వర్ణించారు శ్రీ రమణమహర్షి ఆశ్రమాన్ని. ఆత్మవిద్యలంటే యేమిటో యీ తరం యువతీ యువకులు తెలుసుకోవలసిన అవసరం ఎంతయినా వున్నది. అలాగే ప్రార్థన అనే ఖండికలో యీ రచయిత్రి వ్రాసిన పద్యాలూ నిత్యపారాయణకు తగినవి. కవి గణపతి గురించి యీ రచయిత వ్రాసిన పద్యాలు ప్రత్యేకం ప్రశంసించదగినవి. ఇందులోని పద్యాలన్నీ చదవడానికి హాయిగా వుండడమే కాకుండా వేదాంతార్థం గలవి కూడా గమనించతగిన విశేషం.

మరీ మరి జెప్పెద వినవె—మనసా నీకు
అయ్యో! పామరత్వము మాని పరమేశు గనవే!

అంటూ యీ రచయిత్రి ప్రారంభించిన శ్రీ రమణస్తుతి పాటలు యీ పుస్తకం అంతటిలోనూ ముఖ్యమయినవి. భక్తులందరూ పారాయణ చేయదగిన పద్యాలు యీ పుస్తకంలో వున్నాయి.

శ్రీ వి. ఎస్. అవధాని

ఈ వ్యవస్థపై మరో రాయి

[కవితా సంపుటి, జి. శంకర్, డెమ్మి—32 పేజీలు; వెల రెండు రూ; ప్రతులకు: జి శంకర్, అడ్వొకేట్, శివాజినగర్, నిజామాబాదు.]

ఇది పురాణ మూఢాచారాలపై కుల మత కట్టుబాట్లపై విసరిన రాయిగాదు—ఈనిన పులిపైన బడటమే! లోక కవి వేమన ప్రతిరూపంగా, న్యాయవాది కాబట్టి ఈ వివాదబలం చూపి, విమర్శించి, పాత వాసనల పారబట్టుతున్నాడు. పురాణాలను ఎగతాళి చేయడం, హేతువాదం చేయడం నాస్తికవాదం కాకపోవచ్చు; ఇందుకు తార్కాణ—వేమనయోగి గడ్డగట్టిన అద్వైతి. ఈ కవి కడుపుమంటను, హీనపరచబడిన జాతుల కోపోద్రేకాన్ని వెడల గ్రక్కడం సహేతుకమే.; ఈయన చేసిన నాస్తికవాదం పాతదే; కొత్త లేనందున బలం తక్కువగా ఉన్నది.

ఇప్పుడు మూఢాచారాలను సమర్థించేవారు ఎక్కువ లేకపోయినా, ఈ తిరుగబడేవారు కొంత సహనం చూపితే ఎక్కువ మేలు చేసిన వారౌతారు. పాపీ చిరాయువన్నట్లు మూఢాచారాలు తేలికగా చావవు. కాబట్టి ఇట్టి వ్రాతలు ఎప్పుడూ అవసరమే! ఈర్ష్య తగ్గితే సానుభూతి ఎక్కుతుంది.

ఈ రచనలో భాష చురుకెన్ని, మనసులో ఆవేదనను బయట బెట్టి, సంస్కార మార్గాన్ని చదువరికి చూపుతున్నది. విషయాన్ని సూటిగా చెప్పగలిగిన నేర్పు ఈ వకీలు కవి కున్నది.

జానపద గేయాలు

[(కరీంనగర్ జిల్లావి) సంపాదకుడు జి. లింగారెడ్డి, డెమ్మి, 160 పేజీలు, వెల: రు. 5/ ప్రతులకు: లలితకళా పరిషత్, కరీంనగర్.]

గ్రామజీవన వికాసనానికి జీవగర్ర జానపద వాఙ్మయం; చాల వరకు మౌఖికమ్మైన (ఓరల్) ఇది, లిఖిల్ వాఙ్మయానికంటె చాలా. ముందు పుట్టినది. పల్లెటూరివారిలో గమనించదగిన శక్తి నిండిఉండి, సహజ శోభతో ఓజస్సుతో కవితారూపంలో యాల పదాలుగా ఇది బయటబడి, అంతటా అల్లుకొనిపోతుంది. వీరే సహజ కవులు. మా పల్లెలలో నిరక్షరాస్యులుగూడ—తూరుపు రేకలు మైలవిడిచినవి—అని అంటుండే, విన్నకవులు అరుచోద్యపోతుంటారు.

ఇట్టి అమూల్య సహజ కవితారీతులను పోగుచేసి, అచ్చు వేసి, వాటికి పునర్జీవం కలిగించడం ఎంతో కొనియాడదగిన ఉత్సాహం. అట్టి పనిని శ్రమకోర్చి తాలిమిజూపి, లింగారెడ్డి సేకరించి ముద్రించి గ్రామీణ సాహిత్యానికి మంచిసేవ జేసినాడు.

ఇవన్నీ కరీంనగర ప్రాంతానివి. ఏరి కూర్చిన వీరు, పాడి వినిపించిన వారు పేర్లు పేర్కొనడం కృతజ్ఞతాసూచకం. ఈ గేయాల వర్గీకరణ మంచిపని.

ఇందు, చాలా మంది పెద్దలు జానపద సాహిత్యాన్నిగూర్చి విపుల వివరణాలు నిర్వచనాలు చేసిఉన్నారు. ఇది ఆ వాఙ్మయ వికాస ప్రత్యాలే. ఇదిగాక, పొరటక్రింద, పూరణాలుగా, వివిధ రచయితల వాక్యాలు ఉదాహరించడం గ్రంథానికి భూషణ ప్రాయంగా ఉన్నది.

ఈ పాటలలో భాష – జాతీయతకు కొలమానమై భావ స్ఫూర్తితో, ప్రాచీన రచనా విధానాన్ని చూపుతూ, ఆనందదాయకంగా ఉన్నది. లింగారెడ్డి మాదిరే, ఇతర ప్రాంతాల విద్యావంతులు ఈ పనిని పూర్తిచేయడం అవసరం.

అలలు

[పాటల సంకలనం, హైదరాబాదు విప్లవ రచయితల సంఘ ప్రచురణము. చిన్నసైజు – 24 పేజీలు; వెల 30 పైసలు, ప్రతులకు–నూతన నవతరం మాసపత్రిక, 2–1-561, నల్లకుంట, హైదరాబాదు–44.]

ఈ విప్లవ సంఘ రచయితల ఆదర్శము, వారి హింసామలిన కాండ సంగతి అటుండనిచ్చి,– "విప్లవించిన వీరతెలంగాణా అరుణారుణ నేత్రాలు బద్ధలైన అగ్నిపర్వతాలు - జగిత్యాల, సిరిసిల్లా ప్రాంతాలు" (విప్లవాలు వృథాకావు) అని, స్వస్థలాభిమానంతో పొంగి, ఆత్మార్పణం చేసిన బలిదాతలను పొగడటం, ఉత్తేజకరమనక తప్పదు. ఇదే ఉద్రేకం, ఆవేశం, మేము మా చిన్నతనంలో, వంగ–మహారాష్ట్ర విప్లవవీరుల గథలు విని అనుభవించినాము.

ఈ చిన్నపొత్తం, పొరట పొరటా ఆవేశాన్ని, వీరుల స్మరణా వేదనను గ్రక్కుతున్నది. తెలంగాణా భాష కండగలిగి ఊపిరితో ఉద్రూతలూగిస్తున్నది. "తన బిడ్డ రక్తమందె బూమెమ్మా తడిసిపోయె"–ఇట్లా భావం భాష ప్రకాశిస్తున్నవి. "చేపల మాటలు వినే సముద్రం రెచ్చిపోయింది–" అట! మంచి నుడికారాలున్నవి.

తురకల పాలనలో వికృతాలైన పేర్లను–జగిత్యాల, కరినగర్– అని వ్రాస్తున్నారు.

ఆర్కెస్ట్రా

[వచన కవితా సంకలనం, సంకలన కర్త: ఆశావాది ప్రకాశరావు, డెమ్మి-80 పేజీలు, ధర–రు. 4/ ప్రతులకు: రాయల కళాగోష్ఠి, అనంతపురం.]

వర్తమాన కాలగతిని, ప్రపంచ స్వభావాన్ని గురించి వాపోయి, వాటిని విమర్శించిన వివిధ నూత్నగళాలు వెలువరించిన బృంద గాన సేకరణ–ఈ ఆర్కెస్ట్రా (తెనుగు పుస్తకానికి ఇంగ్లీషు పేరెందుకో!), మామూలు ధోరణి, పరిపాటైన సామాజికస్మృహ పద ప్రయోగాలు ఇందు నిండిఉన్నా–కొన్ని శీర్షికలు అర్థవంతంగా, భాష కమ్మటి నుడికారంతో నున్నది.

"బ్రతుకంతా బాధల్ని తిని, కన్నీళు త్రాగి, కష్టాలను ప్రసవించడమేనా జీవితం?" అని సహేతుకంగానే ఆవేదన పడుతున్నాడు (ఆ రోజు కోసరం) "మంచి అంటే ఎప్పుడూ గిట్టదు–ఈ ప్రపంచానికి" (ఈ లోకం) అని, సృష్ట్యాదిగా మంచిచెడ్డలతో పెనవతాడైన ఈలోక వృత్తాన్ని విమర్శిస్తున్నాడు, కానీ, వినేదెవరయ్యా? ఇది నివారింపరాని శాశ్వత దీనాలాపంగానే నిలిచిపొయ్యేటట్లున్నది. (అల్ప సంతోషి) కాబట్టి ఈనాడు పుట్టి పెరిగి పేర్గాంచిన పెద్దలను అన్ని రంగాలలో ముందుకు వచ్చిన వారున్న యుగంలో మని, వారిని చూచి, వారి చరిత్రలు విన్నదానికి తృప్తి పడుతున్నాడు. నేడు మానవుడు శాంతితో బ్రతకాలంటే ఇదే మంచి మందేమో? ద్వేషించి ద్వేషింపబడితే–క్రియ ప్రతిక్రియా వలయంలో మానవజాతి ఇరుక్కొని పోతుంది.

ఈ రచనలు కొన్ని విమర్శలైనా–పండని అనాది ఆదర్శాలకీ అశ్రుతు చాస్తున్నవి. "ఎండను మింగిన చెట్టు నీడను కక్కింది–బాటసారికోసం. (చెట్టు) భూమి తల్లికి వన్నెవాసి తెచ్చింది" అని నవ్యభావస్ఫురణతో చెప్పబడి ఉన్నది.

చాలా ఖండికలు చదివి ఆనందించవలసినవి ఉన్నవి.

వసంతవల్లరి

[గేయసంపుటి – వారణాసి వెంకట్రావు. డెమ్మి–100 పేజీలు, ధర–రు. 5/, ప్రతులకు: ప్రశాంతి పబ్లిషర్స్, కేర్– జి. కృష్ణమోహన్, పున్నమ్మతోట, విజయవాడ–10.]

సంగీతం, సాహిత్యం, సంప్రదాయం, రమ్యభావం, మనోహర భాష–ఇన్నీ ఒద్దికగా ఒయ్యారంగా నడిచిన రచనా విన్యాసమిది. ప్రతి పంక్తిలో కవితాశిల్ప స్ఫూర్తి దీపిస్తూ, ఈనాడు ప్రతిదినం వెలువడే తండోప తండాలైన రచనలలో, ఇది ఒక సందువెన్నెలగా, రమ్యమైన ఇంద్రధనుస్సుగా ఉన్నది. అనుభూతి పైకుబికి చదువరిని ఆ స్థాయికి తీసికొని పోతున్నది. ఇదేగదా కవితకు నికషోపలం!

పాటల రూపంలో ఉన్న ఈ ఖండికలు రసహృదయులను రంజింపజేయడం సుకరం–ఆశలన్నీ దూసి పోసి అలముటించే మల్లె తీవకు కొత్త చివురులు పల్లవింప జీవమొసగేటందుకే–అని ప్రకృతి సౌందర్యాన్ని లోకానుభవంతో కలుపుతాడు. మల్లెకు ఆకు దూస్తేనే గాని, ననవేసి మొగ్గ దొడగదు. కోకిల విషయం–పక్షిశాస్త్రానికి భిన్నమైనప్పటికిన్నీ, పరిపాటి కవి సమయాన్ని అందంగా చెప్పినాడు. వీణ "పలికించే హృదయం కొరకు పలవరించిపోతున్నది"–అన్నదానిలో

ఒక సుమనస్కుని భావం పరిమళిస్తున్నది. రేడియో సెట్టు ట్యూన్ చేసినదాకా, అ దరి సంగీతాలు మూగబారి ఉన్నట్లు, వీణ తీగలలో దాగి ఉన్న చైతన్యాని, చెపుతున్నాడు—భావుకుడు ఈ కవి. భావాలను అలంకరించ గలిగిన భాష ఉన్నది.

''పరమ శివుడు కాలుమోపిన మూపురాన, కాడిమోపి నందుకు'' మానవాళిని నిందించి, పశుజాతిపై కారుణ్యం—కొత్త రీతిన—ప్రకటిస్తున్నాడు.

''అభిషేకమును చేయ జలము తేలేనని, తలపైన గంగతో తంటి వచ్చావా? పూజసేయగ నీకు పూలు తేలేనని శిరముపై చందురుని ధరీయించినావా?'' అని, భక్తునిపై శివునికిగల వాత్సల్యాన్ని అభినుతిస్తున్నాడు. దీనితో శ్రీ కాళహస్తీశ్వరుడు ఎదుట నిలుస్తున్నాడు.

అన్నీ కొత్త పోకడలే!

మాట్లాడే మల్లెలు

[ఆచార్య తిరుమల, డెమ్మి, వెల : రు. 5/—, ప్రతులకు : మాధురీ పబ్లికేషన్స్, 1 - 1 - 385/21, గాంధీనగర్, హైదరాబాదు – 500 380.]

ఒక పండిత కవి, నేటి అభ్యుదయ కవితామార్గాన్ని తొక్కిన విధ మీ రచన. భావము భాష ఉంటే ఏ శైలి దుష్కరము? గద్యమో, పద్యమో, అందు కవితా శిల్పముంటే చాలు, రసికుల తన్మయుల జేస్తుంది. భావుకుడైనవారు, తా ననుభవించినదానిని—సిరాతోనో, రంగుతోనో, ఉలితోనో రూపొందిస్తే, చదివినవారు చూచినవారు అదే అనుభూతిని పొందితే అదే ఆ కళకు ఒరగల్లు. డొక్కశుద్ధి గలిగి, నవయుగ రీతులలో కవిత లల్లుతున్న ఎల్లోరా—''మల్లెలతోబాటు కవిత్వం గూడ మాట్లాడాల'' అని అన్నదే ఉన్న కిటుకు. చిలుక పలుకుల నినాదాలలో నిబద్ధత లేదంటున్నాడు. కాల పరిస్థితులు—పరిణామం పొందుతున్న అభిరుచుల దర్పణమే ఆయా కాలాల కవితాస్వరూపం అని అంగీకరిస్తే, ఆనాటి ప్రబంధ కవితను తెగడి, నేటి కడుపుమంట కవితను పొగడ పని లేదు. కాబట్టే ''కాలంతోపాటు మారేది సాహిత్యం'' అంటూ, ఎల్లోరా సమన్వయ వాదం చేస్తున్నాడు. ఈ ధోరణే యీ యుగ సాహిత్య నౌకకు చుక్కాణి. ఇట్లనే ఎల్లోరా ప్రజాకవితను నిర్ణయిస్తూ, ఇప్పటి కొందరి మూతినాకుడు వ్రాత ప్రజాకవిత కాదంటూ, వేమన, పోతనలు ప్రజా కవులంటున్నాడు. పాత జానపద గేయ కవులు ఈ కోవ వారేగదా? ఏమైతేనేమి? నేటి విమర్శక రొదలో వినిపించే కల నాదంగా ఈ పరిచయ వాక్యాలున్నవి.

ఆచార్య తిరుమల కొన్ని వాక్యాలు వినండి :— కటిక చీకటి సిరాతో నీ కనురెప్పలమీద రాస్తాను; నావద్ద నాలుకలు విరిగిన కులాల కలాలు తప్ప కత్తులు లేవు. (కులతత్త్వవాదంపై పెద్ద దెబ్బ) విద్యాలయాన్ని విద్యా — లయాలుగ మారుస్తున్న (మంచి విరుపు; మునుపు ఒకప్పుడు, కట్టమంచివారు — ఉభయభాషా అప్రవీణులే — అన్నాడు.) ప్రాంతీయ దురభిమానాన్ని ఎంత నిశితంగా కళాత్మకంగా విమర్శిస్తున్నాడో చూడండి. నిలువుటద్దం లాంటి దేశాన్ని ముక్కలు ముక్కలుగా బ్రద్దలుకొట్టి, ప్రతి ముక్కలోను ముచ్చటగా ముఖం చూచుకోవాలనుకొనే ప్రాంతీయాభిమాన దుర్యోధనుల ఆలోచనల కపట కిరీటాన్ని చూడు, కాకిగూటి కోయిల — పరభాగ్యోప జీవికి మంచి తెనుగుమాట, బ్రతుకులో వేగుచుక్క పొడవక.

ఇందు నేటి కృత్రిమ వాతావరణ విమర్శగూడా ఉన్నది.

చలనమ్

[విహారి. డెమ్మి, 80 పారటలు, వెల : రు 5/-, ప్రతులకు : స్పందన సాహిత్య సమాఖ్య, మచిలీపట్నం—521 001.]

బందరు స్పందన సాహిత్య సమాఖ్యవారు, గుత్తికొండ సుబ్బారావు నాయకత్వాన, ప్రచురణోత్సాహంతో, నవ కవికుమారుల రచనలను వెలువరించడం రచయితలకు ప్రోత్సాహమే గాకుండా, సాహిత్యానికి సేవగూడా అవుతున్నది.

ఈ విహారి — వాఙ్మయ ప్రపంచంలో బాగా విహరించిన మంచి చదువరి. చదువులో మర్మమెరిగి వ్రాయగలిగిన వ్రాయసగాడు. ఇంటి భాషా ప్రౌఢి, నేటి కవిత్వానికి పాండిత్యం అగత్యం లేదనే వారితో ప్రతివాదం చేస్తున్నది. కవితా రేఖల శీర్షిక - వివిధ విషయ పరిజ్ఞానంతో కవితకు చక్కటి ఒప్పిదమైన నిర్వచనం చేస్తున్నది. ఈమాటలు నిన్నటికీ నేటికి రేపటికీ గూడ సరిపొయ్యేవి. ఆత్మతంత్రి రవళిస్తే పల్లవించిన స్వరాలు అనుభూతి జ్వలిస్తే పరవశించిన ఆశాభాస్వరాలు—కవితలట! ఇట్టివాటినేగదా కవిబ్రహ్మ—తిక్కన శిల్పాలన్నది జీవిత వివిధ భిన్నత్వాన్ని ప్రౌఢితో పరిపక్వ భాషతో — జీవితం ఇంద్రధనుస్సులో సంధించిన ధవళ శిలీముఖం—అంటున్నాడు. ఇది జీవితపు వెలుగు నీడలకు భాష్యం. జీవిత సాగరపు లోతుపాతులు గెలిసిన వ్రాత.

సంస్కృత — ఆంధ్ర పద బంధాలు ప్రాణంతో ఉన్నవి :— మీటియార్‌కు రాలుచుక్క అన్నది మంచి పదం. భవిష్యదాకాశం మీద క్రమ్ముకొన్న కుహనా సంస్కారపు నీలి జీమూతాలు కసిదీరా వర్షించి; సమస్యల గంప కెత్తుకొని; కూకట వేరు శీర్షిక మనోజ్ఞంగా ఉన్నది; పొంచి ఉన్న ప్రమాదాలు; ఎలపటెద్దు — నిట్టాడి మొదలైన గ్రామీణ పదాలు ఇంపుగా ఉన్నవి. ఇంత పండితుని ఇంగ్లీషు ఉచ్చారణ ఉత్తరాది తెనుగు వారిదిగానే ఉన్నది. కాన్ఫిడెన్షియల్ (కాన్ఫిడెన్షల్) ఎబౌ (అబౌ) భావోద్రేకంలో కొన్ని చోట్ల భాష మర్మధోరణిలో బడినది; నిలుకడ ఏర్పడితే యిది సర్దుకొంటుంది.

జాతి నిర్మాత

[వచన కావ్యం, గోవర్ధనగిరి శ్రీరాములు, డెమ్మి, 80 పేజీలు, వెల : రు. 4/—, ప్రతులకు : దేశిబుక్ హౌస్, నారాయణ గూడ, హైదరాబాదు — 24.]

సాక్షాత్ బ్రహ్మ స్వరూపుడైన ఆర్యావర్త గురుదేవుని మహిమ దిగజారి, తీసికట్టయి ఉన్న దీనస్థితికి—గురువును దైవంగా తండ్రిగా భావించిన పూర్వవిద్యార్థుల గౌరవభావాన్ని, నేటి విద్యార్థుల నిర్లక్ష్య భావాన్ని తిరుగుబాటును — జ్ఞాన సముపార్జనమే పవిత్ర లక్ష్యంగా ఉండిన భారతీయ విద్యావిధానం కలుషితమైపోయిన దానికి — ఈ ఉపాధ్యాయ రచయిత వగచి, విద్యా విధాన సంస్కరణానికి, సత్సంప్రదాయ పునర్వికసనానికి—భారతీయ సంస్కృతిపై అభిమానంగల ఈయన మంచి దారులు చూపుతున్నాడు. సినిమా విదూషకుడు — జొహార్ అన్నట్లు — మన స్వరాజ్యం అపరాత్రి సమయంలో అందరూ నిద్రబొయ్యేటప్పుడు వచ్చింది కాబట్టి భారతీయులు ఈ స్వాతంత్ర్యాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. కాబట్టే ఇన్ని కడగండ్లు.

ఇందు, ఈనాటి విద్యా సమస్యలన్నీ వివరింపబడి, విమర్శింపబడి ఉన్నవి నిర్మాణాత్మకమైన రచన ఇందు విషయ గురుత్వమున్నా పత్రికల వ్యాసాల భాషవలె, చాలా భాగం కవితాస్ఫూర్తి లేకున్నది; విద్యాధికుడైన రచయిత మన్నించాల చిన్న చిన్న పంక్తులుగా విడగొట్టబడిన గద్య వ్యాసం ఇది.

హిందీ విషయంలో (త్రిభాషా విధానం) సర్వజనామోదకరమైన వాదం ఈయన చేయడంలేదు. ఆంధ్రులు హిందీకి వ్యతిరేకమనుట సత్యదూరం. రెండు కోట్లు తెలంగాణా వారు, ఉరుదూ మాతృభాషగా గలిగిన ముస్లింలున్న మనకు ఇది సమస్యే కాదు.

అసలు అరవలే మూకఉమ్మడిగా వ్యతిరేకులుకాదు. ఏటేటా 40 వేలకు పైన హిందీ పరీక్షలకు కూర్చుంటున్నారు. డి. ఎం. కె వారి గోల రాజకీయ వ్యూహం. అనేక భాషలుగల భారత జాతికి, వీరు మార్గాంతరం చూపరైరి. 1919 లోనే గాంధీజీ త్రిభాషా సూత్రాన్ని సూచించి ఉన్నారు.

బ్రిటీషువారు గుమాస్తాల ఉత్పత్తికే విద్యా విధానం సాగించినారనడం మేలు చేసిన అయ్యలను మరచిపోవడమే. మనం బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని, బ్రిటీషు సంస్కృతిని వేరుచేసి చూడాల. గళిత మహిమతో ఆవేదన పడుతుండిన హైందవ విజ్ఞానానికి పునర్జన్మ కలిగించి, ప్రపంచ నాగరకతా మందిరంలో భారత దేశానికి స్థానం కల్పించినది ఇంగ్లీషు విద్యే అని — జాతీయోద్యమ ఉద్రేకం తగ్గిన తర్వాత, ఇప్పుడందరూ అంగీకరించే విషయం, వివేకానందస్వామి — రామమోహనరాయి—టాగూరు—సరోజినీదేవి—జె. సి. బోసు—నేతాజి బోసు-తరులతా దత్తు (తోరుదత్తు) రామన్—బాబ—అరవింద—గాంధి—నెహ్రూ—తిలక్—గోఖలే—శ్రీనివాసశాస్త్రి — రాధాకృష్ణ — కట్టమంచి — రఘుపతి వెంకటరత్నం — పట్టాభి — (ఎందరని వ్రాయను?) మొదలైన మహాజ్యోతులు, స్వాతంత్ర్య సమర యోధులు ఇంగ్లీషు తల్లివల్లనే ప్రకాశించినారని, అంతర్జాతీయ ఖ్యాతి గాంచినారని కృతజ్ఞతను తెలుపుకొందాం.

అధ్యాపకుడు—కొవ్వొత్తిలా కరగిపోతూ, తనకు తానై దహనమవుతున్నాడన్న సామ్యం మంచిగా ఉన్నది. ఉపాధ్యాయుని సముచితంగా కొనియాడుతున్నాడు.

"తను నేర్చిన జ్ఞానం ఎక్కడో జ్యోతిలా వెలుగుతూ ఎన్నో దీపాలను వెలిగిస్తున్నది" అన్నది ఇందు మహావాక్యం.

అరణ్యనేత్రం

[జయధీర్ తిరుమలరావు, డెమ్మి 64 పేజీలు, వెల రు మూడున్నర, ప్రతులకు : నవయుగ బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాదు–500 001.]

"విప్లవం ఆశయాన్ని భావుకతలో ఫ్రేంకట్టి నిలబెట్టిన విప్లవ భావ కవిత్వమిది" అని, అట్టమీది గ్రంథ పరిచయ ప్రశస్తి (బ్లర్బ్) చెపుతున్నది. నిజమే? ఇది ఈనాడు అడవులకు ప్రాకి హింసామలినమైనా, ఆత్మార్పణ బుద్ధితో వీరు సాగించే విప్లవోద్యమాన్ని ఈ గ్రంథం వివరిస్తున్నది. పూర్వం మన ఆత్మ విద్య అరణ్యాకాలలోనే గదా పుట్టింది. నేడు విప్లవానికి అరణ్యమే నేత్రమైనదని కవి భావం కామాల—మంచి అభిప్రాయం. ఈ రచనలో విప్లవనేత్రం రెప్పలెత్తినది. కళాప్రపూర్ణ—సి. నా. రె. అన్నట్లు—ఈ భావాల మందు పాతరలు తలపులో మాటలో పదను బటువు కలిగి ఉన్నవి.

ఖండికలు చాలామటుకు లోకవృత్తాన్ని వేషధారితనాన్నిచించి చెండాడుతున్నవి. కవితే ఫిరంగి దెబ్బంత పనిచేస్తుందనే వారు గదా వీరు. కాబట్టే వ్రాత జ్వలితాక్షరాలలోనే ఉన్నది. పిన్‌కుషన్ — పేపర్ వెయిట్ — యాష్‌ట్రేటేలమీద సాకుబెట్టి చేసిన, బూర్జువా సంఘ విమర్శక పద్ధతి బాగున్నది కాని, ప్రజలకుగా కవిత్వం చెపుతున్నామంటూ, సామాన్యులకు నోటబట్టని ఇంగ్లీషు పదాలు విరివిగా వాడటం ఎందుకో?

సిజేరియన్ అన్న ఖండిక భావగర్భితం. క్రీస్తుకు ముందు, మొదటి శతాబ్దంలో రోమన్ సామ్రాజ్యాన్ని ఏలిన — జ్యూలియస్ సీజర్, ఆయన తల్లి ప్రసవించలేకపోతే, పొట్టకోసి బిడ్డను బయటకు తీసినారంట. ఈ ఆపరేషనును సిజరియన్ అంటున్నారు; ఇప్పుడివి పరిపాటైపోయినవి. ఇక్కడ కవి అంటాడు :— నీ ఐరన్ సేఫ్ యోని ఎంత పెద్దగాంఢీ ఏం లాభం? లోని గర్భం కుళ్లి నల్లబడింది, ఇక నీకు సిజేరియన్ చేయక తప్పదు. అన్యాయార్జిత ధనాన్ని పోల్చడం బాగున్నది.

వీరి పారిభాషిక పదాలు కొన్ని వినండి :— డైనమైట్ హృదయం—రాజకీయ నకిలీ నందనవనం—రంగు రంగుల అక్వేరియం గ్లాసుల్లో తోకల్ని వీపుల్ని మూతుల్ని ఆడిస్తున్న రకరకాల నాయిక మత్స్యాలు! నేటి రాజకీయ వాదులకు అతికినట్లు సరిపోయింది; వీరిని ఏమన్నా కసి దీరదట.

ద్రాక్షగుత్తులు

[బాల సాహిత్యం, అలుగుపల్లి రామచంద్రారెడ్డి, వెల : రు. 3–50, కాపీలకు : యు. ర. న., నల్లగొండ]

బాల సాహిత్యానికి రుచులూరించ గలిగిన మంచి పేరు. వన్నెవన్నెల సిరాలతో, బొమ్మలతో, పిన్నల ఆకర్షించగలిగిన భాషలో భావాలతో ఈ పుస్తకం ఎన్నదగి ఉన్నది. శిశుప్రవృత్తి నెరిగి, దాని ప్రీతికి వ్రాయబడిన విషయాలివి. భావి పౌరులను తీర్చి దిద్దగలిగిన మంచి విధానం.

తెనుగుతల్లి పిల్లకాయల ప్రార్థనగీతంగా ఉన్నది. గాలిపటం — చుక్కల లోకానికి నిచ్చెన అనడం మంచి ఉత్ప్రేక్ష. చందమామ —ముద్దు లొలికిస్తున్నది. ''మబ్బుల చాటున ఏమున్నదో మాతో కాస్త చెబుతావా? చుక్కల వెలుగులు తెస్తావా'' అని శిశుహృదయ వాంఛను కమ్మగా చెపుతున్నది. ఉత్తరం— ''దూరమైతేనేమి భారమైతేనేమి? మీరు రాసిన మాట మీవాళ్ల కందిస్తా'' అని కాళిదాసు మేఘదూత పనిచేయబోతున్నది; ఇందు ఇంపైన భావస్ఫూర్తి ఉన్నది. కోడిపిల్ల పిల్లవానితో ''మీరు మేపిమేపి కోసి భోంచేస్తారు'' అన్న ఎత్తిపొడుపు మానవుని కుత్తును బాగా నిరసిస్తున్నది.

ఇట్లనే పెద్ద భావాలు పిల్లకాయల మనసు కెక్కేటట్లు, తేట తెనుగులో చెప్పిన ఈ గేయాలను బాలబాలికలు కంఠోపాఠం చేస్తే బాగుంటుంది.

వల్లకాటి వసంతం

[కవితా స్రవంతి, శంకర్ అన్నమరెడ్డి, డెమ్మి, 60 పొరటలు, ధర : రు. 5/-, ప్రతులకు : రాణీ బుక్ సెంటర్; 62–పాండీ బజారు – త్యాగరాజనగర్, మదరాసు – 600 017.]

కడుపులో లేనిదే కన్నీళ్లు కారవు కాబట్టి, ఈ కవి ప్రేమ భగ్నహృదయుడనుకొందాం. ఎద సొక్కి సొక్కి, జీవితం వల్లకాడు కాగా, గుండె నిబ్బర పరచుకొని, ఆ కాడునే వసంత శోభామయం చేసుకోవాలని, తలపుల పూలు పూయించుకోవాలని కవితా గీతాలాపనతో ఊరట బొందుతున్నాడు. విరహానికి ''నిద్రాణ కవితా బాలను తట్టిలేపే శక్తి'' ఉన్నదని తెలిసికొని, ఆ కవితతో ''మాధుర్యపు ముగ్గులు పెడుతున్నాడు.'' ఒక్కొక్కప్పుడు దురదృష్ట వృక్షమే మధుర ఫలాల కాస్తుంటుంది గదా! శ్రీనాథ కవి సార్వభౌముడు– ''వీరభద్రారెడ్డి విద్వాంసుముం జేసి వియ్యమందెనుగదా వెదురు గడియ'' అన్న భావావేశం, పారశీక ప్రేమికులు — లైలా (మజ్ను అంటే ప్రేమోన్మాది) షిరీక్ ఫర్‌హాద్రుల కన్నీటి కాలువలు, ప్రేమ బెట్టిన పెడమొగం పుట్టించిన చేదులో తీపి పండ్లే గదా! వలపు పిచ్చిరేగి అనిపించిన ఈ మాటలలో సత్యమున్నది — ప్రాణమున్నది — కవితా గుణమున్నది.

ఈ రచనలో తెనుగు జాతీయత, సంస్కృత గాంభీర్యము, స్వచ్ఛమైన భాషతో భావాలను పల్లవింపజేసి పరిమళింపజేస్తున్నవి. ప్రతి మాటకు ఊపిరి ఉన్నది. ప్రతి భావానికి ఆవేశము శిల్పాకృతి ఉన్నవి. రాగమెంత తీపో విరాగం గూడ అంత మధురంగానే ఉన్నది. శ్రావ్య సంగీతంలో తల యూపించే ముక్తాయింపు మాదిరి, కొత్తవైన పద బంధాలు మురువు గొలుపుతున్నవి. ఇందలి చైతన్యం ఆవేదనకారిని ఆనందకారిగా జేస్తున్నది. ఈ కవి కల్పనల సంగతే ఇది; మీరే చదువండి. కొన్ని వాక్యాలు సామెతలై నిలువగలవు. గ్రామీణ పదజాలం (గ్రామ్యం అనుకోబాకండి) అందాల మూట గట్టుతున్నది. ఇట్టి రచనా దక్షతకు గద్యమైతే నేమి పద్యమైతే నేమి? గద్యం కవితకు నికషోపలం అని గదా పెద్దలన్నమాట.

''నీ తలపులలో కరగిపోయే కాలం గురించి నేనేనాడూ ఊహించలేదు'' — సుకుమార మధుర భావన. ''అందాలు చందిరిలో కొలువుచేసిన వేళ — కొడిగట్టిన జీవితానికి కొత్త ఊపిరి, మండుటెండల్లోను పండు వెన్నెలలోను నీవులేని వెలితి క్రూరంగా రాజ్యం చేసింది–నీ చెలిమిలోని కలిమేమని చెప్పను? జాజి నీడలో పాన్పేసి–నిలాటి రేవుకు నీవెందుకొచ్చావని నన్నడిగితే నీవు నాటిన మొక్కకు నీరుపోయాలన్నాను (భావ మాధుర్యము, భాషా సౌకుమార్యము) కోరిక పురిటిలోనే కుంటువోతుంది–కలిగినవాడు చేసేది ప్రేమ కలిమిలేనివాడు చేస్తే అది పిచ్చి (గ్రామాలలో ఒక సామెత ఉన్నది: రాణి మగడితోపోతే వ్రతం, పేదరాలు మొగుడితోపోతే వ్యభిచారం) నిశి సన్నిధినే తారకు నిజమైన విలువ–రాతిగుండె నాతి సంగతి ఇట్లా చెపుతున్నాడు: గుండె గీసి నాతి కివ్వ విరిచి విసరి వేస్తుంది—కళ్లు జలపాతాలాయె...ఇట్టివే!

అమృత వృక్షం

[పద్య కవితా సంపుటి. రావి రంగారావు, క్రౌన్ 1/16 60 పేజీలు, వెల రు. 3/–ప్రతులకు : స్పందన సాహితీ సమాఖ్య, మచిలీపట్నం–521001.]

ఇది వివిధ విషయాలపై వ్రాసిన పద్య సంపుటి విమర్శ ఆవేదన అవహేళన మొదలైన ఫక్కీలు ఇందున్నవి. ధార, పద గుంఫన బాగున్నవి. ఇంక కొంత లాలిత్యం అలవడితే కవిత ఇంకా ఎక్కువ ఎన్నికకు రాగలదు. అధునాతన దృష్టి చక్కగా ప్రతిబింబిస్తున్నది. మొదట తన రచనను తనవారికి చదివి వినిపించి బాగోగులు తేల్చుకొంటాననంటున్నాడు; ఇది మంచి ఒరగల్లే!

ఆవేదన ఖండిక లోతు సత్తువ కలిగిఉన్నది. ''దివ్యవిజ్ఞాన శాస్త్రాలు తెలిసికొనుచు మనిషి పెంచుతున్నాడు హింసా ప్రవృత్తి'' అన్న నిర్వేదం- సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు ''మానవుడు చంద్రమండలంలో దిగినా, నేలమీద చదరంగా నడువలేకున్నాడు'' అన్న సుభాషణానికి సరిపోతున్నది. ఇంటిదొంగలో, నేటి కుళ్లిపోయిన రాజకీయాలపై విరుచుకోని పడినాడు. అందరి మాదిరీ కులభేద జనిత హుతాశనాన్ని ఆర్ప'' అంటున్నారు. కులాలు ఉన్నా, మాసిపోయినా, ఆ కులభేద సహనం పరస్పరప్రేమ సత్యకాలానికి మెట్లే కాగలవు.

అక్కడక్కడా చక్కటి నుడికారాలున్నవి.

గోరంత దీపం

[బాలగేయాలు, కోసూరు పున్నయ్య, క్రౌన్ 1/16, 32 పేజీలు, వెల రు. 2/- ప్రతులకు : దివిసీమ బాలానంద సంఘం, గాంధీక్షేత్రం, అవనిగడ్డ–521121]

బాలబాలికలకు హితము నీతి గరపే సులభశైలి గీతాలివి. మంచిదారిన పడితే ఈ గోరంత దీపమేగదా కొండంత దీపమయ్యేది. పున్నయ్య బహుముఖ ప్రజ్ఞావంతుడు, ఆ శక్తులను పిల్లకాయలకు సన్మార్గం చూపేటట్లు ఉపయోగిస్తున్నాడు (కన్నమ్మ) జన్మమిచ్చిన తల్లిపై ప్రేమను నేర్పుతున్నది. మన మందరం ఒకటేనని ఐక్యతను ఊని పలుకుతున్నాడు. చందమామను గూర్చి మనోజ్ఞంగా చెప్పినాడు. భిన్నరుచుల వర్ణన కొత్త తీరులో ఉన్నది.

బుద్ధులు స్థిరపడవలసిన బాలబాలికలకు ఈ గేయాలు పాఠ్యాలుగా అవసరం.

కోరస్

[కవిత, దామెర రాములు, క్రౌన్ 1/16, 60 పారటలు, ధర–రు 2–50, ప్రతులకు: పీస్ బుక్ సెంటర్, 3–4–74/3 లింగంపల్లి, హైదరాబాదు–500029.]

ఇది ఇంగ్లీషు పుస్తకం కాదు; తెనుగు విరసం శాఖ వారి కవిత. ఈనాటి ఇంగ్లీషు భాషాస్థాయిలో, చాలామంది విద్యార్థులకు ఈ హెడింగ్ అర్థం కాకపోవచ్చు. నాకర్థమైనంతవరకు — బృంద గానం, అను పదం—అంటూ.

నక్సలైట్ల ప్రతిపక్ష రక్తదాహం, తోడి మానవ జన పీడ సంగతి అటుండనిచ్చి, ఈ కవిత "జ్వలన గీతం"గా భాషా ప్రౌఢితో అలరారుతున్నది. రచనలో ఓజస్సు మెరుస్తున్నది. నుడికారంలో జాతీయత సొంపుగా వీనులకు ఇంపుగా ఉన్నది.

"చీకటి బంధాలలో చిక్కున్నది · ఉదయాన్ని మింగుతున్నది–" అన్నవి కవితా శిల్పస్ఫోరకాలు. "కరకర పొడుస్తున్నాడు–అరుణారుణ భాస్కరుడు" ప్రౌఢిని చూపుతున్నది. "రాత్రి రాక్షసి కౌగిలా" మంచి ఉత్ప్రేక్ష. "చంద్రనిప్పుల సూర్యుని క్రోధాగ్ని వర్షం" లోకానుభవాన్ని శబ్దప్రయోగ (చంద్ర) విలసనాన్ని తెలుపుతున్నది "మొక్క ఎదిగేది ఎప్పుడూ వెలుగు వైపుకే" ఇది శాస్త్ర పరిజ్ఞానానికి చెందినది.

రచనలో భావనాశక్తి రచనాపాటం నిండి ఉన్నవి. 1967 అన్న శీర్షికలో—తూరుపు నీళ్లోసుకుందని, నెలలు నిండాయని తెల్లారుగట్ల మా గూట్లో కోడి కూసింది—అని, జానుతెనుగు వాడుకలోగల అందాన్ని పొంగిస్తుది ఇది మనదేశంలో నక్సల్ బరిలో (బెంగాల్) ప్రారంభమైన రక్తబలి నాటి కారంభాన్ని గురించినది. సూర్యుడు తూర్పున ఉదయించినట్లే విప్లవం ఆ దిక్కులోనే పుట్టుతుంది అని సూచించినట్లున్నది.

కవి ఉద్దేశ మేదైనా, కవితా రసలుబ్ధులైన పాఠకులకు హాయిని గొలిపే రచన ఇది.

కలతల కొలతలు

[వచన కవితా సంపుటి, కోటపాల్ దేవరాజు, క్రౌన్1/8–80 పేజీలు, మూల్యం రు. 5/–, ప్రతులకు : గ్రంథకర్త, ఎల్. ఐ. జి. హెడ్ క్వార్టర్స్, లబ్బీపేట, విజయవాడ–10.]

ఈ కవి కలతలనే కొలుస్తున్నారు, కాబట్టి కాలగతి తలపోతలే కవితా సామగ్రి కావడం ఉచితంగానే ఉన్నది. ఒక కార్మికుడు, ఆ రంగమందుండే నాయకుడై రచయితై, తన అనుభవాలను, అందరి సాధక బాధకాలను వెల్లడించడంవల్ల ఇది పరోపదేశ పాండిత్యం కావడంలేదు. ఏమీ సంబంధంలేని బయటి కార్మిక నాయకులు తమ ఉదర పోషణార్థమై పెత్తనం చేత జిక్కించుకొని, పనివారిని రెచ్చగొట్టి తిరుగుబాటు చేయించి, నీడ నిచ్చే వృక్షాన్నే మూలచ్ఛేదం చేయించి దేశంలో అరాజకం సృష్టిస్తున్నారు. కాని, ఈ కవి నాయకత్వం అనుభవ పూర్వకమైనది కాబట్టి యోచించవలసి ఉన్నది.

ఇవన్నీ ముక్తకాలు. సామెతలుగా నిలిచిపొయ్యే దానికి కావలసిన కుదింపు బిగువు ఊపిరి చాలా వాటిల్లో ఉన్నవి. ఈయనకు చదువుతోబాటు సంస్కారం గూడ కావాల:– పండితుడు ప్రసిద్ధుడవడంలోగల సులభం పరిశుద్ధుడవడంలేదు. జీవితానుభవం లోపించిన విద్యాగంధం విచక్షణను చంపే ఆయుధమట. చుట్టమూ చేపమూన్నాళ్లే ముచ్చట గొల్పతవి అనే దాన్ని చెపుతున్నాడు:–చట్టాలు చుట్టాలు మొదట్లో ఉన్నంత ముచ్చటగా చివర్లో ఉండవు. నుడికారపు సొంపు తల్లి ప్రేమను రంజింపజేస్తున్నది:– తల్లి ప్రేమకు ఎల్లలులేవు, ఆమె హృదికి చిల్లులులేవు. కలిమి కులాన్నిదాస్తుంది– అని చాలా చక్కటిమాట అన్నాడు; ఎంతటి అనుభవపూర్వకమైన శాశ్వత సత్యం!

ఇట్టి పనస దొనలు చాలా ఉన్నవి.

చంద్రజ్యోతి

[వచన కవిత, శశికాంత్ శాతకర్ణి, డెమ్మి 1/8–80 పేజీలు, మూల్యం : రు. 6/–ప్రతులకు : కళాకేళి ప్రచురణలు, పిఠాపురం–533451.]

"అనుభూతిద్వారానే మానవులు దేవతలౌతారు" అని, అనుభూతిపట్ల పక్షపాతం చూపే కవి రచన ఇది. తత్త్వశాస్త్ర విద్యార్థి అట ఈయన, కాబట్టే ప్రతిబంతిలో సింబాలిజం తొణుకుతున్నది. "విషాద పట్టణం"లో నేటి పట్టణాల వివిధ రంగాల కంపును పారబట్టుతూ, మానవజాతి బాగుపడాలని ఆవేదనతో వ్రాస్తున్నాడు.

కవిత్వం చెప్పడం భావుకునికి సహజమని, పుప్పొడిని మోసుకొనిపొయ్యే భ్రమరాలను ఉపమిస్తున్నాడు– ఈ కాల కీకర ధ్వాన్ని అనుకొని సతతం ప్రవహిస్తుంటుంది జీవనది అని ప్రకృతి స్వాతంత్ర్యాన్ని బాగా చెప్పినాడు—ఆలస్యంగా వచ్చిన ఉదయం మధ్యాహ్నంలోకి పాకింది, ఎదుగు పొదుగు ఎప్పుడో ఆరిపోయిన–మొదలైన నుడికారాలున్నవి.

తెనుగు అక్షరాల ముత్యాలవంటి అందం చంద్రగిరి ఎద్దుల కొమ్ములవంటి తలకట్టుల ఠీవి, మన లిపికి ప్రత్యేకత గదా; కొత్త శిల్పమని శీర్షికలలో దానిని చెడగొట్టడం ఎందుకో.

ఉ ద య రా గ ం

[గేయకవిత, రాసమల్ల దేవయ్య, డెమ్మి 1/8–వెల రు. 2–50 ప్రతులకు : గ్రంథకర్త, భూసంరక్షణ కార్యాలయం, దేవరకొండ–508248.]

సమసమాజ వ్యవస్థకు దోహదమిచ్చే, యువకవితల ఆకాంక్షించే తరుణ కవి — ఈ విద్యార్థి. భావుకత మొగ్గదొడుగుతూ భాషకు గాంభీర్యాన్ని కూరుస్తున్నది. ''ఉదయరాగ పరాగాన్ని హృద్యుడనై యప్పగించెద'' అని ఉత్సాహ శక్తిని ప్రదర్శిస్తున్నాడు. ఉత్ప్రేక్షలు బాగున్నవి.

''జీవన సమరం'' తత్త్వబోధన భావాలతో ప్రపంచయాత్ర కాఠిన్యాన్ని ఎదుర్కొను మనస్సును ఆయత్త పరుస్తున్నది. ఆకటి దైన్య నిరాశలలో పడుతున్నా, రచయిత ఆశతో ముందుచూపు చూస్తున్నాడు. జీవిత సామరస్యానికి ఇదొక్కటే చక్కని రాజ మార్గం. కవిత్వం మంచి బాణీలో పడిఉన్నది.

కళాప్రపూర్ణ డా. మరుపూరు కోదండరామరెడ్డి

''ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర''

[ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర. ఢిల్లీ విశ్వవిద్యాలయం వారిచే పి హెచ్ డి. డిగ్రీ ఒసంగబడిన సిద్ధాంత వ్యాసం—డా. టి. సుశీల. ప్రతులకు హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్స్, సుల్తాన్ బజారులోని మాధవిబుక్ డిపో. 535 పుటలు. వెల : రు. 45.]

1968లో ఢిల్లీ విశ్వవిద్యాలయానికి తెలుగులో పిహెచ్.డి పట్టంకోసం ''ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర'' అనే సిద్ధాంత గ్రంథాన్ని శ్రీమతి టి. సుశీలగారు సమర్పించి పిహెచ్. డి పట్టాన్ని పొందారు. పిహెచ్. డి ఎప్పుడు వచ్చిందో తెలియదు కాని తమ రచనను 79 ఆగస్టు నెలలో ప్రకటించారు. 18వ శతాబ్దాంతం వరకు ద్విపద కావ్యాల సమీక్ష ఇందులో ఉంది. ద్విపద–దాని పుట్టు పూర్వోత్తరాలు, శైవమత సంబంధ ద్విపదలు, శాక్తమత సంబంధ ద్విపదలు, వైష్ణవమతసంబంధ కావ్యాలు, వేదాంత సంబంధ కావ్యాలు, భారత కథా సంబంధాలు, చరిత్రాత్మకాలు, వీర గాథా సంబంధాలు, పురాణసంబంధాలు, జీవిత చరిత్ర సంబంధాలు, సంకీర్ణ ద్విపదలు, సాంఘిక పరిస్థితులు అనే 12 ప్రకరణాల గ్రంథం ఇది. చివర 114 ద్విపద గ్రంథాల పట్టిక ఇచ్చారు. ఉపయుక్త గ్రంథాల లిస్టుకూడా జమచేశారు. మొత్తం 540పుటలు నిండాయి. డాక్టరుసుశీలగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే ఎం.ఎ. చదివి, శ్రీ భగవాన్ సత్యసాయి మహిళా కళాశాల, కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో ఉపన్యాసకులుగా పనిచేసి, ఢిల్లీ విశ్వవిద్యాలయం లోనే సుమారు 12 సంవత్సరాలనుండి పనిచేస్తూ మంచి అనుభవం గడించారని డాక్టరు దివాకర్ల వెంకటావధానిగారు తొలి పలుకులో ఆమెను ఆంధ్రలోకానికి పరిచయం చేశారు. ద్విపద కవితా శాఖ నారోహించిన కవికోకిల పాల్కురికి సోమనాథుడు. ప్రాకృత జనుల నాలుకలపై నాట్యమాడెడి ద్విపద వికార రచనలకు సోమన ప్రౌఢ కార్యవాసనా సంపత్తిని కల్పించినాడు. గద్య పద్యాది కృతులతో దీనిని 'సమతు' అనినాడు. తెలుగు మాట లనంగవలదు వేదము కొలదియ కాజూడుడని, ద్విపద ఐహికాముష్మిక ద్విపద హేతువని సమర్థించినాడు. బసవపురాణ, పండితారాధ్య చరిత్రలను ధారావాహిక ద్విపదలో చెప్పినాడు. ఆర్షవాఙ్మయంలో అనుష్టుప్ కి ఎంత పవిత్రము, ప్రచారమూ ఉందో తెలుగున ద్విపదకు అంత గౌరవ స్థానం సంపాదించ గలిగినాడు. సోమన ప్రాసయతిని కల్పించగా సోమన తరవాత వారు ఈసడించిరి. తాళ్లపాక చిన్నన్న ద్విపద కెరుగును. అతను సోమన ద్విపదలను సంస్కరించినాడు. ద్విపద వాఙ్మయం అపారంగా అభివృద్ధి చెందింది ఛందోగ్రంథకర్తలు లక్షణాలు చెప్పారు. పరిశోధకులు వ్యాసాలు, పీఠికలు వ్రాసి ద్విపద కావ్యాలకు ప్రచారం తెచ్చారు.

ఈ ద్విపద గ్రంథాలపై విశ్వవిద్యాలయాలలో మొదట పరిశోధన తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగింది. డా జి. నాగయ్య ద్విపద వాఙ్మయంపై పరిశోధన చేసి పి.హెచ్.డి పట్టం పొంది తమ బృహత్ గ్రంథాన్ని 1967లో ప్రకటించారు.

డా. సుశీలగారు తమ ప్రస్తావనలో 114 గ్రంథాలు పరిశీలించామని, అందులో 37 మాత్రమే ముద్రితాలని తక్కిన 77 అముద్రితాలని, గ్రంథకర్త నామం తెలియనివి 21 అని, గ్రంథ రచనా కాలం తెలియనివి 30 అని లెక్క కట్టి చెప్పారు. కాని గ్రంథాన్ని సూక్ష్మంగా విశ్లేషిస్తే పరిశీలించిన గ్రంథాలు 116, (విషయ సూచికలో 106 మాత్రం చూపారు), ముద్రితాలు 46, కాలం తెలియనివి 51 అని మా లెఖ ప్రకారం తేల్చాం. దీనికి కారణం ఏవి ముద్రితాలో ఏవి ముద్రితాలు కావో స్పష్టంగా తెలియకపోవడం. (చూ. మనోబోధ పుట. 289. ఇది జి. వో. ఎం ఎల్. బులెటిన్లో అచ్చయింది.) సిద్ధాంత గ్రంథకర్త్రి కవి కాలనిర్ణయం చేశామని చెప్పినా అది నమ్మదగిన మాటకాదు. ఆ నిర్ణయాలన్నీ లోగడ పెద్దలు చేసినవే. 141వ పుటలో భద్ర కవి లింగకవి కాలం నిర్ణయించడానికి లభ్యమైన శాసనాన్ని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు దక్షిణదేశ యాంధ్ర వాఙ్మయంలో గ్రంథస్థం చేశారు. అప్పైన అది ప్రామాణికమైపోయింది.

182వ పుటలో బట్టేపాటి తిరుమలకి క్రీ. శ. 1750 వాడని, 324వ పుటలో బట్టేపాటి తిమ్మయ క్రీ. శ. 1550–1600 మధ్య ప్రాంతమని రాస్తే ఎట్లా నమ్మమంటారు? పుష్పగిరి తిమ్మన టేకుమళ్ళ రంగశాయి 18వ శతాబ్ది ఉత్తర భాగంలో ఉన్నారని కందుకూరి వీరేశలింగం పంతులుగారు చెప్పినట్లు రాస్తే కాలనిర్ణయం చేసినట్లవుతుందా? మరి పుష్పగిరి తిమ్మన 18వ శతాబ్దపు వాడైతే, అతని సహాయం పొందిన కంకంటి నరసింహకవి 17వ శతాబ్దపు వాడెట్లావుతాడు?

పుష్పగిరి తిమ్మకవి, కంకంటి పాపరాజు, అతని తమ్ముడు నరసింహకవి, టేకుమళ్ల రంగశాయి, బట్టేపాటి తిమ్మయ–వీళ్లం

దరు సాహితీ బంధువులు. ఫ్రెండ్సు. డైలీ మిటయి డిస్కస్‌చేస్తూ ఉండేవారు. వివరాలకు కంకంటి పాపరాజు విష్ణుమాయా విలాసానికి డా. నేలటూరి వేంకటరమణయ్యగారు వ్రాసిన పీఠిక చూడండి. దానిని 1956లో వావిళ్లవారు అచ్చువేశారు.

ముద్రితాముద్రితాలు

శరణాగతి ద్విపద, సిద్ధేంద్రయోగి యోగీశ్వర విలాసం, మనోబోధ, వీరమాహేశ్వరాచార సంగ్రహం, అభిమన్యు కల్యాణం, ధర్మాంగద చరిత్ర– ఇవి ముద్రితమైన గ్రంథాలే. మద్రాసు ఓరియంటల్ లైబ్రరీ బులెటిన్‌లో మనోబోధ, యోగీశ్వర విలాసం అచ్చయ్యాయి. వీరమాహేశ్వరాచార సంగ్రహం 'శంకర మహిమ'అనే శీర్షికతో చిత్తూరు జిల్లా బంగారుపాళెం సంస్థానాధీశ్వరులు బంగారు చంద్రశేఖరనాయకేంద్రులు 1888లో అచ్చు వేయించారు. కాని గ్రంథం పూర్తిగా అచ్చు వేయలేదు. మొదటి 5 ఆశ్వాసాలు మాత్రమే

కంకంటి నరసింహకవి 17వ శతాబ్ది వాడని 279వ పుటలో చెబుతూ అతని గ్రంథం విష్ణుమాయావిలాసం విష్ణుమాయా నాటక పద్య కృతికి స్వతంత్రానువాదమని నాగయ్యగారి గ్రంథంలోని (పుట 210) వాక్యాలు కాపీ కొడితే ఏం బావుంటుంది చెప్పండి? నిజంగా విష్ణుమాయా విలాసం ద్విపద పదార్థమో, పద్యమో చెప్పకుండా దాటేస్తే ఎట్లా! అసలు ఈ గ్రంథం గ్రంథకర్త్రి చదివినట్లు లేరు. చదివితే పుష్పగిరి తిమ్మన కంకంటి నరసింహకవికి కూడా సహాయపడ్డాడని తెలిసేదే

''అనఘుని పుష్పగిర్యప్పన్న తనయు
ఘను సంస్కృతాంధ్రైక కవనాతి దకు
మాయన్న సఖుని తిమ్మన కవిఁ గృతి స
హాయునిఁ బిలిపించి యమ్మేటి తోడ''

ఈ వాక్యాలు విష్ణుమాయా విలాసం ద్విపదలోనివే. పుస్తకాలు చదవకుండా సిద్ధాంత గ్రంథాలు రాసే ఈ పాడుకాలంలో ఇదేమి వింత కాదనుకోండి.

విషయసూచిక

విషయసూచికలో గ్రంథంలో సమీక్షించిన గ్రంథాల పేర్లు రాలేదు. సురాభాండేశ్వరం (176) రెండు మైరావణ చరిత్రలు (216, 218), గురు శిష్య సంవాదం (297), రెండు నల చరిత్రలు (351, 353), దేవాంగ పురాణం (412) రెండు సారంగధర చరిత్రలు (450, 451).

విషయసూచికలో ఘటికాచల మాహాత్మ్యం శైవసంబంధి కాదు. అది వైష్ణవక్షేత్ర మాహాత్మము, ధర్మజ కృష్ణసంవాదం భారత సంబంధి. శైవమత వేదాంత గ్రంథాలు, అద్వైత వేదాంత గ్రంథాలు కొన్ని తారుమారయినాయి. శృంగార విషయం, పరశురామాయణం, రామకుమార విజయం, కుశలవకథ. కుశలవోపాఖ్యానం భారత కథకు సంబంధించినవి కావు కదా! శ్రీ కృష్ణార్జున సంవాదం భారతంలో లేదంటూ ఎందుకు చేర్చారో! సిద్ధేశ్వర, పల్నాటివీర, కాటమరాజు చరిత్రలు చారిత్రాత్మకములే.

పురాణ సంబంధ ద్విపదలలో దేవాంగపురాణం దూరినప్పుడు వైశ్య పురాణాన్ని సంకీర్ణ ద్విపదల క్రింద చేర్చడానికి ఏం పాపం చేసుకొంది ? యోగ శాస్త్రం, స్వరశాస్త్రం. వేదాంత గ్రంథాల్లోకి వెళ్లవలసి ఉంటుంది.

ద్విపద గ్రంథాల లిస్టు

ద్విపద గ్రంథపట్టికలో 114 గ్రంథాలు ఇచ్చారు దీంట్లో చేరవలసిన వివేకసింధువు, కపిలచరిత్ర, గౌడపురాణం,మాతపురాణం, మావురమ్మ కథ, సత్యభామావిజయం మొదలయినవి ఎన్నోఉన్నాయి. గ్రంథంలో సమీక్షించిన కురుత్తాళ్వారుల చరిత్ర, కలియుగ మంజరి, ఘటికాచల మాహాత్మ్యం, నలచరిత్ర, మైరావణచరిత్ర ఈ లిస్టులో లేవు. ఈ లిస్టులో ఉన్న ప్రబోధ చంద్రోదయము, భాను కల్యాణం, రామకథ గ్రంథంలోకి అసలే రాలేదు. చొక్కనాథ చరిత్రను వి. వెంకటరావు పరిష్కరించనూ లేదు.

ఉపయుక్త గ్రంథాల జాబితా

ఉపయుక్త గ్రంథాల లిస్టుచూస్తే మరికొన్ని వింతలు. ఆంధ్ర వాఙ్మయ సూచిక 1929లో ముద్రితమైంది. 1920 కాదు. ఆంధ్ర భాషా భూషణం – దేవినేని సూరయ్య వాఙ్మయ మహోధ్యక్ష, కళాప్రపూర్ణ డాక్టరు వడ్లమూడి గోపాలకృష్ణయ్యగార్ల పీఠికా సహిత వ్యాఖ్యాన గ్రంథం. అంతేకాని దేశినేని సూరయ్య అండ్ వ. గోపాలకృష్ణయ్య అని నిర్లక్ష్యంతో రాస్తే ఎట్లా?

463 స్వరశాస్త్రకర్త తెలియదన్నారు. దీనికర్త గణపనారాధ్యుడని, చారిత్రకంగా చాలావిలువైందని డా. నేలటూరి వేంకటరమణయ్యగారు రాస్తూ కవి క్రీ. శ. 1323 – 45 మధ్యవాడని తెలియజేశారు (చూ. వాఙ్మయ వ్యాసమంజరి పుటలు 19–23). ఇది యోగశాస్త్రంలో నాడీ గ్రంథ విభాగానికి చెందుతుంది.

483 ఆ కాలమున నిష్కము వాడుకలో నుండెను. ఒక కర్ణాటక వేశ్య తన రేటు ''శాటీహాటక నిష్కము'' అని చెప్పినది. మహిళలు వాడవలసిన మాటేనా ఇది ? అయినా ద్విపద కావ్యాల పుస్తకంలో ఈ పద్య పాదం ఎందుకు తీసుకురావలసి వచ్చింది ? అందుకనే ఈ సిద్ధాంత గ్రంథం ఒకరి చేతిమీద నడిచింది కాదని అనుమానం పుట పుటకి తగులుతూనే ఉంటుంది.

''శాటీ హాటక నిష్కముల్ వెలిగ రుంరూటంబు చాలించు'' అన్నది పూర్తి ప్రయోగం. ఇది క్రీడాభిరామంలోది.

486 ''మేదర వారిని గూర్చి మొట్ట మొదట దెల్పినది పరమయోగి విలాసము'' - పండితారాధ్య చరిత్రలో చేటల వేమయ్య

కథ ఉంది. పైన చెప్పిన క్రీడాభిరామంలోనే "కాముబిరి గోల మేదరకరణ వేశ్య" ఉంది. దాని "రేటు" తెలియదు.

డా. సుశీలగారు కాయక్లేశాల కోర్చి ఈ గ్రంథం తయారు చేశారు. కాని ద్విపద వాఙ్మయానికి ఈ గ్రంథం చర్విత చర్వణమే అయింది. తెలుగుదేశంలో పి హెచ్. డి స్థాయి దిగజారి పోతోందని మొర పెట్టుకొనే వారికి ఈ గ్రంథం బాగా పనికొస్తుంది.

శ్రీ నిడదవోలు వేంకటరావు

గ్రంథ చౌర్యాలు, జాగ్రత్త! దుర్గానంద్!

[కంఠాలు : ఆర్. కె. మొగసాటి, నరసింగరాజు, తోకచిమ్ము. ప్రచురణ : సాహిత్య నవ పంథా. 7 - 7 – 7 గుట్టల బజార్, ఖమ్మం. వెల : మూడు రూపాయలు.]

"దుర్గానంద్‌గారి ప్రభావం తదనంతర రచయితల మీద ఎంత పడ్డది, ఎంతమంది ఆ కవిత్వాలను కాపీ కొట్టారు అన్నదే" ఈ వ్యాసోద్దేశంగా "రచయితలు" ప్రారంభంలోనే చెప్పారు. కనుక ఈ ఉద్దేశంతోనే ఈ 88 పేజీల క్రవున్ సైజు పుస్తకాన్ని చదవాలి. నేడు ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయ లాంటి కవులెందరో దుర్గానంద్‌గారి రచనలను కాపీ కొట్టి రాస్తున్నారని, కనీసం వాళ్లు దుర్గానంద్‌గారి పేరు గూడా స్మరించడంలేదనీ ఆవేదనతో ఈవ్యాస రచయితలు ఈపుస్తక రచనకూ ప్రచురణకూ ఉపక్రమించారు.

"నేను కళ్లారా చూచాను—ఆయన కవిత్వాలను కాపీ కొట్టిన వాళ్లను చూపిస్తాను ..." మొదలైన వాక్యాలలో ఏకవచనాలు మాత్రమే ఉండటం వలన ఒకే రచయిత వ్రాసి, మిగిలిన యిద్దరి ఆమోదంతో పుస్తకాన్ని ప్రచురించారేమోఅని అనుమానంవస్తుంది.

దుర్గానంద్‌గారి రచనల్లోంచి అనేక ఉదాహరణలిచ్చి, వాటిని నేటి ప్రముఖ రచయితల రచనలతో పోల్చి చూపారు. ఈ పోలికలు బలంగా లేకపోవడం వలన ఆత్రేయ మొదలైన కవులు శ్రీ దుర్గానంద్ రచనల నుండి కాపీ కొట్టారని ఈ గ్రంథకర్తలు ఎంత నొక్కి చెబుతున్నా పాఠకులకు నమ్మబుద్ధివేయదు. అయితే దుర్గానంద్‌గారు కూడా మంచి కవిత్వం రాయగలవారేనన్న సంగతిమాత్రం ఈ గ్రంథాన్నిబట్టి సువిదితమవుతూంది. పాతికేళ్ళక్రితం సాహిత్య రంగంలో ప్రసిద్ధిగాంచిన వారిలో దుర్గానంద్ ఒకరు. ఆనాటి కొందరు కవుల పేర్లు గూడా ఈనాడు చాల మందికి తెలియవు. ఆధునిక సాహిత్యం పద్ధతే అది. ఎవరి అదృష్టం వారిది. ఆరుద్ర వంటి వాళ్ళు సినిమా రంగానికి పోకపోతే దుర్గానంద్‌గారి స్థితిలోనే ఉండేవారేమోనని ఈపుస్తకం చదువుతున్నప్పుడు కొంతమందికైనా అనిపించి తీరుతుంది. అంతా దుర్గానంద్‌గారి దగ్గరి నుంచే కాపీ కొట్టారని నిరూపించ ప్రయత్నించేబదులు దుర్గానంద్‌గారి కవితా మాధుర్యాన్ని సోదాహరణంగా చెబితే ఈపుస్తకం ప్రయోజనకరంగా ఉండేది. ఇచ్చినవి చాలవు.

ఈ పుస్తకంలో రచయితలు ధైర్యంగా చెప్పిన కొన్ని విషయాలు గమనార్హంగా ఉన్నాయి. "గురజాడ అప్పారావుగారిని మనం మహాకవి అంటున్నాము. ఆయన బతికి ఉన్నప్పుడు ఆయన్ని మనం నిజంగా ఈ మాట అంటే ఉలిక్కిపడేవాడే. ఆయన్ను మహాకవి అనలేము. అప్పుడున్న విదేశీ భావాలను ఏదో చిన్న ఛందస్సులో పెట్టి పిల్లలకు అర్థమయ్యేటట్టు చెప్పే గైడులాంటి కవిత్వం ఆయన వ్రాశాడు...గురజాడఅప్పారావుగారి నాటకం గూడా ఆంధ్ర దేశానికి మహా పాత్రల్ను ఆదర్శవంతమైన జీవన లక్ష్యాలను ప్రోది చేసిమనముందు ఉంచలేకపోయింది–" అంటారు ఒకచోట.

దుర్గానంద్‌గారి స్వతంత్ర ప్రవృత్తిని, ఆలోచనా రీతిని తెలిపే వాక్యాలు కొన్ని—

"సత్యజిత్తురాయి మనకు గురువు. అతనివి ఏపారిసులోనో లండన్లోనో ఒక వారం రోజులు ఆడితే ఇక్కడ మన మేధావులకు పట్టపగ్గాలుండవు ప్రపంచమంటే పారిస్సూ లండనేనా! తన దేశంలోనే మెప్పించలేక ఇరాను షా దేశం వదలి పారిపోయినట్టు పారిపోయిన ఆ చిత్రాలు! అవి ఒక కళా ఖండాలా! అసలు సత్యజిత్తురాయ్ చిత్రం ఒక ఆర్టేనా! అది ఆర్టుకాదు. వ్యాకరణం. వ్యాకరణం ఎవరు చూస్తారు—పరీక్షలకు వెళ్లే విద్యార్థులు తప్పితే! దానిలో వాస్తవికత మాత్రమేముంది? ఒక రాణి అంతలో చిలకె చెట్టెక్కితే అవాస్తవికంఅన్నాము. ఒక కనురెప్పే తెరంతాచూపిస్తే అవాస్తవికం కాదా! మనం పాశ్చాత్యుల కళను అర్థం చేసుకోవడానికీ ఆనందించడానికీ రెండు వందల సంవత్సరాల నుండీ వాళ్లక్లాసుల్లో కూర్చుంటున్నాము. అలాగే మన కురుక్షేత్రం, ఉషా పరిణయం వాళ్ళు చూడాలి, చదవాలి, క్లాసులు పెట్టుకోవాలి వాళ్ళబెడ్డను మనం తినడం నేర్చుకున్నప్పుడు మనపాయసం త్రాగడం వాళ్లెందుకు నేర్చుకోరు! బ్రెడ్డుకు పెట్టుకున్న నియమాలు పాయసానికి ఎలా వర్తిస్తాయి! మన కురుక్షేత్ర నాటకంచూచి ఆనందించి వ్రాయగలిగినప్పుడే వాళ్ళు ప్రపంచానికి సరిపడే నాటక సిద్ధాంతాలు వ్రాసినట్టు, లేకపోతే అవి లోకల్ సర్వీసులు అవుతాయిగాని సార్వభౌమిక సూత్రాలు కాలేవు."

పుంభావ సరస్వతి శ్రీనాథుడు

[రచయిత : భాషా ప్రవీణ పాతకోట రాధాకృష్ణమూర్తి, ఎం ఏ. (తెలుగు) ఎం. ఏ. (సంస్కృతము) డెమ్మీసైజు 328 పుటలు, వెల : ముప్ఫయ్ రూపాయలు, ప్రతులకు : ఆంధ్రప్రదేశ గురుకుల విద్యాలయము, డాడికొండ (పోస్టు) గుంటూరు జిల్లా.]

ఇది ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారి ఆర్థిక సహాయంతో ముద్రితమైన మంచి పుస్తకం. అకాడమీ డబ్బు ఒకరి సొంత సొమ్ము కాదు అది ప్రజా ధనం. దానిని సక్రమంగా వినియోగించ వలసిన బాధ్యత కార్యదర్శిది. అలా చేయకపోతే పెద్ద తప్పు, చేస్తే

గొప్ప యేమీకాదు. ఆంధ్రప్రదేశ సాహిత్య ఎకాడమీ ఎన్నో చెత్త పుస్తకాలకు కూడా ధన సహాయం చేస్తోంది. పలుకుబడి ఉన్నవాళ్ళు బాగా ఉపయోగించుకొంటున్నారు. అప్పుడప్పుడూ మంచి పుస్తకాల ప్రచురణకు గూడా అకాడమీ చేయూతనిస్తుందని చెప్పడానికి ''పుంభావ సర్వసతి శ్రీనాధుడు'' మంచి ఉదాహరణ

ప్రింటింగు బాగా లేకపోయినా ప్రెస్సు వారికి కృతజ్ఞతలు చెబడం, తమ ధర్మాన్ని నెరవేర్చిన అకాడమీ కార్యదర్శులను ఎక్కువగా పొగడటం మన రచయితలకు మామూలైంది. ఆ పాత అలవాటునే శ్రీ పాతకోట రాధాకృష్ణమూర్తిగారు కూడ పాటించారనుకోవాలి. మూడు వందల ముప్ఫయ్ పేజీల పుస్తకం వెల ముప్ఫయ్ రూపాయలు పెట్టారు. వెల విషయంలో బాగా శ్రద్ధ తీసుకున్నారు. ఆ శ్రద్ధ ముద్రణ విషయంలో కనబడటం లేదు. అచ్చు తప్పులున్నాయి. మధ్యలో టైపు మారింది. సమీక్షార్థం పంపిన ప్రతిలో 272 పుట తర్వాత ఫారం తల్లక్రిందులుగా బైండయింది!

ఈ పుస్తకంలో శ్రీనాధుని వృత్తాంతము, శృంగార నైషధము, హర విలాసము, భీమ ఖండము కవితా వైశిష్ట్యం, కాశీ ఖండము, శివరాత్రి మాహాత్మ్యము, కాదంబరీ చర్వణము, పల్నాటి వీర చరిత్ర, పూర్వ కవి చర్వణము, శ్రీనాధుని సీసములు, అక్షర రమ్యత అనే అంశాలున్నాయి.

శ్రీనాధుని రచనలను పరామర్శించేవారికి సంస్కృతాంధ్రాలలో పాండిత్యం ఉండాలి. ఈ రచయితకు ఆ అర్హత ఉన్నది. శ్రీనాధుడంటే ఈయనకుఇష్టం. వ్యాసాలను ఆద్యంతమూ ఆసక్తి పుట్టించే రీతిలో, సరళ గ్రాంథిక భాషలో మనోరంజకంగా రచించారు ఆంధ్ర సాహిత్యాధ్యయనం చేసేవారికి బాగా ఉపయోగపడే రీతిలో రచయిత ఆయా విషయాలను గూర్చి సోదాహరణంగా వరణలు ఇచ్చారు. సుప్రసిద్ధమైన శ్రీనాధుని పద్యాలెన్నో ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి. అవసరాన్నిబట్టి అలంకార శాస్త్రాల నుండి పెక్కు శ్లోకాలను ఉటంకించారు.

అంతరిక్ష యాత్ర

[రచన: భగవతీ ప్రసాద్ శ్రీవాత్సవ, అనువాదం: ఏ. వి. యస్. రామారావు, ప్రచురణ: నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, వెల: రూ. 8-00, డిస్ట్రిబ్యూటర్సు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు.]

ఆవిష్కార్ కథ, ఘరేలు బిజిలీ అనే రచనలకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ బహుమతి నందుకున్న హిందీ వైజ్ఞానిక రచయిత డా॥ భగవతీ ప్రసాద్ శ్రీవాత్సవ ఈ పుస్తకాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో రచించారు. అంతరిక్షయాత్రా స్వప్నం, వాయుమండలానికి ఆవల మహాశూన్యంలో, రాకెట్టు వికాసం, భూమ్యాకర్షణ బలం, కృత్రిమ భూ ఉపగ్రహాలు, భూఉపగ్రహ ఉపయోగం, చంద్రునిపై రాకెట్టు దిగింది, మానవ అంతరిక్ష యాత్రికులు, చంద్రతలంపై మానవుని అవతరణ, అంతరిక్ష ప్రయోగశాల, గ్రహ నక్షత్రాల యాత్ర, అంతరిక్షనౌక, గ్రహ నక్షత్రాలపై జీవరాసులు, భారత దేశంలో అంతరిక్ష పరిశోధన ప్రగతి, భవిష్యదవలోకనం అనే పదిహేను శీర్షికలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

ఇలాంటి పుస్తకాలు తెలుగులో ఇంతకు ముందే ఉన్నాయి. వాటన్నిటిలోనూ ఇది చౌకగా, ఉత్తమంగా ఉంది. ఈ పుస్తకంలో మొత్తం పదహారు చిత్రాలున్నాయి. ఇవి చాలవు. అక్షరాల కంటే బొమ్మలే ఎక్కువ ఆకర్షిస్తాయి. అందులోనూ ఈ వైజ్ఞానిక పుస్తకానికి రేఖా చిత్రాల కంటే ఛాయా చిత్రాలు ముఖ్యం. ఆధునిక అంతరిక్ష విజ్ఞానాన్ని తెలియజేసే ఛాయాచిత్రాలు కోకొల్లలుగా లభ్యమవుతున్నప్పటికీ ఈ పుస్తకంలో చాలా తక్కువ ఛాయాచిత్రాలు మాత్రమే వేశారు.

ఆంధ్రానువాదం గ్రాంథికానికి దగ్గరగా ఉంది. శాస్త్ర గ్రంథాలు గ్రాంథిక భాషలో ఉంటేనే బావుంటాయని ఈ పుస్తకం చదివిన తరువాత అనిపిస్తుంది. అనువాదంలోనో, ప్రచురణలోనో, మూలంలోనో మరి – పొరపాట్లు దొర్లాయి. 165 వ పుటలో ''బ్రహ్మాండంలో జీవగతి భూమిమీది జీవగతి కంటే భిన్నంగా ఉండగలదని అనుకోవడం కేవలం మూర్ఖత్వమే అవుతుంది'' అని ఉన్నది. ఆ తరువాత మూడవ వాక్యం ఇలా ఉంది: ''అందుచేత అక్కడ జీవ వ్యాపారం జరుగుతూ ఉంటే అది భూమిపైగల జీవ వ్యాపారానికి పూర్తిగా భిన్నంగా అనేక నిగూఢ విషయాలతో కూడి ఉంటుంది.'' ఈ రెండు వాక్యాలూ ఒకదానికొకటి వ్యతిరేకంగా ఉన్నాయి. మారినర్ బరువు కేవలం 260 కిలోమీటర్లు మాత్రమే (133వ పుట) వంటి వాక్యాలు హాస్యాస్పదంగా ఉంటాయి గాబట్టి ప్రచురణకర్తలు మరింత శ్రద్ధ తీసుకొని మూల రచయిత గ్రంథాన్నీ, అనువాదాన్నీ ప్రూఫులనూ బాగా పరిష్కరించవలసిన అవసరం ఉంటుంది.

1975 తరువాత జరిగిన అంతరిక్ష పరిశోధన విశేషాలు ఇందులో లేవు. '75కు ముందుగానే ఈ గ్రంథం రచించబడటం ఇందుకు కారణం కావచ్చు కానీ ప్రచురించింది '79లో గాబట్టి కనీసం ఆమధ్య కాలంలో అంతరిక్ష విజ్ఞాన ప్రగతిని తెలిపే ఛాయాచిత్రాలనైనా ఈ పుస్తకంలో వేయవచ్చు. ఈ పుస్తకంలో స్కైలాబ్ గురించిన 'వివరణ 73 నాటిది! విజ్ఞానశాస్త్రం క్షణ క్షణాభివృద్ధి నందుతూంది. శాస్త్ర గ్రంథాలు ప్రచురించేవారు ఆ క్షణం వరకూ తెలిసిన విజ్ఞాన విశేషాలను వెలువరించే ప్రయత్నం చేయాలి.

శ్రీ పులిచెర్ల సాంబశివరావు

తెలుగు విద్యార్థులకో తొమ్మిది పుస్తకాలు

తెలుగు విద్యార్థులకు తెలుగు, ఆ తెలుగుతోపాటు తెలుగు నాట చరిత్రలూ తెలియడం చాలా అవసరం. హైదరాబాదు ఇండి

యన్ పబ్లిషింగ్ హౌస్‌వారు దేశ చరిత్రకు సంబంధించిన ప్రోలయ వేముడు, విశ్వనాథ నాయకుడు, గౌతమి అనే పుస్తకాలను, ''ప్రహ్లాదుడు'' కథ, బాపూజీ చరిత్రను ఒక ఆంగ్లకథకు తర్జుమా వినయ ప్రభ కథ, వడగళ్ళు, కథంబము అనే చిన్న కథల సంపుటాలను ప్రచురించారు. డాక్టర్ నాయని కృష్ణకుమారి గౌతమి కథను చాలా చక్కగా రచించారు. కథ చదువుతూంటే చదువరి వొళ్ళు పులకిస్తుంది. మిగతా ఏడు పుస్తకాలూ కూడా బాగున్నాయి. ఈ పుస్తకాలు తెలుగు విద్యార్థులకోసం, లైబ్రరీలకోసం ప్రచురింపబడ్డాయి. ఎటొచ్చీ ప్రచురణకర్తలు కాస్త అచ్చు తప్పులు రాకుండా జాగ్రత్త పడి వుండుంటే బాగుండి వుండేది. తెలుగు నేర్పదల్చుకున్న పుస్తకాలలో అచ్చుతప్పులూ, నిఘంటువులో అచ్చుతప్పులూ వుంటే ఎలా?

తొమ్మిదో పుస్తకం నాయకురాలు. మహావాది వెంకటరత్నం వ్రాసిన యీ పలనాటి వీరగాథను గుంటూరు జూపిటర్ బుక్ హవుస్‌వారు ప్రచురించారు.

ఈ పుస్తకాలు ప్రతి లైబ్రరీలోనూ తెలుగు అరలలో చోటు చేసుకొనవచ్చును.

1) ప్రోలయవేముడు : డి. వి. సుబ్రహ్మణ్యం.

2) వినయప్రభ : ఆచార్య.

3) విశ్వనాథ నాయకుడు : నూతలపాటి పేరరాజు.

4) బాపూజీ : అనుముల వెంకట శేషకవి.

5) ప్రహ్లాదుడు : బృందావనము రంగాచార్యులు.

6) కదంబము : వావిలాల సోమయాజులు.

7) గౌతమి : నాయని కృష్ణకుమారి.

8) వడగళ్ళు : శ్రీ దివి దీక్షితులు.

9) నాయకురాలు : మహావాది వెంకటరత్నము.

మ న సు గ తి

[శిష్ట్లా కృష్ణమూర్తి, కర్నూలు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం, కర్నూలు, ఆర్రూపాయలు.]

ఓ శలవు రోజున పొద్దున్నే బద్ధకంగా లేచిన శివరాం మనస్సు ప్రతి చిన్న విషయాన్నీ చాలా వివరంగా తర్కించుతూంటుంది. ఆ రోజంతా, దారిన పోయే స్త్రీని చూసినపుడు ప్రతి పురుష మనస్సు పొందే వికారం, తినగా మిగిలినన్నాలు పారేయడానికే యిష్టపడే మనస్తత్వం వగైరాలూ. యింట్లో తన భార్య శాంత ఫలానాదిలేదు అన్న ముక్కలోని దొప్పిపాడుపు వరకూ అన్ని విషయాలూ కూలంకషంగా అతని మనసు వివరిస్తూంటుంది. ఇదే మనసు గతి.

రచయిత శిష్ట్లా కృష్ణమూర్తి మనసు గతి చాలా చక్కగా వివరించారు. సామాన్య మానవుని ఆలోచనల తీరుకు అద్దం పట్టారు. కథలోనూ, కథనంలోనూ కొత్తదనం వుంది. ఆలోచనలతో సతమతమవుతూన్న అతనిని అతని భార్య మందలింపులూ వాటిమీద ఆతని వ్యాఖ్యానాలూ చాలా సహజంగా వున్నాయి. ఎటొచ్చీ కథాంతంలో ఆతను 'శాంతా నాక్కావల్సింది నీవు కాదు. నాక్కావల్సింది మనశ్శాంతి' అని అనేబదులు, 'నాక్కావల్సింది మనసుకు విశ్రాంతి' అనుంటే సహజంగా వుంటుండేమో!

వాంటెడ్ కాలమ్

[వై. వి. యస్. యస్. యన్ మూర్తి, దేవీ పబ్లికేషన్స్, విజయవాడ, పదిరూపాయలు.]

ఈ పుస్తకంలో మొత్తం ఇరవైయ్యయిదు కథలున్నాయి. కథలన్నిటిలో వాంటెడ్ కాలమ్ కథే డెబ్బయిన్నర పేజీలుంది. మిగతా కథలన్నీ బహు చిన్నవై పిట్ట కథల సైజు చేరాయి. ఏ కథలోనూ కథావస్తువు సరిగా ఎన్నుకోలేదు. ఎన్నుకున్న వస్తువుని రచయిత సరిగా పోషించడానికి ప్రయత్నం చేయనూలేదు. సోమన్న కథ, అబ్దుల్ ఖాదర్ కథ, కాసబియాంకా కథలలోలా ప్రతి కథలోనూ నీతి ఎదురు చూడకపోయినా కథావస్తువైనా వుండాలని చదువరి ఎదురు చూడడం తప్పుకాదు. అలా చూసే చదువరికి యీ కథలలో ఏమీ దొరకదు.

రచయితకు నేర్పువున్నా, చక్కని శైలివున్నా కథలు చాలా చిన్న చిన్నవిగా రాయడంచేత ఏ కథా రాణించలేదు.

198 పేజీలు, పది రూపాయల ఖరీదు వున్న యీ ''వాంటెడ్ కాలమ్'' పుస్తకాన్ని విజయవాడ దేవీ పబ్లికేషన్స్ వారు ప్రచురించారు. రచయిత వై. వి. యస్. యస్. యన్. మూర్తి.

అ రు ణ రా గ ం

[చెరుకూరి రమాదేవి, న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ, పన్నెండు రూపాయలు.]

వివాహం అనవసరమైన యింట్లో (?) పుట్టిన లలిత, ధనవంతుడైన మోహనూ ప్రేమించి రిజిస్ట్రరు పెళ్ళి చేసుకుంటారు. లలితకు నెల తప్పి, గర్భం ఫలించేనాటికి రివాజుగా ఆ డాక్టరు మోహను తమ హోదాకు సరితూగే అమ్మాయిని వివాహం చేసేసుకుంటాడు. కచ్చితంగా పెళ్ళి వూరేగింపు సమయానికి తాను కన్న కొడుకు నెత్తుకుని ఆ వూరెళ్ళిన లలిత ఆ సీను చూసి గుండె రాయి చేసుకుని గిరుక్కున తిరిగొచ్చేస్తుంది. పిల్లవాణ్ణి తానే పెంచి పెద్ద చేయాలని నిశ్చయించుకుంటుంది. ఈలోగా రోగాలు వచ్చి కృంగి కృశించి తానిహ బ్రతకనని వూహించుకుని పక్క వాటాలో వంటరిగావుంటూ వుద్యోగం చేసుకుంటున్న అరుణకు యీ కథంతా

చెప్పి తన బాబును వాని బాబు దగ్గర జేర్చమని తన రిజిస్టరు పెళ్ళి సర్టిఫికట్టూ, పిల్లవాని జనన సర్టిఫికట్టూ యిస్తుంది. తానిహ బ్రతకనని కూడా హెచ్చరిస్తుంది. అన్నట్టుగానే అరుణ ఆ వూరె ళ్ళాక చనిపోతుంది.

అరుణ ఆ పసి పిల్లాడితో ఆ వూరు చేరి లలి మఱది డాక్టరు మోహన్ను లలిత భర్త డాక్టరు మోహనుగా అపార్థం చేసుకుని కథంతా చెప్పి బాబును వప్పగించి పోడాని కొచ్చానంటుంది. ఈ కథంతా మొదట 35 పేజీలలో అయిపోతుంది. మిగతా 217 పేజీలలో కథ ఏమీ లేదు. మోహను తన అన్నగారి పాపఫలాన్ని తానే భరించ నిశ్చయించుకుని తల్లిని, వదినగారిని కూడా ఎదిరించే స్థితిలో వుంటాడు. కొన్ని పేజీలు దొర్లగా అతను అరుణను చాలా సునిసితంగా ప్రేమిస్తున్నట్టూ, ఆమె కూడా అతన్ని ప్రేమిస్తున్నట్టూ చదునరికి అనుమానం వస్తుంది. కథలా నడుస్తూండగా కథలోకి మోహన్ వదినగారి అన్నగారు విలనులా ప్రవేశిస్తాడు అరుణని క్రూరమైన మాటలతో హింసిస్తూంటాడు. 188వ పేజీలో మోహన్ అరుణని "ఐ లవ్ యూ" అంటాడు. ఆమె చేతి వేళ్ళను నొక్కుతూ. విలను కృష్ణారావు 192వ పేజీలో వచ్చి "బాబు మీ యిద్దరి అనురాగ ఫలం అనాధ పేరుతో మోహన్ పెంచుతున్నాడు" అంటాడు ఆ మాట భరించలేక అరుణ మోహన్ వూళ్ళో లేనపుడు ఆ వూరొదిలివేసి విజయవాడ వచ్చి ఆతని స్నేహితుని ఆఫీసులో ఆతని పేరుపయోగించి వుద్యోగం సంపాదిస్తుంది. అక్కడ గోపాల్ అనే అతన్ని వివాహం చేసుకోడాని కొప్పుకుంటుంది. మోహన్ ఆ వూరొచ్చి ఆమెను కలిస్తే గోపాల్ దాన్ని సమ్మతించడు. నిశ్చయమయిన వారి విహహం ఆగిపోతుంది. చివరికి 256వ పేజీలో అరుణ మోహన్ను పెళ్ళాడ్డానికి సమ్మతిస్తుంది.

ఈ కథ చక్కనిది. కథనమూ చక్కగా వుంది. కానీ రచయిత్రి కథావసరాన్ని మించి పాత్రలను, సన్నివేశాలను చదువరి విసిగేలా పెంచారు. కథ చివరివరకూ వచ్చాక గోపాల్ పాత్ర ప్రవేశపెట్టినందువల్ల అరుణ పాత్ర గంభీరతపోయి, పేలవం అయింది. పెళ్ళి చేసుకుందామని అన్న మోహనుకు తన బాధ్యతలు వప్పచెప్పిన అరుణ గోపాలును వప్పుకోడానికి కారణం కనబడదు. విలను పాత్ర శుద్ధ దండగ. అరుణ ఆలా వూరొదలడాని కాపాత్రే అవసరంలేదు.

రచయిత్రి చెరుకూరి రమాదేవి రాసిన యీ నవలను విజయవాడ న్యూ స్టూడెంట్సు బుక్ సెంటర్‌వారు పన్నెండ్రూపాయల వెలకు తెలుగు చదువరి ముందుంచారు.

శ్రీ భూపతి

ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ ఇన్ ఆంధ్ర అండర్ ది ఈస్టు ఇండియా కంపెనీ:

[రచయిత డాక్టర్ వై. విఠలరావు "గురుప్రసాద్" 10-5 64-8/ఎ శ్రీరామ్ నగర్ కాలని, మాసబ్ టాంకు, హైదరాబాదు-28. ప్రథమముద్రణము 1979, 324 పుటలు. వెల : రు. 40 ప్రకాశనము : ఎన్. విద్యారణ్యస్వామి, 1-8-71 ప్రెండర్‌గాస్ట్ రోడ్డు, జవహర్‌నగర్, సికింద్రాబాదు-3]

ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగు ఇన్ ఆంధ్ర అండర్ ది ఈస్టిండియా కంపెనీ అనే ఆంగ్ల గ్రంథము చరిత్ర పరిశోధకులైన డాక్టర్ వై. విఠలరావు 1968లో పిహెచ్. డి. పట్టమునకు సమర్పించిన సిద్ధాంత వ్యాసము. ఈ గ్రంథనామాన్ని ఈస్టిండియా కంపెనీ పాలనలో ఆంధ్రలో విద్యా వైదుష్యములు అని తెలుగులోనికి తర్జుమా చేయవచ్చును.

ఈస్టిండియా కంపెనీ 16వ శతాబ్దాంతంలో భారత దేశంలో అడుగుపెటింది 17వ శతాబ్దంలో వ్యాపారాభివృద్ధితో పాటు వర్తక స్థావరాలు సంపాదించింది. ఈ స్థావరాలలో ఉండేవారి కోసం వారు పాఠశాలలు స్థాపించవలసి వచ్చింది. అదేవిధంగా వర్తకంకోసం వలసలకోసం వచ్చిన ఐరోపియనులు ముఖ్యంగా పోర్చుగీసువారు, ఫ్రెంచివారు తమ తమ వర్తక స్థావరాలలో పాఠ

శాలలు నెలకొల్పారు. భారతదేశంలో వివిధ ప్రాంతాలలో సాగిన యీ విద్యావిధానం ఆంధ్రదేశంలో కూడా సాగింది. ఆంధ్రదేశంలోని కాకినాడ సమీపంలోనున్న యానాంలో ఫ్రెంచివారు ప్రాథమిక పాఠశాల నెలకొల్పారు. క్రమంగా కొన్ని ఇంగ్లీషు పాఠశాలలు అక్కడక్కడా ఏర్పడ్డాయి. ఆంధ్రదేశంలో ఐరోపియను వలస రాజ్యాలు ఆధిపత్యం కోసం జరిపిన పోటీ పోరాటాలలో ఆదిలో ఫ్రెంచివారిదే పైచేయి. తరువాత ఫ్రెంచివారిని ఓడించి ఆంగ్లేయులు వారి స్థానాన్ని ఆక్రమించారు. ఈనాటి ఆంధ్రప్రదేశ్ అంతా కొంచెమించుగా నైజాం పాలనలోనే అఖండ భాగంగా ఉండేది. దానిని తన అవసరాలు తీర్చుకోడానికి నైజాం కొంతభాగం ఉత్తర సర్కారులుగా, కొంతభాగం దత్తమండలాలు (రాయలసీమ) ఇంగ్లీషువారి పరంచేస్తూ వచ్చాడు. మిగతాభాగం ఆతని పాలనక్రింద తెలంగాణాగా మిగిలిపోయింది. అందువల ఆంధ్రదేశంలో ఉత్తర సర్కారులలో దత్తమండలాలలో విద్యావిధానం ఆనాటి ఈస్టిండియా కంపెనీ విద్యావిధానం అని చెప్పాలి.

17వ శతాబ్దం మొదలు ఒకటిన్నర శతాబ్దాలు అనగా 18వ శతాబ్దమధ్యకాలం వరకూ ఆంధ్రలో ఈస్టిండియా కంపెనీ తన ఆధ్వర్యంలో విద్యాశాలలు స్థాపించలేదు. కొంతవరకూ ఇట్టి కృషి క్రైస్తవ మిషనరీలుచేస్తూ వచ్చాయి. ఈ కాలంలో ఇంగ్లీషు పాఠశాలలు స్థాపించబడకపోయినా, ఇంగ్లీషు, పోర్చుగీసు, ఫ్రెంచి పదాలు తెలుగు భాషలో చోటు చేసుకుంటూ వచ్చాయి. ఇండియాలో కంపెనీ ప్రభుత్వం లాంఛన మాత్రంగానైనా విద్య విషయంలో డబ్బు ఖర్చు పెట్టడం 1813 లో ప్రారంభమైంది. 1833 నుండి మెకాలే ప్రాబల్యంవల్ల ఈ డబ్బు పాశ్చాత్య విద్యా పద్ధతిని ప్రోత్సహించడానికి ఖర్చు పెట్టాలనే వాదం బలపడింది. విశ్వ విద్యాలయాల స్థాపన ప్రారంభమయ్యేసరికి ఈ విద్యావిధానం ఇంకో మలుపు తిరిగింది.

ఈ గ్రంథంలో కంపెనీ పరిపాలనలో ఆంధ్రదేశంలోని పాఠశాలల గురించి, దేశీయ విదేశీయ విద్యాంసుల గురించి విద్యాసాహిత్య పరిస్థితులను గురించి ఎన్నో వివరాలు సేకరించి వివరించడం జరిగింది. దీనిలో 11 అధ్యాయాలున్నాయి. మొదటి దానిలో గ్రంథ ప్రయోజనమూ, ఆధారాల సేకరణ, చివరి దానిలో కంపెనీ ఉద్యోగులు (పాశ్చాత్యులు ఆంధ్రులు) తెలుగు భాషకూ వాఙ్మయానికీ చేసిన సేవ వివరించారు. ఇతరాధ్యాయాలలో కంపెనీకి పూర్వం ఉన్న విద్యావిధానమూ 1813 నుండి 1835 వరకు, 1835 నుండి 1854 వరకు, 1854 నుండి 1858 వరకూ అమలులో ఉన్న విద్యా పథకాల వివరాలు, వానికి సంబంధించిన గణాంకములతో ఉన్నాయి.

కంపెనీ పాలనలో విద్యా రంగంలో పాలకుల కృషి కంటే స్వచ్ఛంద సంస్థల కృషి ఎక్కువగా ఉండేది. దీనిలో క్రైస్తవ మిషనరీల పాత్ర విస్తారమైనది. మిషను సంస్థలతోబాటు దేశీయ విద్యాసంస్థలు కూడ నెలకొల్పబడ్డాయి. ధనవంతులైన ఆంధ్రులు తెలుగు దేశంలోని జమీందారులు విద్యాశాలలను స్థాపించి పోషిస్తూ వచ్చారు. ప్రఖ్యాతి గాంచిన బందరు నోబుల్ కళాశాల, గుంటూరు క్రైస్తవ కళాశాల, విజయనగర మహారాజ కళాశాల, పిఠాపుర రాజ కళాశాల మున్నగునవి ఈకాలములోనే పాఠశాలలుగా ఆవిర్భవించినవి.

కంపెనీ కాలంలో గవర్నరులైన మన్రో, ఎల్ఫిన్‌స్టన్ వంటి పాలకులు విద్యా విషయంలో కొన్ని పథకాలు అమలు జరిపినారు. ఆ రోజులలో స్థాపించబడిన తహశీల్‌దారి పాఠశాలలు, కలెక్టరు పాఠశాలలు అంత ప్రయోజనకరంగా లేవు. ఉపాధ్యాయుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి ప్రభుత్వం సాయంచేసి బాధ్యత వహించాలన్న సూత్రం మన్రో పథకంలో గమనింపదగ్గది. తరువాత ఏర్పడిన సుపీరియరు స్కూల్సు, యూనివర్శిటీబోర్డు, ప్రావిన్షియల్ స్కూల్సు ఏర్పడటం జరిగింది. 185- లో రాజమండ్రిలో ఒక ప్రావిన్షల్ స్కూలు స్థాపించారు. ఇది అచ్చట కళాశాలగా వృద్ధి పొందడానికి అవకాశం కలిగింది. మన్రో పథకం రద్దయిన తర్వాత దేశీయ విద్యా పోషణ కుంటుపడినపుడు నర్సాపురంలో (ఇప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలోనిది) సబ్ కలెక్టరుగా ఉన్న జి. ఎన్. పైలరు ఒక ఆంగ్లో వెర్నాక్యులర్ స్కూలు స్థాపించాడు. ఇది గణనీయమైన సేవ చేసింది.

కంపెనీ కాలంలో విద్యా రంగంలోని పరిస్థితులు తెలిసికోడానికి ఒక ముఖ్యాధారమైనది. వెన్నెలకంటి సుబ్బారావు ఇంగ్లీషులో కంపెనీ విద్యాధికారులకు వ్రాసిన లేఖ ఈ గ్రంథములో మొదటి అనుబంధంగా చేర్చబడింది. ఆనాడే మన విద్యా విధానంలో విజ్ఞాన విషయాలు, శాస్త్ర పరిజ్ఞానం ఆవశ్యకత, దేశ భాషాధ్యయనము ప్రాధాన్యము, అధ్యాపకుల ఆర్థిక స్థితిని మెరుగుపరుచుటలో ప్రభుత్వం బాధ్యత హెచ్చరించడం గమనింపదగ్గది. ఇప్పటికీ విద్యా విధానంలో ఇవి ప్రధానాంశాలు కదా!

కంపెనీ కాలంలో విద్యాశాలల వివరాలతోబాటు ఆనాటి తెలుగు సాహిత్యం, కావ్య రచనలు, పత్రికా ప్రకటనం, కవుల పండితుల ప్రసక్తి చేర్చడం ఈ గ్రంథానికి మరింత ప్రయోజనం చేకూర్చాయి. ఆనాటి వాఙ్మయంపై పాశ్చాత్య భాషల ప్రభావం, క్రైస్తవ మత ప్రచార ప్రభావం బాగా కనపడతాయి. పాశ్చాత్యులు కూడ తెలుగు గ్రంథ రచన చేసారు. బెంజిమిన్ స్కాల్ట్జ్ 1746-47 లోనే తెలుగులో బైబులు తర్జుమా చేసాడు. ఫ్రెంచి మిషనరీలు తెలుగు ఫ్రెంచి కోశం తయారుచేసారు. తెలుగుభాషకు సి.పి. బ్రౌను సేవ అమోఘమూ, సర్వజన విదితమూ. తెలుగు వాఙ్మయానికి చరిత్రకు మెకంజీ సేకరణలు మౌలికాధార గ్రంథాలు. అతనికి సాయపడిన కావలి బొరయ్య సోదరులు కంపెనీ ఉద్యోగులు అప్పటి నుండే హిందువులతోబాటు క్రైస్తవ సోదరులు కూడ తెలుగు కావ్య రచన సాగించి భాషాసేవ చేసినారు. పాశ్చాత్యుల కొరకు వాడుకభాషా ప్రయోగము అధికమైనపుడు గ్రాంధిక భాషావాగనుశాసను అనదగిన చిన్నయసూరి దాని నరికట్టి గ్రంధిక భాషను పునరుద్ధరించినాడని గ్రంథకర్త ప్రశంసించినాడు (పు. 250) కాని చిన్నయసూరి ఈ ప్రయత్నం తెలుగు భాషావికాసానికి అవరోధముగా పరిణమించినదన్న అధిక సంఖ్యాకుల వాదము నేడు బలము సంతరించుకొంటున్నది.

ఈ గ్రంథములో విద్యాశాలలకు సంబంధించిన గణాంక సంఖ్యా వివరములతోబాటు నాటిబోధనాంశముల, బోధనా పద్ధతుల పరిశోధన కూడ చేర్చియుంటే ఈ గ్రంథము విలువ ఇనుమడించేది

ఈ సిద్ధాంత వ్యాసములో డాక్టరు విరలరావు విశేష పరిశోధనా కృషి, విషయ వివరణలో విశ్లేషణములోను నిష్పాక్షిక దృష్టి ప్రతి పుటలోను కనపడుతుంది. విద్యాధికారులకు చరిత్ర పరిశోధకులకు ప్రయోజనకారియైన గ్రంథము. కళాశాలలలోను విశ్వ విద్యాలయాలలోను పరిశోధన సంస్థలలోను అవశ్యముగా ఉండవలసిన గ్రంథము.

శ్రీ వై. వి. రమణ

ఉదయశ్రీ

[రచన : 'కరుణశ్రీ' — న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటరు, ఏలూరు రోడ్, విజయవాడ–2, డెమ్మీ, 525 పుటలు, వెల 40 రూ.]

భావ కవిత్వోద్యమం ముమ్మరంగా ఉన్న కాలంలో పుట్టి, భావకవిగా పెరిగి ఉదయశ్రీ, కరుణశ్రీ, విజయశ్రీ వంటి ఖండ కావ్య ప్రక్రియలో తన ప్రతిభను పెక్కు భంగుల చాటుకున్న కవి శేఖరులు శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి.

ఈయన కలంపేరు 'కరుణశ్రీ' అంటే ''దయామయమైన శ్రీ కలవాడ''ని అర్థం. బుద్ధభగవానుడికి ఇది పర్యాయంగా స్వీకరించబడింది.

''ఉదయశ్రీ నా హృదయం, విజయశ్రీ నా శిరస్సు, కరుణశ్రీ నా జీవితం'' అని చెప్పిన దాన్నిబట్టి కవిగారి హృద్విపంచి మ్రోయించిన వివిధరాగ ప్రస్తారాల సంపుటీకరణమే ప్రస్తుత కవితా సంపుటి అని చెప్పవచ్చు.

''కవిత్వం ఒక కమ్మని అనుభూతి; మానవత్వంలో నవత్వం చూపించే అందాల ఆశాజ్యోతి. అది జీవిత విపంచి మేళగించి మ్రోగించిన కల్యాణ గాంధర్వగీతి'' అని ఆయన విశ్వాసం. కాబట్టి కరుణశ్రీగారి కవితను ''అనుభూతి కవిత'' అని అనొచ్చు.

బుద్ధభగవానుని ఆర్ద్ర నేత్రాంచలాలనుంచి ప్రభవించిన కరుణాకుమారి''యే కవిగారి కవితాలంబనమూర్తి. ఆ 'భువనైక మోహిని'యే 'జీవిత సహచరి'గా, 'ఆరాధ్యదేవి'గా, 'ఆనంద లహరి'గా రూపొందింది. ఆమెయే ఆయన ఊహాప్రేయసి. ఆమె స్ఫూర్తులే మానవత్వపు కూర్పులు, ఆమె దృగంచల చంచల నృత్త్తరంగ మాలికల గలగలలే ఆయన కవితా రస ఝరుల నిగ లు.

అందుకే—

'ఆమె గాఢ పరిష్వంగమే మదీయ
జీవితమునకు మోక్ష లక్ష్మీప్రసాద
మామె యనుభూతియే శుష్కమైన నాదు
బ్రతుకు నౌదార్య మలయ మారుతపు వీచి' (పు.38)

అని కరుణశ్రీ ప్రకటించుకున్నారు.

'నేనీవయి నీవు నేనయి గ్రహింతము విశ్వకళా రహస్యముల్' (పు. 282) అని అనగల అద్వైత ప్రేమ వారిద్దరిదీ.

'కొంటె విధాత నీ యెడద కుంగుటి వెట్టిన వాడిబాణమే
గంటముగా లిఖింపు మొక కావ్యము; నీ కరుణాకుమారి క్రీ
గంటి కవోష్ణ బాష్ప కలికల్ రసపూర్ణములై సువర్ణ పుం
బంటలు రాశిపోయ నవభారతమున్ సృజియింపరా కవీ!'
(పు. 285)

ఇదీ ఆ కవితాకుమారి అందించే ప్రబోధం. ఆ ఉత్తేజమే పెక్కు కావ్యాలను రచింపజేసి 'కరుణశ్రీ'గారిని లబ్ధ ప్రతిష్ఠులనుగ జేసింది.

మొత్తం 525 పుటలున్న ఈ సంపుటంలో 5 భాగాలూ, సుమారు నూటఏభై పైగా వివిధ శీర్షికలూ ఉన్నాయి. మొట్ట మొదటిగా 1944లో వెలుగులోకి వచ్చిన 'ఉదయశ్రీ' ప్రథమ భాగం, 1979లో అచ్చయిన 5వ భాగంతోపాటు 48వ సారి ప్రకటించబడింది. ఇది కవిగారికున్న 'డిమాండ్'కు ఒక గీటు రాయి.

దేవాది దేవునకు స్వాగతాంజలి ఘటించడంతో మొదలయిన మొదటిభాగం 'విష్ణుదేవుని'కి జోహారు లర్పించడంతోను, 'శ్రీనివాసోదాహరణ'తో ప్రారంభమైన 5వ భాగం శారదా స్తుతితోను మంగళాంతం కావడం వంటివి కవి చూపించిన నూతనత్వం.

పద్యం, గేయం, వచన పద్యం అను త్రిపథగా 'కరుణశ్రీ' గారి కవితా స్రవంతి జాలువారిన తీరు కాలానుగుణంగా మారిన మనఃప్రవృత్తికీ, పద్యంగానీ గద్యంగానీ హృద్యంగా రచిస్తే సహృదయు లెప్పుడూ ఆదరిస్తారనే ఆయన దృఢవిశ్వాసానికీ నిదర్శనం.

ప్రాయికంగా కరుణశ్రీ గారి కవితలో అంతస్స్రోతంగా కరుణరసం ఉట్టిపడుతుంది. బీదపూజ, కుంతీకుమారి, పుష్ప విలాపంవంటి విందుకు ఉదాహరణలు.

మొత్తం సంపుటంలో తపోభంగం, ఊర్మిళాకుమారి, సావిత్రి, అనసూయాదేవి, ధనుర్భంగంవంటి పౌరాణికాలూ; యాద గిరిస్వామి, కనకదుర్గాభవాని, ఆదిదంపతులు, కరుణామయివంటి భక్తిరసప్రపూరితాలూ; తెలుగు తల్లి, మాతృశ్రీ, స్వేచ్ఛాపుష్పాలు, స్వతంత్ర భారతి, ఆగస్టు విప్లవం, కాంగ్రెస్‌రథం వంటి దేశభక్తి పరిపూరితాలూ; రుద్రమదేవి, పురుషోత్తముడువంటిచారిత్రకాలు; వాల్మీకి, పోతన, త్యాగయ్య, విశ్వనాథ, ఆదిభట్ల, బాపూజీవంటి ప్రముఖుల గూర్చి, నవరాత్రి, దీపావళి, ఉగాది, రిపబ్లిక్ దినోత్సవాల గూర్చి వ్రాసిన కవితలూ; హిందీ కాశ్మీరీ—బెంగాలీ కవితలకు చేసిన అనువాదాలూ, అప్పుడప్పుడూ చేసిన సమస్యా పూరణలు మొదలైన ఇతరాలూ ఉండటం విషయ వైవిధ్యానికి నిదర్శనం.

"చిన్నన్నా! క్షేమంగా ఉన్నావా" (పు. 449)వంటి వచన కవితతోబాటు, "అనగనగా ఒక దేశం..." (పు. 501) వంటి వచన కథాకావ్యాలూ—

"శ్రీకారం చుట్టుకున్న
స్త్రీజాతి కథానికవలె
ఆకారం దాల్చిన లో
కైక శోకగీతివలె" (పు. 408) వంటి బృంద గీతాలూ, ఉదాహరణ కావ్యాలూ ప్రక్రియా వైవిధ్యానికి ఉదాహరణలు.

"సింగం బాతడు హస్తిపీవు; వలదా శ్రీరాముపై బోయినన్
భంగంబందెదె వంచు మొత్తుకొన, నా పల్కుల్ చెవిన్ దూర్పకే
భంగిన్ గూలితి" వంచు తార రఘు రాడ్బాణంబుచే వాలి కూ
'లంగానెత్తి కురంగనేత్ర కనియెన్ లాంగూల శృంగారమున్'

వంటి సమస్యా పూరణలు కవి చమత్కారానికీ, పాండిత్య ప్రకర్షకు చక్కని దృష్టాంతాలు.

నేటి విషమ పరిస్థితిని చూచి "సిద్ధార్థస్వామి! మళ్ళొక్క మారు దిగి రావయ్యా పురోగామివై..." (పు. 443) అనీ,

'ఇప్పటికీ మనిషి మనిషిమీద సవారీ చేస్తున్నాడు
ఇప్పటికీ అధర్మం ధర్మాన్ని ఉరితీస్తున్నది' (పు. 440)

అనీ అభ్యుదయవాదిగా అక్కడక్కడా ఆక్రోశించినా మొత్తంమీద కరుణశ్రీగారు నూటికి నూరుపాళ్లు "భావకవే" అని నా అభిప్రాయం.

డా|| నండూరి వారి 'సువర్ణ సౌగంధికం', భావ సుమాను గుణంగా కూర్చిన బాపు వర్ణచిత్రాలూ సువర్ణానికి సువాసన అబ్బినట్లుంది. కాని కవితలు రచించిన తేదీలు కూడా ఉంటే కరుణశ్రీగారి ప్రతిభనుగూర్చి అంచనాగట్టే పరిశోధకులకు చాలా అనువుగా ఉండేది.

శ్రీ శివలెంక ప్రకాశరావు

"మీరట్ కుట్ర కేసు : గొప్ప దాడి"

[రచన : సోహన్‌సింగ్ జోష్, ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1979, పుటలు : 143, వెల : రు. 3 లు.]

బాబా సోహన్‌సింగ్ జోష్ నేటి ప్రముఖకమ్యూనిష్టు నాయకులలో ఒకరు. 1929నాటి మీరట్ కుట్ర కేసులో ఒకముద్దాయి శిక్ష విధింపబడిన వారిలో ఒకరు. 1979 మే 20 నాటికి అర్ధ శతాబ్ది ఉత్సవ సందర్భంగా ఈ గ్రంథం వ్రాశారు. అనువాదకుల పేరు ఇందులో ఈయబడలేదు.

లాహోర్ కుట్రకేసు, ఈ మీరట్‌కేసు 'విప్లవ ప్రజాతంత్ర యువజనులకు విలువయిన గుణపాఠాలు అందజేస్తాయి. ఈ కుట్ర కేసు గుణపాఠాలను మన యువకులు జీర్ణించుకొని ఉన్నట్లయితే, బహుశా నక్సలైట్లు ఆవిర్భవించే వారే కాదు . ... పై రెండు కేసులలోను నిందితులైన కామ్రేడ్స్ ఎంతటిఆదర్శవాదంతో, త్యాగ బుద్ధితో ప్రభావితులైనారో, ఆ జ్వాలను తిరిగి ప్రజ్వలింపచేయాలి. ముఖ్యంగా ఈ రోజులలో, బూర్జువా అవినీతి ఆదితర అరిష్టాలు, వర్గచైతన్యం గల కామ్రేడ్స్‌యొక్క నైతిక సూత్రాలను కలుషితం చేసే ప్రమాదమున్న ఈనాడు, ఇది మరీ అవసరం" అంటారు శ్రీ జోష్. ముందు మాటలో.

అలాగే ఈ పుస్తకాన్ని ఈ విధంగా ముగిస్తారు : "స్వాతంత్ర్యానంతరం దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గను గత 32 సంవత్సరాలుగా దేశ మౌలిక సమస్యలను పరిష్కరించటంలో విఫలమైన బూర్జువావర్గ పార్టీల నుండి అధికారాన్ని స్వాధీనం చేసుకొనేందుకు వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనను సాధించటం ఈనాటి తక్షణ అవసరం. భారతదేశం ఈనాడు ఎదుర్కొంటున్న రుగ్మతలన్నింటికీ సోషలిజం ఒక్కటే పరిష్కార మార్గం. దేశంలోని వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్యమై, అధికారం నుండి బూర్జువా పార్టీలకు ఉద్వాసన చెప్పి, దేశాన్ని సోషలిజం దిశగా ముందుకు తీసుకుపోతాయని ఆశిద్దాం."

పుస్తక ఆశయం ఈపాటికి అందరికీ తెలిసే ఉంటుంది.

అయితే గుణపాఠాలేమిటీ, అవి జీర్ణించుకుంటే ఎలా నక్సలైట్లు ఆవిర్భవించే వారే కాదో మట్టుకు, పుస్తకం అంతా చదివినా తెలియదు.

వామపక్ష ప్రజాతంత్రశక్తుల ఐక్యత, ప్రజాస్వామి (సోకాల్డ్) శక్తుల ఐక్యత—ఇలాంటివన్నీ అమలులోకి రాని, వచ్చినా రెండు సంవత్సరాలైనా నిలవని విషయాలని నిన్న మొన్నటి చరిత్ర ఋజువు చేసింది.

కాబట్టీ గ్రంథాన్ని చదివి ఎవరికివారు నిగ్గు తేల్చుకోవలసిన విషయమిది సుమా !

చాణు

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patr Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.